B.S. RAMULU
B.C. lu sadhikarikatha
Empowerment of Bc's
Phule Ambedkar Lohia

తప్పక చదవాల్సిన పుస్తకం

University of Social Philosophy Publication

బి.ఎస్. రాములు ❋ బీసీలు సాధికారికత ❋ ఫూలే అంబేద్కర్ లోహియా

60వ జన్మదినం

సామాజిక తత్వవేత్త

బి.ఎస్. రాములు



బీసీలు సాధికారికత

మహనీయులు

ఫూలే అంబేడ్కర్ లోహియా

53వ పుస్తకం

www.etelangana.org

ప్రచురణ:
సామాజిక తాత్విక
విశ్వవిద్యాలయం

ముందుమాట

బీసీల సాధికారికత కోసం అన్ని రంగాల్లో చేయాల్సిన నిర్మాణాల్లో, ఉద్యమాల్లో, ఎన్నికల్లో, నాయకత్వాల్లో సిద్ధాంత ప్రాతిపదిక చాలా ముఖ్యమైనది. మహాత్మా జ్యోతిబాఫూలే, డా॥ బి.ఆర్.అంబేడ్కర్, డా॥ రామ్‌మనోహర్ లోహియా వంటి మహనీయులు ఎంతో స్ఫూర్తి నిస్తారు. ఆ మహనీయులు ఈ పుస్తకానికి స్ఫూర్తి.

బీసీల సాధికారికతను అన్ని రంగాల్లో సాధించాల్సి ఉంది. సత్యం ప్రచారంలో లేకపోతే ప్రచారంలో వున్నదే సత్యంగా భావించే స్థితి వుంటుంది. సంస్కృతిలో చరిత్ర దాగి వుంటుంది. కొత్త పండుగలను కుటుంబంలో భాగంగా ఎలా చేసుకోవాలి? డర్బన్ వ్యతిరేక సదస్సులో బీసీలు పాల్గొనలేకపోయిన నేపథ్యాన్ని తెలుసుకుంటే బీసీలు ఎంత వెనుకబడిపోయారో బీసీల సాధికారికత కోసం చేయాల్సిన కృషి తెలుస్తుంది.

సమాచారం, ప్రచారం, ఆచరణ, సంస్కృతిలో చరిత్ర నిక్షిప్తమైన తీరును విశ్లేషించాను. బీసీల సాధికారికతకు వార్తలు సృష్టించడం, ఉద్యమాలను నడిపించడం సామాజిక న్యాయాన్ని సాధించడానికి, సిద్ధాంత ప్రాతిపదికలను నిర్మించుకోవడం, నైపుణ్యాలను పెంచుకోవడం, అమెరికాలో అందరి ఆమోదంతో గెలిచిన బరాక్ ఒబామా లాగా ఎదగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అగ్రకులాలతో పోటీపడి కులం పేరు చెప్పకుండానే అందరిలాగా ఎదగడం సాధ్యపడ్డప్పుడే స్వయంకృషితో ఎదగడం పూర్తవుతుంది.

ఇది లోహియా శతజయంతి సంవత్సరం.

బీసీల సాధికారికత కోసం లోహియా చేసిన కృషిని తెలుసుకోవాల్సి అవసరం ఉంది. సమకాలికుల కృషిని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది.


ఇందులోని వ్యాసాలను పత్రికల్లో ప్రచురించిన సంపాదకులకు, చక్కగా కంపోజ్ చేసిన శారద, ఏవిఎమ్ విజయ్ కుమార్‌గారలకు కృతజ్ఞతలు.

బీసీల సాధికారికత కోసం త్యాగంతో, చిత్తశుద్ధితో భవిష్యత్ తరాల కోసం వర్తమాన భూమికగా వర్తమాన అవసరాలను కూడా పట్టించుకొని కృషి చేసే యువతరం ఎదగాల్సిన అవసరం ఉంది. ఈ పుస్తకం అలాంటి తరం కోసం...

బి.ఎస్.రాములు

1

సమాజం సంస్కృతి ప్రజాస్వామ్యం



సమాచారం-ప్రచారం ఆచరణ-సంస్కృతి

ప్రచారం, సమాచారం పర్యాయ పదాలు. ప్రచారాన్ని అనేక విధాలుగా నిర్వహిస్తారు. సమాచారం, సంస్కృతి రూపంలో కూడా ప్రచారం కొనసాగుతుంది. సిద్ధాంతాల రూపంలో కూడా ప్రచారం కొనసాగుతుంది. ఆధిపత్యం చెలాయించే కొన్ని సామాజిక వర్గాలు, పాలకులు ప్రచారాన్ని సమాచారం అని, సంస్కృతి అని, సంప్రదాయం అని కూడా వ్యవహరిస్తారు. శాస్త్రవేత్తలు ప్రచారాన్ని పరిశీలన, విశ్లేషణ అనే పేర్లతో కొనసాగిస్తారు. 1985లో సోవియట్ రష్యా నుండి 'ప్రాపగాండా' అనే పేరుతో ఇంగ్లీషులో ఒక మంచి పుస్తకం వెలువడింది. పారిశ్రామిక, ప్రజాస్వామిక వ్యవస్థల్లో పెట్టుబడిదారులు, పాలకవర్గాలు సమాచారం ద్వారా తమ భావజాలాన్ని ప్రయోజనాలను ఎలా ముందుకు తెస్తారో, ప్రజలను అందుకు అనువుగా ఎలా మలుస్తారో విశదీకరించారు.

కమ్యూనికేషన్ గ్యాప్

కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల అలా జరిగింది అంటుండం చూస్తూనే వుంటాం. అంటే ఏమిటి? సమాచారం ప్రసారం కాకపోవడం వల్ల అలా జరిగిందని అర్థం. అందువల్ల భావాలను, అభిప్రాయాలను సరైన పద్ధతిలో, సకాలంలో ఎదుటివారు స్వీకరించే విధంగా వ్యక్తీకరించాలి. అప్పుడే అవి ఎదుటివారిలో ఆచరణకు ఉపక్రమింప చేస్తాయి. సిద్ధాంతాలు, మూఢ విశ్వాసాలు, మంచి విశ్వాసాలు, కులం, మతం, భాషాభిమానం,

సంస్కృతి మొదలైనవన్నీ నిరంతర సమాచారం, ప్రచారం, ఆచరణ ద్వారానే సత్యంగా పది మంది నమ్మేవిగా ఆచరించేవిగా కొనసాగుతున్నాయి. అందువల్ల ఏది సత్యమో, ఏది విశ్వాసమో, ఏది దృక్పథమో, ఏది అలవాటు ప్రకారం ఆలోచించడమో చాలా మందికి తెలియదు. ప్రజాస్వామిక ప్రభుత్వాలు, సంస్థలు తమ ప్రచారాన్ని సమాచారం పేరుతో కొనసాగిస్తూ ప్రజలను తమకనుకూలంగా ఉండేట్టు అలవాటు చేస్తుంటాయి.

సత్యం కూడా ప్రచారమే

సత్యం కూడా ప్రచారమే. సత్యానికి ప్రచారం లేకపోతే ప్రచారంలో వున్నదే సత్యంగా భావించబడుతుంది. నిరంతర ప్రచారం దేనినైనా సరే సత్యంగా భావించే స్థితిని ముందుకు తెస్తుంది. సిద్ధాంతాలు, మూఢ విశ్వాసాలు, మంచి విశ్వాసాలు, కులం, మతం, సంస్కృతి కూడా ప్రచారం, ఆచరణ ద్వారానే కొనసాగుతాయి. వార్తలందు జగము వర్ధిల్లవలయు అని నన్నయ భారత అనువాదంలో పేర్కొన్నాడు. వార్త అనేదే స్వయంగా ప్రచారం. ప్రచారం లేని వార్త 'సంఘటన'గా మిగిలిపోతుంది. ఆచరణ, ప్రచారం లేని సిద్ధాంతాలు కాగితాల్లో ఉండిపోతాయి.

సమాచారం కూడా ప్రచారమే

వార్తలోని సమాచారం కూడా ప్రచారమే. సాహిత్యంలోని సందేశం, సంస్కృతి, మానవ సంబంధాలు, పరిణామాలు కూడా ప్రచారమే. కళల్లోని కళ కూడా ప్రచారమే. ప్రచారమే అన్ని వేదికల ద్వారా, అన్ని ప్రచార, ప్రసార సాధనాల ద్వారా సాహిత్యం కళల ద్వారా కొనసాగుతూ ఉంటుంది. టూత్‌పేస్ట్ ప్రచారంతో టూత్‌పేస్ట్ కొంటాము. సినిమా ప్రచారంతో సినిమా చూస్తాము. వార్త ప్రసారంతో వార్తను వింటాము, చూస్తాము. టీవీ సీరియల్ ప్రచారంతో టీవీ చూస్తాము. సినిమాలోని కథ కూడా ప్రచారమే. టీవీ సీరియల్‌లోని కథకూడా ప్రచారమే. అందులోని సంస్కృతి, మానవ సంబంధాలు, అత్తా కోడళ్ళ మధ్య సంఘర్షణ కూడా ప్రచారమే. అత్తా కోడళ్ళు, భార్యా భర్తలు ఇలా కలిసి ఉండాలని, లేదా ఇలా పోట్లాడుకోవాలని చేసే ప్రచారమే.

ప్రచారంలో పాలకవర్గాల సౌకర్యాలు

ఆర్థిక శక్తుల కార్యకలాపాలే సామాజిక, రాజకీయ, సాంస్కృతిక శక్తుల మాటను నియంత్రిస్తాయి. నిర్దేశిస్తాయి అని ప్రచారంలో ఉంది. సామాజిక శక్తులే, రాజకీయ అధికారమే, ప్రభుత్వ అధికారమే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక శక్తులను నిర్దేశిస్తాయి అనేది మరొక ప్రచారం. కులము, వర్ణము, మతం మొదలైనవే సామాజిక, రాజకీయ,

ఆర్థిక, సాంస్కృతిక అంశాలను నిర్దేశిస్తాయి అనేది మరొక ప్రచారం. అభివృద్ధి చెందిన వర్గాలు, ప్రాంతాలు, దేశాలు, భాషలు, జాతులు మిగిలిన వారిని నిర్దేశిస్తాయి. అనేది మరొక ప్రచారం. అభివృద్ధి అందుకున్న వారికి, అందుకోదల్చుకున్నవారికి, అభివృద్ధి అందుకోలేక పోతున్నవారికి మధ్య ఉన్న అంతరమే అన్ని ప్రచారాలకు, సిద్ధాంతాలకు మూలం అని కూడా ఒక ప్రచారం.

డా॥ బి.ఆర్.అంబేద్కర్

ఇలా తమ మాట పదిమంది మాట్లాడే మాటగా ఎలా ప్రచారం పొందాలో ఎవరికి వారు తమ తమ అభిప్రాయాలకు అనువుగా ముందుకు తెస్తుంటారు. అందుకే డా॥ బి.ఆర్. అంబేద్కర్ సత్యానికి కూడా ప్రచారం అవసరం అన్నారు. ప్రచారం లేని సత్యం వ్యాప్తిని కోల్పోతుంది. తద్వారా అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణ పొందిన సత్యాలే సత్యాలుగా ముందుకు వస్తాయి. సత్యం కూడా ప్రచారం వల్లనే బతుకుతుంది. సత్యానికి కూడా ప్రచారం అవసరం. సత్యం కూడా పది మంది నోట నానితేనే సత్యంగా నిరూపించబడుతుంది. అందువల్ల నెగెటివ్ అంశాలను కాకుండా మానవీయ పాజిటివ్, అనుకూల అంశాలను, సత్యాలను ప్రాధాన్యతనిచ్చి ప్రచారంలోకి తీసుకురావడం అవసరం. కానీ పత్రికలు, మీడియా, సినిమా, టీవీ, ప్రచార సాధనాలు అవసరమైనదాన్ని, ఆదర్శాలను కాకుండా అనవసరమైన నెగెటివ్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ మనిషి మెదడును కలుషితం చేస్తున్నారు. దీన్ని సమూలంగా మార్చుకోవడం అవసరం. ఏది మంచో, ఏది సత్యమో, ఏది ధర్మమో వాటికి ఎక్కువ ప్రాచుర్యం ఇవ్వడం ద్వారానే ఒక ఆదర్శం ముందుకు సాగుతుంది.

పదగురాడు మాట పాడియై ధర జెల్లు అన్నాడు వేమన. పది మందిలో ప్రాచుర్యం పొందేదే సత్యంగా జనంలో కొనసాగుతుంది. పదిమందిలో ప్రాచుర్యం ఎలా పొందుతుంది, ఎందుకు పొందుతుంది, ఎలా పొందాలి అనేది ఒక విద్య. వారే సామాజిక కార్యకర్తలు. వారే రాజకీయ నాయకులు. వారే సాంస్కృతిక సైనికులు. అలాంటి వారే వార్తలను సృష్టించడం, ఉద్యమాలను నిర్మించడం, సత్యాలను ప్రచారం చేయడం కోసం జర్నలిజం, పొలిటికల్, సోషల్ ఇంజనీర్ సిద్ధాంతాలను, ఆచరణను అధ్యయనం చేయడం అవసరం.

సంస్కృతిలో చరిత్ర

చరిత్ర గతిలో మానవజాతి ప్రోది చేసుకున్న విశ్వాసాలు, మంచి, చెడులు, అలవాట్లే సంస్కృతి. సంస్కృతి అంటే పేర్లు, తేదీలు లేకుండా వర్తమానంలో కొనసాగుతున్న ఆనవాళ్ళు, సాక్ష్యాల గత చరిత్ర. సంస్కృతి అంటే గత చరిత్రే. అది వర్తమానంలో సంస్కృతి రూపంలో కొనసాగుతున్న గత చరిత్రే. సంస్కృతి అంటే గతకాలపు ఆలోచనా విధానాల, జీవన విధానాల పరిణామాల సంపుటి. కనుక సంస్కృతిని పరిశీలిస్తే మొత్తం చరిత్ర పరిణామం తెలియకపోయినా సంస్కృతి అంతా చరిత్ర శకలాలనే తెలుపుతుంది. అందువల్ల ప్రజల చరిత్ర, ఆయా సమాజాల చరిత్ర సంస్కృతిరూపంలో వర్తమానంలోనూ కొనసాగుతూ వుంటుంది.

వర్తమానంలో కొనసాగుతున్న సంస్కృతి అంతా గత కాలపు చరిత్రను తెలిపే ఆనవాళ్ళే. అందువల్ల సంస్కృతి ఒక గతమే కాకుండా వర్తమానంలో కొనసాగుతున్న ప్రాచీన, అర్వాచీన చరిత్రే. సంస్కృతి మొదట ప్యాషన్ల రూపం సంతరించుకుంటుంది. అలవాట్ల రూపంలోకి మారుతుంది. ఆలోచనలు స్థిరీకరణ పొంది మతాలుగా, భావజాలాలుగా, పండగలుగా, జీవన విధానాలుగా మారడమే సంస్కృతి.

అత్యంత విశ్వసనీయ చారిత్రకాధారాలు సంస్కృతిలోనే ఉన్నాయి. వాటిని డీకోడ్ చేయడం ద్వారా, ఇతర సాక్ష్యాల ద్వారా, పరిణామాల ద్వారా చరిత్ర పరిణామాలను సమగ్రం చేయవచ్చు. సత్యానికి దగ్గరగా మార్చవచ్చు. ఇలా

పరిశీలించని రాజుల చరిత్ర, తేదీల చరిత్ర, యుద్ధాల చరిత్ర నిజంగా ప్రజల చరిత్ర కాదు. అది పాలకవర్గాల ఆధిపత్యాన్ని నేడు కూడా ఆమోదించడానికి రుద్దే చరిత్ర మాత్రమే. అందువల్ల సంస్కృతి ప్రధాన వనరుగా చరిత్ర నిర్మాణం చేయడం ఎంతో అవసరం.

సంస్కృతి విశేషాలు

ఇందుకు తెలుగు ప్రజల్లో కొనసాగుతున్న కొన్ని సంస్కృతి విశేషాలను పరిశీలించవచ్చు. పుట్టుక, పెళ్లి, చావు, రక్తసంబంధాలు, కుల సంబంధాలు, కులాల మధ్య సంబంధాలు, ఇరుగుపొరుగు ఊర్ల మధ్య సంబంధాలు, పలకరింపుల తీరుతెన్నులు వీటిలో కొనసాగే ఆచార వ్యవహారాలు, సంస్కృతి పరిశీలన ద్వారా గడచి వచ్చిన చరిత్ర పరిణామాలను తెలుసుకోవచ్చు. ఉదాహరణకు పెళ్లికాని వాళ్ళు చనిపోయినప్పుడు వారిని కట్టెల్లో కాల్చివేయకుండా మట్టి తవ్వి బొంద పెడతారు. తప్పనిసరిగా కట్టెల్లో కాల్చివేయాలనుకుంటే జిల్లేడు కొమ్మను విరుచుక వచ్చి దానికి పసుపు కుంకుమ మొదలైనవన్నీ చేసి శవానికి కూడా పెళ్లికి సంబంధించిన పసుపు కుంకుమ మొదలైన వన్నీ చేసి అప్పుడు కాల్చడానికి తీసుకెళతారు. పెళ్లికాని వాళ్ళను మోసుకుపోవడానికి ఒకటే కట్టెకు కట్టుకుని తీసుకుపోతారు. ఇలా జిల్లేడు కొమ్మతో పెళ్ళి చేసిన తరువాత మాత్రమే పెళ్ళయిన వాళ్ళకు కట్టినట్టుగా పాడెకట్టి నలుగురు మోస్తారు. పెళ్లికాని వారి శవాన్ని ఒకటే కట్టెకు కట్టి ఇద్దరే మోస్తారు. ఇది ఇప్పటికీ చాలా కులాల్లో కొనసాగుతున్న పద్ధతి. కొన్ని కులాల్లో చనిపోయే ముందు వారిని పద్మాసనంలో కూర్చోబెట్టి గుంజకు ఆనిస్తారు. లేదా చనిపోయిన వెంటనే ఇలా చేస్తారు. చనిపోయిన తరువాత ఆలస్యమైతే కాళ్ళు, చేతులు ఇలా కూర్చోబెట్టడానికి వంగవు. అంత్యక్రియల తీరులో పెళ్లియొక్క ప్రాధాన్యత కనబడుతుంది. శైవులు చాలా కాలం దాకా పెళ్లి అయిన వారిని కూడా మట్టితీసి బొంద పెట్టేవారు.

సంస్కృతిలో దాగివున్న చరిత్ర పరిణామం

హిందువుల సాంప్రదాయక పెళ్లిలో అనేక చారిత్రక పరిణామాలు చూడవచ్చు. సుమారుగా 13 రకాల పెళ్లిల ఆనవాళ్ళు ఈ సాంప్రదాయక పెళ్లిలో తంతురూపంలో కనపడతాయి. పూర్వం ఒక్కొక్క రకమైన పెళ్లి విధానం కలసిపోయి అవన్నీ కొనసాగిస్తూ తంతుగా మారిపోయాయి. కాళ్ళు తొక్కితే ఒక పెళ్ళి అయ్యేది.

ఎంగిలి తింటే ఒక పెళ్ళి అయ్యేది. ఉంగరం పెడితే ఒక పెళ్ళి అయ్యేది. కొత్త బట్టలు కట్టిస్తే ఒక పెళ్ళి అయ్యేది. పసుపు కొమ్ము, మంగళసూత్రం కడితే ఒక పెళ్ళి అయ్యేది. మట్టెలతో ఒక పెళ్ళి అయ్యేది. కొంగులు ముడివేస్తే ఒక పెళ్ళి అయ్యేది. అగ్ని చుట్టూతా తిరిగితే ఒక పెళ్ళి అయ్యేది. ఏడడుగులు కలిసి నడిస్తే ఒక పెళ్ళి అయ్యేది. వేలు పట్టుకుని నడిస్తే ఒక పెళ్ళి అయ్యేది. నాతిచరామి అని అంటే ఒక పెళ్ళి అయ్యేది. జీలకర్ర బెల్లం పెట్టుకుంటే పెళ్ళి అయిపోయేది. అందుకే చాలా మంది ఇప్పటికీ పెళ్ళి లేటు అవుతుంటే జీలకర్ర బెల్లం పెట్టుకోగానే అక్షింతలు వేసి వెళ్ళిపోతుంటారు. అక్షింతలు వేయడం ఒక పెళ్ళి. పూలదండలు వేసుకోవడం ఒక పెళ్ళి. పరస్పరం బొట్టు పెట్టుకోవడం ఒక పెళ్ళి. అలాగే పెళ్లి అయ్యాక నాగవెల్లి అని మరొక పెళ్ళి జరుగుతుంది.

పెళ్లిఅయ్యి వెళ్ళిపోయేటప్పుడు బావమరుదులు బావని సోదరిని అడ్డగిస్తారు. ఇది రుక్మిణి కళ్యాణం తాలూకు రాక్షస వివాహానికి సంబంధించినది. గోండు గిరిజనుల్లో ఈ పద్ధతి పెళ్లే ఇప్పటికీ ప్రధాన వివాహ పద్ధతిగా కొనసాగుతున్నది. గిరిజనులు పెండ్లి పిల్లను పెండ్లి పిల్లవాడు తీసుకుపోతుంటే కొడుతూ పరిగెడతారు. పరిగెడుతూ పెండ్లి పిల్లను కాపాడుకుంటూ తాను కూడా దెబ్బలు కాచుకుంటూ పరిగెడతాడు. ఇది ఇప్పటికీ దెబ్బలు లేని మర్యాద పద్ధతిలో సాగిస్తున్నారు. ఇలా పెళ్లిలో స్వయం వరం, గాంధర్వ వివాహం అనగా సూర్య చంద్రుల ప్రకృతి సాక్షిగా పెళ్ళి చేసుకోవడం, శకుంతల దుష్యంతుల పెళ్లిలాగ పెళ్ళి చేసుకోవడం మొదలైన పద్ధతులున్నాయి.

ఇప్పుడు వీటికి అదనంగా పెళ్లి రిజిస్ట్రేషన్ కూడా వుంది. పెళ్లి రిజిస్ట్రేషన్ కూడా పూర్తి పెళ్ళితో సమానం. స్టేజి మ్యారేజి పద్ధతి, హిందూ సాంప్రదాయక పెళ్ళి రిసెప్షన్ పూలదండల మార్పిడి, తిరిగి అక్షింతలు వేయడం మొదలైనవి కూడా కొనసాగిస్తున్నారు. ఇలా అనేక పెళ్ళిళ్ళ విధానాలు ఇప్పుడు హిందూ సాంప్రదాయక పెళ్లిలో తంతుగా మారి కొనసాగుతున్నాయి.

తోడు పిల్లను పెళ్ళి పిల్లతో కూర్చోబెట్టడం, పెండ్లి పిల్లవాడికి తోడు పెళ్ళిపిల్లవాడిని కూర్చోబెట్టడం ఇప్పటికీ చూడవచ్చు. ఇది ద్రౌపది, పాండవుల పెళ్లికి సంబంధించిన పెళ్లి విధానం యొక్క చారిత్రక ఆనవాలు. ఇల్లాలు అనే పదానికి ఇంటికి ఆలు అనే అర్థానికి సంబంధించిన వెనుకటి చారిత్రక ఆనవాలు తోడుపిల్ల, తోడు పిల్లవాడు సాంప్రదాయంలో చూడవచ్చు. అందుకే తోడు పిల్లను, తోడు పిల్లవాడ్ని పెండ్లి పిల్ల, పెండ్లి పిల్లవాడితో సమానంగా గౌరవిస్తారు, బట్టలు

పెడతారు. మరదళ్ళపై సరసాల హక్కు, బావలపై సరసాల హక్కు కనీసం జోకుల మేరకు ఇప్పటికీ కొనసాగడం ఆనాటి చారిత్రక ఆనవాలే. ఇప్పుడు బావా మరదళ్ళ సంబంధాలు అన్నా చెల్లెల సంబంధాలుగా ఆత్మీయంగా మారి మరదళ్ళ పెళ్ళిళ్ళను ఇంటి అల్లుళ్లే పెద్ద కొడుకులుగా నిలబడి చేసే పరిణామం పొందింది. అలా అక్కా చెల్లెల్ల అనుబంధం అక్క ద్వారా చెల్లెలి పెళ్లి జరిపే కర్తవ్యం పెరుగుతూ వచ్చింది.

పురుడు, నామకరణం సంస్కృతిలో భాగమే

పుట్టినప్పుడు చేసే కార్యక్రమాల్లో ముఖ్యమైనది ప్రసూతి అయిన తరువాత శిశువుతో పాటు వెలువడిన పదార్థాలను జాగ్రత్తగా ఒక మట్టి ముంతలో వేసి మట్టిలో పాతిపెడతారు. దీనిని మాయ ముంత అంటారు. దీనికి ఎంతో ప్రాధాన్యత వుంది. మూడవ రోజున పురుడు చేస్తారు. పుట్టిన 21 రోజుల్లో మొలదారం కడతారు. జిట్టి (దిష్టి)పూసలు కడతారు. 21వ రోజు పేరు పెడతారు. మేనమామనే పేరు పెడతాడు. అన్నా చెల్లెల్ల అనుబంధంగా రక్తసంబంధాలను ఎలా మార్చారో తాపీ ధర్మారావు, ఆరుద్ర రచనలతో పాటు రక్తసంబంధాల శాస్త్రంలో చూడవచ్చు. మేనమామ పాత్ర జీవితమంతా కొనసాగుతూనే వుంటుంది. పెళ్ళిలో అక్కా చెల్లెల్ల పిల్లల పెళ్ళిళ్ళకు తీసుకు రావలసిన పచ్చని కొమ్మ మా ప్రాంతంలో ఇందుకు అందుగు చెట్టు కొమ్మ మేనమామనే తీసుకురావాలి. పిల్లలకు పుట్టువెంట్రుకలు కూడా మేనమామనే తీయాలి. ఎంత దూరతీరాల్లో వున్నా దీన్ని తప్పకూడదు. అందుకే మా పెద్ద కొడుకు కరీంనగర్ జిల్లా వేములవాడ దేవస్థానంలో మా మనవడి పుట్టువెంట్రుకలు తీయించుకోవడానికి అమెరికా నుండి కొడుకు కోడలు మనవడు రాగా పుట్టువెంట్రుకలు తీయాల్సిన మేనమామ ఇంగ్లాండ్ నుండి వేములవాడకు రాకతప్పలేదు. నేను బౌద్ధదర్శనంలోకి మారినా మావాడి పుట్టువెంట్రుకలు మా అమ్మ బలవంతంపై వేములవాడలో తీసినందుకు గాను ఆయన కూడా తన కొడుకు వెంట్రుకలు వేములవాడలోనే తీయాలని అమెరికా నుండి లక్షల రూపాయలు ఖర్చు చేసుకుని, మా కోడలు లండన్ నుండి అన్నయ్యను పిలిపించుకొని కొడుకు పుట్టువెంట్రుకలు తీయించారు. అదీ సాంప్రదాయంలో, సంస్కృతిలో వున్న బలం.

ఈ సెంట్‌మెంట్లు కోల్పోయినప్పుడు లేదా వీలు కాదు అని ఫ్రెండ్స్‌లాగా చెప్పేస్తే ఈ సంబంధాలు ఈ కమిట్‌మెంట్ అదృశ్యమవుతుంది. మానవ

సంబంధాలు కోల్పోతారు. కొత్త రూపంలో మానవ సంబంధాలు కొనసాగుతాయి గానీ ఈ ఆత్మీయ గత చరిత్ర తాలూకు సెంటిమెంట్ల సంస్కృతి సాంప్రదాయాల కమిట్‌మెంట్లు కొనసాగవు. అందుకే ఎంత దూరాన వున్నా, ఎంత ఖర్చు అయినా చావులకు, పెళ్ళిళ్ళలకు ఆత్మీయులు రాకతప్పదు. రాకపోతే అక్కడితో వారి సంబంధాలు ఆగిపోతాయి. తిరిగి మాట కలుపుకుంటేనే పైపై సంబంధాలు మాత్రం కొనసాగుతాయి.

అందువల్ల జీవితంలో ఎన్ని మాటలు చెప్పినా ఎన్ని అనుబంధాలు వల్లించినా భౌతికంగా తన హాజరుతో తనను తాను నిరూపించుకుంటేనే గౌరవిస్తారు. ఇది ఈ సంస్కృతి చరిత్రలో ఇమిడి వున్న అంశం. అందువల్ల ఇది భావవాదం కాదు. భౌతికవాదం కోసమే భావవాదం రూపంలో సాంప్రదాయాల రూపంలో, సంస్కృతి రూపంలో మానవీయ సంబంధాలు, మానవ సంబంధాలు కొనసాగుతున్నాయి.

ఇలా సంస్కృతిలో వున్న చరిత్ర ప్రజల చరిత్ర. ఆయా సమాజాల పరిణామాల చరిత్ర. అందువల్ల వీటిని అన్ని కులాల సంస్కృతి నుండి వెలికి తీయడం అవసరం. అదే సమయంలో సంస్కృతి పేరిట, కులం పేరిట, మతం పేరిట, ధర్మం పేరిట జరిగిన అణచివేతను, దోపిడీని వెలికి తీయడం అవసరం. వాటిని సంస్కృతిలో భాగంగా, ఆలోచనలో భాగంగా ఆచరణలో భాగంగా కొనసాగిస్తున్న క్రమాలన్నిటిని తొలగించుకోవడం అవసరం. మనిషిని మనిషిగా గౌరవించడం అవసరం. నూతన సంస్కృతిని ప్రచారం చేయడం అవసరం.

ప్రచారం, సమాచారం అనేక రకాలు. నోటి ప్రచారం, మాట ప్రచారం, సూక్తి ప్రచారం, విగ్రహ ప్రచారం. గ్రంథ ప్రచారం, కళల ప్రచారం, రేడియో ప్రచారం, సినిమా ప్రచారం, టీవీ ప్రచారం, పత్రికా ప్రచారం. సాహిత్యం, కళలు, సిద్ధాంతాలు, కులం, మతం, ప్రాంతం, భాష, జాతి, మొదలైనవన్నీ ప్రచారాలే.

ఆధిపత్య సామాజిక వర్గాల ప్రచారం

అభివృద్ధి చెందిన వారి ప్రచారం అందంగా ఉంటుంది. ఎన్నికల ప్రచారం అధికారంలో ఉన్నవారికి ఎంతో సులువు. ఎన్నికల ప్రణాళికలు కూడా ప్రచారమే. సరుకుల ప్రచారం, మతాల ప్రచారం, కులాల ప్రచారం, అభివృద్ధి ప్రచారం ప్రాంతీయ దృక్పథాల ప్రచారం అభివృద్ధి చెందిన ప్రాంతాల ప్రచారం, వెనుకబడిన ప్రాంతాల ప్రచారం, వెనుకబడిన దేశాల ప్రచారం ఇలా ప్రచారం అనేక రకాలు. ప్రచారం ఈ యుగ లక్షణం. కుల సంఘాలు తమ కులాన్ని ప్రచారాన్ని చేస్తాయి. మతాలు తమ

మతాన్ని ప్రచారం చేస్తాయి. ప్రచారం ద్వారా ఆచరణలోకి తెస్తాయి. ఆచరణ అలవాటుగా మారుతుంది. ఒకరు ఆచరిస్తే అలవాటు అంటారు. పది మంది ఆచరిస్తే అలవాటును సంస్కృతిగా మారింది అంటారు.

అలవాటు-సంస్కృతి

చాలా మంది అలవాటు ప్రకారం ఆలోచిస్తారు. ఈ అలవాటు కులం ప్రకారంగా, మతం ప్రకారంగా, ప్రాంతం ప్రకారంగా, భాష ప్రకారంగా, తానున్న స్థల కాల స్థితుల ప్రకారంగా, వయస్సు ప్రకారంగా, హోదా ప్రకారంగా ఏర్పడుతుంటాయి. మారుతుంటాయి. అలవాటు ప్రకారం ఆలోచించే వాటికి భిన్నంగా ఉన్నవాటిని తనకు వ్యతిరేకమైనవని, అవతలిపక్షం ఏకపక్షంగా మాట్లాడుతున్నారని అనుకుంటారు. అలా తెలంగాణ వాళ్ళు ఏక పక్షంగా మాట్లాడుతున్నారని ఇతర ప్రాంతాల వాళ్ళు అనుకుంటారు. అగ్రకులాలు ఏకపక్షంగా మాట్లాడుతున్నారని బిసీలు, ఎస్‌సిలు అనుకుంటారు. డెల్టా వాళ్ళు ఏక పక్షంగా మాట్లాడుతున్నారని తెలంగాణ వాళ్ళు అనుకుంటారు. ఇలా అనుకోవడంలో ఉన్నది అలవాటు ప్రకారం ఆలోచించడమే. అలా ఆలోచించడానికి అలవాటు చేయబడ్డారు. ఈ అలవాట్లను మార్చుకోకపోతే అభివృద్ధిగాని, బీసీల సాధికారికత గాని సాధ్యం కాదు. నిత్యనూతనంగా ఆలోచించాలి. నిత్యనూతనంగా, సృజనాత్మకంగా ఆచరించాలి. సమాజానికి మార్గదర్శకంగా ఎదగాలి.

కాలక్రమంలో హిందువులు కొన్నింటికి అలవాటు చేయబడ్డారు. బిసిలు కొన్నిటికి అలవాటు చేయబడ్డారు. బ్రాహ్మణులు కొన్నిటికి అలవాటయ్యారు. క్రైస్తవులు, ముస్లింలు కొన్నిటికి అలవాటు చేయబడ్డారు. తెలంగాణ ప్రజలు కొన్నిటికి అలవాటయ్యారు. రాయలసీమ ప్రజలు కొన్నిటికి అలవాటయ్యారు. డెల్టా ప్రజలు కొన్నిటికి అలవాటయ్యారు. కొన్ని పదాలు, కొన్ని వంటలు, కొన్ని ఆలోచనలు కొందరికి అలవాటు. వీటన్నింటిని తిరిగి కొత్తగా విశ్లేషించుకోవాలి. ప్రశ్నించుకోవాలి. కొత్తవి స్వీకరించాలి. కొత్తకు మార్గం వేయాలి. అలవాటు నుండి సంస్కృతి నుండి విముక్తి పొందాలి. స్వేచ్ఛగా స్వాతంత్ర్యంతో నూతన సామాజిక విలువలను పెంపొందించి నూతన సంస్కృతిని పెంపొందించుకుంటూ ముందుకు సాగాలి.

అలవాటే సంస్కృతి. సంస్కృతి అంటే అలవాటే. స్వచ్ఛందంగా అలవాటు ప్రకారంగా ఆచరించేది సంస్కృతి. సంస్కృతి ప్రశ్నించబడదు. అలవాటుగా ఆచరించబడుతుంది. సంస్కృతిగా, విశ్వాసంగా ఆచరించడానికే అన్ని సిద్ధాంతాలు,

అన్ని మతాలు, అన్ని దృక్పథాలు, అన్ని పార్టీలు తమదే కరెక్టు అని ప్రచారం చేస్తుంటాయి. అందుకు అనువైన సాక్ష్యాలను, ప్రయోజనాలను ముందుకు తెస్తుంటాయి. నమ్మకాన్ని కలిగిస్తుంటాయి. అందువల్ల అన్నీ నమ్మదగినవిగానే కనపడతాయి. అన్నీ సత్యంగానే తోస్తుంటాయి. అలా తోచడం వల్లే వాటిని ఆచరించేవాళ్ళు ఆచరిస్తున్నారు. వాటి వెంట నడుస్తున్నారు. తమ సంస్కృతిగా, తమ మతంగా, తమ కులంగా భావిస్తూ ఆచరిస్తున్నారు. ఈ ఆలోచనా విధానం నుండి బయటపడితేనే బానిస భావజాలం నుండి బయపడడం సాధ్యం. ఎవరూ ఫలానా కులంలో పుట్టాలని పుట్టలేదు. ఏదో ఒక కులంలో పుట్టడం యాదృచ్ఛికం. ఒక కులంలో పుట్టడం పాపం గాని, పుణ్యంగాని కాదు. అది ప్రకృతి పరమైన పరిణామం. మనుషులందరూ ఒక్కటే. పుట్టుకతో అందరూ సమానమే. భారత రాజ్యాంగం అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం అన్ని రంగాల్లో ఎదిగే అవకాశాలను ఇచ్చింది. వాటిని అందుకుని ముందుకు సాగడానికి అడ్డంకిగా ఉండే అన్ని భావజాలాలను, అలవాట్లను, సంస్కృతిని వదులుకోవల్సిందే. అప్పుడే బీసీలు, ఎస్సీలు, సాధికారికత సాధిస్తారు. తామే నూతన సమాజాన్ని నిర్మిస్తారు. సామ్యవాద, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్థంభాలవుతారు. ప్రపంచానికే వెలుగవుతారు.

అంతర్జాతీయ దినోత్సవాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఫాదర్స్‌డే, మదర్స్‌డే, రాఖీ పౌర్ణమి, వినాయక చవితి విగ్రహాలు, అక్షరాస్యతా దినోత్సవం, విజయదశమి, సంక్రాంతి, బక్రీద్, రంజాన్, క్రిస్మస్, గుడ్‌ఫ్రైడే, బుద్ధపూర్ణిమ, బోనాలు, మొదలైనవన్నీ సంస్కృతి పేరిట కొనసాగుతున్న సంస్కృతి, ప్రచారం, ఆచరణలే.

ఎవరికి వారే తమ కులాన్ని ఆచరించడం వల్లనే కులం కొనసాగుతున్నది. కులాన్ని ఆచరించక పోతే కులం రెండవ తరంలోనే అంతరించి పోతుంది. మతాన్ని ఆచరించకపోతే రెండవ తరంలోనే మతం సంస్కృతి నుంచి అదృశ్యం అవుతుంది. అలాగే ప్రాంతీయ దృక్పథం, భాషా దృక్పథం ఆచరించక పోతే రెండవ తరంలోనే అంతరించిపోతుంది. ఏదైనా ఇలా ప్రచారం ద్వారా కొనసాగుతూ ఆచరణ ద్వారా సత్యంగా భావించే స్థితి ఏర్పడుతున్నది. అందువల్ల ప్రచారం ఎంత ముఖ్యమో ఆచరణ అంత ముఖ్యం. ఆచరణ ఎంత ముఖ్యమో ప్రచారం అంత కన్నా ముఖ్యం. ప్రచారం లేకుండా ఆచరణ, సంస్కృతి క్రమంగా అదృశ్యమవుతుంది.

పండుగలు నూతన సంస్కృతి

పండుగలు అందరు కలుసుకోవడానికి, ఆత్మీయతలు పంచుకోవడానికి కొన్ని సందర్భాలకు, సంస్కృతులకు చిహ్నంగా, అవసరంగా కొనసాగుతున్నాయి. మానవ జాతికి పట్టిన పీడ తొలగిన సందర్భాన్ని ఏటా పండుగ జరుపకోవడం కూడా మన సంప్రదాయంగా వుంది. అందరు కలుసుకోవడమే ఒక పండుగ. మానవ జీవితంలో మనుషులు కలుసుకోవడానికి మించిన ప్రాధాన్యతలు ఉండవు. పండుగలు మనుషులు కలుసుకోవడానికి ఒక సందర్భాన్ని, ఒక అవసరాన్ని సృష్టిస్తాయి. ప్రతిరోజూ శ్రమించే రైతులు, కూలీలు, చేతివృత్తుల వారు, ఉద్యోగులు ఏడాదిలో కొన్ని రోజులు సెలవు తీసుకోవడమే పండుగ.

పండుగల్లో వైవిధ్యం

పండుగలు పలు రకాలు. వ్యక్తిగత కుటుంబ పరిమితిలో జరుపుకునే పండుగలు. కులం పండుగలు, సమాజం పండుగలు, ప్రభుత్వ పండుగలు, ప్రాంతీయ పండుగలు, జాతీయ పండుగలు, వ్యవసాయిక సమాజ పండుగలు, సంస్కృతితో ముడివడివున్న పండుగలు, రాజకీయాలతో ముడివడివున్న పండుగలు. మతంతో, విశ్వాసాలతో ముడివడివున్న పండుగలు. చరిత్రతో ముడివడివున్న పండుగలు.

పుట్టిన రోజులు, నామకరణం, బారసాల, పుట్టువెంట్రుకలు, పెళ్లి, చావులు మొదలైనవి కుటుంబానికి వ్యక్తులకు సంబంధించిన పండుగలు. ఆషాఢ మాస వనభోజనాలు, పొలాల అమావాస్య, సంక్రాంతి మొదలైనవి వ్యవసాయిక సమాజ పండుగలు. వినాయక చవితి, కృష్ణాష్టమి, మహాలయ అమావాస్య (పెత్రమాస), దసరా, దీపావళి, క్రిస్మస్, బక్రీద్, రంజాన్, మహా శివరాత్రి మొదలైనవి మత పరమైన పండుగలు. రాఖీ, హోలీ మొదలైనవి మతపరమైన విశ్వాసాలను దాటిన సామాజికమైన పండుగలు. కార్తీకపౌర్ణమి, వసంతోత్సవం మొదలైనవి ప్రకృతి పరమైన పండుగలు. ఉగాది, జనవరి 1 మొదలైనవి కాలానికి సంబంధించిన పండుగలు. 26వ జనవరి, 15 ఆగస్టు, నవంబరు 1, సెప్టెంబర్ 17, 1 మే డే, బుద్ధ జయంతి, 14 ఏప్రిల్ అంబేద్కర్ జయంతి, గాంధీ జయంతి, ఫూలే జయంతి, గురునానక్ జయంతి మొదలైనవి చారిత్రక పండుగలు. 14 ఫిబ్రవరి ప్రేమికుల రోజు మొదలైనవి ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందుతున్న పండుగలు. వీటికి తోడుగా ఐక్యరాజ్య సమితి ఏటా కొన్ని తేదీలను మదర్స్‌డే, ఫాదర్స్‌డే మొదలైన పండుగలుగా జరుపుకోవాలని నిర్ణయిస్తూ వస్తున్నది. ఇవి పలు రకాల సంస్కృతుల చిహ్నంగా ప్రాధాన్యత వహిస్తున్నాయి.

పండుగ సాధారణంగా ఇంటివాళ్లు అందరూ ఇంట్లో కలిసి జరుపుకునేదిగా ఉంటూ మొత్తం సమాజం, మొత్తం ప్రాంతం, రాష్ట్రం, దేశం అంతటా జరుపుకునే పండుగగా ప్రజల జీవితంలో భాగమైన పండుగలు ఒక ఆత్మీయ సంస్కృతిని, అనుబంధాలను, ఆనందాలను, పవిత్రతా భావనను కలిగిస్తాయి. సంక్రాంతి, దీపావళి, దసరా, ఉగాది మొదలైన పండుగలు ఎంతో ఆత్మీయంగా ఆత్మబంధువులు కలుసుకుంటారు. ఎక్కడ వున్నా తమ మూలాల్లోకి వెళ్లి ఒక చోట కలుసుకుంటారు. వేల ఏళ్ల నుండి గిరిజన సమాజం నుండి, వర్ణ కుల సమాజాల నుండి కూడా ఇది కొనసాగుతూ వస్తున్నది. పండుగలు మారినా వాటి అంతస్సారం కొనసాగుతూ వున్నది. అందువల్ల, పండుగల కోసం పిల్లలు, పెద్దలు కూడా ఎదురు చూస్తారు.

సంక్రాంతి పండుగకు భాగ్యనగరం సగానికి పైగా ఖాళీ అయిపోయింది. రోడ్లు బందలు నిర్వహించినప్పుడు కన్నా నిర్మానుష్యమైపోయాయి. అలా ప్రజలు తమ తమ ఊళ్లల్లోకి ఆత్మీయులను కలుసుకుని కలబోసుకోవడానికి వెళ్లారు. ఇవే మానవీయ సంబంధాలు అంటే ! తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండుగ, దసరా, దీపావళి చాలా ముఖ్యమైన పండుగలు.

డిసెంబర్ 31, జనవరి 1 నూతన సంవత్సర ఆహ్వానం తీరుకు, సంక్రాంతి, తెలుగువారి నూతన సంవత్సరమైన ఉగాది పండుగలు జరుపుకునే తీరుకు, 14 ఫిబ్రవరి ప్రేమికుల రోజు జరుపుకునే తీరుకు మధ్య ఎంత వ్యత్యాసం? ఎంత వైవిధ్యం? అసలు పోలిక ఉందా? వీటిని కుటుంబ పండుగలుగా మార్చుకోలేమా? వీటిని అంతర్జాతీయ వ్యాపార సంస్కృతి, వ్యాపారం కోసం ఇలాంటి పండుగలను ప్రోత్సహిస్తుంది. అయితే సంక్రాంతి, దసరా, దీపావళి, ఉగాది పండుగలకు జరిగే వ్యాపారం తక్కువేమి కాదు. ఇవీ ఒకనాటి ప్రచారమే. ఈ పండుగల్లో కూడా ప్రేమికుల రోజు, జనవరి 1 పండుగల కన్నా ఎన్నో రెట్లు వ్యాపారం జరుగుతుంది. కానీ, కుటుంబంలో భాగంగా, ఆత్మీయతల్లో భాగంగా ఈ పండుగలు జరుగుతున్నాయి.

మారిన ధోరణి

ఇటీవల కొన్ని పండుగలు ఇంటితో సంబంధం లేకుండా బయట జరుగుతున్నాయి. ఇలాంటి పండుగల వల్ల స్నేహితులు, పరిచయస్తులు, సహ ఉద్యోగులు, సహ విద్యార్థులు కలుసుకుంటున్నారు. వ్యక్తులుగా కలుసుకోవడంవల్ల వారు కొత్త పోకడలు పోతున్నారు. ఇటీవల డిసెంబర్ 31, జనవరి 1 సందర్భంగా రాత్రంతా మెలకువతో ఉండడం, అల్లరి చేయడం, టపాసులు పేల్చడం, అర్ధరాత్రి ఫోన్లు చేయడం, వీధి వీధంతా తిరుగుతూ అరవడం, ఈ మేరకు మహా శివరాత్రి జాగారం లాగా భావించి అర్థం చేసుకోవచ్చు. కానీ, బాగా తాగడానికి డబ్బులు కోట్ల రూపాయలు వృధా చేయడానికి ఈ సందర్భాన్ని వినియోగించుకోవడం యువతరం దుబారా పట్ల బాధ కలుగుతుంది.

సెల్‌ఫోన్లు వచ్చాక నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డులు పంపుకోవడం బాగా తగ్గింది. గ్రీటింగ్ కార్డుల్లో చక్కని చిత్రాలు, సూక్తులు ఉంటాయి. అవి కాస్త ఖర్చుకు సంబంధించినవైనా నాలుగు కాలాల పాటు దాచుకోగలిగే జ్ఞాపకాలుగా, చిరునామాలను దాచి వుంచే కార్డులుగా చక్కగా ఉంటాయి. కానీ, రాత్రంతా మెలకువతో ఉండి తెల్లవారుఝాము దాకా తినడం, తాగడం, డబ్బులు వృధా చేయడం కుటుంబ సంస్కృతికి ఆత్మీయ సంస్కృతికి ఉపయోగపడకపోగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారి కోసం బాధపడుతున్నారు. ఈ పండుగను ఇంట్లో జరుపుకునే పండుగగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. మార్కెట్లో అమ్ముకునే అంతర్జాతీయ వ్యాపారవేత్తలు ఈ సంస్కృతిని ప్రచారం ద్వారా పెంచి పోషిస్తున్నారు అని ఒక విమర్శ ఉంది. అయితే, వెనకటి నుండి కొనసాగుతున్న పండుగల్లో కూడా, జాతరల్లో

కూడా మార్కెట్ శక్తులు, వ్యాపారస్తులు, గుళ్ల పూజారులు వారి వ్యాపార అవసరాల ద్వారానే పెంచి పోషించారు. ఇందుకు ఎన్నో పండుగులను, జాతరలను, జయంతులను, నోములను సృష్టించి ప్రచారం చేశారు. కొబ్బరికాయలు కొట్టడం, బెల్లం పంచడం అనేవి కొబ్బరి, బెల్లం వ్యాపారులు, ఉత్పత్తిదారులు సృష్టించి పెంచి పోషించిన సంస్కృతే. అందువల్ల పండుగల్లో వ్యాపారవేత్తల ప్రయోజనాలు ఇప్పుడే కాదు, వందల ఏళ్ల నుండి కొనసాగుతున్నాయి. ఈ వ్యాపారవేత్తల, పూజారుల, బ్రాహ్మణుల స్వార్థాలకు దైవభక్తి, పుణ్యం పేరు చెప్పడాన్ని కబీరు, గురు రవిదాసు మొదలైన భక్త కవులు తీవ్రంగా వ్యతిరేకించారు.

రాఖీ పౌర్ణమి పుట్టిన సందర్భం వేరు. ఇప్పుడు అది అన్నా చెల్లెళ్ల ఆత్మీయ పండుగగా కుటుంబంలో, జీవితంలో భాగమైంది. సరిగ్గా అలాగే, ప్రేమికుల రోజును కూడా కుటుంబంలో, జీవితంలో ముఖ్యమైన ఆత్మీయ పండుగగా మార్చుకోవలిసిన అవసరం ఉంది. ఇది యూరప్, అమెరికా దేశాల్లో కాకుండా చైనాలో చక్కగా ఆచరణలో ఉంది. తాను ప్రేమించిన అబ్బాయిని, అమ్మాయిని తల్లిదండ్రులకు పరిచయం చేసి దీవెనలు పొందుతారు. తల్లిదండ్రులే పెళ్లి చేస్తారు. ఇది ఇటీవల మనదేశంలో కూడా ఉన్నత ఉద్యోగాలు, వృత్తులు చేస్తున్న వారి మధ్య విస్తరిస్తున్నది. అయితే, పూర్తిగా ఇవి కింది స్థాయి దాకా, గ్రామాల దాకా విస్తరించాలి. అందుకు తల్లిదండ్రులు, సామాజిక సంస్థలు, ఉద్యమాలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఒక ప్రధాన కర్తవ్యంగా ప్రోత్సహించాలి. తిరుపతి దేవస్థానం తరుపున సామూహిక వివాహాలు జరిపిస్తున్న పద్ధతి చాలా మంచి పద్ధతి. అన్ని దేవాలయాల్లో ఏడాదికి కనీసం ఎనిమిది, తొమ్మిది సార్లయినా సామూహిక వివాహాలు జరిపే కార్యక్రమాలను వేగవంతం చేయాలి. తద్వారా, ఖర్చులు తగ్గుతాయి. ఆరోగ్యప్రదంగా ప్రేమికులు పెళ్లి చేసుకునే అవకాశం కలుగుతుంది. ఇలాగే, ఇతర మతాల్లో కూడా చేయడం అవసరం.

కొత్త పండుగలు

ప్రేమికుల రోజుగా 14 ఫిబ్రవరిని జరుపుకోవడంలో విదేశీ సంస్కృతి భారతీయులపై రుద్దబడుతున్నదనేది వాస్తవమే. అయితే, దుష్యంతుడు శకుంతలను ప్రేమించిన రోజును లేదా రాధా కృష్ణుల ప్రేమ దినోత్సవాన్ని ప్రేమికుల రోజుగా జరుపుకోవచ్చు. హోళి పండుగ ఒకప్పుడు ప్రేమికుల పండుగే. కాముని కాల్చడం అనగా మన్మధున్ని కాల్చడం, వసంత కేళి మొదలైనవి ప్రేమికుల పండుగలే.

అలాంటి తేదీలు వెతికి వెలికి తీయడం అవసరం. అంతేగానీ, ప్రేమికుల రోజును జరుపుకోవడాన్ని వ్యతిరేకించడం ప్రేమను వ్యతిరేకించడమే అవుతుంది. అందువల్ల, ప్రేమికుల రోజు కన్నా చాలా రోజుల ముందే ప్రేమికులు తమ తల్లిదండ్రులకు, సన్నిహితులకు తాము ఎవరిని ప్రేమిస్తున్నారో చూచాయగా చెప్తూ ప్రేమికుల రోజు నాడు వారిని ఇంటికి పిలిచి పరిచయం చేసి భోజన సత్కారాలతో ఒక పూట ఇంట్లో కలివిడిగా కలిసి ఉండడం అనే సంస్కృతిని ప్రోత్సహించాలి. ప్రచారం చేయాలి.

ప్రేమికుల రోజున అదే రోజు పెళ్లి చేసుకోదల్చుకున్న వారికి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేయడాన్ని ప్రభుత్వం, సామాజిక ఉద్యమాలు విస్తృతంగా ప్రచారం చేయగలగాలి. అంతేగానీ, బలవంతంగా తాళి కట్టించి పెళ్లి చేస్తాం అని నెగెటివ్ కోణంలో, వ్యతిరేకించే కోణంలో తిరగడం సరైంది కాదు.

ప్రేమించడం భారతీయ సాంప్రదాయం

ప్రేమ అనేది భారతదేశంలో శతాబ్దాల తరబడి మన సంస్కృతిలో భాగంగా కొనసాగుతూ వస్తున్నది. అందువల్ల, ప్రేమను, ప్రేమికులను కించ పరిచే, అవమానించే పద్ధతులు సరైనవి కావు. ప్రేమికులను వారి ఇష్టాయిష్టాలను తెలుసుకుని ప్రేమికుల రోజున లేదా కృష్ణాష్టమి జన్మదినం రోజున పెళ్లిళ్లు చేసి ఆశీర్వదించాలి. కులాతీతంగా, మతాతీతంగా పెళ్లిళ్లను చేసుకోవడాన్ని ప్రోత్సహించాలి. అందుకు ప్రేమికుల రోజును కూడా రాఖీ అన్నా చెల్లెళ్ల పండుగ వలె ఒక పవిత్రమైన కుటుంబ పరమైన, సామాజిక పరమైన, బలమైన సెంటిమెంట్ గల పండుగగా మలుచుకోవల్సిన అవసరం ఉంది. అలాగే, జనవరి 26, ఆగష్టు 15, డిసెంబర్ 31, జనవరి 1 పండుగలను కూడా పవిత్రంగా కుటుంబపరంగా కుటుంబంలో భాగంగా జరుపుకుని ప్రజాస్వామ్య సంస్కృతిని, విలువలను, వాటి ప్రాధాన్యతను, సమానత్వాన్ని ఒక అత్యున్నత మానవీయ విలువగా, సంస్కృతిగా జీవితంలో భాగంగా మార్చుకోవడం అవసరం. ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, పార్టీలు, యాజమాన్యాలు ఇందుకు విస్తృత ప్రచారాన్ని, ప్రోత్సాహాన్ని అందించడం అవసరం. అప్పుడే ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం కుటుంబంలో గొప్ప పండుగగా నూతన సంస్కృతిని సంతరించుకుంటుంది. అన్ని పండుగలు సమాజంతో పాటు కుటుంబంలో భాగంగా మారగలిగినప్పుడే అవి చిరకాలం సుస్థిరంగా కొనసాగుతాయి.

ప్రేమికుల రోజు-రాఖీ పండుగ

మారుతున్న సమాజాన్ని అనుసరించి ప్రపంచవ్యాప్తంగా సంస్కృతి ఒకటిగా మారుతూ కొత్త పండుగలు ఎన్నో మన జీవితంలో ప్రవేశిస్తున్నాయి. యాభై ఏళ్ల నాటి పండుగలకు, నేటి పండుగలకు ప్రాధాన్యతలకు మధ్య ఎంతో కొత్తదనం ప్రవేశించింది. అలాగే రాఖీ పండుగను మహిళా దినోత్సవంగా, మహిళా హక్కుల దినోత్సవంగా, అన్నా, చెల్లెల్ల పండుగగా, జాతీయ, అంతర్జాతీయ పండుగగా జరుపుకోవడం అవసరం. ఒక నక్షత్రం రాశులు ఇలా కలిశాయని అన్నా చెల్లెళ్లు చక్కెర్లు పోసుకోవాలని, చీరలు పెట్టుకోవాలని రెండేళ్లకోసారి ఏవేవో పేర్లతో పండుగలను, సందర్భాలను సృష్టిస్తూనే ఉన్నారు. ఈ పండుగలను నిరాకరిస్తే ప్రేమలు లేవు మా మీద అని కష్టాలు పొందేవాళ్లు విమర్శిస్తారు. ఇలా సెంటిమెంట్లు, అనుబంధాలు మిళితమయ్యే విధంగా పండుగలు రూపొందిస్తారు. వాటిని మరింత పవిత్రంగా జరుపుకోవడానికి నూతన సంస్కృతిని సాంప్రదాయిక సంస్కృతిని కలగలుపుతూ మంచి వైపు మళ్లించడం అవసరం.

మారే ఉద్దేశ్యాలు

జంధ్యాల పౌర్ణమిని రాఖీ పండుగగా ప్రాచుర్యంలోకి తీసుకుని వచ్చి అన్నా చెల్లెళ్ల మధ్య అనుబంధాలను పెంచడం ఇటీవలి పరిణామమే. దీన్ని సాంప్రదాయ వాదులు ముఖ్యంగా ఆరెస్సెస్ వాదులు దేశ భక్తి పండుగగా కూడా మలిచారు. నాకు నీవు రక్ష, నీకు నేను రక్ష, మనము దేశానికి రక్ష అని ప్రతిజ్ఞ తీసుకుని రాఖీలు కట్టుకోవడాన్ని ఒక పెద్ద కార్యక్రమంగా కొనసాగిస్తున్నారు. అలాగే, యుక్త వయస్కులైన స్త్రీ పురుషులు పవిత్రంగా ప్రేమించుకుని ఒకటి కావడానికి ప్రేమికుల దినోత్సవాన్ని కూడా మలచడం ద్వారా మన ప్రాచీన సంస్కృతి సాంప్రదాయాలను పునరుద్ధరించిన వారౌతారు. శకుంతల దుష్యంతుల ప్రేమ, రాధా కృష్ణుల ప్రేమ, సంయుక్త పృథ్వీరాజ్‌ల ప్రేమ ఇలా భారతీయ చరిత్రలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తాజ్‌మహల్ ప్రేమ చిహ్నంగా ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. ఇలా భారతీయ చరిత్రలో తరతరాలుగా ప్రేమ సంస్కృతి కొనసాగుతున్నది.

కుల మతాలకు అతీతంగా మానవాళి ఒక్కటి కావడానికి కులాతీత, మతాతీత ప్రేమ వివాహాలు ఎంతగానో దోహదం చేస్తాయి. మనుషులు అందరూ ఒకటే అనే మహోన్నత సాంస్కృతిక విలువను, మానవీయ విలువను ప్రేమికుల రోజు సందర్భంగా గుర్తించి గౌరవిస్తూ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, సామాజిక సేవా

సంస్థలు, రాష్ట్రీయ స్వయం సేవక సంఘాలు, వాటి పరివారం, వామపక్ష పార్టీలు సంఘాలు ఈ పండుగను మానవాళి మానవీయ విలువలను పెంచేదిగా రాఖీ పండుగలాగా మలచడం అవసరం. అది అన్నా చెల్లెళ్ల పండుగ. అలాగే ప్రేమికుల రోజును ప్రేయసీ ప్రియుల, కాబోయే భార్యాభర్తల అవగాహన పండుగగా పవిత్రమైనదిగా గుర్తించి గౌరవిస్తూ అందుకనువుగా కార్యక్రమాలు తీసుకోవడం అవసరం. తల్లిదండ్రులు ఈడు వచ్చిన తమ పిల్లల ప్రేమలను, ఇష్టాయిష్టాలను గౌరవించి కులాతీతంగా మతాతీతంగా తల్లిదండ్రులే స్వయంగా పూనుకుని పెళ్లి చేసే సంస్కృతి పెరగడానికి అనువుగా అందరూ పూనుకోవడం అవసరం.

పండుగలు కుటుంబ సంస్కృతిలో భాగం కావాలి

పాశ్చాత్య దేశాల పండుగలను ఇతర దేశాల మీద రుద్దడం వాస్తవమే. అయితే, ఐక్యరాజ్య సమితిలో భారతీయ పండుగలను గురించి వివరించి వాటిని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు జరుపుకునే పండుగగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వం తరపున ఎప్పటికప్పుడు అనేక ప్రతిపాదనలను ప్రవేశపెడుతూ వుండాలి. ఉదాహరణకు రాఖీ పౌర్ణమి అన్నా చెల్లెళ్ల పండుగను జూలై చివరి వారంలో గానీ, ఆగస్టు నెలలో గానీ ఒక తేదీ నిర్ణయించి ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవాలని ప్రతిపాదన పెట్టవచ్చు. అలాగే, వసంతోత్సవం పండుగగా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒక తేదీ సూచిస్తూ హోలీ పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవాలని కోరవచ్చు. అలాగే, పూల పండుగ అయిన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవాలని ఒక తేదీ సూచిస్తూ ప్రతిపాదనలు పంపవచ్చు. ఇలా ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతిలోని చారిత్రక సాంస్కృతిక అంశాలను ఆధునిక మానవీయ సంస్కృతికి అనువైనవాటిగా మలుచుకోవడానికి మన వంతు ప్రతిపాదనలను చేసి చర్చించడం అవసరం. కాంగ్రెస్, బిజెపి కేంద్ర ప్రభుత్వాలు ఇలాంటి ప్రతిపాదనలు ఇప్పటిదాకా ఎన్ని చేశారో ప్రకటించాలి.

ఎలాంటి ప్రతిపాదనలు చేయకుండా ప్రపంచవ్యాప్తంగా ఒక పండుగగా ముందుకు వచ్చిన తర్వాత వ్యతిరేకించడం సరైంది కాదు. దాన్ని భారతీయ సంస్కృతికి అనువుగా మలుచుకోవాలి. భారతీయ సమాజంలోని కుల వివక్షతకు, మత వివక్షతకు, కట్నాలు, తల్లిదండ్రుల ఆధిపత్యం మొదలైన అనేక సమస్యలకు పరిష్కారంగా తమ జీవితాలను తామే నిర్ణయించుకునే స్వేచ్ఛా సమానత్వం పెంచి పోషించే ప్రేమికుల రోజు వంటి పండుగలను ఏడాదికి రెండు మూడు పండుగలుగా భిన్నమైన పేర్లతో

జరుపుకోవడం అవసరం. కులాతీత దినోత్సవం పేరిట ప్రేమికుల రోజును రెండవసారి జరుపుకోవచ్చు. అలాగే, కులాతీత, మతాతీత దినోత్సవం పేరుతో మరో పండుగ కూడా జరుపుకోవచ్చు. తాజ్‌మహల్ దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకోవాలని దాన్ని కూడా ప్రేమికుల దినోత్సవంగా ఒక తల్లి గౌరవ చిహ్నంగా కూడా దాన్ని ప్రచారం చేయవచ్చు. ఎందుకంటే తాజ్‌మహల్ ఔరంగజేబు తల్లి సమాధి. ఒక తల్లిగా 14 మందిని కన్న తర్వాత బాలింత రోగంతో ముంతాజ్ చనిపోయింది. అప్పుడు షాజహాన్ ఎక్కడో యుద్ధంలో ఉండిపోయాడు. సకాలంలో వైద్యం అందక చనిపోయిన తల్లికి గౌరవ చిహ్నంగా కూడా తాజ్‌మహల్‌కు ప్రాధాన్యత ఉంది.

విదేశీ అంటూ అన్నిటినీ నిరాకరించాలా?

ఆరెసెస్ వంటి సాంప్రదాయవాదులు, ఆధునిక వాదులు అందరూ ఇలా ప్రతి సందర్భాన్ని మన అవసరాలకు అనుగుణంగా, సామాజిక మార్పుకు సామాజిక న్యాయానికి భారతీయ ప్రజాస్వామిక స్వాతంత్ర్య విలువలకు అనువుగా మలుచుకోవడం కోసం ప్రశ్నించాలి. అలా ఉద్యమించకుండా ఆచరించకుండా అవి విదేశీ అని వ్యతిరేకించడం సరి కాదు. మన జీవితంలో విదేశీ కానిది రోజురోజుకూ తగ్గిపోతున్నది. విద్యుత్తు, రేడియో, బస్సు, రైలు, పెట్రోలు వాహనాలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్, సినిమా, టీవీ, సిమెంట్, తారు రోడ్లు, పాలిష్టర్, విమానాలు మొదలైనవన్నీ విదేశీయమైనవే. సబ్బులు, స్నోలు, పౌడర్లు, స్ప్రేలు కూడా విదేశీయమైనవే. విదేశాల్లో ఎందరో కనుగొన్న వాటిని అన్ని దేశాలు స్వీకరించాయి. తమ జీవితాల్లో భాగం చేసుకున్నాయి. తమ అవసరాలకు అనుగుణంగా మలుచుకున్నాయి. ఉదాహరణకు హిందువులు కరెంటు వచ్చాక నూనె దీపాల వలె డిజైన్లు చేసి దేవుళ్ల పటాలకు దీపాలు అలంకరిస్తున్నారు. అలాగే, రైలెక్కి, బస్సెక్కి హిందూ దేవుళ్లను దర్శించుకోవడానికి వెళుతున్నారు.

ఇలాగే సినిమా, కెమెరా ద్వారా ప్రింటింగ్ ప్రెస్ ద్వారా దేవుళ్ల సినిమాలను తీసి, ఫోటోలను దించి, ప్రింట్ చేసి ప్రచారం చేస్తున్నారు. ఇలా జీవితంలోని సమస్త కోణాల్లో విదేశీ ఆవిష్కరణలు ప్రవేశించి మన జీవితంలో భాగమయ్యాయి. విదేశీ ఆవిష్కరణ అయిన కరెంటుతో స్వదేశీ ఇడ్లీలు, దోశలు పిండి రుబ్బుకునే మిషన్లను, గ్రైండర్లను రూపొందించుకున్నారు. సరిగ్గా ఇదే పద్ధతిలో ప్రపంచవ్యాప్త పండుగలను స్వదేశీ సంస్కృతికి అనువుగా కుల వివక్షత, మత వివక్షత తొలగించి మానవులందరూ ఒకటే అనే మానవీయ సంస్కృతిని ఆచరించడానికి ప్రాచుర్యంలోకి తీసుకోవడం

అవసరం. దీన్ని వ్యతిరేకించేవారు ఈ అసమానతలు, కుల వివక్షత ఇలాగే వుండాలని, కులాతీత మతాతీత వివాహాలను వ్యతిరేకించాలని భావిస్తున్నారని అర్థం. వీళ్లు సమాజానికి వెనుకబడిపోయిన ఆలోచనా విధానంలో కొనసాగుతున్నారు. వారి కోసం సమాజాన్ని వెనక్కి నడపడం సాధ్యం కాదు. ఆ ప్రయత్నం చేస్తే వాళ్లే వెనుకబడిపోతారు. అందువల్ల రాఖీ పౌర్ణమిని ఫెమినిజాన్ని, అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని ప్రచారం చేసే పండుగగా స్త్రీ పురుషులు సమానం అని గుర్తు చేసే పండుగగా మలుచుకోవడం అవసరం. 14 ఫిబ్రవరి ప్రేమికుల రోజును లేదా దేశీయంగా మరొక రోజును ప్రేమికుల దినోత్సవంగా ప్రకటించుకుని ఆచరించడం అవసరం.

కులాంతర వివాహాలకు తల్లిదండ్రులు అడ్డు కాకూడదు. తల్లిదండ్రులే ప్రేమికులకు కులాతీతంగా పెళ్లి చేసే సంస్కృతి రోజురోజుకూ పెరుగుతున్నది. ఇది ఆహ్వానించదగిన పరిణామం. పల్లెల్లో కూడా ప్రేమ పెళ్లిళ్లను కుటుంబసభ్యులు ముందుండి జరపాలి. పెళ్లిళ్లను దుబారా లేకుండా తక్కువ ఖర్చుతో జరుపుకోవడానికి పెళ్లి దినోత్సవాలను, వారోత్సవాలను ఏడాదికి మూడు నెలలకు ఒకసారైనా జరపాలి. ఆ సందర్భంగా గుళ్లల్లో, మసీదుల్లో, చర్చిల్లో, గురుద్వారాల్లో, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెళ్లిళ్లను ఉచితంగా జరిపి సర్టిఫికెట్ ఇవ్వడమే కాకుండా తిరుపతిలో ప్రవేశపెట్టినట్టుగా బంధు మిత్రులకు భోజనాలు కూడా ఆ యా సంస్థల తరపున ఏర్పాటు చేయడం అవసరం. తద్వారా పెళ్లి పేరిట ఖర్చు చేసి అప్పుల్లో కూరుకుపోతున్న విధానాన్ని సమూలంగా మార్చడం అవసరం. ఇలా మనసుంటే మార్గం వుంటుంది. కనుక, ప్రజల తరపున ప్రజల కోసం ఆలోచించడం, ప్రజాస్వామ్య విలువలు, సంస్కృతి కులాతీత మతాతీత సంస్కృతి విలువలు ఆచరణ కోసం కనీసం 21 ఏళ్లు వయసు వచ్చిన పురుషులను, 18 ఏళ్లు నిండిన స్త్రీలను వారి ఇష్టాయిష్టాలను అనుసరించి పెళ్లి చేయడం, పెళ్లి చేసుకోవడాన్ని ప్రోత్సహించడం అవసరం. ప్రేమికుల రోజు సందర్భంగా అందరూ ఈ కోణంలో ఆలోచిస్తే సమాజం ఆధునిక సమాజంగా మారడంతో పాటు మానవీయ సంస్కృతికి పునర్ నిర్మాణమవుతుంది.

ప్రజాస్వామ్యం పార్టీ స్వామ్యం

భారతదేశంలో ఇప్పుడు రాజకీయాల్లో ప్రజాస్వామ్యంలో పార్టీ స్వామ్యమే కొనసాగుతున్నది. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం చేశాక ప్రజాస్వామ్యం పూర్తిస్థాయి పార్టీస్వామ్యంగా మారిపోయింది. పార్టీ అధినాయకత్వమే ఎవరికి టిక్కెట్లివ్వాలో నిర్ణయిస్తారు. అధినాయకత్వం విధేయతకు, తమ సామాజిక వర్గాలకు, బంధుమిత్రులకు, ఆశ్రిత పక్షపాతులకు, ఆయా లాబీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

పార్టీ అధినాయకత్వంగా ఎదగడానికి క్రింది అర్హతల్లో చాలా మేరకు సాధించి వుంటారు.

1. **గుడ్‌విల్, ప్రాచుర్యం, ప్రజల విశ్వాసం**
2. **సామర్థ్యం, విధేయుల్ని కలిగి వుండడం**
3. **మాస్‌లీడర్, టీమ్‌లీడర్‌గా నిర్మాణ సామర్థ్యం**
4. **ఫండ్‌రైజింగ్ సామర్థ్యం**
5. **ఉత్తేజపరిచే సామర్థ్యం, స్ఫూర్తినిచ్చే సామర్థ్యం**
6. **పార్టీ, ప్రజాసంఘాల, ఉద్యమాల నిర్మాణ సామర్థ్యం**
7. **పార్టీ శ్రేణుల ప్రయోజనాల అన్ని స్థాయిల్లో కాపాడ్డం**
8. **ఉదారత, అధ్యయనం వినే ఓపిక, స్వీకరణ శక్తి**
9. **విశాల జాతీయ దృక్పథం, జాతీయ, అంతర్జాతీయ అవగాహన**

సొంత సామర్థ్యం పెంచుకోవాలి

సొంతంగా తన నియోజకవర్గంలో గెలవడానికి, గెలిపించడానికి, పార్టీలను నడిపించడానికి ఈ సామర్థ్యాలను సాధించుకోవడం అవసరం. ఇవి సాధించకుండా కొన్ని సామాజికవర్గాల నేతృత్వంలో ఉన్న పార్టీలో పనిచేసే వారికి, అందులోనే టిక్కెట్లివ్వాలని కోరే వారికి ఇవి చాలా మేరకు లేవనే అర్థం. పార్టీపై ఆధారపడ్డ వాళ్లు. పార్టీని ఆయా రంగాల్లో నిర్మాణం చేసే స్థాయి ఇంకా సాధించుకోలేదు. వారు విధేయులుగా వున్నప్పుడే టిక్కెట్లిస్తారు. సామర్థ్యం పెంచుకుంటున్న కొద్దీ విధేయత కూడా అదే స్థాయిలో పెంచుకుంటూ వున్నప్పుడే అధిష్టానం అవకాశాలు ఇస్తుంది.

అప్పుడప్పుడు కొందరికి లాటరీ తగిలినట్టుగా అవకాశాలు తగులుతాయి. భారతదేశ ప్రధానమంత్రిగా పనిచేసిన పి.వి.నరసింహారావు, డాక్టర్ మన్‌మోహన్‌సింగ్, భారత రాష్ట్రపతిగా పనిచేసిన అబ్దుల్ కలాం, పనిచేస్తున్న ప్రతిభాదేవిసింగ్ పాటిల్ ఇలా ఎదిగే క్రమంలో విధేయతతో పాటు అవకాశాలు అనుకోకుండా కలిసిరావడం వల్ల అధిష్టానం అవకాశాలను ఇచ్చి ప్రమోట్ చేసింది.

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తే...

చేవ వున్న విత్తనం పర్వతాల రాళ్ళ మధ్య కూడా మహావృక్షంగా ఎదుగుతుంది. కొండల్లో వున్న అడవులన్నీ ఇలా ఎదిగిన మహావృక్షాలే. నిజంగానే ఆయా సామాజిక కులాల రాజకీయ నాయకులకు శక్తి సామర్థ్యాలు వుంటే సొంత సత్తాతో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలి. ఓడిపోయినా ఫర్వాలేదు. సెకండ్ లీడింగ్ వచ్చినా పర్వాలేదు. 20వేల ఓట్లు మించితే సమాజం ప్రజా నాయకుడిగానే గౌరవిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులు కూడా అలాగే గౌరవిస్తారు. ఆ తరువాత మరోసారికి సొంతంగా గాని, మరో పార్టీ తరఫున గాని పోటీ చేసి గెలవడం సాధ్యపడుతుంది. ఇండిపెండెంట్‌గానైనా పోటీ చేసి ఆయా పార్టీలను ఓట్ల చీలిక ద్వారా ఓడిస్తాడేమోననే భయాన్ని సృష్టించే వారే ప్రాదేశిక నియోజకవర్గాల స్థాయిలో నాయకులుగా ఎదుగుతారు.

అధికార పార్టీలను లేదా ఉనికిలో ఉన్న రాజకీయ పార్టీలను కొన్ని సీట్లు బీసీలకు ఇవ్వాలని, ఆ యా కులాలకు ఇవ్వాలని కోరితే జరిగే సామాజిక న్యాయం పరిమితం. సిద్ధాంత భూమిక లేకుండా, ఆయా సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రాధాన్యత లేకుండా వ్యక్తికి పట్టం కడితే ఆయా కులాలకు జరిగే సామాజిక న్యాయం

బహుకొద్ది. కులం పేరిట, బీసీల పేరిట, ఎస్సీల పేరిట, ఎస్టీల పేరిట ఎన్నికయ్యేవారు మొత్తం సమాజానికి చేయడంతో పాటు ఆ యా కులాలకు ప్రత్యేక శ్రద్ధతో సామాజిక న్యాయం చేయడానికి ఎన్నో పరిమితులు...

ఆయా సామాజిక వర్గాల నుండి ఎదిగిన వారి ప్రత్యేక కర్తవ్యాలు

డా॥ అంబేద్కర్ ఎస్సీల పేరిట పనిచేసి ఎస్సీ, ఎస్టీలకు సామాజిక న్యాయాన్ని సాధించి రాజ్యాంగబద్ధం చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ మంత్రిగా వుంటూ సామాజిక న్యాయం కోసం పలు రంగాల్లో కృషి చేశాడని చెప్తారు. జి.వెంకటస్వామి కార్మికశాఖ మంత్రిగా కొన్ని ప్రత్యేక సందర్భాలను సామాజిక న్యాయం సాధించడానికి కృషి చేశారు. దామోదరం సంజీవయ్య సామాజిక న్యాయం కోసం కృషి ప్రారంభించగానే ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించారు. తమిళనాడులో కాంగ్రెస్ తరపున గానీ, జస్టిస్ పార్టీ తరపున గానీ, డీఎంకే తరపున గానీ, అన్నాడీఎంకే తరపున గానీ సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు.

కొన్ని చిన్న చిన్న అవకాశాలు వ్యక్తిగతంగా ఇచ్చి, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడానికి కొందరికి ముఖ్యంగా నాయకులకు వెసులుబాటు కల్పిస్తారు. వారు తాము వచ్చిన సామాజిక వర్గాలను వారి వెంట నడిపించుకోవడం ద్వారా ఆ యా రాజకీయ పార్టీల్లో తమ స్థానాన్ని గెలుచుకుంటారు.

కుల సంఘాలకు కుల నిర్మూలన లక్ష్యం కావాలి

కుల సంఘాల వాళ్లు కులాల పరిమితుల్లో ఆలోచించడం మనుధర్మం, వర్ణ వ్యవస్థ పరిధిలో కుదించుకుపోయి ఆలోచించడమే అవుతుంది. కులం గురించి చర్చించడం కులాన్ని ఆచరించడానికి కాదు, కులాన్ని నిర్మూలించడానికి, అన్ని కులాలు సమానమే అని కలిసి కుల నిర్మూలన దిశగా సాగడానికి మాత్రమే.

కానీ, ఈ నాటి కుల సంఘాలు, సామాజిక వర్గాలు కులాన్ని ఆచరించాలని, కులాలకు పరిమితమై ఆలోచించడం వల్ల పాలక వర్గాలు కోరుకున్న పనినే చేసి పెడుతున్నారని వాళ్లు కోరగానే 'అది ఇస్తాం, ఇది ఇస్తాం, కొన్ని సీట్లు ఇస్తాం, బడ్జెట్‌లు ఇస్తాం' అని బుట్టలో వేసుకుంటున్నారు.

అందువల్ల, కులాల వారీగా సమీకరణలు దీర్ఘకాలిక సామాజిక న్యాయం, సామాజిక మార్పు రీత్యా అంత మంచివేమీ కాకపోగా, సామాజిక న్యాయానికి విరుద్ధమైన దశకు మలుపు తిరుగుతుంటాయి. ఆ యా పార్టీల్లోని అగ్ర కుల

నాయకత్వాలు తమ అనుచరులను ఆ యా కుల సంఘాల్లో తయారుచేసుకుంటారు. తయారైన వారిని తమ కనుకూలంగా మలుచుకుంటారు.

పాలకవర్గాల తెలివితేటలు మరీ తక్కువేమీ కాదు

పాలక వర్గాలు మరీ అంత తెలివి తక్కువవి ఏమీ కాదు. కులాల రీత్యా నిర్మాణం చేస్తే ఒక కులానికి మరో కులాన్ని పోటీ పెట్టి, ఒకే కులంలో మరో గ్రూపును తయారు చేసి పోటీ పెడతారు. తమకు అనుకూలమైనవారిని నాయకులుగా ముందుకు తెస్తారు. నిజంగా పనిచేసేవారిని వెనక్కి నెడతారు. అంబేద్కర్ చెప్పినట్టు కులం పునాదుల మీద ఒక జాతిని గాని, ఒక నీతిని గాని నిర్మించలేరు. కులాలకు, వర్గాలకు అతీతంగా మొత్తం సమాజం గురించి, భారతదేశం గురించి, ప్రపంచం గురించి ఆలోచించగలిగేవారే సామాజిక న్యాయాన్ని నిజంగా సాధించడం సాధ్యమవుతుంది.

కులవృత్తులు వదిలేసిన వారే కులాల గురించి ఎక్కువ మాట్లాడుతున్నారు

గతంలో కులవృత్తులు పోతే కులం కూడా పోతుందని చాలా మందిమి ఆశించాము. రాజకీయాల్లో కులం అధికార సాధనానికి ఉపయోగపడే బలమైన శక్తిగా మారుతూ వచ్చింది. కులవృత్తులు పోయిన తరువాత, కులవృత్తులు చేయని వారే కులాల గురించి, కుల చైతన్యం గురించి ఎక్కువ మాట్లాడుతున్నారు. ఇది పరిమితమైన ప్రయోజనానికి సంబంధించిందని తెలిసి కూడా మాట్లాడవలసి వస్తున్నది.

జాతీయ ఉద్యమ కాలంలో, పారిశ్రామిక విప్లవంలో, బ్రిటీష్ ప్రభుత్వం కుట్ర పూరితంగా కులవృత్తులను ధ్వంసం చేసే ప్రత్యేక కార్యక్రమం చాపకింద నీరులా ఆచరణలోకి తెచ్చినప్పుడు వాటి నుండి రక్షణ కోసం కులవృత్తి సంఘాలు ఏర్పడ్డాయి. ఇలా మొదటి దశలో కులవృత్తి రక్షణ కోసం, రెండవ దశలో ఆయా కులవృత్తుల ప్రజలు సాంఘికంగా, విద్యాపరంగా కాస్త ఎదగడం కోసం హాస్టళ్ళు, విద్యాసంస్థలు పెట్టడం ప్రారంభించారు. సబ్సిడీలు డిమాండ్ చేశారు. మూడవ దశలో ఈ రెంటిని గురించి మాట్లాడ్డం తగ్గించి రాజకీయాధికారం గురించి ఆయా కులాలకు కులాల వారీగా నిష్పత్తి ప్రాతినిధ్యం అందాలనేదానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

కుల సంఘాలు కుల వృత్తుల ననుసరించి ఏర్పడ్డప్పటికీ నేడు కుల సంఘాల పెత్తనం అంతా కుల వృత్తులు చేయనివారిదే. కుల వృత్తులు చేయనివారే ఆ యా కులాల పేరిట సామాజిక న్యాయం అని, రాజకీయ రంగంలో తమ వాటా అని

అడుగుతున్నారు. అది, అర్థం చేసుకోవచ్చు. కానీ, వాళ్లు ఆ యా కుల వృత్తుల్లో ఉంటూ, కుల వృత్తులు కోల్పోతూ ఉపాధి కరువై, నైపుణ్యం కరువై పేదరికంలో మగ్గుతూ ఆకలిచావులకు, ఆత్మహత్యలకు లోనౌతున్నారు. వీళ్ల గురించి ఆ యా కుల సంఘాలు తమ కులాల ప్రజలను చేరడానికి ప్రయత్నించడంలేదు.

ఇతర సామాజిక వర్గాలతో ఒబామాలాగా పోటీపడి గెలవాలి

కుల వృత్తులు పోయినా, రాజకీయ ప్రయోజనాల కోసం కులాలు, కుల సంఘాలు, మరింత బలపడుతున్నాయి. రాజకీయ అధికారాన్ని బ్రాహ్మణులు, రెడ్లు, వెలమలు, కమ్మలు, జాట్లు మొదలైనవాళ్లు కులాల పేరుతో సమీకరించి అధికారాన్ని చేపట్టడంలేదు. ఆయా పార్టీలు రాజ్యాంగ లక్ష్యాలను, సామాజిక న్యాయాన్ని, ఎన్నికల ప్రణాళికలను ప్రజల ముందు ఉంచి మైనార్టీ జనాభా అయినప్పటికీ అందరి ఓట్లు సాధించి గెలుస్తున్నారు. మైనార్టీ కులాలే ఇలా గెలువగలిగినప్పుడు మెజార్టీ కులాలు అవే సామాజిక లక్ష్యాలను, సామాజిక న్యాయాన్ని వారికన్నా మరెన్నో రెట్లు విస్తారంగా ప్రకటించి ఎన్నికల్లో గెలుపొందవచ్చు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఈ పని ఎందుకు చేయలేకపోతున్నారు? అమెరికాలో ఒబామా గెలిచినట్లు ఎందుకు గెలవలేక పోతున్నారు. మాంసం తింటున్నామని ఎముకలు మెడలో వేసుకోరు. తమ సామాజిక వర్గాలకు మేలు చేస్తున్నామని అగ్రకులాలు చెప్పుకోరు. బీసీలు, ఎస్సీలు కూడా అలాగే ఎదగడం అవసరం. అగ్రకుల నాయకులు ఇతరులకు చేసింది ఎక్కువ చెబుతారు. తమకోసం, తమవారి కోసం చేసింది అసలు చెప్పరు. బీసీలు, ఎస్సీలు కూడా అలా ఎదిగినప్పుడే నిండుకుండలా తొణకని రాజకీయం స్థాయికి ఎదగడం పూర్తయినట్టు. కేవలం కులాల పేర్లు చెప్పుకొని, సామాజిక వర్గాల పేర్లు చెప్పుకొని అధికారంలోకి రావాలని అనుకోవడంలో ఏదో లోపం ఉంది.

లోపం ఎక్కడుంది?

సామర్థ్య లోపమా?

కమిట్‌మెంట్ లోపమా?

అధ్యయన లోపమా?

ఆర్థిక లోపమా?

అగ్రకులాలతో ఎందుకు వెనకబడుతున్నారు?

వారికున్న సామర్థ్యాలను తాము సాధించుకోడానికి ఏం కృషి చేస్తున్నారు?

బీసీ నాయకులని, ఎస్సీ నాయకులని ముద్ర పడడం అవసరమా?

అది లాభమా? నష్టమా?

వీటిని నిశితంగా పరిశీలించాలి. నాయకులు పరిష్కరించుకోవాలి. ఈ సామర్థ్యాలను సాధించుకోవాలి. లేకపోతే అది కుల సమీకరణలను ప్రోత్సహించి కులాల మధ్య వైరుధ్యాలను, వైషమ్యాలను పెంచి సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. పూలే, అంబేద్కర్‌లు సమాజాన్ని ఒకటి చేశారు. ఒకటిగా కలపడానికి కృషి చేశారు.

పాలకవర్గాలు, అగ్రకులాలు అధికారం కోసం ఓట్ల కోసం కొన్ని సామాజిక వర్గాలను మచ్చిక చేసుకోవాల్సి వచ్చింది. తద్వారా ఓటు బ్యాంకు పెరగడమే కాకుండా సామాజిక న్యాయం చేశామని ప్రదర్శించుకోవచ్చునని స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న ప్రతి ఎన్నికలో ఆయా కులాలను దువ్వడం అందులో తమ విధేయులను నాయకులుగా ప్రోత్సహించడం జరుగుతూ వస్తున్నది.

క్రమంగా అనేక పార్టీలు ఏర్పడ్డాక ఎవరికి వీలైన మేరకు వాళ్ళు తమకు లాబీలుగా, ఓటుబ్యాంకులుగా అధికారానికి సోపానాలుగా పనికొస్తారని పాలక వర్గాలు ప్రజలను విడి విడిగా, కులాల వారీగా చీల్చడం కోసం, చీల్చి కొన్ని కులాలను తమ వేపు మల్చుకోవడం కోసం సౌకర్యంగా ఉండడానికి ప్రవేశపెట్టిన ప్రక్రియ ఇది. కాన్షీరాం ఇదే మాట మరింత స్పష్టంగా తమకు చెంచాలను తయారు చేసుకోవడం కోసం చేసిన ప్రయత్నం అని దాన్నంతా చెంచాయుగం అని విశ్లేస్తూ వ్యాసాలు రాశారు.

కులాల సంఖ్య తగ్గాలి. సమీప కులాలు కలిసిపోవాలి. క్రమక్రమంగా కులాలు తగ్గాలి. 11వ శతాబ్ది నాటికి 20 కులాలు కూడా లేవు. ప్రజాస్వామికంగా సమసమాజ నిర్మాణమే ప్రజాస్వామిక సామ్యవాదమే సామాజిక న్యాయానికి, సామాజిక మార్పుకు, సంఘ సంస్కరణలకు అంతిమ లక్ష్యం.

రాజకీయ రంగంలో సాధికారికత

రాజకీయ రంగంలో జనాభా నిష్పత్తి ననుసరించి రాజకీయ ప్రాతినిథ్యం ఉండడమే సామాజిక సాధికారికత చర్చ ముందుకు వచ్చింది. అందుకు సిద్ధాంతం, ఎజెండా, స్వయంగా నాయకులుగా ఎదగడం ప్రధానం. ఎజెండా ఏమిటి? గెలిచాక చేసే సామాజిక న్యాయం ఏమిటి? అనేవి చాలా కాలంగా మరుగున పడిపోతున్నాయి.

గెలిచాక ఏం చేస్తామో చెప్పడం ద్వారానే ఎన్నికల్లో ఆ యా పార్టీలు పోటీ చేస్తాయి. అందువల్ల, గెలిచాక చేసే సామాజిక న్యాయం ఏమిటో, పరిపాలన చేసే తీరేమిటో ప్రణాళికల్లో ప్రకటించడంతో పాటు అందుకు అవసరమైన ఆందోళన, ప్రచార కార్యక్రమాలు తీసుకోవడం అవసరం.

అధికారంలోకి వస్తున్న కొన్ని సామాజిక వర్గాలకు ఉన్నదేమిటో వాటిని బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎలా సాధించుకోవాలో పరిశీలించాల్సిన అవసరం ఉంది. బరాక్ ఒబామా నల్లజాతి మూలాల నుండి ఎదిగి అమెరికాకు ప్రజల చేత దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అబ్రహాం లింకన్ లాగా ఇండియాలో ఎదగడానికి ప్రతీక డా. బి.ఆర్.అంబేద్కర్. అబ్రహాం లింకన్, అంబేద్కర్, బరాక్ ఒబామాలను బీసీలు మార్గదర్శకంగా తీసుకోవాలి. వారి లాగా ఎదిగే కృషి చేయడమే నిజమైన సామాజిక న్యాయం. బరాక్ ఒబామా తాను నల్లవాడినని, వారి ప్రతినిధినని ఓట్లు వేయాలని నల్లవారిని ప్రత్యేకంగా ఓటు బ్యాంకుగా మార్చుకోవాలని బహిరంగంగా చెప్పలేదు, రహస్యంగానూ చెప్పలేదు. మొత్తం ప్రపంచాన్ని సంబోధించాడు. అమెరికా ప్రజలను సంబోధించి మార్పు అవసరమన్నాడు. వారి హృదయాలను గెలుచుకున్నాడు. ఇది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులకు ఆదర్శమైనప్పుడే వారు మొత్తం సమాజానికి నాయకులుగా, ప్రజా సేవకులుగా ఎదుగుతారు.

ఆయా సమస్యలను విడిగా పరిష్కరించడం సులభం

రాజకీయాధికారం దేనికోసం? ప్రజా సేవ చేయడానికి. సామాజిక న్యాయం సాధించడానికే రాజకీయాధికారం. ప్రజాసేవ, సామాజిక న్యాయం సాధించడానికి ఇతర మార్గాలు ఉన్నాయి. విద్యా, వైద్యం, స్కూళ్లు, కాలేజీలు పెట్టడం ద్వారా మద్యనిషేధం, బీసీలకు 50 శాతం బడ్జెట్లు కేటాయించాలి వంటి ఉద్యమాలు నిర్వహించడం ద్వారా సామాజిక న్యాయం సాధించవచ్చు.

సామాజిక న్యాయం, సాధికారికత సాధించడానికి రాజకీయాధికారంతో ముడిపెట్టకుండా స్వతంత్రంగా ఉద్యమిస్తే ఇష్యూ బేస్ ఉద్యమాలు విజయాలు సాధిస్తాయి. ప్రజల చేతిలో ఉన్న ఓటు హక్కు శక్తి ఈ విజయాలను అనివార్యం చేస్తుంది. అన్ని పార్టీలు మద్దతు ఇస్తాయి. మద్యనిషేధం ఉద్యమం, గిట్టుబాటుదారుల ఉద్యమం, మహిళా రిజర్వేషన్లు మొదలైనవి అలాంటి వాటిలో కొన్ని. ఇవి అన్ని పార్టీల మద్దతు పొందుతూనే వున్నాయి.

అందువల్ల, ఆ యా సామాజిక వర్గాలు భారత రాజ్యాంగం పేర్కొన్న సామాజిక న్యాయాన్ని డిమాండ్ చేస్తూ స్వతంత్ర ఉద్యమాలు సాగితే అవి ఆ యా ప్రభుత్వాలను, పార్టీలను ప్రభావితం చేస్తాయి. విద్య, ఉద్యోగ, వైద్యం ఆ యా సామాజిక వర్గాలకు అందించడానికి దీర్ఘకాలిక ఉద్యమాలు చేయడంతో పాటు ఆరెస్సెస్ వలె విద్యా సంస్థలను నెలకొల్పుతూ ముందుకు సాగితే అందరికీ విద్య పదేళ్లలోనే సాధ్యపడుతుంది.

మనుషులందరూ సమానమే

మనుషులందరూ సమానంగా పుట్టారు. అందువల్ల సమానత్వం అవసరం. పెరగడంలో కూడా సమానత్వం అవసరం. అవకాశాల్లో కూడా సమానత్వం అవసరం. అవకాశాలందుకోవడానికి పేదరికం, అవిద్య అడ్డంకులైతే వాటిని అధిగమించడానికి రాజ్యం పూర్తిగా సహకరించడమే సామాజిక న్యాయం.

అందరి ఓట్లతో గెలుస్తారు. ఒక్క ఓటు మెజార్టీతో గెలిచినా అందరి ప్రతినిధే. అందరికీ మేలు చేయాలి. ఓట్లు వేయనివారికి, ఓట్లు లేని వారికి, మొత్తం సమాజానికి కూడా మేలు చేయాలి. అదే సామాజిక న్యాయం. రాజ్యాంగ మౌలిక విలువలన్నీ సామాజిక న్యాయానికి సంబంధించినవే.

కులవృత్తుల్లో మార్పుల ఆవశ్యకత

కుల వృత్తుల్లో రావాల్సిన మార్పులను శాస్త్రీయంగా ప్రభుత్వాల తరఫున చర్చించడం అవసరం. తద్వారా, ఉత్పాదకత పెరగడం, శారీరక శ్రమ తగ్గడం, గిట్టుబాటు పెరగడం, ఆరోగ్య ప్రమాణాలు పెరగడం, సాధించాలి. ఈ దృష్టితో కుల వృత్తులను, ఆ యా వృత్తులను నిరంతరం పరిశోధనలకు గురిచేయాలి. శాస్త్ర పరిశోధన అంశాలను వారికి జత చేయాలి. ఉదా॥కు, కుమ్మరి...

అందువల్ల, ఆసియా దేశాలు యూరప్, అమెరికా దేశాల సాంకేతికతను యథాతథంగా దిగుమతి చేసుకోవడం వల్ల నిరుద్యోగిత పెరుగుతుంది. వృత్తులు ధ్వంసమౌతాయి. వృత్తులను ధ్వంసం చేసే బదులుగా సాగినంత కాలం వాటిని ఆధునీకరించడం అవసరం. అన్ని కుల వృత్తుల్లోకి అన్ని కులాల వాళ్లు చేరే విధంగా కుల వృత్తులు ఆధునీకరణ పొందితే సామాజిక న్యాయం వేగవంతం అవుతుంది. ముఖ్యంగా అగ్ర కులాల పేదలు బీసీ, ఎస్సీ, ఎస్టీల చిన్న వృత్తులు అని, నీచ వృత్తులు అని భావించే వృత్తుల్లోకి ఎంత ఎక్కువగా చేరితే అంత మేరకు అవి గిట్టుబాటుగా, సామాజిక గౌరవ ప్రదంగా మారాయని చెప్పవచ్చు.

జాతీయోద్యమం నాటి నాయకత్వానికి నేటి నాయకత్వానికి తేడా

1980 నుండి ఎదిగివస్తున్న సామాజిక వర్గాల రాజకీయ నాయకత్వం పూర్తిగా అగ్ర కులాలపై ఆధారపడి బతుకుతున్నది. అంతకుముందు బీసీ నాయకులు, ఎస్సీ నాయకులు స్వతంత్రంగా ఎదుగుతూ వచ్చారు. జాతీయోద్యమంలో గొప్ప పాత్ర నిర్వహించారు. ఆ నాయకత్వం పోటీలో క్రమక్రమంగా వెనుకబడిపోయింది. నూతన తరాల నాయకత్వం అగ్ర కులాల పంచన చేరి సీట్లు పొంది వారి దయాదాక్షిణ్యాల మీద, అనుగ్రహం మీద బతికే స్థితి పెరిగింది.

తెలుగుదేశం పార్టీ 1983లో రంగం మీదకి వచ్చాక బీసీలకు ప్రాధాన్యత పెరిగిన మాట నిజమే. కానీ, వీరు స్వంత వెన్నెముక ఉన్న నాయకత్వం కాదు. వెన్నుకు పార్టీ అనే బద్దలు కట్టి నిలబెట్టిన నాయకత్వం ఇది. స్వతంత్ర నాయకత్వంగా టీడీపీ నుండి ఎదగలేదు. టీడీపీలో చేరినవారు కాంగ్రెస్ వారి వలె సంపన్నులు కాలేదు. వారిని రక రకాల రంగాల్లో వచ్చే ఆదాయాలను తిననివ్వలేదు. అన్నీ అగ్రజులే మేశారు. అందువల్ల, ప్రతిసారీ ఎన్నికలకు టిక్కెట్ల కోసమే కాకుండా ఎన్నికల ప్రచార ఖర్చు కోసం కూడా పార్టీ పైనే ఆధారపడాల్సి వచ్చింది.

'బీసీలకు రాజకీయాధికారం' గ్రంథంలో వివరించినట్టుగా స్థానికంగాగాని, రాష్ట్ర స్థాయిలోగాని తన గెలుపు కోసం గాని, పార్టీ కోసంగాని ఎన్నికలకు, సభల నిర్వహణకు ఫండ్ రైజింగ్ చేయలేనివారు, స్వంత కార్యకర్తలను తయారు చేసుకోలేనివారు నాయకులుగా నిలదొక్కుకోలేరు. కాంగ్రెస్ పార్టీ ఇందుకు భిన్నమైనది. కాంగ్రెస్ పార్టీ నిజానికి పార్టీయే కాదు. గెలువదల్చుకున్న వాళ్లు స్వంత కార్యకర్తలతో, స్వంత ఫండ్ రైజింగ్‌తో, స్వంత ప్రతిష్టతో అందరూ కలిసి ఒక చోట చేరిందే కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ అంటే తెలుగులో మహాసభ అని అర్థం. అది నిజంగానే అందరూ చేరిన మహాసభ. అదొక సముద్రం. ఒక చేపను మరొక చేప తినేస్తుంది.

తెలుగుదేశం పార్టీ బీసీలకు రాజకీయ నాయకత్వం అందించినప్పటికీ అది స్వతంత్ర నాయకత్వంగా ఎదిగే అవకాశం లేనిది. దాని నిర్మాణమే అలాంటిది. గౌతులచ్చన్న, కొండా లక్ష్మణ్ బాపూజీ కొన్ని రంగాల్లో, కుల సంఘాల్లో స్వతంత్ర నాయకత్వంగా ఎదిగారు. తెలుగుదేశంలో ఇలాంటి వారిని చూడలేము.

అభివృద్ధి, అధికారం, గౌరవం అందుకున్నవారికి, అందుకోవాల్సినవారికి మధ్య వైరుధ్య పరిష్కారమే సామాజిక న్యాయం. సంఘ సంస్కరణే సామాజిక న్యాయం. సామాజిక న్యాయమే సంఘ సంస్కరణ. భారత రాజ్యాంగమే సంఘ సంస్కరణలకు ఒక గొప్ప స్ఫూర్తి.

పార్టీలో ప్రజాస్వామ్యం

పార్టీలో ప్రజాస్వామ్యం వున్నప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టు. ఎందుకంటే ముందేచెప్పినట్టుగా ప్రజాస్వామ్యం అంటే ఆచరణలో, రాజకీయాల్లో పార్టీస్వామ్యంగా మారిపోయింది. అందువల్ల పార్టీ ప్రాథమిక సభ్యులైన ప్రజల ప్రతినిధులుగా ప్రాధాన్యత వహించి పార్టీ అధ్యక్షుణ్ని పార్టీ సభ్యులు ఎన్నుకోవాలి. నియోజక వర్గంలో, ఎవరు ఎన్నికల్లో పోటీ చేయాలి అనేది పార్టీ సభ్యుల ఓటింగ్ ద్వారా నిర్ణయించాలి. అమెరికాలో ఈ పద్ధతి కొనసాగుతున్నది.

పార్టీ సభ్యుల మధ్య కూడా కార్యవర్గ ఎన్నికల్లో పోటీ ఉండాలి. పోటీ లేని ఏకగ్రీవం నియంతృత్వంగా, లేదా నిర్జీవంగా మార్చివేస్తుంది. ఇలా, పార్టీ సభ్యుల చేత ఎన్నుకోబడని నాయకులు తామే సైన్యాధ్యక్షులమని, ఇక సమకూర్చుకోవాల్సింది సైనికులనే నని అనుకుంటారు. ఇది మహ్మద్ ఘోరి, చంఘిజ్‌ఖాన్ ల వంటి దృష్టి తప్ప ప్రజాస్వామ్యం పార్టీలో ఆచరణలో లేదు. పోటీ ఉన్నప్పుడే సభ్యత్వం, రశీదులు, ఓటర్ల లిస్టులు సరిగ్గా వుంటాయి. చైతన్యం, చురుకుదనం ప్రవహిస్తుంది.

పార్టీ స్వామ్యం నియోజక వర్గాల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల కనువుగా మార్చాలి. కింది స్థాయి నాయకులు పై స్థాయి నాయకులను ఎన్నుకోవాలి. అందుకు భిన్నంగా పై స్థాయి నాయకులు, కింది స్థాయి నాయకులను ఎంపిక చేస్తున్నారు. అందువల్ల, ప్రజాస్వామ్యం అంటే, 'కౌపీన సంరక్షణార్థం' అన్న కథ లాగా పంచ పాండవులంటే నాకు తెలియదా? మంచం కోళ్ల వలె ముగ్గురే కదా అన్నట్టు సాగుతుంది. 'దైవం మంత్రాధీనం, మంత్రం బ్రాహ్మణాధీనం, బ్రాహ్మణో మమదేవత' అన్నట్టుగా ప్రజాస్వామ్యం పార్టీ అధీనం, పార్టీ అధిష్ఠాన అధీనం, అధిష్ఠానమే

ప్రజాస్వామ్యం అన్న చందంగా మారిపోయింది. దాంతో, నాయకులు ఎప్పుడూ వుంటారు. అలాగే వుంటారు. వారి కోసం కార్యకర్తలు, ఓట్లు, గెలుపు ఓటములు వస్తూ పోతూ వుంటాయి అనేదిగా ప్రజాస్వామ్య అభాసుపాలు అవుతున్నది.

ఇతర పార్టీల్లో పనిచేసినప్పుడు విధేయతతో పని చేసుకుంటూ వెళితే ఎప్పుడో ఒకప్పుడు పీవీ నరసింహారావు లాగా అత్యున్నత పదవి కూడా తగులుతుంది. ప్రశ్నిస్తే, తర్వాత టిక్కెట్టే ఇవ్వరు. ప్రశ్నించినప్పుడు, బాగా ప్రశ్నించారు అని మెచ్చుకుంటే వారి పని అయిపోయినట్టేనంటారు.

ఆధిపత్య లాబీలు-సామాజిక వర్గాలు

వడ్డించేవాడు మనవాడైతే ఏ మూల కూర్చున్నా మంచిగా వడ్డిస్తాడు అని సామెత. అధికారంలో వున్న కొన్ని సామాజిక వర్గాలు, కులాలు పొందుతున్న ప్రత్యేక ప్రయోజనమిది. అయితే, అధికారంలో వున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఇలా వడ్డించడం సాధ్యం కావడంలేదు. ఇతర సామాజిక వర్గాల నాయకత్వంలో ఈ పరిమితి ఎప్పుడూ వుంటుంది.

రిజర్వేషన్లు, సామాజిక న్యాయం

రిజర్వేషన్లు కొందరికే ఉపయోగపడతాయి. సామాజిక న్యాయం అందరికీ ఉపయోగపడుతుంది. వెయ్యి జనాభాలో రిజర్వేషన్లతో అయిదు ఉద్యోగాలు రావచ్చు. జనాభా శాతం ప్రకారం రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలిస్తారు. అలా పొందేది కొందరే. అయిదుగురే. రిజర్వేషన్లు వారి వ్యక్తిగత అభివృద్ధి కోసం మాత్రమే కాదు. జనాభా ప్రాతిపదికన ఇస్తున్నారు గనుక, శాసనసభ్యుల్లాగా, సర్పంచుల్లాగా అందరి తరఫున అందరి కోసం ఎంపికైనవారు. వారు తమ సామాజిక వర్గాల కోసం, సామాజిక న్యాయం కోసం కృషి చేయవలసి వుంటుంది. డా॥బి.ఆర్.అంబేద్కర్ ఇలా ఆశించి రిజర్వేషన్లను సాధించాడు. కానీ, అది జరగడం లేదని అంబేద్కర్ ఎంతగానో వాపోయాడు. పర్యవసానంగా రిజర్వేషన్లు వ్యక్తిగత అభివృద్ధికే పరిమితమౌతున్నాయి. రిజర్వేషన్లు పాక్షిక పరిష్కారమే. సామాజిక న్యాయం, సంక్షేమం, రాయల్టీసెస్, అందరికీ విద్య మొదలైనవి అందరికీ ఉపయోగపడతాయి.

సాధికారికత లక్ష్యాలు ముఖ్యం

సాధికారికత, సామాజిక న్యాయం పేరిట రిజర్వేషన్ల ద్వారా ఎస్సీలు, బీసీలు

శాసనసభ్యులు కావడంతో పరిష్కారం కాదు. వారు సామాజిక న్యాయం కోసం పనిచేస్తేనే పరిష్కారం జరుగుతుంది. లేకపోతే, అది వారి వ్యక్తిగత అభివృద్ధిగా, వారి బంధు మిత్ర అభివృద్ధిగా మిగిలిపోతుంది. అందువల్ల, వాళ్లు ఏం చేస్తారు, ఏం చేయాలి అనేది ముఖ్యం. అదే సామాజిక న్యాయం. కనుక, సామాజిక న్యాయం కోసం సాధించాల్సిన లక్ష్యాలు, ప్రణాళికలే ముఖ్యం. వాటిని ఎంత మేరకు అమలు జరిపారనేదే ముఖ్యం.

వీటికోసం ఉద్యమించే క్రమంలో రాజకీయ చైతన్యాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంచుతూ రాజకీయ అధికారంలో వాటా అడిగినప్పుడే ముందుకు పోవడం సామాజిక పరిణామం, జాతీయ అభివృద్ధి సాధ్యపడుతుంది.

నిజమైన రాజకీయ నేతలు పార్టీ నాయకులు పైన చెప్పిన వాటిని ప్రధాన డిమాండ్లుగా ప్రజల్ని చైతన్యపరుస్తారు. రాజకీయ అధికారం, సాధికారికత వీటి అమలు కోసమే అని చెప్పగలుగుతారు. అప్పుడే 'సామాజిక న్యాయం' కోసమే సమస్త ప్రజల సాధికారికత కోసమే రాజకీయ అధికారం అని బల్లగుద్ది చిత్తశుద్ధితో వాదించే, ఆచరించే నైతిక స్థయిర్యం వస్తుంది.

నెంబర్ వన్‌లు నెంబర్ టూలు

ప్రస్తుతం అన్ని పార్టీలు ప్రజాస్వామిక విలువలను, నిర్మాణాలను కాదని వ్యక్తికేంద్రంగా, కొన్ని సామాజిక వర్గాల ఆధిపత్యం కేంద్రంగా కొనసాగుతున్నాయి. అందువల్ల రాజకీయాల్లో లెక్కలు గమ్మత్తుగా మారిపోతుంటాయి.

ఎవరు నెంబర్‌వన్?

ఒక వ్యక్తి శక్తి సామర్థ్యాల మీద, ప్రతిష్ట మీద పార్టీ నడవడం జరిగితే అతడు నెంబర్ వన్. అతనికి గాలిని, ట్రెండ్‌ని సృష్టించే, ఎన్నికల్లో విజయం వైపు మళ్ళించే శక్తి సామర్థ్యాలు ఉంటే నెంబర్ వన్. ఆకట్టుకునే ప్రసంగాలు, పలు విషయాల పట్ల సరియైన అవగాహన, అందుకు ఎప్పటికప్పుడు అధ్యయనం మేధావులతో, అనుభవజ్ఞులతో సలహాలు, సూచనలు ప్రతిరోజు తీసుకుంటూ ఉండడం. ఫండ్స్ సేకరించే శక్తి సామర్థ్యాలు. సమర్థవంతమైన నినాదాలను రూపొందించే సామర్థ్యం. పార్టీ అనుబంధ సంఘాల్లో సరియైన వారిని నియమించడం. ఇందుకు అనేక గ్రూపులతో విడి విడిగా అభిప్రాయ సేకరణ – క్రాస్ చెకింగ్. నియమించాక వచ్చే విమర్శలను కట్ చేయడం. విమర్శ రాకుండానే చూసుకోవడం. పని చేస్తూ పోతే మరో దానిలో గానీ, మరో సారి గానీ అవకాశాలు ఎలా వస్తాయో వ్యక్తుల పేర్లు లేకుండా చెప్పి ఒప్పించి ఉత్సాహ పరచడం. ముందుకు నడపడం.

ఏటా కొందరు వెళ్ళిపోతుంటారు. కొందరు చేరుతుంటారు. వెళ్ళిపోయినవాళ్ళు మళ్ళీ వస్తుంటారు. వీళ్ళందరినీ సమతూకంలో కలుపుకొని పార్టీ పనిని విస్తరించడం. జిల్లా కమిటీలను నియోజకవర్గ కమిటీలను వీలైన మేరకు మెజార్టీ అభిప్రాయాన్ని సేకరించి సమర్థులైనవారిని, తమకు ఇష్టమైనవారిని నియమించడం. సమాంతరంగా వారికి తోడుగా మరో ముగ్గురు నలుగురిని ఎదిగించడం. ఒకరు వెనక్కి తగ్గినా మరొకరు పార్టీని, కార్యక్రమాలను ముందుకు తీసుకుపోయి బ్యాలెన్స్‌ను పెంచడం.

సామాజిక ఉద్యమాలు వేరు. రాజకీయ ఉద్యమాలు వేరు. కార్మికుల, కర్షకుల ఉద్యమాలు వేరు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఉద్యమాలు వేరు. విద్యార్థుల, యువజనుల ఉద్యమాలు వేరు. ఆర్థిక పోరాటాలు వేరు. కుల సంఘాలు వేరు. రాజకీయ పార్టీల నిర్మాణం వేరు. సాహిత్య సంఘాల నిర్మాణం వేరు. సాంస్కృతిక ఉద్యమాలు వేరు. ఇవి వేటికవి ప్రత్యేకమైనవి. ప్రస్తుతం రాజకీయ పార్టీల నిర్మాణాన్ని తెలుసుకుందాం. రాజకీయ పార్టీకి స్థూలంగా ఒక సిద్ధాంత అవగాహన ఉండాలి. ఉదా॥కు తెలుగుదేశం పార్టీకి తెలుగు ఆత్మ గౌరవం నినాదం మౌలికమైనది. తెలంగాణ రాష్ట్ర సమితికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన మౌలికమైన నినాదం.

నెంబర్‌టూల ప్రాధాన్యత

నెంబర్‌టూలు పార్టీ నాయకులు. అధినాయకుడి ముఖ్య సహచరులు. అధ్యక్షుడు పార్టీకి రాజైతే నెంబర్‌టూలు మంత్రులు, సైన్యాధ్యక్షులు, మేధావులు. పాలసీల నిర్మాణంలో ముఖ్యపాత్ర నిర్వహించే వారు. ఒకరు పది మందితో సమానమైనవారు.

అయినా నెంబర్ టూ జీరో ఎందుకు అవుతారు? నెంబర్ టూను ఒకటి పక్కన సున్నాగా ఎందుకు లెక్కిస్తారు? నెంబర్ వన్ పక్కన 1పక్కన సున్నా చేరితే ఆ1శక్తి 10గా మారుతుంది. అయితే ఆ1 లేక పోతే సహచరులు జీరో అవుతారు. ఎందుకంటే పైన చెప్పినవన్నీ నెంబర్ వన్ చేతిలో ఉంటాయి. పార్టీపై పూర్తి పట్టు నెంబర్ వన్‌కే ఉంటుంది. అన్ని అనుబంధ సంఘాలపై పూర్తి పట్టు నెంబర్ వన్‌కే ఉంటుంది. అన్ని జిల్లా నియోజక వర్గ కమిటీలపై నెంబర్‌వన్‌కే పట్టు ఉంటుంది. నెంబర్ టూ డిమాండ్ చేసి తనవారికి ఇప్పించేవన్నీ అంతిమంగా సలహాలే అవుతాయి. నెంబర్ టూ ద్వారా ప్రమోట్ అయినవారికి కూడా నెంబర్ వన్ ఆమోదాన్ని పొంది, విశ్వాస పాత్రులుగా ఉంటారు. కనుక నెంబర్ టూకు ప్రత్యేక యంత్రాంగం గానీ, గ్రూపు గానీ బలపడదు. అది సాధారణ పరిస్థితుల్లో నెంబర్ వన్‌కు కూడా లొంగి ఉంటుంది. నెంబర్ టూకు మాత్రమే వాళ్ళు విధేయంగా ఉంటే నెంబర్ వన్ వాళ్ళను

దూరం జరిపి మరొకరిని రంగం మీదికి తెస్తారు. లేదా సమాంతరంగా క్రాస్ చెక్ చేసే వారిని షాడో యంత్రాంగాన్ని అభివృద్ధి పరుస్తారు. అందువల్ల తిరుగుబాటు చేసినప్పుడు తప్ప తమ గ్రూపుకు సంబంధించిన డిమాండ్ చేసినప్పుడు తప్ప సాధారణ పరిస్థితుల్లో నెంబర్ టూకు ప్రత్యేకంగా బలం ఉండదు.

ఏకకాలంలో డ్రైవర్‌గా, ప్రయాణికులుగా 'దారి–అడవి' నాయకులు

నిరంతర ప్రయాణమే జీవితం. దారిలో ఓవర్‌టేక్ చేసి ముందుకు దూసుకు వెళ్లేవాళ్లుంటారు. నీవు 30గంటలు ప్రయాణించి చేరుకుంటే, కొందరు ప్రత్యేక అవకాశాలు ఉపయోగించుకొని, కల్పించుకొని రెండు గంటల్లో గమ్యం చేరుతారు. అందుకు వారసత్వం, కులం, డబ్బు, అధికారం, జ్ఞానం, మోసం, ఆకాశయానం మరేదైనా కారణం కావచ్చు. నాయకుడుగా డ్రైవర్ సీటులో మీరుంటే మీ సామాజిక లక్ష్యం, గమ్యం, సూటిగా, స్పష్టంగా ముందుకు సాగుతుంది. మీ బస్సులోని ప్రయాణికులకు స్వేచ్ఛ కలుగుతుంది. దారిలో కనిపించే దృశ్యాలన్నీ ఎక్కిదిగే ప్రయాణికులను వారు అనేక కోణాల్లో పరిశీలిస్తుంటారు. సూచిస్తుంటారు. అందువల్ల వారి అనుభవాలు, అవగాహన కూడా విలువైనవే. మీరే బస్సులో ప్రయాణికుడిగా కొనసాగినప్పుడు డ్రైవర్‌గా, నాయకులుగా వున్న కాలంలో మీరు కోల్పోయిందేమిటో తెలుస్తుంది. 'పర్టికులర్ యూనివర్సల్–వ్యక్తి, ధ్యేయం, దారి, అడవి' వ్యాసంలో ఈ రెంటిని పోల్చి చూపాను. భూమిని అంటిపెట్టుకొని భూమిలోకి వేళ్ళు విస్తరించినప్పుడే మహావృక్షం ఆకాశంలోకి విస్తరిస్తుంది. ప్రజల్లోకి వేళ్లూనుకున్నవాళ్లే దిగంతాలకు విస్తరిస్తారు.

నెంబర్‌టూలు 'సున్నా'లేనా?

సహచరులు లేకుండా పార్టీ లేదు. పార్టీ నిర్మాణం లేదు. చతురంగ బలాలు అన్నీ సహచరులే. అయినా ఎన్ని నెంబర్ టూలు కలిసినా అన్నీ సున్నాలేనా? అవును. ఎన్ని నెంబర్ టూలు కలిసినా అన్నీ సున్నాలే అవుతాయి. నెంబర్‌టూలు అందరు కలిసినా పార్టీని నిర్మించలేరు. ఎందువల్ల? ఈ నెంబర్ టూలకు నెంబర్ వన్‌లకు ఉండే అనుభవాలులేవు. ఆ కర్తవ్యాలు స్వీకరించలేదు. నెంబర్ వన్ వద్ద పోగుపడే సమాచారం ఉండదు. నియామకాలు జరిపే అనుభవాలు లేవు. తల్లిదండ్రుల నీడన బతుకుతూ ఉన్నతంగా ఎదిగే పిల్లల వంటి స్థాయి మాత్రమే ఉంటుంది. నెంబర్ టూలు అంతా ప్రభుత్వ సలహాదారుల్లాగా, కలెక్టర్ల లాగా కొన్నిటికే పరిమితమవుతారు.

కనుక వారు ఒక పార్టీ నిర్మాణం చేయాలంటే తిరిగి కొత్తగా అనేక బాధ్యతలను స్వయంగా చేపట్టాల్సి ఉంటుంది. తల్లి దండ్రులు లేని పిల్లలు ఎలా తమ జీవితాలను స్వయంగా గెలుచుకోవడానికి కృషి చేస్తారో అంత నిబద్ధతతో కృషి చేయాల్సి ఉంటుంది. నేను విప్లవ పార్టీ నుండి తాత్వికంగా, కార్యక్రమాల రూపకల్పనలో విభేదించి బయటికి వచ్చాక స్వయంగా తత్వాన్ని, సామాజిక కార్యక్రమాలను, నిర్మాణాలను, సంస్థలను, సహచరులను ఏర్పర్చుకోవాల్సి వచ్చింది. ఉద్యమంలో కలిసి పని చేసిన వారు ఎవరూ కలిసి రాలేదు. అనేక అనుభవాల నుండి అనేక రంగాల నుండి వచ్చినవారిని అందరినీ కలుపుకుంటూ దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్య వేదిక నిర్మాణం చేసి బహుజన తత్వశాస్త్రాన్ని, బహుజన రాజకీయాలను, సామాజిక ఉద్యమాలను, కార్యక్రమాలను రూపొందించడం జరిగింది. 1992 నుండి క్రమంగా దీన్ని ముందుకు నడిపించడం జరిగింది.

25 మందిని నెంబర్ టూలను తయారు చేస్తేనే నెంబర్ వన్‌లుగా లెక్క

నెంబర్ టూలు లేకుండా నెంబర్ వన్‌లు చేయగలిగేదేమీ లేదు. 25 మంది నెంబర్ టూలను, 100 మంది నెంబర్ త్రీలను తయారు చేయగలిగిన వారే నెంబర్ వన్‌లుగా ఎదుగుతారు. తాను తయారు చేసిన వారితో తానే పోటీపడుతూ నిరంతరం ఎదిగే వారే నెంబర్ వన్‌లుగా పయనీర్‌లుగా చరిత్రలో స్థానం పొందుతారు. నెంబర్ టూలను, నెంబర్ త్రీలను అణచి పెట్టడం ద్వారా, అవకాశాలు నిరాకరించడం ద్వారా నెంబర్ వన్‌లుగా వుండాలనుకునే నాయకులు చరిత్రలో కనుమరుగవుతారు. ప్రాక్షనిస్టులుగా తేలుతారు. తిరుగుబాట్లను ఎదుర్కొంటారు. ఓటమి చెందుతుంటారు. అందువల్ల నెంబర్ వన్‌లు లేకుండా మాస్ లీడర్స్ లేనట్టుగానే నెంబర్ టూలను ఎదిగించకుండా నెంబర్ వన్‌లకు నిర్మాణమే వుండదు. భర్తదే కుటుంబంలో ఆధిపత్యమైనప్పటికీ భర్తనే సంపాదించుకుని తెస్తున్నప్పటికీ భార్యా, పిల్లలు లేకపోతే అది కుటుంబమే కాదు. భార్య, పిల్లలు చెప్పింది తండ్రి వినకతప్పదు. అలా కుటుంబాన్ని ప్రజాస్వామికంగా నడుపుకుంటూ వస్తుంటారు. పార్టీలో కూడా కుటుంబంలోలాగా కలిసి జీవించాలి.

నీకు చదువు, సంస్కారం నేర్పిన గాడిద ఎవర్రా అని తిడుతుంటారు. గతంలో పనిచేసి వచ్చిన పార్టీ, ఉద్యమం, ఉద్యోగం యొక్క సంస్కారం, ఆ తరవాత కూడా కనపడాలి. బెల్లి లలిత అనే ఒక కళాకారిణిని ఒక మాజీ నక్సలైటు ముక్కలు ముక్కలుగా నరికివేశాడు. నక్సలైట్లు నేర్పే సంస్కారం ఇదేనా అని కొందరు వాపోయారు. అలాగే

ఒక పార్టీలో ఎంతో ఎదిగిన నాయకుడు మరో పార్టీలో చేరాక జీరో అయితే అది ఆ కొత్త పార్టీ నాయకుడి అసమర్థత, స్వార్థం అవుతుంది. అలాగే తన గత పార్టీ స్థాయి నాయకత్వాన్ని, సంస్కారాన్ని కొత్త సంస్థలో ప్రదర్శించలేకపోతే, దిగజారిపోతే గతంలో పనిచేసిన పార్టీకి కూడా తిట్లు తప్పవు. అందువల్ల ఎవరు వున్నా, ఎవరు పోయినా ఆయా పార్టీల నాయకత్వం నిరంతరం సభ్యత, సంస్కారం, నాయకత్వ సామర్థ్యం, లోతైన అవగాహన అందించడం అవసరం. ఉదాహరణకు నేను విప్లవ పార్టీలో పనిచేస్తున్నప్పుడు కొండపల్లి సీతారామయ్య నెంబర్‌వన్‌గా వుండేవాడు. ఎంతోమందిమి నెంబర్ టూలుగా వుండేవాళ్ళం. భిన్నాభిప్రాయాలు కలిగాక పార్టీ నుండి బయటకు వచ్చాను. ఉద్యమం త్యాగాన్ని కర్తవ్యంగా మలిచింది. పార్టీ నుండి బయటకు వచ్చాక ఆ పార్టీ ఇచ్చిన సంస్కారాన్ని, లోతైన అవగాహనను మరింత అభివృద్ధి పరిచి కొనసాగించడం నా కర్తవ్యం అవుతుంది. నెంబర్‌వన్‌గా నా రంగంలో నేను ఎదిగి నిరూపించుకున్నప్పుడే ఆ పార్టీకి గౌరవం, నాకూ గౌరవం. మీ ఎదుగుదలకు ఆ పార్టీ ఇచ్చిన శిక్షణ, సంస్కారమే కారణం అని అంటారు. ఇది ఇరుపక్షాలకు గౌరవప్రదమైన మాటే.

కొత్తది మొదలుపెడితే అన్నీ కొత్తగానే

నేను రాడికల్స్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వున్నప్పటికీ పార్టీ నిర్మాణం ప్రకారం నెంబర్‌వన్ కాకుండా నెంబర్ టూగానే చెప్పుకోవాలి. అనగా పార్టీ ఫండ్ సేకరణలో, అనేక విభాగాల నిర్మాణంలో ఇతరత్రా అనేక రంగాల శక్తి, సామర్థ్యాలు సాధించుకోవలసిన అవసరం లేని స్థాయిలో కొనసాగాను.

నెంబర్ టూ నుండి నెంబర్ వన్ కావడానికి...

1990లో సామాజిక రంగంలో స్వయంగా ఒక నిర్మాణం చేయాలనుకున్నప్పుడు వాటన్నిటిలో స్వయంగా సామర్థ్యం సంపాదించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. ఎన్నో సంస్థలను, ఎన్నో రకాల వ్యక్తులను, పార్టీలను, భావజాలాలను, ప్రాంతాలను కలుపుకుని ఒక వేదిక మీదికి తీసుకురావడానికి ఎన్నో కసరత్తులు చేయాల్సి వచ్చింది. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక నిర్మాణం చేయడంతో పాటు పలు రంగాల్లోకి విస్తరించడం జరిగింది. తద్వారా ఎన్నో అనుభవాలు, ఎన్నో రకాల నైపుణ్యాలు పెంచుకోవాల్సి వచ్చింది. నెంబర్‌టూలుగా వుండే వారు ఎంత గొప్ప నాయకులైనా వారికి ఈ అవసరం, ఆవశ్యకత ఏర్పడదు.

అందువల్ల తమ రంగంలో తప్ప మిగతా రంగాల్లో వారు ఇతరులపై ఆధారపడుతుంటారు. అనుభవ రాహిత్యం వారిని వెన్నాడుతుంటుంది. ఇలా నేను విప్లవోద్యమం ద్వారా బహుజనులకు రాజకీయ అధికారం సాధ్యం కాదని వదిలేశాక స్వయంగా నిర్మాణాలు, సిద్ధాంతాలు, కార్యక్రమాలు రూపకల్పన చేశాను. సామాజిక రాజకీయ రంగాల్లో చురుకుగా పాల్గొన్నాను. వాటి నిర్మాణాలు, సిద్ధాంతాలు, కార్యక్రమాలు రూపకల్పన చేశాను.

నెంబర్‌టూ నుండి నెంబర్‌వన్‌గా ఎదిగిన కేసీఆర్

అలాగే 2001లో కేసిఆర్ టీడీపీలో చాలాకాలం పనిచేసి తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. టీడీపీలో ఆయన నెంబర్‌టూగా వున్నప్పటికీ అనుభవాలు తక్కువ. సిద్ధిపేట ఎమ్మెల్యేగా స్థానిక రాజకీయాల్లో స్వయంశక్తితో ఎదిగిన అనుభవాలు రాష్ట్ర స్థాయి నిర్మాణానికి పనికివచ్చే విధంగా ఆలోచన, అధ్యయనం చేశారు.

1996 నుండి మాలాంటి ఎందరో 40, 50 సంస్థలు ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎక్కడికక్కడ విభిన్న రంగాల్లో కృషి చేస్తున్న వాళ్ళందరినీ కలుపుకొని పోవాల్సిన అవసరం కేసీఆర్‌కు, టి.ఆర్.ఎస్‌కు ఏర్పడింది. కలిసిరానివారిని కనీసం వ్యతిరేకంగా కాకుండా చూసుకోవాల్సి వచ్చింది.

రాజకీయ పార్టీగా నిర్మాణం చేయడానికి ఆయన ఎమ్మెల్యేగా, టీడీపీ రాష్ట్ర కమిటీలో నిర్వహించిన అనుభవాలు పనికి వచ్చాయి. కానీ నాలాగే పూర్తిగా కొత్త స్వభావంతో కొత్త నిర్మాణాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దాదాపు వందకు పైగా అనుబంధ సంఘాలను, విభాగాలను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. ప్రతి రంగంలో తనదంటూ ఒక లాబీని, టీమ్‌ను రూపొందించుకోవాల్సి వచ్చింది. ప్రత్యేకంగా తనదైన నినాదాలను ముందుకు తీసుకురావాల్సి వచ్చింది. సాహిత్య సాంస్కృతిక రంగాల్లో తమదైన నిర్మాణాలను కళా రూపాలను రూపొందించు కోవాల్సి వచ్చింది. ప్రతి ఉద్యమం తనదైన సాహిత్యాన్ని, కళారూపాలను, నాయకులను, కార్యకర్తలను, నినాదాలను, కార్యక్రమాలను ప్రత్యేకంగా రూపొందించు కుంటుంది.

అలా కేసిఆర్ కూడా తనకు తాను మారుతూ రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగారు. ఏమీ లేని రాజకీయ రంగంలో ఒక తుఫానును సృష్టించారు. రాజకీయ రంగంలో జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర నినాదాన్ని హిమాలయాలంత ఉన్నతంగా ఎదిగించారు. ఇవాళ జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో తెలంగాణ రాష్ట్రాన్ని

వ్యతిరేకించే శక్తులకు సింహస్వప్నంగా మారారు. కాన్షీరామ్ జాతీయ స్థాయిలో ఎలా సింహస్వప్నమయ్యారో రాష్ట్ర రాజకీయాల్లో కేసిఆర్ అదేస్థాయికి ఎదిగారు.

నినాదం ఒక్కటే చాలదు, నిర్మాణ సామర్థ్యం అవసరం

బీసీ నాయకులు, ఎస్సీ నాయకులు ఇదే బీసీల, ఎస్సీల బలహీనత. తన ప్రాంతం వారిని మోయలేరు కానీ ఇతర ప్రాంతాల వారిని, అగ్రకులాల వారిని భుజాల మీద మోస్తారు. జి. వెంకటస్వామి, ఎమ్.సత్యనారాయణ రావు గారలు జైపాల్ రెడ్డికి కాని, డి. శ్రీనివాస్‌కు గానీ మొదటి నుండి పూర్తి మద్దతు ఇచ్చి ఉంటే రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే సమస్యేలేదు.

నెంబర్ వన్‌లు అవడానికి పెరుగుతున్న లాబీలు

అప్రజాస్వామిక పార్టీ నిర్మాణాల వల్ల, డబ్బున్న సామాజిక వర్గాల ఆధిపత్యం వల్ల, కుటుంబ ఆధిపత్య రాజకీయాల వల్ల నెంబర్ టూలు నెంబర్ వన్‌లు కాలేరు. నెంబర్ టూ వేరు. వారసులు వేరు. నెంబర్ టూ కాకపోయినా నెంబర్‌లో ఏ లెక్కకు రాకపోయినా వారసులు నెంబర్‌వన్‌లు అవుతుంటారు. చంద్రబాబు నెంబర్‌వన్. దేవేందర్ గౌడ్ నెంబర్ టూ. కాన్షీరామ్ నెంబర్ వన్. మాయావతి నెంబర్‌టూ. మాయావతి నెంబర్ టూ మాత్రమే కాదు. కాన్షీరామ్ ఆమెను స్వయంగా తన రాజకీయ వారసురాలిగా ప్రకటించారు. కనుక ఆయన తరువాతి స్థానం ఆమెదే. కాంగ్రెస్‌లో నెంబర్ టూలు చాలా మంది ఉండేవాళ్ళు.

నెహ్రూ కాలంలో వల్లభాయి పటేల్, మౌలానా ఆజాద్, మొరార్జీ దేశాయి మొదలైనవాళ్ళు ఎందరో ఉండేవాళ్ళు. కానీ నెహ్రూ పోయాక ఏ లెక్కలో నెంబర్ టూగా లేని, లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాన మంత్రి అయ్యాడు. లాల్‌బహదూర్ శాస్త్రి కాలంలో ఎందరో నెంబర్ వన్‌లు, నెంబర్ టూలు ఉండేవారు. కానీ ఇందిరాగాంధీ నెంబర్ వన్ అయ్యింది. ఇందిరాగాంధీ కాలంలో నెంబర్‌వన్ స్థాయికి ఎదిగిన నెంబర్ టూలు చాలా మంది ఉండేవాళ్ళు. మొరార్జీ దేశాయి, నీలం సంజీవరెడ్డి మొదలైనవారు. కానీ రాజీవ్‌గాంధీ నెంబర్‌వన్ అయ్యారు.

అలాగే రాజీవ్‌గాంధీ కాలంలో అర్జున్ సింగ్, శరద్ పవార్, ప్రణబ్ ముఖర్జీ మొదలైనవాళ్ళు నెంబర్ వన్ స్థాయిలో ఉన్నప్పటికీ పీ.వీ. నరసింహారావు ప్రధాన మంత్రి అయ్యారు. అలాగే తరువాత సోనియాగాంధీ నెంబర్ వన్ అయ్యారు. రాహుల్ గాంధీ నెంబర్ టూలో లేరు. ఇలా నెంబర్ టూలు ఎప్పుడు నెంబర్ వన్ కాలేదు.

నెంబర్‌టూలు నిరంతరం స్థానాలు మార్చబడ్డారు. అర్జున్ సింగ్, శరద్ పవార్, ప్రణబ్ ముఖర్జీ మొదలైనవాళ్ళు నెంబర్ టూలుగా కొంతకాలం వెలిగారు. కాస్త తల పైకెత్తగానే తలలు తెగిపడ్డాయి. ఎక్కడో విసిరివేయబడ్డారు. సొంత పార్టీలు పెట్టుకున్నారు. తిరిగి కలిసారు. అలా ఏనుగు తలను వినాయకుడికి అతికించి బతికించుకున్నట్టుగా తిరిగి తమదికాని ముఖాలతో, వ్యక్తిత్వాలతో కుంటుతూ, దేకుతూ మరోసారి నెంబర్ టూలు అయ్యారు. కాన్నీ ఏ నెంబర్ లేని లాల్ బహదూర్ శాస్త్రి ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ నెంబర్ వన్‌లు అయ్యారు. కరుణానిధి, లాలూ ప్రసాద్ యాదవ్, ఎన్టీఆర్, చంద్రబాబుల క్రమాలు కూడా ఇంతే.

ఆయా పార్టీల్లో బీసీలు నెంబర్ వన్‌లు అయ్యే అవకాశం వుందా?

అందువల్ల బీసీలు, ఎస్సీలు నెంబర్‌టూగా ఉండటం అనేది ఎప్పుడూ 1 అంకెను 10 సంఖ్యగా బలం పెంచడానికే పనికి వస్తుంది. బీసీల్లోంచి ఎంతమందిని నెంబర్‌టూలుగా ఎదగనిస్తే ఆ పార్టీలు అంత బలోపేతం అవుతాయి. వాళ్ళు ఆయా పార్టీలకే ఎంతోఉపయోగపడతారు.

వెనుకబడిన ప్రాంతాల వాళ్ళు, వెనుకబడిన కులాల వాళ్ళు, దళితులు, సన్నిహితులను ఎదగడాన్ని వ్యతిరేకిస్తారు. ఇతరులకు సహకరిస్తారు.

కాన్షీరామ్ ఎప్పుడో చెప్పినట్టు బీసీలు, ఎస్సీలు ఏ పార్టీలో నెంబర్ టూలుగా ఉన్నా వారు "టూల్స్" మాత్రమే. వారు ఎన్నడూ నెంబర్ వన్ కాలేరు. 60 ఏళ్ళ జాతీయ, రాష్ట్రీయ రాజకీయాలను ఎన్నిసార్లు వడబోసి పరిశీలించి అయినా లెక్కలు తేల్చుకోవచ్చు. నెంబర్ టూలు నెంబర్ వన్‌లు ఎందుకు కాలేరంటే ఆ నిర్మాణం వారిది కాదు. నెంబర్ వన్‌గా ఉన్నవారి నిర్మాణం అది. అది ప్రజాస్వామిక విలువలతో కూడిన పార్టీ నిర్మాణంలో నడవడంలో లేదు.

అనుకోని అవకాశం వచ్చి నెంబర్ వన్ అయితే యుపిఏ ప్రభుత్వంలో మన్‌మోహన్ సింగ్‌లాగా ఉండాల్సి వస్తుందే తప్ప దేన్నీ కదిలించలేరు. ఎవరినీ మార్చలేరు. తనవారిని పెట్టలేరు. పాత లాబీలను మార్చి తమ లాబీలను సృష్టించలేరు. అందువల్ల బీసీలు గానీ ఎస్సీలు గానీ ఏ పార్టీలో ఎంత పెద్ద స్థాయిలో ఉన్నప్పటికీ తమ వారికి చేసే మేలు పరిమితం తన స్వప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తారు. ఇలా పార్టీల్లో ప్రజాస్వామ్య విలువలు, నిర్మాణం లోపించినందువల్ల ఏకవ్యక్తి కేంద్రం కావడం వల్ల కొన్ని సామాజికవర్గాలకే

పరిమితం కావడం వల్ల బీసీ, ఎస్సీలు ఏ పార్టీలో ఉన్నా విభీషణులుగా లంకకు చేటుగా మారుతారు. వారి స్వార్థం కోసం బీసీలను, ఎస్సీలను, వారి ప్రయోజనాలను, నిండా ముంచడానికి వెనుకాడరు. ఇది చరిత్ర చెప్తున్న సత్యం.

నెంబర్ టూల ప్రాధాన్యత

పార్టీ నాయకులు, నెంబర్‌వన్‌లు నెంబర్‌టూల ప్రాధాన్యత గుర్తించకపోతే నెంబర్‌వన్‌లే జీరోలుగా మారతారు. నెంబర్‌టూలు, నెంబర్‌త్రీలు పనిచేయడం వల్లే నెంబర్‌వన్‌లకు వ్యాప్తి పెరుగుతుంది. నెంబర్‌వన్‌లు చదరంగంలో రాజులయితే, నెంబర్‌టూలు, నెంబర్‌త్రీలు మంత్రులు ఒంటెలు, గుర్రాలు, ఏనుగులు వంటివారు. రాజు వీరి పరివారంతోనే రాజుగా కొనసాగుతారు. అందువల్ల నెంబర్‌వన్ కాదలుచుకున్న వారు కనీసం పాతికమందిని నెంబర్ టూలను, వందమందిని నెంబర్‌త్రీలను, వేలాదిమందిని అంకితమైన కార్యకర్తలను, లక్షలాదిమంది అభిమానులను తయారు చేసుకోగలగాలి. అలా సమాజానికి, ఉద్యమాలకు, పార్టీలకు స్ఫూర్తినివ్వగలగాలి.

చెట్టుకు ఆకులు, కొమ్మలు, వేళ్ళు వున్నప్పుడే అందం. తాడిచెట్టులాగా నెంబర్‌వన్‌లు వుంటే దాని నీడకోసం ఎవరూ ప్రాకులాడరు. వారు ఒంటరిగానే మిగిలిపోతారు. పిల్లలకోడిలాగా నెంబర్‌వన్‌లు నెంబర్‌టూలను మొదలుకొని అభిమానులందరిదాకా అందరినీ గౌరవించాలి, స్ఫూర్తినివ్వాలి, ఎదిగించాలి. ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి, ఎదగాలి. ఎదిగే వారితో పోటీపడి నిరంతరం ఎదుగుతూ వుండాలి. నెంబర్‌టూలు నెంబర్‌వన్‌ల వలే అన్ని రంగాల్లో ఎదిగే కృషి చేస్తూ వుండాలి. అప్పుడే స్నేహపూరిత వైరుధ్యం అభివృద్ధికి అనువుగా గెలువు, గెలిపించు అనే సూత్రంతో ఇరుపక్షాలు మరింత అభివృద్ధి చెందుతాయి.

ప్రజాస్వామ్య విలువలు గల పార్టీలు అవసరం

ప్రజాస్వామ్య విలువలు, నిర్మాణాలు వుండే పార్టీల నిర్మాణం ఎంతో అవసరం రెండు సంవత్సరాలకు మించి వరసగా పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా వుండకుండా వుండేవిధంగా రాజ్యాంగం ద్వారా పార్టీల నిర్మాణాన్ని నిర్దేశించడం అవసరం. జీవితంలో రెండుసార్లకు మించి ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా ఉండకుండా ఎప్పటికప్పుడు కొత్తవారిని ఎన్నుకునే వ్యవస్థ రావాలి. ఎన్నికల్లో నిలబడి గెలిచిన వారినే నాయకులుగా పార్టీల్లో ఎన్నుకోవాలి. ఎన్నికలకు దూరంగా

వుంటూ పార్టీ పదవులను అనుభవించే వారు పార్టీలకు, ప్రజలకు నిజమైన ప్రజానాయకులకు తీరని నష్టం చేస్తారు.

పార్టీలో ప్రజాస్వామ్యం - సాధికారికత

పార్టీలో ప్రజాస్వామ్యం, బీసీల సాధికారికత, ఎస్సీ సాధికారికత, మహిళల సాధికారికత ఉన్నప్పుడే నిజమైన ప్రజాస్వామిక పార్టీగా ఎదుగుతుంది. ప్రజాస్వామిక విలువలతో, సంస్కృతితో నెంబర్‌టులు నెంబర్‌వన్‌లుగా క్రమ పద్ధతిలో ఎదిగినప్పుడే ఆయా పార్టీల్లో ప్రజాస్వామిక నిర్మాణాలు కొనసాగు తున్నాయని అర్థం. రోటరీ క్లబ్, లయన్స్‌క్లబ్ వంటి కొన్ని సంస్థల్లో ఉపాధ్యక్షులనే ఎన్నుకుంటారు. ఆ తర్వాత అతడే అధ్యక్షుడవుతాడు. మళ్ళీ ఉపాధ్యక్షున్నే ఎన్నుకుంటారు. ఈ పద్ధతిలో అధ్యక్షుడైన నెంబర్‌వన్ తిరిగి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యే అవకాశమే ఉండదు.

ఇలాంటి పద్ధతి పార్టీలు పాటిస్తే నెంబర్‌టులు క్రమంగా నెంబర్‌వన్‌లుగా మారే అవకాశం ఉంటుంది. పార్టీల నిర్మాణంలో ప్రాథమిక సభ్యుల ఓట్ల ద్వారా నాయకులను, అభ్యర్థులను అమెరికాలో లాగా ఎన్నుకునే పార్టీ విధానాన్ని రాజ్యాంగంలో చేర్చడం అవసరం. పార్టీలు అలా పూర్తిస్థాయిలో ప్రజలపై ఆధారపడి కార్యకర్తలను నిర్మాణం చేసుకుంటూ వారి విశ్వాసాన్ని పొందుతూ పార్టీ సభ్యుల ఓట్ల ద్వారా నియోజకవర్గాల అభ్యర్థులను ఎన్నుకున్నప్పుడే పార్టీస్వామ్యం ద్వారా నిజమైన ప్రజాస్వామ్యం ఆచరణలోకి వస్తుంది.

అలాంటి నిర్మాణం సాధ్యమైనప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అంతదాకా అధినాయకుల ఇష్టాయిష్టాలకు ప్రజాస్వామ్యం పార్టీస్వామ్యం పేరిట కొందరి చేతుల్లో కేంద్రీకృతమవుతుంది. కింది స్థాయి కార్యకర్త కూడా రాష్ట్ర స్థాయి నాయకులుగా ఎదిగే అవకాశం పెరుగుతుంది. శక్తి సామర్థ్యాలను అనుసరించి నెంబర్‌టూలే కాకుండా నెంబర్ త్రీలు, పార్టీ కార్యకర్తలు కూడా కాలక్రమంలో క్రమంగా నెంబర్‌వన్‌లుగా ఎదుగుతారు.

ఒబామా గెలుపు ప్రపంచ చరిత్రలో ఒక మలుపు

ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న అమెరికాలో ఒబామా గెలుపు ప్రపంచ చరిత్రలో ఒక మలుపు. ఈ గెలుపు అనేక ప్రత్యేకతలతో ప్రపంచానికి బహుముఖీన సందేశాలను, ఉత్తేజాన్ని అందిస్తుంది. పాలితులు, పాలిత వర్గాలు, జాతులు, కులాలు ఈ గెలుపు నుండి గొప్ప స్ఫూర్తిని పొందుతాయి. చిన్నప్పుడే తల్లిదండ్రులు విడిపోయారు. ఎక్కడెక్కడో పెరిగారు. అది విద్యార్థి జీవితంలో వేసిన ప్రభావం, అల్పత్వ భావన, అభద్రత ఎంతో. దాన్నించి బైట పడి ఎదగడం ఒక ఎత్తు. తల్లిదండ్రులు వర్ణాంతర-మతాంతర వివాహం చేసుకున్నారు. 1961లో పుట్టిన ఒబామా 35వ యేటనే అమెరికన్ పార్లమెంటు సభ్యుడిగా, సెనేటర్‌గా ఎన్నిక కావడం దానికదే ఒక గొప్ప విజయం.

ఒబామా గెలుపు సృష్టించిన చరిత్ర

20 కోట్ల మంది ఓటర్లలో ఈసారి 13 కోట్లకు పైగా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. 1960లో జాన్‌ఎఫ్ కెనెడీ ఎన్నిక తర్వాత మొదటిసారిగా సెనేటర్ అధ్యక్షుడై అమెరికా అధ్యక్ష భవనంలో అడుగుపెడుతున్నారు. ఇది కూడా ఒక చరిత్ర ప్రాధాన్యత గల అంశం. 47 ఏళ్ల ఒబామా అమెరికా ప్రజల హృదయాలను గెలుచుకున్న తీరు ప్రపంచానికే ఆదర్శం. 1908 తర్వాత మొట్టమొదటిసారిగా 64 శాతానికి పైగా ఓటర్లు ఓటు వేయడం మరొక చరిత్ర.

1976లో జిమ్మీ క్యార్టర్‌కు 297, 1948లో హారీట్రూమన్‌కు 303 ఎలక్ట్రోరల్ ఓట్లు వచ్చాయి. గెలవడానికి 270 ఎలక్ట్రోరల్ సీట్లు వస్తే సరిపోతుంది. ఒబామాకు 350 పైగా ఓట్లు లభించాయి. పోలైన ఓట్లలో 53 శాతం ఓట్లు ఒబామాకు పడ్డాయి. ఇది కూడా ఒక గొప్ప చరిత్ర. గత నాలుగు దశాబ్దాల్లో ఎప్పుడూ రిపబ్లికన్ పార్టీకి ఓట్లు వేస్తున్న ఇండియానా వర్జీనియా వంటి రాష్ట్రాలు కూడా డెమొక్రటిక్ పార్టీకి ఓటు వేసి ఒబామాని గెలిపించాయి. మొత్తంగా ఈ ఎన్నికల్లో అమెరికన్ ప్రజలు విజయం సాధించాయి. తాము కోరుకున్న మార్పును ఒబామాలో చూసుకున్నారు.

అమెరికా విధానం మారుతుందా అని కొందరు పెదవి విరువవచ్చు. ఒక నల్లవాడు దేశాధ్యక్షుడు కావడమే ఒక గొప్ప మార్పు. దీన్ని సరిగ్గా ప్రచారం చేయగలిగితే, స్వీకరించగలిగితే ఆఫ్రికా దేశాల స్వాతంత్ర్య పోరాటాలతో పోల్చవచ్చు. ప్రపంచవ్యాప్తంగా పేదలకు ఇది ఒక గొప్ప స్ఫూర్తి. కష్టపడి క్రమశిక్షణతో కృషి చేస్తే ఎదగడం సాధ్యమే అనే నూతన సహస్రాబ్ది సందేశమిది.

సోవియట్ రష్యా విప్లవం

20వ శతాబ్దంలో రష్యా సోషలిస్టు విప్లవం ప్రపంచానికి ఒక గొప్ప ఉత్తేజాన్ని అందించింది. అయితే అది పార్టీకి, భావజాలానికి సంబంధించింది. 21వ శతాబ్దంలో ఒబామా విజయం పార్టీకి, భావజాలానికి, దేశాలకు అతీతంగా పీడిత వర్గ ప్రజలకు, పాలితులకు, బానిసలకు గొప్ప స్ఫూర్తినిస్తుంది. ఫలానా పార్టీ నాయకత్వంలో, ఫలానా భావజాలంలో పనిచేస్తేనే ఇది వస్తుంది అనే పరిమితి ఏమీ లేకుండా కోట్లాది ప్రజల హృదయాల్లో ప్రత్యక్షంగా ఉత్తేజాన్ని నింపే మహోన్నతమైన మలుపు ఒబామా గెలుపు.

నెల్సన్ మండేలా బరాక్ ఒబామా రెడ్ ఇండియన్స్

నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికా స్వాతంత్ర్యానికి అహింసాయుతంగా పోరాటం చేసి ప్రపంచానికి నల్ల సూరీడుగా స్ఫూర్తినిచ్చాడు. ఇప్పుడు నల్లనయ్య అమెరికన్ దేశాధ్యక్షుడిగా చరిత్ర సృష్టించాడు. శ్వేత భవనంలో అడుగుపెడుతున్న మొట్టమొదటి ఆఫ్రో అమెరికన్ బరాక్ ఒబామా సృష్టించిన చరిత్ర ఇలా ఎన్నో విధాల ప్రపంచంలోనే మలుపు. చిన్న మొత్తాలలో విరాళాలు సేకరించడం ద్వారా ఆయన 750 మిలియన్ డాలర్లు సమకూర్చడం కూడా ఒక చరిత్రాత్మకమైన సంఘటన. ఈ విజయం మీది అని ఒబామా ప్రజలకు అంకితం చేశాడు. నల్లవాళ్లు, తెల్లవాళ్లు ఇరువురూ అమెరికా దేశానికి వలస వచ్చినవారే. ఒకరు యజమానులుగా, మరొకరు బానిసలుగా బతికారు.

అమెరికన్ స్వదేశీయులు రెడ్ ఇండియన్స్‌గా ఇంకా బతికివున్నవాళ్లు కొందరున్నారు. త్వరలో రెడ్ ఇండియన్ కూడా తమ దేశానికి తామే దేశాధ్యక్షులుగా కావడం అంత కష్టమేమీ కాదు అని ఒబామా విజయం స్పష్టం చేస్తున్నది.

అబ్రహం లింకన్ మార్టిన్ లూథర్‌కింగ్

ఒబామా అబ్రహాం లింకన్‌ను మరిచిపోలేదు. నల్లవాళ్ల హక్కుల కోసం పోరాటం చేసిన మార్టిన్ లూథర్ కింగ్‌ను జాతీయ నాయకుడిగా మున్ముందు మరింత స్ఫూర్తిని ఇస్తాడు. బానిస యజమానుల పిల్లలు, బానిస పిల్లలు కలిసి తినడంతో పాటు బానిస పిల్లలు ఈ దేశాన్ని పరిపాలించడం సాధ్యమే. ఇది నా కల అని 1963లో మార్టిన్ లూథర్ కింగ్ పేర్కొన్న నాలుగు దశాబ్దాలకే ఆ కల నిజమైంది.

అమెరికన్ సమాజంలో మార్పులు వేగవంతంగా జరుగుతాయనడానికి ఇది ఒక గొప్ప నిదర్శనం. భారత రాజకీయాల్లో కుటుంబ రాజకీయాలు, వంశ పారంపర్య రాజకీయాలు కూడా ఇంత వేగంగా దేశానికి ప్రధానమంత్రిని చేయలేక పోయాయి. కానీ, అమెరికాలోని మార్పు కోరుకుంటున్న ప్రజలు ఒక యువకుణ్ణి దేశాధ్యక్షునిగా ఎన్నుకోగలిగారు. అమెరికా మార్పులను ఎంత వేగంగా స్వీకరిస్తుందో దీంతో స్పష్టం.

ఒబామా అందరి ప్రతినిధి

కొందరు విశ్లేషకులు గుర్తు చేసినట్టు నల్లవాళ్ల ప్రతినిధిగా ఒబామా తనకు తాను ఎప్పుడూ ప్రకటించుకోలేదు. దేశ ప్రజలందరికీ ప్రతినిధిగా, దేశాధ్యక్షుడిగా కావాలని తన కోరికను పార్టీలో రెండేళ్ల ముందే స్పష్టం చేశాడు. మాజీ దేశాధ్యక్షుడు బిల్ క్లింటన్ సతీమణి హిల్లరీని పార్టీలో ఓడించి తానే అభ్యర్థిగా గెలుపొందడం తొలి విజయం. దీన్నించి భారతదేశం ఎంతైనా నేర్చుకోవచ్చు. పార్టీలో ముఖ్యమంత్రి కావాలనుకునేవాళ్లు, ప్రధానమంత్రి కావాలనుకునేవాళ్లు ఇలా పార్టీలో పోటీపడి పార్టీ సాధారణ సభ్యులచేత ఓటింగ్‌లో విజయం సాధించిన తర్వాతనే పార్టీకి నాయకత్వం వహించి ముందుకు నడపాలి. అప్పుడే భారతదేశంలో నిజమైన పార్టీ పరిమిత ప్రజాస్వామ్యం ఆచరణలోకి వస్తుంది. తమ పార్టీలోని అగ్ర కుల నాయకత్వాన్ని అధిగమించి ప్రజల హృదయాలను గెలుచుకుని పార్టీకి తామే నాయకులుగా ఎదగగలగాలి. ఒబామా లాగా ఓపెన్ కాంపిటీషన్‌లో తమ తమ పార్టీల్లో ఎదిగినప్పుడే వారు సమాజానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతారు.

ఒబామా జాతీయ దృక్పథం

ఔట్ సోర్సింగ్ పట్ల ఒబామా వ్యక్తం చేసిన అభిప్రాయాలు భారతీయ సాఫ్ట్‌వేర్ రంగానికి నష్టం కలిగిస్తుందని కొందరు భయపడడం సహజమే. అయితే, అమెరికన్ రాజకీయాల్లో కొనసాగుతున్న లాబీలను నిశితంగా పరిశీలిస్తే ఈ అభిప్రాయం సరి కాదని తెలుస్తుంది. అమెరికా ప్రజలకు ఉపాధి అవకాశాలు పెంచడం పట్ల ఎవరికీ అభ్యంతరం లేదు. ఒబామా చెప్పింది దీనికి సంబంధించిన విషయమే. ఔట్ సోర్సింగ్ తగ్గే అవకాశం లేదు.

ఎందుకంటే, రెండు వేల డాలర్లతో ఇండియాలో సాఫ్ట్‌వేర్ అమెరికా వారికి అందుతుంటే దాన్నే అమెరికాలో పొందాలంటే ఆరు వేల డాలర్లు ఖర్చు అవుతాయి. పైగా, జార్జి బుష్ వారికి సంబంధించిన రిపబ్లికన్ పార్టీ ఆయుధాలు అమ్ముకోవడం మీద ఆధారపడి బతుకుతున్న పారిశ్రామిక లాబీ. అందువల్ల, వాళ్లు యుద్ధాలను ప్రేరేపిస్తారు. బిన్ లాడెన్ వల్ల ఎక్కువ లాభ పడ్డది ఈ వర్గాలే. దాని ఫలితంగానే అమెరికాలో సంక్షోభం పెరిగింది. 11 సెప్టెంబర్ 2001 ప్రపంచ వాణిజ్య సంస్థ భవనాలను కూల్చివేసిన సందర్భంగా సందట్లో సడేమియా లాగా జార్జి బుష్ కొన్ని లక్షల కోట్ల డాలర్ల ఆయుధాల ఉత్పత్తికి ఇరవై సంవత్సరాలలో సప్లయ్ చేయాలనే ఒప్పందాలను ఖరారు చేశాడు. అవి ఉత్పత్తి ప్రారంభించాయి. వాటికి డబ్బంతా తరలిపోతున్నది.

మరొకవేపు ఇరాన్ యుద్ధాన్ని అమెరికా ఆర్థిక వ్యవస్థపై జార్జి బుష్ రుద్దిన బరువు, భారం భరించలేనిదిగా మారింది. ఇలా, ఆయుధ ఉత్పత్తిదారుల లాబీ అనేక యుద్ధాలను, సమస్యలను సృష్టిస్తున్నది. ఒబామా యుద్ధాలను వ్యతిరేకిస్తు న్నాడంటే ఈ ఆయుధ ఉత్పత్తిదార్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆయుధాల లాబీ నడుములు విరగ్గొడితే అమెరికాలో అందరూ హాయిగా, సుఖంగా బతుకవచ్చు.

ఒబామా విజయం ప్రపంచ ప్రజలకు స్ఫూర్తి

ఒబామా విజయం నుండి కాన్షీరాం ఇచ్చినంత స్ఫూర్తిని భారతీయ ప్రజలు పొందగలగాలి. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి స్ఫూర్తి పొందగలగాలి. బుద్ధుడు పుట్టిన తర్వాత శతాబ్దాల కాలంలో బానిసలు రాజులుగా, చక్రవర్తులుగా మారిన క్రమం చాలా తక్కువ. శూద్రులు శతాబ్దాల తరబడి రాజ్యాలను పరిపాలించారు. కానీ, వారిని బానిసలని అనలేము. భారతదేశంలో 13వ శతాబ్దంలో బానిస వంశం పాలన సాగిన ఘట్టం తప్పితే మళ్లీ బానిసలు రాజ్యాధినేతలు కాలేదు. అందువల్ల, భారతదేశంలో ఒబామా విజయం దళిత బహుజనులకు ఎంతో స్ఫూర్తి.

అంబేద్కర్ భారతదేశంలో రిజర్వేషన్ల ద్వారా సాధించిన ఫలితాల నుండి, దళితుల నుండి ఎలా ఎదిగారో అమెరికాలో కూడా నల్లవాళ్లకు కల్పించిన ప్రత్యేక అవకాశాల నుండి నల్లవాళ్లు నాలుగు దశాబ్దాలుగా ఎదుగుతున్నారు. ఇలా, ఒబామా విజయం రిజర్వేషన్ల పరిణామాల విజయంలో భాగం కూడా. అలాంటి సామాజిక వర్గం నల్లవాళ్లలో అన్ని స్థాయిల్లో ఎదగడం వల్లనే అది అదనపు లాబీగా కూడా ఒబామాకు ఉపయోగపడింది.


కొందరు విశ్లేషకులు ఒబామా రాగానే అమెరికా మారుతుందా అని పెదవి విరుస్తారు. ఒక ముస్లిం, ఒక నల్లవాడు, ఒక వర్ణాంతర వివాహితుల సంతానం దేశాధ్యక్షుడు కావడమే దానికదే ఒక గొప్ప సంకేతం, ఒక గొప్ప సందేశం, ఒక గొప్ప ఉత్తేజం. అగ్ర కులాల నాయకత్వం స్థానంలో దళిత బహుజన కులాల నాయకత్వం దానికదే ఒక గొప్ప మలుపు. ఏదైనా ఒకటే అనుకునేవాళ్లు తాము తింటే ఇతరుల ఆకలి తీరినట్టే అని చెప్పే అగ్రకులాధిపత్య వాదులే. కానీ, తమ పార్టీల్లోనైనా, తాము ఎన్నికల్లో నిలబెట్టే అభ్యర్థులనైనా దళిత బహుజనం నుండి ఎన్నుకోవడంలేదు. ఆ పార్టీలకు నాయకత్వంగానైనా బీసీ ఎస్సీ ఎస్టీ నాయకుల్ని ఎదిగించలేని పార్టీలు అవి.

ఒక వడ్రంగి అధ్యక్షుడుగా...ఒక అంటరానివాడు రాజ్యాంగ నిర్మాతగా....

19వ శతాబ్దంలో ఒక వడ్రంగి, పేదవాడు అబ్రహాం లింకన్ 1862లో అమెరికాకు అధ్యక్షుడయ్యాడు. నల్లవాళ్ల బానిసత్వాన్ని రద్దు చేయడం వల్ల అంతర్యుద్ధం జరిగింది. 10 లక్షల మంది చనిపోయారు. ఇలా పట్టుదలతో లింకన్ నల్లవారి బానిసత్వాన్ని చట్టబద్ధంగా రద్దు చేశాడు. ఆ సందర్భంగా చేసిన గెట్టీస్‌బర్గ్ ప్రసంగం ప్రజాస్వామ్యానికి గొప్ప నిర్వచనం ఇచ్చింది. ప్రజాస్వామ్యం అంటే ప్రజల చేత ప్రజల యొక్క ప్రజల కొరకు ప్రజాస్వామ్యం అని ఇచ్చిన నిర్వచనం ఒక గొప్ప నిర్వచనం. డా॥బి.ఆర్.అంబేద్కర్ ఈ నిర్వచనాన్ని మరికొంత సమగ్రం చేశాడు. అందరూ అన్ని అవకాశాలు అందుకునే విధంగా అవకాశాల కల్పనతో పాటు మానవ వనరులను తీర్చిదిద్దుతూ సామాజిక న్యాయం సాధించడం అనే అంశాన్ని ప్రజాస్వామ్యం అమలు జరిపినప్పుడే అది నిజమైన ప్రజాస్వామ్య మని అంబేద్కర్ అన్నాడు. శాంతియుత ప్రజాస్వామిక వ్యవస్థలో అబ్రహాం లింకన్, డా॥బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయాన్ని సమన్వయించి ముందుకు సాగడంలో ఒబామా విజయం ప్రపంచానికే ఒక గొప్ప మలుపు.

2

బీసీలు సాధికారికత



దర్బన్ వర్ణ వివక్ష వ్యతిరేక సదస్సు

బీసీలు సాధికారికత

దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో వర్ణ వివక్షతకు వ్యతిరేకంగా ఆగస్టు 2001లో ప్రపంచ సదస్సు జరిగింది. ప్రపంచ దేశాల నుండి నాలుగువేల మంది దాకా హాజరయ్యారు. ఎన్నో భాషలు, ఎన్నో సంస్కృతులు, ఎంతో ఆనందం. మనమంతా ఒక్కటే అనే విశ్వాసం. ఇండియా నుండి 120 మంది దాకా సదస్సుకు హాజరయ్యారు. అందులో రాష్ట్రం నుండి 40 మంది దాకా వెళ్ళారు. కత్తి పద్మారావు, కె.ఎస్.చలం, బొజ్జా తారకం, గోరటి వెంకన్న, ఘంటా చక్రపాణి, మాష్టార్జీ, కంచ ఐలయ్య, బి.ఎమ్.లీలాకుమారి మొదలైన వాళ్ళు వెళ్ళిన వారిలో వున్నారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారతదేశంలో వర్ణ వివక్ష లేదని అధికారికంగా ప్రతినిధులుగా వెళ్ళడాన్ని వ్యతిరేకించింది. బిజెపి జాతీయ అధ్యక్షుడైన బంగారు లక్ష్మణ్ దళితుడైనప్పటికీ అతనిచేతే దేశంలో వర్ణవివక్ష లేదని చెప్పించారు. కుల వివక, కులాంతరాలు అన్నీ వర్ణ వివక్షలో భాగమే.

మహిళా ఉద్యమాలు ప్రపంచ వ్యాప్తంగా వేగవంతమయ్యాక వారి మద్దతుతో వర్ణవివక్ష వ్యతిరేక ఉద్యమాలు నూతనశక్తిని సంతరించుకున్నాయి. శ్వేతజాతి మహిళలు వర్ణవివక్ష వ్యతిరేక సదస్సుకు మద్దతిచ్చారు. రెడ్‌ఇండియన్స్‌ని పొట్టనపెట్టుకొని అమెరికాను ఆక్రమించిన యూరప్ వారసులు రెడ్‌ఇండియన్‌లకు చరిత్రలో తమ పూర్వీకులు చేసిన హత్యాకాండకు క్షమాపణ చెప్పారు. గాంధీజీ భారతదేశంలోని

వర్ణవివక్షతకు తమ పూర్వీకుల తరఫున క్షమాపణ చెప్పారు. ఇలా చరిత్రలో జరిగిపోయిన అన్యాయాలను సరిచేయడానికి రిజర్వేషన్లు, ప్రొటెక్షనిజం మొదలైన పలు రూపాల్లో కృషి సాగుతున్నది.

డర్బన్‌లో బీసీ వాయిస్ విన్పించకపోవడానికి ప్రధాన కారణం బీసీలు జాతీయ స్థాయిలో ఒక బలమైన శక్తిగా ఎదగకపోవడం. బీసీలందరికీ ప్రయోజనకరమైన, అందరినీ ఏకం చేసే సిద్ధాంతభూమిక, వ్యూహం, ఎత్తుగడలు లేకపోవడం. అందువల్లే బీసీలు ఈ దేశంలో జాతీయ సమస్యలపై గాని, దేశం గురించి గాని, పట్టించుకొని కార్యక్రమాలు రూపొందించలేకపోగా, కనీసం స్టేట్‌మెంట్లైనా ఇవ్వలేకపోయారు.

ప్రపంచవ్యాప్తంగా వర్ణ వివక్షతకు వ్యతిరేకంగా జరిగిన డర్బన్ సదస్సులో బీసీల వాయిస్ వినిపించలేదు. ఎస్సీల గొంతు బలంగా విన్పించారు. సమస్య ప్రధానంగా దళితులది కావడంతో పాటు సంఘటితంగా, వారు వాయిస్ గ్రూపుగా ఎదగడంవల్ల ఇది సాధ్యపడింది.

వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటంలో బీసీల పాత్ర ఏమిటో నిర్వచించుకుంటే ఇకనుండైనా బీసీలు క్రియాశీలంగా ఉండడం సాధ్యపడుతుంది. బీసీలు వర్ణ వివక్షను, కుల వివక్షను వదలుకోవడానికి సైద్ధాంతికంగా, ఆచరణాత్మకంగా సిద్ధంగా ఉన్నారా? వర్ణ వివక్షతను వ్యతిరేకిస్తూ అగ్ర కులాల పార్టీలు, నాయకులు, సంస్థలు మాట్లాడాయి. జాతీయ ఎజెండాలోకి తీసుకున్నాయి. అట్లా బీసీ కులాల నాయకులు, సంఘాలు, సంస్థలు తమ ఎజెండాలోకి తీసుకున్నాయా! ఎందుకు తీసుకోలేకపోయాయి? అసలు బీసీలు అనేవాళ్లు ఒక ఐక్యసంఘటనగా సమాజ వికాసంలో, జాతీయోద్యమంలో, సామాజిక సాంస్కృతిక పరిణామాల్లో క్రియాశీల పాత్ర నిర్వహించడం మొదలైందా?

ఎస్సీల్లో రెండు కులాలే ప్రధానంగా ఉండడం వల్ల ఆ రెంటి కలయికతో ఎస్సీలు ఒక శక్తిగా ఎదిగారు. బీసీలు ఒకటి రెండు కులాలు కాదు. బీసీలది ఒక కులం కాదు. ఒకే సంస్కృతి కాదు. సంచారులు, గిరిజనులు, సేవక కులాలు, అస్పృశ్య సంబంధ కులాలు కొన్ని కలిసి బీసీ-ఎ గ్రూపులో వున్నాయి. బీసీ-బి గ్రూపులో చేతివృత్తి కులాలు కల్లు గీత, చాపలు, బట్టలు, నగలు, చెక్క పనులు, చెట్ల పనులు, బంగారం, ఇనుము, కంచు వారి మొదలైన పనులు భిన్నమైనవి. పని విధానాలు, పని పరిస్థితులు, తద్వారా వారి సంస్కృతి ఆలోచనలు భిన్నమైనవి. బీసీ-డి గ్రూపులో అగ్ర కులాల కన్నా కొద్దిగ తక్కువ అనుకునే కులాలున్నాయి. పూజారి కులాలు, వ్యవసాయ కులాలు మొ॥వి. సామాజిక వైవిధ్యం, సామాజిక నిర్మాణం, బీసీ కులాల నిర్మాణంలో కనపడుతుంది. వీరు వేల ఏళ్లు గడిచినా

సామాజికంగా ఒక్కటి కాలేకపోయారు. బౌద్ధం అందరినీ కలిపి ఉంచితే, హిందూ వర్ణకుల వ్యవస్థలు, కులాంతరాలు అందరినీ చీలదీయడం, విడగొట్టడం ఇందుకు ప్రధాన కారణం.

రిజర్వేషన్ల అవసరం రీత్యా, రాజకీయ అవసరాల తీర్యా, రాజ్యాంగ లక్ష్యాల రీత్యా ఎస్సీలాగా వీరికి బీసీఅని పేరు పెట్టారు. అంతేగానీ, బీసీ లందరూ ఒక్కటి కావడానికి ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక ప్రాతిపదిక ఏమీ లేదు. శూద్రులు అనే నిర్వచనం ఒక్కటే వీరిని ఒక్కటి చేస్తున్న సిద్ధాంతం.

శూద్రులు పారిశ్రామిక విప్లవం వల్ల వృత్తులు, ఉపాధి కోల్పోయారు. చదువుకున్న కులాలు, వలస పోగలిగినవారు, విద్యనేర్చినవారు ఆధునిక వృత్తుల్లో చేరారు. మహాత్మా జ్యోతి రావు పూలే శూద్రుల, అతి శూద్రుల వికాసం కోసం జీవితాన్ని అంకితం చేశారు. ఆయనే శూద్రులకు ఒక జాతీయ దృక్పథాన్ని అందించారు. అయితే, ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి, కమ్యూనిస్టుల్లోకి, కుల సంఘాల్లోకి చీలిపోయి బీసీలు ఆ జాతీయ దృక్పథాన్ని కోల్పోయారు. ఇతరులకు, ఇతర సిద్ధాంతాలకు అనుచరులుగా మారారు. ఆరెస్సెస్, బీజేపీ, శివసేన సిద్ధాంతాల్లో అనుచర వర్గంగా బీసీలు చేరారు.

స్వాతంత్ర్యానంతరం రామ మనోహర్ లోహియా బీసీలకు జాతీయ దృక్పథాన్ని, రాజకీయ దృక్పథాన్ని, అవకాశాన్ని కల్పించాలని కృషి చేశాడు. తత్ఫలితంగా ఉత్తరాది రాష్ట్రాల్లో బీసీలు 1967 నుండి అధికారం అందుకోవడం జరిగింది. దక్షిణాదిలో 1962 తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో బీసీలే అధికారంలోకి వస్తారని లోహియా ఊహించాడు. ఆశించాడు. అది జరగలేదు. బీసీల నుండి ఎదిగిన అధికారులు, నాయకులు ఎస్సీలకు నమ్మదగిన, ఆధారపడదగిన మిత్రులుగా, నాయకులుగా విశ్వాసం చూరగొనలేకపోయారు. ఆర్థికంగా, సాంఘికంగా ఎదుగుతున్నకొద్దీ తామూ అగ్ర కులాల్లాగే వర్ణ వివక్ష సంస్కృతిని ఒంట పట్టించుకుని ఎస్సీలకు కొత్త శత్రువులుగా తయారయ్యారు. చంద్రభాను ప్రసాద్ తన వ్యాసాల్లో తరచూ ఈ క్రమాన్నే ప్రస్తావిస్తూ ఎస్సీలకు ఉన్నంతలో అగ్ర కులాలే మంచి మిత్రులని, ఈ కొత్త శూద్ర అగ్ర కులాల అణిచివేత క్రూరంగా వుంటోందని సోదాహరణంగా వివరించారు.

అందువల్ల, ఆయన ప్రకారం బీసీలు కూడా వర్ణ వివక్షతను, అణచివేతను కొనసాగిస్తున్నవాళ్లే. రాజకీయ, సామాజిక రంగాల్లోని బీసీ నాయకత్వం వర్ణ వివక్షను కొనసాగిస్తున్నారు. తిట్టే తిట్లలో కులాన్ని కించపరిచే బూతుమాటలెన్నో ఇప్పటికీ బీసీ ప్రజలు బలమైన ఆయుధాలుగానే ఉపయోగిస్తున్నారు. గాంధీ వచ్చి అగ్ర కులాల్లోని

వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడి, వారిచే పల్లెల్లో అవమానాలపాలై కూడా కాంగ్రెస్‌ని, జాతీయోద్యమాన్ని దృక్పథంలో పూర్తిగా, ఆచరణలో వీలైనమేరకు వర్ణ వివక్షను వ్యతిరేకించేట్టు కృషి చేశాడు. జ్యోతిబాపూలే తర్వాత బీసీల్లో ఇలాంటి దృక్పథం, ఆచరణ కొరవడింది.

ఇవాళ బీసీ నాయకత్వం వర్ణ వివక్షతను వ్యతిరేకించినా బీసీలు దాన్ని వదులుకోవడంలేదు. బీసీ ప్రజలు బీసీ నాయకత్వ ప్రభావంతో పని చేయడంలేదు. బీసీ ప్రజలు అగ్రకుల సిద్ధాంతాల, నాయకుల ప్రభావంతో పనిచేస్తున్నారు. ఎస్సీ ప్రజలు ఎస్సీ నాయకత్వ ప్రభావంతో పనిచేస్తున్నారు. అంబేద్కరు సిద్ధాంత భూమిక వారందరినీ ఐక్య పరిచింది. బీసీలను ఐక్య పర్చడానికి ఇలాంటి సిద్ధాంతభూమిక స్వీకరించ లేదు. అందువల్ల బీసీల నాయకత్వం ఎంత చైతన్యవంతులైనా బీసీ ప్రజలు అందుకు భిన్నంగా తమ స్వార్థానికి బాగుంది గనుక వర్ణ వివక్షను పాటిస్తున్నారు.

రాజకీయంగా బీసీ నాయకత్వానికి బీసీ ప్రజల్లో కాస్త పట్టుంది. కానీ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, కళా రంగాల్లో బీసీ ప్రజలు బీసీ నాయకుల అడుగుజాడల్లో నడవడానికి నిరాకరిస్తున్నారు. బీసీలు ఇన్నేళ్లయినా ఒక శక్తిగా ఎదగలేకపోవడానికి గల మౌలిక వైరుధ్యం ఇది. ఈ వైరుధ్యాన్ని పరిష్కరించుకుంటే భారత రాజకీయాల్లో, సాంఘిక ఆర్థిక రంగాల్లో బీసీలు అజేయశక్తిగా ఎదుగుతారు. అందుకు, సిద్ధాంత ప్రాతిపదికలు మార్చుకోవాలి.

రిజర్వేషన్ల ప్రకారం రాజకీయ రంగంలో, ఉద్యో రంగాల్లో ఎస్సీలది ఎస్సీలకు, ఎస్టీలది ఎస్టీలకు, రిజర్వు అయింది. ఎస్సీ, ఎస్టీలది వారిది వారికి పోగా అగ్ర కులాలు తమ జనాభా నిష్పత్తికి మించి అన్ని రంగాల్లో అనుభవిస్తున్నదంతా బీసీలకు చెందాల్సిందే.

రాజకీయ అధికారం బీసీలకు 50 శాతం అందితే అధికారం ననుసరించి కాంట్రాక్టర్లుగా, పారిశ్రామిక, వ్యాపార వర్గాలుగా బీసీలు 50 శాతం ఎదగడం సాధ్యమే. ఇప్పుడు అగ్ర కులాల కింద అనుచరులై పనిచేస్తు ఉంటున్నారు. ఎస్సీ, ఎస్టీలు బీసీల నుంచి గుంజుకొని తిన్నదేమీ లేదు. అయినా ఎస్సీ, ఎస్టీలతో ఐక్యంగా ఉండడానికి బీసీ ప్రజలు సిద్ధంగా లేరు. ఎందువల్ల? సామాజికంగా, సాంస్కృతికంగా మేం వారి కన్నా ఎక్కువ అనే భ్రమల వల్ల – ఆ ఆధిక్యతని వదులుకోలేని స్వార్థం వల్ల ఇలా జరుగుతున్నది. అగ్ర కులాల దగ్గర ఏం చూసి కలుద్దామనుకుంటున్నావో అదంతా నీదే, నీకు చెందాల్సిందే అని–దాన్ని సాధించుకోవడానికి ఇప్పటికే బీసీల

కన్నా బలమైన శక్తిగా ఎదిగిన ఎస్సీ, ఎస్టీలను కలుపుకొని పోరాడాలని అర్థం చేయించాల్సి వుంది.

బీసీల నిష్పత్తి ప్రకారం 280 మంది బీసీలు పార్లమెంటు సభ్యులుగా, 106మంది ఎస్సీ పార్లమెంటు సభ్యులతో కలిస్తే మూడింట రెండు వంతుల మెజారిటీ అవుతారు. అప్పుడే దేశాన్ని, రాజ్యాన్ని సమూలంగా అట్టడుగు స్థాయి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీల కనువుగా వారి కందాల్సిందంతా అందే కృషి చేయడం సాధ్యపడుతుంది. కేవలం ఏడేళ్లలో ఇవి సాధించడం సాధ్యమే.

భారతదేశంలో బ్రాహ్మణుల తర్వాత బలమైన శక్తిగా, సిద్ధాంత భూమికతో జాతీయ స్థాయిలో నిలువగలిగింది ఎస్సీలు మాత్రమే. రాజకీయ రిజర్వేషన్లు ఉద్యోగాల్లో రిజర్వేషన్ల వల్ల అత్యున్నత స్థాయిలో ఎస్సీ నాయకులు, అధికారులు బలమైన శక్తిగా వున్నారు. అలా కింది స్థాయిలో లేరనేది వాస్తవమైనప్పటికీ యిది ప్రస్తుతాంశం కాదు. బ్రాహ్మణులకు దీటుగా జాతీయ స్థాయిలో ఏ జాట్, కమ్మ, రెడ్డి కుటుంబాలు లేవు. వాటికి సాధ్యం కాదు. స్థానిక బ్రాహ్మణేతర అగ్రకులాలు జాతీయ స్థాయిలో ఒక్కటి కాలేవు అని జనతాపార్టీ, జనతాదళ్ విచ్ఛిన్నాలు రుజువు చేశాయి. అందువల్ల ఆర్థికంగా, సాంస్కృతికంగా, సామాజికంగా ఎస్సీ ప్రజలు ఎంతో వెనుకబడి వున్నప్పటికీ ఎస్సీ నాయకత్వం రాజకీయ, బ్యూరోక్రసీ సిద్ధాంత రంగాల్లో బ్రాహ్మణుల్ని బలంగా సవాలు చేసి, దేశాన్నే నిలదేసే స్థాయికి ఎదిగింది. కాన్షీరాం, బిఎస్‌పి ఎదుగుదల ఈ సామాజిక పరిణామాల వల్లనే సాధ్యపడింది.

బీసీలు రాజకీయ, బ్యూరోక్రసీ రంగాల్లో ఎస్సీల కన్నా ఎంతో వెనుకబడి వున్నారని వాస్తవాలు గ్రహించాల్సి వుంది. తమ ఆధిక్యత తెచ్చిపెట్టుకున్న మానసిక ఆధిక్యతే తప్ప సాంఘిక, రాజకీయ, ఆర్థిక పునాది లేదని గ్రహించి కులాధిక్యతా భ్రమల్నించి బయటపడాల్సి వుంది.

బీసీ కుల సంఘాల నాయకత్వాన్ని ప్రభావితం చేస్తూ బీసీ సంఘాల నాయకత్వం సామాజిక, సాహిత్య, సాంస్కృతి, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో ఎదగాలి. అది జరిగినప్పుడే తమకు సంఘాల ద్వారా కుల వ్యవస్థ, వర్ణవివక్ష దృక్పథంతో ఆచరణలో సమూలమైన మార్పులొస్తాయి. అందుకు బౌద్ధం, రాజ్యాంగ లక్ష్యాలు పనికివస్తాయి.

బీసీలు తమ సిద్ధాంత భూమికను మార్చుకోవడంలో భాగంగా, పోలరైజేషన్ చేయాల్సి వుంది. అందుకు వేదంలోని కులసృష్టి పురుషసూక్తం శ్లోకాన్ని, భగవద్గీతలోని కుల సమర్థ శ్లోకాన్ని, మనుధర్మ శాస్త్రాన్ని కుల సంఘాల ద్వారా అంబేద్కర్ లాగా

తగుల బెట్టి కుల వివక్షకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయాలి.

బీసీలు హిందూపురాణాలు, మైథాలజీపై ఆధారపడి కుహనా చరిత్రను నిర్మించడాన్ని ఆపేయాలి. ఆ భారాన్ని తొలగించుకోవడానికి చరిత్ర నుండి బీసీల పాత్రను సమాజ నిర్మాతలుగా వారు చేసిన వేల ఏళ్ళ కృషిని స్పష్టంగా, నిర్దిష్టంగా విశ్లేషించాలి.

బీసీల్లో తమ కులానికే పరిమితమై ఆలోచించే దృక్పథం నుండి విస్తరించి జాతీయ దృక్పథం ఏర్పర్చుకోవాలి. జాతి అనే అన్ని పొలాలకు నీరందాలంటే వర్షపాతం చెరువు, ప్రాజెక్టులు కాలువ నిర్మాణం గురించి ఆలోచిస్తారు. నా పొలానికి నీరందితే చాలనుకునే వాళ్ళు ఏదో ఒక బావి తవ్వుకోవాలని ఆలోచిస్తారు. బావిలో కప్పలా కుదించుకుపోతారు. అలాకాకుండా అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలి. అందరు జీవన ప్రమాణాలు పెంచుకోవాలి. ప్రతిమనిషి ఒకే విలువ, ఒకే ఓటు, ఏ కులం గొప్పది కాదు, ఏ కులం చిన్నది కాదు. అన్ని కులాలు సమానమే అని ప్రజల్ని చైతన్యవంతం చేయాలి.

కులవృత్తులు కుల అంతరాలకు పునాదిగా వున్నాయి. కులవృత్తులపై ఆధారపడి ఆధునిక అభివృద్ధిని అందుకోవడం, మధ్యతరగతిగా మారడం, బీసీలు, ఎస్సీలకు నూరేళ్ళయినా సాధ్యం కాలేదు. కులవృత్తులు వదిలేసిన వారే అన్ని రంగాల్లో ఎదగడం జరుగుతుంది. దిక్కులేకనే కులవృత్తి చేస్తున్నాం అనే స్పృహ కలిగిస్తే – మంచి వృత్తి వెతుక్కొనే కృషి చేస్తారు. కుల ప్రాతిపదికగా గల కులవృత్తి వదిలేశాక వుండే కులం, రక్తసంబంధాలకు మానసిక ఐక్యతకు సంబంధించి మాత్రమే. కులాంతర వివాహాల ద్వారా, అందరూ ఒక్కటే అనే దృష్టిద్వారా కుల వివక్షను రూపుమాపవచ్చు.

దర్బన్‌లో బీసీలు తమ వాయిస్ విన్పించే స్థాయికి ఎదగడం అంటే జాతీయ స్థాయిలో అన్ని రంగాల్లో, అన్ని విషయాల్లో బీసీలు తమ వాయిస్ విన్పించే స్థాయికి ఎదగడం. జాతీయ స్థాయికి బీసీలు వాయిస్ గ్రూపుగా ఎదిగినప్పుడే దర్బన్‌లో బీసీ వాయిస్ విన్పించడం సాధ్యం. మరోమాటలో చెప్పాలంటే దర్బన్‌లో బీసీ వాయిస్ విన్పించడమంటే బీసీలు జాతీయ స్థాయి బలమైన శక్తిగా సిద్ధాంత రంగాల్లో, సామాజిక రంగాల్లో ఎదిగారని అర్థం.

బీసీలు కుల వివక్షను పాటించడం మానేస్తే కులవివక్ష అనేది కేవలం 15 శాతం గల అగ్రకులాలకే పరిమితమైపోతుంది. కనుక దాన్ని తొలగించడం సులువు. బీసీల్లోంచి జాతీయ స్థాయి మేధావులు, రచయితలు, సిద్ధాంతవేత్తలు ప్రజాపునాది బలంతో ఎదిగినప్పుడు దర్బన్ వంటి అంతర్జాతీయ సదస్సుల్లో బీసీ వాయిస్ వినిపించడం, జాతికి నాయకత్వం వహించడం సాధ్యపడుతుంది.

కేంద్రం, రాష్ట్రాలు, కాంగ్రెసేతర ప్రభుత్వాలు

బీసీల సాధికారికత

స్వాతంత్ర్యానంతరం బీసీలు క్రమ క్రమంగా అనేక రాజకీయ పార్టీల్లో ఎదుగుతూ వస్తున్నారు. స్వయంగా బీసీలు జాతీయ స్థాయిలో పార్టీలు పెట్టలేకపోయినప్పటికీ ప్రాంతీయ స్థాయిలో పలు రాష్ట్రాల్లో స్వయంగా పార్టీలు పెట్టి ఎదిగి అధికారాన్ని చేపడుతూ వస్తున్నారు. అయితే జాతీయ స్థాయిలో ఒక్కటి కాలేక పోతున్నారు.

భాషా సమస్య

ప్రాంతీయ దృక్పథాలు, ప్రాంతీయ భాషల పరిమితి వీరిని ఎదగకుండా అడ్డుపడుతున్నది. జాతీయ దృక్పథంతో పాటు హిందీ, ఇంగ్లీషుల్లో మాట్లాడే సామర్థ్యం పెంచుకొని ఢిల్లీ నుండి రాజకీయాలను, జాతిని సంబోధించగలిగితే బీసీలు జాతీయ స్థాయిలో కూడా నాయకత్వంగా ఎదిగి కేంద్రంలో అధికారంలోకి రావడం సాధ్యపడుతుంది.

శూద్రులు కేంద్రంలో అధికారంలోకి రాలేకపోవడానికి ప్రధాన కారణం జాతీయ దృష్టి లేకపోవడం, జాతీయ స్థాయి నాయకులుగా నిలదొక్కుకోలేక పోవడం, హిందీ, ఇంగ్లీషు, ప్రాంతీయ భాషల ద్వారా తమ పార్టీలను, ఉద్యమాలను, నాయకులను, తమ రాష్ట్రాల చరిత్రలను స్వయంగా తమ ప్రభుత్వాల ద్వారా కోట్లాది ప్రజలకు అందించలేకపోవడం.

స్వయంగా బ్రాహ్మణీయ శక్తులతో తాత్కాలిక ప్రయోజనాల కోసం చేతులు కలిపి వారిని బలోపేతం చేసి తాము క్రమంగా బలహీనపడి పోవడం.

జాతీయపార్టీల్లో కొందరు బీసీలు సాధారణ కార్యకర్తలుగా చేరి స్వయంకృషితో పార్టీలకే కేంద్ర బిందువుగా మారుతూ వచ్చారు. కేంద్రంలోని బ్రాహ్మణీయ శక్తులు సెమీ ఫైనల్ దశలో వీరి వికెట్లను ఔట్ చేస్తున్నారు. ఇదంతా కాకతాళీయంగా జరిగినట్టు చేస్తారు. కానీ దాని వెనక అగ్రవర్ణాల, జాతీయ స్థాయి పారిశ్రామిక వేత్తల కుట్రలు, పకడ్బందీ ప్రణాళికలు ఉన్నాయి. దీర్ఘకాలిక దృష్టి కోల్పోయిన స్వయంకృత అపరాధం కూడా ఇందుకు కారణం. చరణ్‌సింగ్, దేవగౌడ శూద్రుల నుండి ప్రధాన మంత్రులు అయినప్పటికీ వారి కున్న మెజార్టీ నామమాత్రం కావడంతో మైనారిటీ ప్రభుత్వాలను కొంత కాలం పాటు నడిపారు. శూద్రుల దృక్పథంతో శూద్రుల నాయకత్వంలో కేంద్ర రాజకీయాల్లో పాత్ర నిర్వహించే అవకాశం వారికి రానేలేదు.

కాంగ్రెసేతర పార్టీలు, ప్రభుత్వాలు

ఇప్పటికీ శూద్ర దృక్పథంతో బీసీ, ఎస్సీ అనుకూల వైఖరితో శూద్ర నాయకత్వంలో జాతీయ పార్టీలు ఎదగలేకపోయాయి. ఆయా పార్టీల్లో నాయకులుగా మాత్రమే ఎదుగుతూ వస్తున్నారు. తామే నాయకులుగా ఎదిగిన ప్రాంతీయ పార్టీల నాయకత్వం తమ పార్టీల ప్రభుత్వాల గురించి దేశంలోని ఇతర రాష్ట్రాలకు అందించిన సమాచారం, మౌలిక విషయాలు ఏవీ లేవు. అవి ఎందుకు అధికారంలోకి వస్తున్నాయో కూడా ఇతర రాష్ట్రాలకు ఆశ్చర్యపోయేంతగా సమాచార లోపం కొనసాగుతున్నది. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర వహించే నాయకులుగా ఎదిగిన కామరాజ్ నాడార్, సి. అన్నాదురై, కరుణానిధి, రామ్‌నరేష్ యాదవ్, శరద్ పాటిల్, కళ్యాణ్‌సింగ్, ములాయంసింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్ మొదలైనవాళ్ళంతా ఇలా సెమీ ఫైనల్ దశలో ఆగిపోయినవారే. ఉత్తర భారత రాజకీయాలు లోహియా సోషలిస్టు పార్టీ పరిణామంలో భాగంగా, మధ్య భారతంలో బీజేపీ, శివసేన పార్టీలో భాగంగా, దక్షిణ భారతదేశంలో డీఎంకే పార్టీ ద్వారా బీసీలకు రాజకీయాధికారం సాధ్యమైంది. దక్షిణాదిలో స్వతంత్ర పార్టీ నిర్మాణంతో కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చారు. ఓబీసీల కోణంలో 1960 నుండి భారత రాజకీయాల్లో తక్కువ పాత్రేమీ నిర్వహించలేదు.

బీసీలకు ప్రాధాన్యతల లేని కాంగ్రెస్ పార్టీ

కాంగ్రెస్ పార్టీలో జాతీయ ఉద్యమ కాలం నుండి ఇప్పటికీ శూద్ర ఓబీసీలకు సరైన ప్రాతినిధ్యం లేదు. బ్రాహ్మణులు, బ్రిటిష్ ప్రభుత్వంలో, 565 సంస్థానాల్లో పరిపాలకులుగా, పన్ను వసూలు దారులుగా వుంటూ జమిందారులుగా, రాజులుగా పిలువబడిన వారు, వారిద్వారా ప్రయోజనం పొందిన వారే కాంగ్రెస్‌లో సింహభాగం ఆక్రమిస్తూ రిజర్వేషన్ల మేరకు ఎస్సీలకు ఎస్టీలకు అవకాశం ఇస్తున్నారు. పైగా కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో బీసీలకు రాజకీయాల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను 50 ఏళ్ళుగా వ్యతిరేకిస్తూ వచ్చింది. ఇవన్నీ కలసి ఓబీసీలు ప్రత్యామ్నాయాలను వెతుకున్నారు. అలా లోహియా పార్టీద్వారా, డిఎంకె ద్వారా, జనతాపార్టీ ద్వారా, బిజెపి ద్వారా అధికారంలోకి వస్తున్నారు. ఈ కోణంలో చూసినప్పుడు ఆయా దశల్లో ఆయా పార్టీల్లో ఓబీసీలు అవకాశం దొరికినప్పుడు నాయకులుగా, ముఖ్య మంత్రులుగా ఎదుగుతూ తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. అలా బీజేపీలో కూడా ఓబీసీలు ఎదిగారు. కళ్యాణ్‌సింగ్, శంకర్‌వాగేలా, ఉమాభారతి, గోవిందాచార్య, నరేంద్రమోడీ, ఆలే నరేంద్ర, బంగారులక్ష్మణ్, బండారు దత్తాత్రేయ మొదలైన ఓబీసీలు జాతీయ స్థాయిలో నాయకులుగా గుర్తింపు పొందడం అనేది కాంగ్రెస్ కన్నా, సిపిఐ, సిపిఎం పార్టీల కన్నా డీఎంకే, సోషలిస్టు, ఎస్పీ, రాష్ట్రీయ జనతాదళ్ పార్టీలతో పాటు బీజేపీ, బీసీలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చాయని స్పష్టం చేస్తున్నది.

శూద్రుల సాధికారికతలో రామ్‌మనోహర్ లోహియా సోషలిస్టుల కృషి

స్వాతంత్ర్యానంతరం శూద్ర అగ్రకులాలు దక్షిణాది రాష్ట్రాలలో డిఎంకె, జనతాపార్టీ, జనతాదళ్, టిడిపి పేరిట స్వయంగా ఎదుగుతూ వచ్చాయి. శూద్రులు ఉత్తర భారతదేశంలో లోహియా సోషలిస్టు పార్టీ చుట్టూ కేంద్రీకృతమయ్యారు. బీసీలకు 60 శాతం పార్టీ పదవులు, ఎన్నికల్లో టికెట్లు ఇవ్వడానికి నిర్ణయించుకున్నందున బీసీల పార్టీగా ఎదిగింది. దాన్నుంచి 1967లో రామ్ నరేష్ యాదవ్ ఉత్తరప్రదేశ్‌లో బీసీ ముఖ్యమంత్రి అయ్యారు.

ఆ తరువాత అదే వారసత్వం సమాజ పరిణామం కొనసాగుతూ ములాయంసింగ్ యాదవ్ మొదలైనవారు నాయకులుగా ఎదిగి వచ్చారు. ఇలా లోహియా పార్టీ నాయకత్వంలో శూద్ర అగ్రకులాలు, శూద్ర ఓబిసిలు కలసి గెలిచారు. దాని పరిణామాల్లో భాగంగా లాలూప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్, శరద్ యాదవ్,

రాంవిలాస్ పాశ్వాన్ మొదలైన వారు నాయకులుగా, ప్రాంతీయ పార్టీలుగా ఎదుగుతూ వచ్చారు.

బీసీలు అధికారంలోకి వచ్చాక జరిగిన సామాజిక పరిణామాలు, అభివృద్ధి రాజకీయాలు ప్రజలకు చేరిన క్రమం ననుసరించి అంతకన్నా ఇంకా కింది వర్గాలకు ప్రజాస్వామ్య ఫలాలు, అధికారం అందుకోవాలనే స్ఫూర్తి పెరిగింది. బీసీలు అధికారంలోకి వచ్చాకే ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ అధికారంలోకి రాగలిగింది. బహుజన సమాజ్ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి రావడం జరిగింది. బీసీలు ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి రాకుండా ప్రజాస్వామ్యం, రాజకీయ అధికారం బీసీ, ఎస్సీల సమీపానికి రాకుండా బీఎస్పీ గెలవడం ఊహించలేని విషయం. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీలు అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రమే దళితులు అధికారంలోకి రావడం సాధ్యపడుతుంది. పైగా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరప్రదేశ్‌లో కన్నా దళితులు తక్కువ, బీసీలు ఎక్కువ.

బీజేపీ - బీసీల సాధికారికత

ఉత్తర భారతదేశంలో లోహియా సోషలిస్టు పార్టీ ద్వారా బీసీలు అధికారంలోకి వస్తే మధ్య భారతదేశంలో మరో క్రమంలో అధికారంలోకి రావడం కనపడుతుంది. మధ్య భారతంలో గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో బీజేపీ పార్టీలో కార్యకర్తలుగా చేరి క్రమంగా ఎదిగి నాయకులయ్యారు. ముఖ్యమంత్రులయ్యారు. అలా ఓబీసీలైన శంకర్ వాగేలా, నరేంద్ర మోడీ, ఉమాభారతి, గోవిందాచార్య మొదలైన వారు గుర్తింపు గల నాయకులుగా ఎదుగుతూ వచ్చారు. లోహియా తెచ్చిన బీసీ నినాదంతో, పార్టీ నిర్మాణంతో ఉత్తర ప్రదేశ్‌లో కూడా కళ్యాణ్‌సింగ్ వంటి ఓబీసీలే బిజెపి ముఖ్యమంత్రులుగా ఎదిగారు.

శూద్రుల సాధికారికత - బ్రాహ్మణీయ శక్తులు

బ్రాహ్మణీయ శక్తులు బ్రాహ్మణేతర శక్తులను చీలదీసి కలుపుకుంటూ, వదిలేస్తూ మళ్ళీ కలుపుకుంటూ తమ ఆధిక్యతను నిరంతరం కొనసాగిస్తున్నారు. వామపక్షాలు ఈ బ్రాహ్మణీయ శక్తులకు అత్యవసర సేవలను నిరంతరం అందిస్తూ ఆరిపోకుండా చూస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎస్సీలను, ముస్లింలను కలుపుకుంటూ దశాబ్దాల పాటు అధికారంలోకి వచ్చింది. 1962 నుండి బ్రాహ్మణేతర బీసీ కులాలు, శూద్ర అగ్ర కులాలు ప్రాంతీయ పార్టీల ద్వారా ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తున్నారు.

1967లో సగానికి పైగా రాష్ట్రాల్లో కాంగ్రెసేతర పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అయినా ఆ తరువాత కేంద్రాన్ని పట్టుకోలేక పోయాయి.

బీసీల సాధికారికత - జనతాపార్టీ, జనతాదళ్

1977లో జనతా పార్టీ రూపంలో కాంగ్రెసేతర ప్రభుత్వానికి అవకాశం వస్తే దాన్ని పూర్తి కాలం నిలుపుకోలేక పోయారు. 1980లో తిరిగి బ్రాహ్మణీయ శక్తులు కేంద్రంలో అధికారంలోకి వచ్చాయి. 1989లో బ్రాహ్మణేతర అగ్ర కులాలు, శూద్ర కులాలు జనతాదళ్ రూపంలో వీ.పీ. సింగ్ ప్రధానమంత్రిగా అధికారంలోకి వస్తే దాన్ని కూడా పూర్తి కాలం పని చేయకుండా చేశారు. ఆ తరువాత బీసీ, ఎస్సీలు కలిసి అధికారాన్ని పంచుకునే అవకాశం వచ్చినప్పుడు ములాయంసింగ్ యాదవ్ బీఎస్పీని అణచివేయడానికి ప్రయత్నించారు. దాని వల్ల ఆయన భారతీయ చరిత్రలో శూద్రులు, దళితులు కలిసి రాజ్యాధికారం పంచుకొని కేంద్రంలో అధికారం చేపట్టకుండా చేసిన చరిత్ర మలుపుకు కారణమయ్యారు.

ఎస్సీల సాధికారికతను అడ్డుకున్న ములాయం

బాబ్రీ మసీదు కూల్చివేత బీజేపీని కేంద్రంలో అధికారంలోకి తెచ్చిందనడం పైకి కనిపించే అర్ధ సత్యం. అసలు వాస్తవం ములాయం సింగ్ యాదవ్ లాంటి వాళ్ళు ఎదుగుతున్న దళిత కులాల రాజకీయ అధికార లాబీలతో అధికారాన్ని కలిసి పంచుకోవడాన్ని నిరాకరించడం. దాంతో కాంగ్రెస్, బీజేపీ వంటి బ్రాహ్మణీయ శక్తులతో చేతులు కలిపి బీఎస్పీ అధికారంలోకి వచ్చింది. అది ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో బ్రాహ్మణీయ శక్తులకు ప్రాధాన్యతనిచ్చి బీసీల వాటాను పంచిఇచ్చేయడం జరిగింది. ఇలా బ్రాహ్మణీయ శక్తులు, దళితులు, ముస్లింలు మొదటి నుండి ఒక శక్తిగా కలుసుకుంటున్నారు.

ములాయంసింగ్ యాదవ్ ఒప్పందం ప్రకారం 1993లో బహుజన సమాజ్ పార్టీకి ముఖ్యమంత్రిత్వం బదలాయించి మిత్రపక్షంగా కలిసి ప్రభుత్వాన్ని యదావిధిగా నడపడానికి సహకరించి ఉంటే బీఎస్పీ, బీజేపీ కలిసి, మరోసారి కాంగ్రెస్‌తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశకు రాజకీయాలు మలుపు తిరిగేవి కాదు. బీసీ ఎస్సీలు కలిసి రాజకీయ అధికారం పంచుకొని ఉండేవారు. ఇలా ములాయంసింగ్ యాదవ్ భారత రాజకీయాల్లో బీజేపీ అధికారంలోకి రావడానికి పీవీ నరసింహారావు లాగే పరోక్షంగా ఉపయోగపడ్డారు.

దళితుల సాధికారికత

కాంగ్రెస్ నాయకత్వంలో బ్రాహ్మణీయ శక్తులు, మాజీ రాజులు, దళితులు సాగితే, బీఎస్పీ నాయకత్వంలో దళిత శక్తులు, బ్రాహ్మణీయ శక్తులు కలిసి సాగుతున్నాయి. క్రమంగా కాంగ్రెస్, బీఎస్పీ ప్రాతినిధ్య సామాజిక వర్గాలు ఒక్కటే అయ్యాయి. అయితే కాంగ్రెస్‌లో బ్రాహ్మణీయ శక్తుల నాయకత్వం ఉంటే బీఎస్పీలో దళిత శక్తుల నాయకత్వం కొనసాగుతున్నది. ఇది ఎంతో కాలం ఇలాగే ఉండదని బౌద్ధంలో బ్రాహ్మణీయ శక్తులు చేరిన తరువాత బౌద్ధం బ్రాహ్మణీకరణ పొందిన క్రమం స్పష్టం చేస్తున్నది. కాంగ్రెస్, బిజెపి తదితర బ్రాహ్మణీయ శక్తుల చేతుల్లో అనివార్యంగా చేరిపోయే విధంగా వామపక్షాలు బీసీలను ఒక సామాజిక వర్గంగా అణచివేస్తూ నాయకత్వం నుండి వెలివేస్తున్నాయి. బ్రాహ్మణీయ శక్తుల నుండి విముక్తి చెంది శూద్రులు, దళితులు, ముస్లింలు రాజకీయ అధికారాన్ని కలసి పంచుకోవడానికి ముందుకు వచ్చినప్పుడే అది అందరికీ మేలు చేస్తుంది.

బీసీల సాధికారికత గుణపాఠాలు

అందువల్ల స్వాతంత్ర్యానంతర చరిత్ర నుండి కేంద్రంలో రాజకీయ అధికారంగురించి తీసుకోవలసిన గుణపాఠం ఏమిటి? బ్రాహ్మణీయ శక్తులను వదిలేసి శూద్ర అగ్ర కులాలు, అగ్రవర్ణాలు, బీసీలు, ఎస్సీలు, ముస్లింలు కలిసి జాతీయ స్థాయిలో ఒక్కటి అయినప్పుడే శూద్రులు, దళితులు అధికారంలోకి వచ్చే పరిణామం సాగుతుంది. అందుకు అన్ని ప్రాంతీయ పార్టీలు జాతీయ దృక్పథాన్ని అలవర్చుకొని హిందీ, ఇంగ్లీషు భాషల్లో తమ పార్టీల, రాష్ట్రాల సామాజిక ఉద్యమాల గురించి, నాయకుల గురించి, సాహిత్యం గురించి వందలాది రచనలను వెంటది వెంట తమ ప్రభుత్వాల ద్వారా అనువాదాలు తీసుకురావాలి. అలాగే తెలుగు, తమిళ, బెంగాళి, గుజరాతీ, కన్నడ, రాజస్థానీ, మరాఠీ, ఒరియా మొదలైన ప్రధాన భారతీయ భాషల్లో కూడా వీటిని అనువదించి సబ్సిడీ రేట్లపై కోట్లాది ప్రతులు ప్రజలకు చేరేట్టు చూడాలి.

బీసీల సాధికారికత కర్తవ్యాలు

నేటికీ బీసీలు జాతీయ రాజకీయాల్లో పూర్తిస్థాయి జాతీయ నాయకులుగా ఎదగలేదని చెప్పడమే సరియైనది. సమీప భవిష్యత్‌లో శూద్రుల దృక్పథంతో ఎదిగే జాతీయ నాయకత్వంగానీ, పార్టీ గానీ వస్తుందనే ఆశ కూడా కనుచూపు మేరలో లేదు. ఏమంటే చాలా మంది ప్రాంతీయ స్థాయిలోనైనా నెంబర్‌వన్‌గా ఎదగలేకపోయారు.

కొందరు శూద్రులు, ఓబీసీలు నెంబర్‌వన్‌గా ఎదిగి జాతీయ స్థాయికి చేరినప్పటికీ ప్రాంతీయ స్థాయి దృక్పథంతో ఆలోచించడమే అందుకు ప్రధాన కారణం. భాష, సంస్కృతి విషయంలో బీసీలు ఇంగ్లీషు, హిందీ భాషల్లో మాట్లాడుతూ మొత్తం దేశాన్ని సంబోధిస్తూ పర్యటించినప్పుడు వారికి ఈ స్థాయి వస్తుంది. శూద్ర అగ్రకులాలు కూడా కేంద్రంలో నిలదొక్కుకోలేక పోతున్నాయి.

న్యాయవ్యవస్థ, పరిపాలనా యంత్రాంగం చాలా బలమైనవి. వీటిలో బ్రాహ్మణీయ శక్తులు తిష్టవేసాయి. ప్రతిదాన్నీ తమకనుకూలంగా లేకపోతే వ్యతిరేకిస్తాయి. బ్రాహ్మణీయ రాజకీయ శక్తులు, ప్రభుత్వ ఉన్నత అధికార శక్తులు, పారిశ్రామిక వేత్తలు కలిసి శూద్ర అగ్రకులాలు, బీసీ కులాలు కేంద్రంలో అధికారంలోకి రాకుండా చూస్తున్నాయి. పార్టీలకు అతీతంగా ఈ శక్తులు లాబీలుగా పనిచేస్తున్నాయి.

కేంద్రంలో శూద్రుల సాధికారికత

అందువల్ల బీసీలు, ఎస్సీలు మాత్రమే కాకుండా శూద్రులు అందరూ కలిసి సాగినప్పుడే జాతీయ రాజకీయాల్లో శూద్ర అగ్రకులాలు, బీసీలు, ఎస్సీలు తమ సామాజిక వర్గాల నిజమైన ప్రతినిధులుగా సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా కదలాలి. ఆయా రాష్ట్రాలల్లో అధికారంలోకి వస్తున్న శూద్ర అగ్రకులాలు, శూద్ర బీసీ కులాలు, దళిత కులాలు జాతీయ స్థాయిలో ఎదిగే కృషి చేయాలి.

తాము ఇలా ఒక మెట్టు పైకి ఎక్కుతూ శూద్ర అగ్ర కులాలు ప్రాంతీయ స్థాయిలో బీసీలను, బీసీ కులాలు ప్రాంతీయ స్థాయిలో దళితులను, దళితులు అధికారంలో ఉన్నచోట ఒక మెట్టు పైకి జాతీయ స్థాయిలోకి వెళ్ళి ప్రాంతీయ స్థాయిలో బీసీలను అధికారంలోకి ఆహ్వానిస్తూ సామాజిక వర్గాల మధ్య రాజకీయ అధికార పంపిణీలో, పారిశ్రామిక, ఉద్యోగ, తదితర రంగాల్లో జనాభా నిష్పత్తి అనుసరించి ఎదగడంలో సౌజన్య పూరితంగా ముందుకు కదలాలి.

సామాజిక వర్గాలు మెట్టు మెట్టుగా అన్ని రంగాల్లో ప్రాంతీయ స్థాయి నుండి జాతీయ స్థాయి దాకా ఎదగడానికి, శూద్ర అగ్ర కులాలు, బీసీ, ఎస్సీలు, ముస్లింలు ఒక్కటై కేంద్రంలో అధికారంలోకి రావడానికి ప్రణాళికా బద్ధంగా కనీసం 15 ఏళ్ళ పాటు కృషి చేయడం అవసరం.

బీసీ ఎస్సీల సాధికారికత కర్తవ్యాలు

ఇటీవల అగ్రకులాల పార్టీల్లో బీసీ, ఎస్సీ నాయకులుగా కొనసాగుతున్న వాళ్లు తాము వచ్చిన సామాజిక వర్గాలకు ఏమి మేలు చేసారని యువతరం ప్రశ్నించడం పెరిగింది. లెక్కలు తీయడం మొదలెట్టారు.

అయితే ఎవరిగురించైనా ఆశగా ఉత్సాహంగా చెప్పుకోవడానికి అంటూ ఏమీ లేదు. పైగా చాలామంది పనికిరాని పదవుల్లో ఉత్సవ విగ్రహాల్లా కొనసాగుతున్నారు. మూల విగ్రహాలు అగ్రకులాలవే. నిజానికి జాతీయ ఉద్యమ కాలం నుండి అన్ని కులాలు ఉద్యమాలు చేస్తున్నాయి. అన్ని కులాల నుండి నాయకత్వం కూడా ఎదిగింది. కానీ ఒక దశ దాటాక అగ్ర కులాల నాయకత్వం ముందుకు పోతూ బీసీ ఎస్సీల నాయకత్వం ఆగిపోతున్నది. ఇలా దశాబ్దాలుగా ఎందుకు జరుగుతున్నదో సమీక్షించుకోవడం అవసరం. ప్రధానంగా కమ్యూనికేషన్స్ స్కిల్స్, నాయకత్వంలో పోటీ పడే సంఘర్షణలో ఎలా ముందుకు సాగాలో తెలుసుకోవడం అవసరం.

కొందరికి వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ ప్రత్యేక గౌరవాలను, సాంఘిక అంతస్తులను ఇచ్చింది. దాని వల్ల వాళ్ళు అయాచితంగా ఎదిగే అవకాశాలు వుండటం వల్ల అన్ని రంగాల్లో ఆ ప్రత్యేక మార్కులతో ఇతరుల కన్నా అదనంగా అర్హతలున్నట్లు కనబడటం ద్వారా అన్ని స్థాయిల్లో ఉన్నత స్థాయికి వెళ్ళడం సాధ్యపడుతున్నది.

కమ్యూనికేషన్ స్కిల్స్

బీసీ, ఎస్సీ నాయకులు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో వెనుకబడి వున్నారు. అగ్రకులాల్లాగ అహంకారాన్ని ప్రదర్శించనవసరం లేదు. కానీ అగ్రకులాల్లాగ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవడం అవసరం. లోప్రొఫైయిల్ అనగా ఉన్నదాని కన్నా తక్కువగా కనిపించే తీరు వల్ల బీసీ ఎస్సీలు చాలా నష్టపోతున్నారు. కొంత మంది ఉన్నదాని కన్నా ఎక్కువ ప్రదర్శించి అహంకారులుగా ముద్రపడి నష్టపోతున్నారు. ఈ రెండూ సరిచేసుకోవాలి. ఇటీవల ఒక భారతదేశ ప్రజాప్రతినిధి నెల రోజుల పాటు హాస్పటల్‌లో వుండాల్సి వచ్చింది. ఆ విషయం ఆయన ఇంటికి వచ్చాక చాలా మందికి తెలిసింది.

సమీకరణలు సాధికారికత

అలాగే ఒక ఎమ్మెల్యే పోటీదారు 75 వేలు ఓట్లు సాధించి కొద్దిలో ఓడిపోయిన నాయకుడు తన తల్లి చనిపోతే ఎవరికీ తెలియదు. ఎవ్వరూ ఫోన్‌చేసి దాన్ని తెలుపలేదు. తెలిపితే వీలుచేసుకుని పలకరిస్తారు. ఆ సందర్భంగా మానవసంబంధాలు పెరుగుతాయి. ఎవరు ఆత్మీయులు దగ్గరగా ఫీలవుతున్నారో కూడా ఇలాంటి సందర్భాలు గీటురాయిగా పనిచేస్తాయి.

పెళ్లిల్లు ఇలాంటి గీటురాయిగా పనిచేయవు. పెళ్లిల్లు సమీకరణ శక్తిని తెలుపుతాయి. సంబంధాలను తెలుపుతాయి. చావులు, హాస్పటల్‌లో వుండటం అనే సందర్భాల్లో కలిసేవారు ఎవరు ఆత్మీయులో అనే మానవీయ సంబంధాలను తెలుపుతాయి. పత్రికల్లో ఈ విషయాలు వార్తగా తెలిసినప్పుడే కమ్యూనికేషన్‌లో అతడు నాయకుడుగా ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సరిగ్గా ఎప్పటికప్పుడు తెలుస్తున్నట్టు లెక్క.

ఇటీవల ఒక యువ మిత్రుడు ఉత్సాహంగా వుంటే అతని శ్రీమతి కాస్త ముభావంగా కనిపించింది. తరువాత తెలిసిందేమంటే వాళ్ళకి యాక్సిడెంట్ జరిగిందని అతని శ్రీమతికి చేయి నాలుగు ముక్కలుగా విరిగి అతుకున్నాయని కాళ్ళు చేతులు బాగా దెబ్బతిన్నాయని కుటుంబం మొత్తం యాక్సిడెంట్‌లోనుంచి గాయాలతో ప్రాణాపాయం నుండి బతికి బయట పడిందని తెలిసింది. వాళ్లిద్దరూ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో సుప్రసిద్ధులు. వాళ్ళే ఈ విషయం సన్నిహితులకు తెలుపుకోలేకపోయారు. ఇలా లోప్రొఫైల్ అనేక విషయాల్లో కొనసాగుతూ వుంటుంది. బీసీ ఎస్సీలు

నాయకులుగా ఎదగడానికి కమ్యూనికేషన్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్కిల్స్, లీడర్‌షిప్ స్కిల్స్ ఇతర నాయకులను పరిశీలించడం ద్వారా అలర్చుకోవడం అవసరం.

ప్రతి సందర్భం సాధికారికత

జీవితంలోని ప్రతి సందర్భం కూడా రాజకీయ సమీకరణకు, రాజకీయ రంగానికి, సాధికారికతకు అవకాశం ఇస్తుంది. దానిని గమనించడం అవసరం. అలా తీర్చిదిద్దుకోవడం కూడా అవసరం. ఒక మేధావిని, పెద్దాయనని పలకరించడం కోసం వెళ్ళాల్సిన సందర్భంలో పది మందిని వెంటేసుకుని వెళ్ళినప్పుడు నాయకుడుగా గౌరవ ప్రదంగా కనబడుతుంది. అలాంటి సందర్భాల్లో కలసిన మిగతా అందర్నీ పేరు పేరునా పలకరిస్తే ఏ పార్టీవారైనా, రాజకీయాల్లో వున్నా లేకున్నా ఎంతో పులకరించిపోతారు. అక్కడ రాజకీయాలు మాట్లాడనక్కర లేకుండానే మానవీయ ఆత్మీయత ద్వారా ఒక అనుబంధం, సంబంధం ఏర్పడుతుంది. ఇలాంటి సంఘటనలు, సన్నివేశాలు, సందర్భాలు ప్రతినిత్యం రాజకీయనాయకులకు ఎదురవుతూనే వుంటాయి. ఉదాహరణకు ఒక యాక్సిడెంట్ జరిగిందని తెలవగానే అక్కడికి సహచర అనుచర బృందంతో కలసి వెళ్ళి పోలీసులతో, డాక్టర్లతో, బంధుమిత్రులతో మాట్లాడితే అది వారికి ఎంతో ధైర్యాన్ని ఇస్తుంది. జీవితం అంతా గుర్తుంచుకుంటారు. అది వార్తగా కూడా ప్రాచుర్యం పొందుతుంది. బాధితులకు కాస్త మెరుగైన సేవలు అందుతాయి.

అలుగుడు కుండలు సాధికారికత

కొంత మంది బీసీ ఎస్సీ నాయకులు ఇలాంటి సందర్భాలలో పిలువలేదు గదా అని వూరకుండి పోతుంటారు. అలాంటి ఇన్‌ఫియారిటీ నుండి బయటపడాలి. కొన్ని సమావేశాలకు ఆహ్వానం లేదని, లేదా ప్రొటోకాల్ పాటించలేదని వెల్లడానికి నిరాకరిస్తారు. అలాంటి సందర్భాలు ప్రజలను కలవడం కోసం, అక్కడికి వచ్చినవారిని కలవడం కోసం అవసరమని అనిపిస్తే తప్పకుండా వెళ్ళాల్సిందే. సాధికారికతలో ఇదొక ముఖ్యాంశం. మిమ్మల్ని పిలవలేదని ఎవ్వరూ అనుకోరు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల వారికి చేరకపోయి వుండవచ్చు. కావాలని కూడా పిలవకపోవచ్చు.

అయినా వెళ్ళాలి. మొదటివరసల్లో కూర్చోవాలి. తన సహచరులు, అనుచరులు ఆ సభలో తమ నాయకున్ని పిలిచేట్టు చేసుకోవాలి. ఆ నాయకుని నాయకత్వం వర్థిల్లాలని నినాదాలు చేయడం ద్వారా కూడా అస్థిత్వాన్ని ప్రదర్శించుకుంటారు. ఇలాంటివి ఎన్నో రకాల కమ్యూనికేషన్స్ స్కిల్స్ ఆచరణలో వున్నాయి. వాటిని తాము

ఉపయోగించుకోవడం రావాలి. పని చెప్పే పద్ధతిలో అధికారం కన్నా ఆత్మీయత, తప్పించుకోలేని విధంగా తప్పనిసరిగా పనిచేసే విధంగా మాటతీరు, అప్రోచ్ అలవర్చుకోవాలి. ఇటీవల ఏపదవి లేకుండానే సీనియర్ నాయకుడుగా మారిన నాయకుడు అవకాశం వచ్చినప్పుడు మాట్లాడిన తీరు అతనికి ఇన్నాళ్ళూ ఏపదవి ఇవ్వకపోవడమే మంచిదైంది అనుకునే స్థాయిలో గర్వాన్ని ఆధిక్యతను ప్రదర్శించారు. పాత దొరల పద్ధతిలో వ్యవహరించడాన్ని వెనుకబడిన నాయకులు సవరించుకోకపోతే తిరిగి రెండవ సారి కూడా నష్టపోతారు.

సంఘర్షణ సాధికారికత

సాధికారికత ఊరకే రాదు. సంఘర్షణ చాలా ఉంటుంది. చాలా సందర్భాల్లో నాయకత్వంలో బీసీ, ఎస్సీలు పోటీలో సంఘర్షణ భరించలేక తప్పుకుంటున్నారు. ఇతర రంగాల్లోకి మళ్లుతున్నారు. తానున్న స్థానంలో సంతృప్తిపడుతున్నారు. అక్కడనుంచి కూడా యువనాయకత్వం వచ్చి వెనక్కి నెట్టి వేస్తున్నారు. అలా వెనక్కు నెట్టే వారిలో ఇతర కులాలతోపాటు బీసీ, ఎస్సీ యువకులు కూడా ఉంటున్నారు. వాళ్లు తాము ఎదగడానికి పదోన్నతి పొందకుండా అదే స్థానంలో స్థిరపడి పోయిన వాళ్ల వల్లే తమకు ఆయా స్థానాలు దక్కడంలేదని భావిస్తూ సీనియర్ నాయకత్వాన్ని వ్యతిరేకించాల్సిన అనివార్యత ఏర్పడుతున్నది. తద్వారా అగ్ర కులాలపై కలిసి యుద్ధం చేయాల్సినవాళ్లు వారి ఆసరాతో పరస్పరం తలపడాల్సిన దుస్థితిలో కూరుకు పోతున్నారు.

దీనివల్ల అగ్రకుల నాయకత్వం హాయిగా పైపైకి వెళ్లి పోతున్నది. ఒక తహసిల్దార్ శాఖా పరమైన పరీక్షలు ఉత్తీర్ణుడు కాకపోయినందువల్ల ఆర్డీఓగా, డిప్యూటీ కలక్టరుగా పదోన్నతి పొందకపోవడంవల్ల అతని జూనియర్లు తహసిల్దార్ పదవిని పొందకుండా మిగిలిపోతున్నారు. వారి ప్రమోషనుకు అడ్డంకిగా ఉన్నారని సీనియర్లను అవినీతి కేసుల్లో ఇరికించి సస్పెండు అయ్యేలా చూసి ఆ ప్రమోషన్లు చేజిక్కించుకుంటున్నారు. సరిగ్గా రాజకీయాల్లో కూడా ఇలాగే జరుగుతున్నది.

పోటీపడకపోతే ఆగిపోతారు

అందువల్ల ప్రమోషన్ పొందాల్సిన వాళ్లు కృషి చేయకుంటే, పోటీ పడకుంటే తరువాతి వారు కూడా వారిని మరింత వెనక్కు నెట్టి వేస్తారు. ఒకాయన జీవితమంతా నిజాయితీగా ఉద్యోగం చేసారు. మామూళ్లివ్వ నందున ప్రమోషన్లన్నీ ఆగిపోయాయి.

అనుకూలమైన చోట అవకాశమున్నా దూర ప్రాంతానికి బదిలీ చేయబడ్డాడు. అన్నీ ఓర్చుకున్నారు. చివరకు భార్యా బిడ్డలు కూడా అతన్ని ఏవగించుకున్నారు. అనేక ప్రాంతాలు తిరిగినందున ఆరోగ్యం కూడ దెబ్బతింది. చివరకు చేసేదిలేక జీవన సాయం సంధ్యలో మూమూళ్లు సమర్పించుకుని అనుకూలమైన చోటకు బదిలీ చేయించుకున్నాడు.

ఆఖరికి నిజాయితీపరుడు సాధికారికత...

అతనితో పాటు ఉద్యోగానికి ఎక్కిన మిత్రుడు జిల్లా అధికారిగా పదోన్నతిపై పని చేస్తున్నాడు. అతనికింద ఇతడు ఆఫీస్ సూపరింటెండెంటుగా పని చేస్తున్నాడు. ఈమామూళ్లు అప్పుడే ఇచ్చి ఉంటే నాకన్నా నెలముందు అన్ని ప్రమోషన్లు కొట్టి నాలాగ జిల్లా అధికారివయ్యుండేవాడివి కదా! నీ నిజాయితీ దేనికి పనికొచ్చింది అని అడిగాడు. అతని వద్ద జవాబు లేక పోయింది.

రాజకీయాల్లో డబ్బు ఖర్చు పెట్టి, మాయ చేసి గెలిచాడని విమర్శించే వాళ్లు కూడా గెలవాలంటే అదేపని చేయక తప్పదు. ఐతే ఈ నీతి సూత్రాలు అతని అభివృద్ధిని పదోన్నతిని 20 ఏళ్లు వెనక్కునెట్టేసరికి 15 వేల రూపాయిలు ఖర్చుతో గెలిచి సీనియర్ కావలిసినవాడు, 15 లక్షలు ఖర్చు చేస్తే తప్ప గెలువలేని స్థితిలో పోటీలో నిలబడాల్సి వచ్చింది. యువకులు తమకు అవకాశం రాకుండా పదవీ వ్యామోహంతో తానే పోటీచేస్తున్నాడని ఓడించాలని పిలుపునిచ్చారు. ఆయన ఓడిపోయాడు. అలా అవకాశాలు ఆలస్యంగా అందుకుంటే దోస్తులే శత్రువులౌతారు. దశాబ్దాలుగా బీసీ, ఎస్సీ నాయకత్వం వెనకబడి పోవడానికి ఇదొక ముఖ్య కారణం. ఎదిగిన బీసీ, ఎస్సీ నాయకత్వం యువతరానికి ఆసరా ఇవ్వలేక పోవడం మరో ప్రధాన కారణం. వాళ్లే ఇతరులపై ఆధారపడి ఎదిగిన వాళ్లు. వాళ్లకు వాళ్లే బరువు. ఇతరులను ఎలా ప్రోత్సహించగలరు? బీసీ, ఎస్సీల పేరు చెప్పుకుని గెలిచి వాళ్లకు చేసిందేమిటని విమర్శల పాలౌతుంటారు. అలా బడుగు వర్గాల నాయకులుగా వారికి చేసిందేమిటో చెప్పుకోవడానికేమీ మిగలదు.

ఇలా అగ్రకులాల పార్టీలో చేరి బీసీ, ఎస్సీల నాయకులుగా ఎదిగిన వారి గతి ఇలా సాగుతున్నది. బీసీ, ఎస్సీలు తాముగా సొంతపార్టీ ఏర్పరుచుకుని తామే నిర్ణేతలుగా ఎదగడం అవసరం. అప్పుడే స్వేచ్ఛ గా నాయకులుగా అగ్రకులాలతో పోటీ పడి నిలిచి గెలిచే సత్తా ఉంటుంది. ఇందుకు కావలిసినది ఆత్మవిశ్వాసం. పది మందిని కూడ గట్టే, మెప్పించే, ఆకట్టుకునే బలం ఏర్పడుతుంది.

శూద్రులు రాజ్యాధికారం కోటలోకి చొరబడి కోట తలుపులు తెరవాలి

పూర్వం రాజ్యాలు, రాజులు, కోటలు కేంద్రంగా నడిచేవి. రాజులు కోటలు దుర్గాలు నిర్మించుకునేవారు. కోటల్లో రాజు, మంత్రి, సైన్యం, పరివార సమేతంగా కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లతో జీవించేవారు. రాజ్యాన్ని జయించాలనుకుంటే కోటను స్వాధీనం చేసుకోవాలి.

కోటలోకి వెళ్ళాలంటే చూట్టూ కందకం ఉంటుంది. కందకంలో నీల్లుంటాయి. నీళ్ళల్లో మొసళ్ళుంటాయి. కాళ్ళకు చుట్టుకునే తీగలుంటాయి. కోట బురుజుల మీద సైనికులు కాపలా కాస్తుంటారు. కోటలోకి ప్రవేశించడం అంత సులభం కాదు. శివాజీ ఎన్నో కోటలను జయించారు. అతని దగ్గర ఒక శిక్షణ ఇచ్చిన ఉడుము ఉండేది. ఉడుముకు బలమైన తాడు కట్టి కోట గోడకు విసిరేవారు. ఉడుము ఆ కోట గోడను గట్టిగా పట్టుకునేది. ఆ తాడును పట్టుకొని కోటలోకి వెళ్ళే ప్రయత్నం చేసేవారు. కోటకు కాపలా ఉన్నవాళ్ళు అలా వచ్చేవారిపై ఈటెలు విసిరేవారు. సలసల కాగే నూనె కుమ్మరించేవారు. కత్తులు విసిరేవారు. వెయ్యి కత్తిపోట్లకు జడవకుండా ఆ తాడు పట్టుకొని కందకం మీదుగా కోటపైకి చేరే ప్రయత్నం చేసేవారు. ఎంతోమంది జారి గాయాలై కిందపడిపోయేవారు. కొందరు కోట గోడపైకి చేరేవారు. అక్కడ సైనికులు లోపలికి రాకుండా ఎదిరిస్తుంటారు. మరికొన్ని తాళ్ళు

వేసి మరికొందరు తాడుపట్టుకొని వస్తూ వుంటారు. కోటలోపలికి చేరినవారిపై కోటలోనివాళ్ళు యుద్ధం చేస్తారు. చంపేసే ప్రయత్నం చేస్తారు. అలా యుద్ధం చేస్తూ చేస్తూనే కోట తలుపులు తీయడానికి ముందుకు సాగుతారు. కోట తలుపులు తీస్తే బయట ఉన్న తమ సైన్యం లోపలికి వస్తుంది. లోపల ఉన్న సైన్యంతో యుద్ధం చేస్తారు. రాజు, మంత్రి, సైన్యాధ్యక్షుడు కూడా యుద్ధంలోకి దిగుతారు. ఓడిపోయే స్థితి ఉంటే రహస్య మార్గాల గుండా భూగర్భ సొరంగాల నుండి పారిపోతారు. కోట వెలుపలి నుండి లోపలికి వచ్చినవారు కోటలో ఉన్న రాజు, మంత్రి, సైన్యాధ్యక్షుడిని చంపేస్తారు. శరణు కోరితే కొందరిని చంపకుండా జైళ్ళో పెడతారు. చిన్న ఉద్యోగులను కూడా తొలగిస్తారు. శరణు కోరితే కొంత మందిని తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

కోటలోకి చొరబడ్డ శివాజీ కోటల్ని ధ్వంసం చేశాడు. కోటలోకి చొరబడ్డాక కోట తలుపులు తీశాడు. ఎందరో రాజులు పారిపోయారు. చనిపోయారు. అలా కోటలను జయిస్తూ వచ్చాడు. ఔరంగజేబు కూడా ఇలాగే సైన్యాన్ని పంపి రాజ్యాలను కోటలను జయిస్తూ వచ్చాడు. సామ్రాజ్యాన్ని ఏర్పర్చుకున్నాడు. శరణు చొచ్చిన వారిని కొందరిని సామంతరాజులుగా పెట్టుకున్నాడు. కొన్ని చోట్లో సుబేదారులను సామంత రాజులుగా నియమించారు.

రాజ్యాధికారాన్ని అందుకోవడం కోసం నిరంతరం కోటలోపల కూడా ఎత్తులకు పై ఎత్తులు సాగుతూ ఉంటాయి. మంత్రి సైన్యాధ్యక్షులు తిరుగుబాటు చేసి రాజును చంపి లేదా బంధించి వాళ్ళే రాజులు కావడానికి చూస్తూ ఉంటారు. విష ప్రయోగం కూడా చేస్తూ ఉంటారు. ఎంత నమ్మకం కలిగిన రాజస్థాన పరివారం కూడా నమ్మడానికి లేదు. రాజు నిరంతరం అందరిపట్ల జాగరూకుడై ఉంటాడు. ఎప్పుడు ఎటువైపు నుండి కుట్ర జరిగినా, దాడి జరిగినా ఎదుర్కొనే స్థైర్యాన్ని, ధైర్యాన్ని నమ్మకస్తులను ఆంతరంగికంగా చివరకు మంత్రికి సైన్యాధ్యక్షునికి కూడా తెలియకుండా కలిగి ఉంటాడు.

అలాగే కోట వెలుపల ఉన్నవారు కోటలో ఉన్నవారిని సంప్రదిస్తారు. పరస్పర ప్రయోజనాల ఒప్పందాలు చేసుకుంటారు. అలా ఒప్పందంతో కోటలోపలికి చేరి రాజును పదవీభ్రష్టుల్ని చేస్తారు. అటు తరువాత ఎవరిబలం ఉంటే వాళ్ళే రాజుగా ప్రకటించుకుంటారు. కోటవెలుపలివారిని కోటలోపలివారు రాజును జయించిన సైన్యాధ్యక్షుడు చంపేయవచ్చు లేదా ఆ సైన్యాధ్యక్షున్నే కోట వెలుపలి నుంచి వచ్చిన వారు చంపేయవచ్చు. రాజకీయాల్లో రాజ్యాధికారంలో ఏదైనా సాధ్యమే కృష్ణుడే

భగవద్గీతలో అర్జునుడికి రాజ్యాధికారం కోసం అన్నదమ్ములు, గురువులు, బంధువులు, ప్రజలు అంటూ ఏదీ చూడకుండా యుద్ధం చేయి చంపు, లేదా చావు ఏదైనా విజయమే అంటూ భగవద్గీత బోధించాడు. కౌటిల్యుడు అర్థశాస్త్రం రాసాడు. కౌటిల్యుని అర్థశాస్త్రం వచ్చాక చాలా రోజులకు భగవద్గీత రాసారని చరిత్రకారుల అభిప్రాయం. భగవద్గీత, కౌటిల్యుని అర్థశాస్త్రం, మనుస్మృతి, నారదస్మృతి, శుక్రనీతిసారం మొదలైనవి వెనుకటి కాలంలో రాజ్యాధికారం ఎలా సాధించాలో సాధించుకున్న రాజ్యాధికారాన్ని ఎలా నిలుపుకోవాలో రాజ్యాధికారం నిలుపుకుంటూ ఎలా పరిపాలన చేయాలో ఎంతో చక్కగా వివరించారు.

రాజ్యాధికారం అనేది ఒక కోట వంటిది. ఆ కోటలో ఎప్పుడూ ఎవరో ఒకరు అధికారంలో ఉంటూనే ఉంటారు. వారి మంత్రి సైన్య పటాలం ఎప్పుడూ కోటలో రక్షణ కాపలా కాస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు మంత్రాంగం సూచనలు చేస్తూ ఉంటారు. వ్యూహం ఎత్తుగడలు మార్చుతూ ఉంటారు. కోటలోకి ఇతరులు అధికారం కోసం రాకుండా నిరంతరం చర్యలు తీసుకుంటూ ఉంటారు. అలా రాజులు, చక్రవర్తులు వంశపారంపర్యంగా 200 ఏళ్ళ నుండి 400 ఏళ్ళ దాకా తరాల తరబడి వారి వంశ పారంపర్య పరిపాలన కొనసాగించారు. కూల్చివేసినప్పుడే ఆ రాజ్యాలు కూలిపోతాయి.

కోటలోకి చొరబడకుండా రాజ్యాధికారం సాధ్యం కాదు

రాజరికాల కాలంలో రాజ్యాధికారం రక్తసిక్త రహదారుల గుండా అందుకోవడం జరిగింది. ఇప్పుడు రూపాలు మారాయి. సారం కొనసాగుతున్నది. కానీ రాజ్యాధికారం అనే కోట అలాగే కొనసాగుతున్నది. ఫిరంగిగుండ్లు, తుపాకులు, విమానాలు కనుక్కున్న తరువాత కోటలు పనికిరానివైపోయాయి. కోటలో దాగుంటే అధికారం నిలుస్తుంది అనేది ఏమీ లేదు. కోటను ఆకాశంనుంచి కూడా దాడి చేసి ఆక్రమించవచ్చు. అలా కోటల నిర్మాణం కాలం తీరిపోయింది. కానీ రాజ్యాధికారం కోసం కోటలు అలాగే కనిపించకుండా కొనసాగుతూనే ఉన్నాయి.

రాజ్యాధికారం అనే కోటలో నీవు ప్రవేశించాలనుకుంటే కోట వెలుపల నుండి ఏమీ సాధించలేవు. కోటలోకి చొరబడకుండా రాజ్యాధికారం సాధ్యం కాదు. కోటలోపలికి చొరబడాలంటే మధ్యలో కందకం ఉంటుంది. కోట తలుపులు మూసి ఉంటాయి. కోట బురుజుపై సైనికులు పహారా కాస్తుంటారు. ఉడుము పట్టుతో కోటకు తాడు విసిరి ఉడుము ఆధారంగా కోటలోపలికి ప్రవేశించే ప్రయత్నం చేస్తుంటే

ఈటెలు బళ్ళాల దెబ్బలు, గాయాలు అవుతూనే ఉంటాయి. ఓర్చుకోక తప్పదు. రక్తం కారుతూనే ఉంటుంది. ఏడ్వడానికి కూడా సమయం ఉండదు. సలసల కాగే నూనెను పై నుండి పోస్తూ ఉంటారు. నూనె బారిన పడకుండా కదులుతూ ఉండాలి. నీవు ఒక్కడివి సర్పంచ్‌గానో, ఎమ్మెల్యేగానో ఇన్ని కష్టాలు పడి ఎన్నికై రాజ్యాధికారం కోటలోకి ప్రవేశిస్తావు. కోటలో ప్రవేశించిన తరువాత కోటలో యుద్ధం జరుగుతుంది. కోటలో ఉన్నవారిని శరణుజొచ్చి కాళ్ళు పట్టుకుంటే తన ఆస్థానంలో చిన్నదో పెద్దదో పదవి ఇస్తారు. మంత్రిని చేస్తారు. రాముడికి ఆంజనేయుడి లాగా రామభజన చేసుకుంటూ కోటలోపలి రాజుకు సేవచేస్తే విభీషనుడిలాగా రాజ్యాధికారంలో కాస్త వాటా ఇస్తారు. వారి కనుసన్నల్లో చక్కగా బతకవచ్చు.

కొందరు కోటలోపలికి వెళ్ళాక కోట తలుపులు తీసి తన సైన్యాన్ని కోటలోపలికి ప్రవేశపెట్టడం మరచిపోతారు. కోటతలుపులు తీయకుండా కోటలోపలికి చేరిన వారికి పంచ మకారాలతో భోగభాగ్యాలు అందిస్తారు. కోట తలుపులు తీసినవారే కోటలోపల రాజ్యాధికారం సాధిస్తారు. తన సైన్యాన్ని కోటలోపలికి వచ్చేట్టుగా కోట తలుపులు తీసినప్పుడే అతను విజయం సాధిస్తాడు. లేదా అతని బలం పెరుగుతుంది.

ఇలా మహ్మదీయ, హిందూ రాజుల, చక్రవర్తుల కోటలో కొందరు పాగా వేశారు. తమ వారికి కోట తలుపులు తీశారు. బ్రిటిష్ వాళ్ళు కోటలోపల ఉన్న రాజులను, మంత్రులను, సైన్యాన్ని ఎవ్వరిది వారికి చెప్పి కోటలోకి ప్రవేశించారు. కోటలోనివారిని లోబర్చుకున్నారు. చిన్నవారిని ప్రమోట్ చేశారు. పెద్దవారు కూలిపోయారు. చిన్నవారిని ఆ తరువాత కూల్చివేశారు. చిన్నవారు తనమీద ఆధారపడేటట్టు చేసుకున్నారు. తన సైన్యం (తన ఓటు బ్యాంకు) తనది తాను నిరంతరం పెంచుకున్నారు. తన సైన్యాన్ని కిరాయికి ఇచ్చారు. ఒకసారి వారికి ఒకసారి వీరికి కిరాయికి ఇచ్చారు. ఇద్దరి సైన్యాలు నశించాయి. బ్రిటిష్‌వారి సైన్యాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. బ్రిటిష్‌వారు భారతదేశాన్ని జయించారు. రాజ్యాధికారం కోటలో పాగా వేశారు. కోటలో ఉన్న రాజులందరినీ సామంతరాజులుగా బతకవచ్చు అని ఔదార్యం చూపారు. సరిగ్గా ఓటు బ్యాంకు సమకూర్చుకున్న వర్గాలు కూడా ఇలాగే రాజ్యాధికారం కోటలోకి ప్రవేశించి రాజులయ్యారు.

కొందరు బీసీలు ఎస్సీలు రాజ్యాధికారం కోటలో ప్రవేశించాక తమ సామాజిక వర్గాలకు రాజ్యాధికారం కోట తలుపులు తెరిచే బదులుగా కోట తలుపులు మూయడం చేశారు. తనకు పోటీ అవుతారని తాను కోటలో చేరాక ఇలా కోట తలుపులు

మూసేశారు. కోటలో ఉన్నవారి పాద సేవ చేసుకుంటూ బతికేశారు. తామే బిసి, ఎస్‌సిలకు ప్రతినిధులమని పలికారు. నమ్మించే ప్రయత్నం చేశారు. వాళ్ళు కోట తలుపులు మూసినవారే. కోటలో చేరినవారు ఎంత మంది తనవారిని కోటలో చేరడానికి తలుపులు తీస్తారో అంత మేరకే వారు ఆయా సామాజిక వర్గాలకు ప్రతినిధులు. రెడ్లు కోట తలుపులు తీసి 294 మంది శాసనసభ సీట్లకు 200 సీట్లు కెటాయించారు. అలాగే కమ్మలు కమ్మకులస్తులకు కోట తలుపులు తీసి సగానికి ఎక్కువ మంది రాజ్యాధికారంలోకి రావడానికి పార్టీ టిక్కెట్లు, బి. ఫారాలు, పార్టీ పదవులు ఇచ్చారు.

కాంగ్రెస్ కోట రాష్ట్రంలో రెడ్ల అధీనంలో ఉన్నది. టిడిపి కోట కమ్మల అధీనంలో ఉన్నది. బిజెపి కోట కమ్మ, వెలమ, వైశ్య, శూద్రుల అధీనంలో ఉన్నది. బి.ఎస్.పి కోట ఎస్‌సిల అధీనంలో ఉన్నది. టిఆర్ఎస్ కోట వెలమల అధీనంలో ఉన్నది. వాళ్ళు కోట తలుపులు తమ తమ సామాజిక వర్గాలకు తీస్తారు. మిగతావారు కోట మీద దాడి చేసి లోపలికి చొరబడతారు. చొరబడి నయానా భయానా స్థానం సాధిస్తారు. పాదసేవ చేయడానికి ఆంజనేయుడిగా పూజలందుకోవడానికి రామరాజుగారికి అభ్యంతరమేమీ ఉండదు.

కొందరు వీటన్నింటినీ అధ్యయనం చేశారు. ఆనాటి సైన్యానికి బదులుగా ఓటు బ్యాంకు సైన్యాన్ని పెంచకుంటూ వెళ్ళారు. ఓటు బ్యాంకును ఒకసారి వారికి ఒకసారి వీరికి సీట్ల ఒప్పందంలో భాగంగా సహకరించుకున్నారు. మూడవసారికి ఆ రెండు పక్షాలు బలహీనపడి ఈ మూడో పక్షం ఎదుగుతూ పోయింది. కోట వారిదైపోయింది. కోటలో రాజ్యం వారిదైపోయింది. 1967 నుండి దేశంలో రాజకీయ సమీకరణలు, పార్టీల బలాబలాలు ఈ సూత్రంతోనే అధికారంలోకి వచ్చాయి.

రాం భజన చేసే హన్మంతుల వల్ల శూద్రులకు రాజ్యాధికారం రాదు

ప్రజాస్వామ్యంలో కోటలు పోయాయి. కోటలు పోయినా కోటరీలు కొనసాగుతున్నాయి. కోటను జయించడానికి, కోటలో ప్రవేశించడానికి రూపాలు మారాయి. కానీ హింస రక్తపాతం, వెనక్కి నెట్టడం, పడదోయడం, చేతులు నరకడం, తల తీయడం అలాగే కొనసాగుతున్నాయి. ఇవన్నీ ప్రజాస్వామ్య పద్ధతుల్లో కొనసాగుతున్నాయి. మీడియా ద్వారా కొనసాగుతాయి. థాట్‌పోలిసింగ్ ద్వారా కొనసాగుతాయి. పార్టీ నిర్మాణం ద్వారా కొనసాగుతాయి. ఓటు బ్యాంకు ద్వారా కొనసాగుతాయి. బి ఫారాలు ఇవ్వడం ద్వారా కొనసాగుతాయి. బి.పారాలు ఇవ్వకుండా

నిరాకరించడం ద్వారా కొనసాగుతాయి. బి ఫారం నిరాకరించి ఏదో ఒక సంస్థకు లేదా పార్టీలో నామినేటెడ్ పోస్టు కెటాయిస్తారు. అలా సొంతబలం పెరగకుండా చేసి తమకు అనువుగా ఉండేవిధంగా ప్రమోషన్లు ఇస్తుంటారు. పెంచి పోషిస్తుంటారు. వీళ్ళంతా కోటలో రాజ్యాధికారంలో ఉన్నవారి ప్రయోజనాల కనువుగా బతుకుతున్న నాయకత్వమే.


ఆంధ్రప్రదేశ్ రాజ్యాధికార కోటలోంచి బ్రాహ్మణులను 1947 నుండి బయటకు పంపడం ప్రారంభించారు. 1917 నుండి మద్రాసు ప్రెసిడెన్సీ, హైదరాబాద్ రాజ్యంలలో రెడ్లు, కమ్మలు, కాపులు, వెలుమలు, ముస్లింలు కోట తలుపులు తీయడం ప్రారంభించారు. బ్రిటిష్‌వారి కోట తలుపులు తీసి మొదట బ్రాహ్మణులు చొరబడ్డారు. కాంగ్రెస్ సైన్యాన్ని, కాంగ్రెస్ కోటను తయారు చేసుకున్నారు. బ్రిటిష్‌వారి కోటను బ్రాహ్మణ కాంగ్రెస్ సైన్యం కైవసం చేసుకుంది. కోటలో కోటరీగా 1932 నుండి బ్రాహ్మణ రాజ్యాధికారం బ్రిటిష్‌వారి కోటలో ప్రవేశించింది. 1937లో బ్రిటిష్‌వారి కోటలో అధికారంలోకి కూడా వచ్చింది. ఇలా 1850 నుండి బ్రిటిష్‌వారి కోటలోకి ప్రవేశించిన బ్రాహ్మణులకు, కాంగ్రెస్ కోటకు, కాంగ్రెస్ సైన్యానికి తమ మొత్తం కోటలను బ్రిటిష్‌వారు అప్పగించి వెళ్ళిపోయారు. ఇలా కోటలో ప్రవేశించిన వారికే క్రమంగా పూర్తి స్థాయి రాజ్యాధికారం చేకూరుతుంది. కోటకు వెలుపల ఉండిపోయేవారికి ఎన్నడూ రాజ్యాధికారం రాదు. రాజ్యాధికారం రావాలంటే కోటలో ప్రవేశించక తప్పదు. కోటలో చాలా కాలం అలాగే ఉండిపోవాల్సి వస్తే కోటలోపలి రాజులకు అదును చూసి గెలిచేదాకా పాదసేవ చేయక తప్పదు. కోట తలుపులు నిరంతరం తమ సామాజిక వర్గాలకు తీసి లోనికి తీసుకోవడం చేసేవారే కోటలో క్రమంగా అధికారంలోకి వస్తారు. కోట తలుపులు మూసేవారు తమ సామాజిక వర్గాలకు నాయకులు కాదు. వారు వ్యక్తిగత నాయకులే. వారి ప్రయోజనం ఏదైనా కావచ్చు.

కోటలోపలికి చేరడం ఒక్కటే ముఖ్యం కాదు. కోటలోకి చేరాక కోట తలుపులు తీశాడా, కోట తలుపులు మూశాడా అనేదే అతను ఏ సామాజిక వర్గాలకు, ఏ లాబీలకు, ఏ కోటరీలకు ప్రతినిధో నిర్ణయిస్తుంది. అందువల్ల పుట్టుక ఒక్కటే నిర్ణయాక అంశం కాదు. కులం ఒక్కటే నిర్ణాయక అంశం కాదు. ఏ కులంలో పుట్టారనేది ఒక్కటే నిర్ణయాక అంశం కాదు. ఏ కులంలో పుట్టాలో అతను కోరకున్నది కాదు. అందువల్ల కులం రీత్యా ఎవరినీ ఆ కులానికి ప్రతినిధిగా చూడనవసరం లేదు. కోటలో ఎవరికి పీఠం వేశారు. కోట తలుపులు ఎవరికి తెరిచి ఉంచుతున్నారు,

ఎవరు లోపలికి రాకుండా కోట తలుపులు మూస్తున్నారు అనేదే వారు ఏ సామాజిక వర్గాలకు ప్రతినిధో వారు ఏ రాజ్యాధికారాన్ని చెలాయిస్తున్నారో నిర్ణయిస్తుంది.

చరిత్రలో క్షత్రియ రాజులంటూ ఎవరూ లేరు. శూద్రులు, ఆదివాసులు, అతి శూద్రులే వేల ఏళ్ళుగా కోటలోకి ప్రవేశించారు. రాజ్యాధికారం చెలాయించారు. కానీ కోట తలుపులు తీసినప్పుడు బ్రాహ్మణులు, వైశ్యులు కోటలోపలికి ప్రవేశించి శూద్రులు, అతిశూద్రులు కోటలోపలికి రాకుండా తలుపులు మూశారు. వంశ పారంపర్య పరిపాలన సాగడానికి కోటలోపల ఉన్న వాళ్ళు సహకరించే అంగీకారంతో కోటను పట్టుకున్న రాజులు రాజీపడిపోయారు. వారిని క్షత్రియులని కీర్తించారు. ప్రజలకు దూరం చేశారు. ఇప్పుడూ అదే జరుగుతున్నది.

శూద్రులు రాజ్యాధికారం కోటలోకి ప్రవేశించాలనుకుంటే ఇవన్నీ గడిచి ముందుకు సాగాలి. కోటలోకి నిచ్చెన వేయాలి. దారి వేయాలి. కోటలోకి చొరబడడానికి రహస్యంగా సొరంగాలు తీయాలి. కోటకు ఉడుముపట్టుతో తాడు విసిరి కోటలోకి ఎగబాకాలి. కోట తలుపులు తీయాలి. తనవారిని కోటలోపల విస్తృతంగా ప్రవేశపెట్టాలి. సుశిక్షితులైన సైనికుల్లాగా కోటలో ప్రవేశించిన వాళ్ళు కోటలోపలి వారిపై యుద్ధం చేయాలి. అంతర్గత సంఘర్షణ నిరంతరం సాగుతూనేఉంటుంది. కలిసి పనిచేస్తూనే రాజ్యాధికారం కలిసి పంచుకుంటూనే రాజ్యాధికారం కోటలో తన కోటాను, కోటరీని సైన్యాన్ని పెంచుకుంటూనే పోవాలి. అప్పుడే కోట శూద్రుల వశం అవుతుంది.



10

మహనీయులు



శైవమతానికి అధికార హోదా కల్పించిన పాల్కురికి

పాల్కురికి సోమనాథుడు కాకతీయుల కాలంలో జీవించిన మహాకవి. కాకతీయులు శైవమతాన్ని స్వీకరించడంతో శైవమతానికి అధికార హోదా లభించింది. కాకతీయులు తొలుత గిరిజనులు అని నేటి పదాల్లో చెప్పవచ్చు. అయితే ఆనాడు అలాంటి వర్గీకరణ లేదు. కాకతీయుల పూర్వీకులు ఎరుకలి, వడ్డెర, దొమ్మరి కులాల, కులవృత్తుల సమాజాలకు చెందిన వారు. ఎరుక రాజు, బేతరాజు, రాజ్యాలు ఏర్పర్చే క్రమంలో రాజ్యం ప్రశాంతంగా వుండాలని తొలుత జైన మతం స్వీకరించారు. కానీ ఉత్తరాది నుండి, ఇరుగుపొరుగు నుండి దాడులు, దండయాత్రలు పెరగడంతో యుద్ధానికి సన్నద్ధం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అందుకు జైనం తాత్వికంగా ఉపయోగపడే మతం కాదు. దాంతో రాజ్యఅవసరాల కోసం శైవం వీరశైవంగా కొత్త శక్తితో అభివృద్ధి పరిచి ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఏర్పడింది. శైవంలో వీరశైవం వీరరసాన్ని, భక్తివీరాన్ని ప్రధానం చేసింది. దేవుడికి సర్వం సమర్పించే తాత్వికతను ముందుకు తెచ్చింది. సైనికులు, ప్రజలు రాజ్యసంరక్షణ కోసం, రాజ్యవిస్తరణ కోసం తమ ఉత్పత్తులను,

---

వరంగల్ జిల్లా పాలకుర్తిలోని పాల్కురికి సోమన కళాపీఠం పురస్కారం. **1994**లో వర్తమానం దినపత్రిక, ఇతర పత్రికల్లో ప్రచురించడింది.

సంపదలను చివరకు తమ ప్రాణాలను కూడా సమర్పించుకోవాల్సిన అవసరాన్ని అనుసరించి అందుకనువుగా వీరశైవం ముందుకు వచ్చింది. శ్రీశైలం, వేములవాడ, కొమరవెల్లి, అలంపురం వంటి శైవక్షేత్రాలు తొలుత జైనక్షేత్రాలే. పాల్కురికి సోమన సాహిత్య సామాజిక రంగాల ద్వారా శైవమతానికి అధికార హోదా సాధించడంలో చేసిన కృషి అపారమైనది.

కర్నాటకలోని బిజ్జలుడనే రాజుకు మంత్రిగా ఉన్న బసవేశ్వరుడు వీరశైవమతం కోసం విస్తృత ప్రచారం గావించాడు. బౌద్ధం, జైనం, తాంత్రికమతం అంతరించిపోతున్న కాలంలో వీరశైవం విజృంభించింది. ఉత్తరాదినుండి దక్షిణాదికి విస్తరిస్తున్న ముస్లిం రాజుల దండయాత్రలు ఇస్లాం మతం, వర్ణవ్యవస్థను బలంగా ఢీకొంది. కాకతీయులు రాజ్యవిస్తరణకు ఇస్లాంను, ముస్లిం రాజులను ఎదుర్కోవటానికి రాజకీయంగా, మతపరంగా, తాత్వికంగా దేశీయ మతమైన శైవాన్ని వీరశైవంగా స్వీకరించడం అవసరమని భావించి జైనాన్ని వదులుకున్నారు. జైన గుళ్ళను, శైవ గుళ్లుగా మార్చడానికి పూనుకున్నారు. తెలంగాణ అంతటా కాకతీయ రాజ్యం విస్తరించిన పలు ప్రాంతాల్లో జైన ఆనవాళ్ళన్నీ వీరశైవాలయాలుగా రూపొందడం చూడవచ్చు. అలా కులాలుగా చీలి, అనైక్యతకు, అవమానానికి గురవుతున్న ప్రజలను సంఘటితపరచడం రాజకీయ అవసరంగా ముందుకొచ్చింది.

అంతర్గత, బాహ్యాశక్తులను ఎదిరించడం కోసం ప్రజల మధ్య మానసిక ఐక్యతకోసం వీరశైవం అవైదికమతంగా ప్రారంభమై బౌద్ధ, జైన తాంత్రిక మతాలకు ప్రత్యామ్నాయం అయి తర్వాతి కాలంలో సవైదికమతం అయింది. రాజుల రాజరిక పరిపాలనకు యధాతథ కొనసాగింపు కోసం భక్తిమతం ఎంతో అవసరం. దైవంపట్ల వీర భక్తి రాజరికం పట్ల ఇహలోక వీరభక్తిగా ప్రయోజనం యిస్తుంది.

వీరశైవం సామాజిక సిద్ధాంతంగా కులాలను, కులవివక్షతను వ్యతిరేకించింది. శైవాన్ని స్వీకరించిన ప్రజలందరూ సమానమే అని తాత్వీకరించింది. సహపంక్తి భోజనాలను ముందుకు తెచ్చింది. ఎన్ని సాంఘిక వ్యతిరేక కార్యకలాపాలు చేసినా శివున్ని పూజించినంతనే గౌరవనీయుడవుతాడని ప్రచారం చేశారు. వ్యభిచారులు, వేశ్యలు, దొంగలు, తాగుబోతులు, పంచమకారాలతో తాంత్రికవాదం పేరుతో వామాచారం పేరుతో కొనసాగుతున్న పౌరసమాజానికి పూర్వదశల సంస్కృతిని యధాతథంగా ఆమోదిస్తూ శివున్ని పూజించినంతనే వారంతా పవిత్రులవుతారని ప్రతిపాదించారు. బసివిని, పార్వతులను దేవాలయాల వద్ద గ్రామ లైంగిక అవసరాలను

తీర్చే వ్యవస్థలను ఏర్పాటు చేశారు. జోగిని, బసివి వంటి వేశ్యావృత్తిలోకి వీరశైవం దళితులను లాగింది. శతాబ్దాల తరబడి దళితులు, శూద్రులు అవమానాల పాలయ్యారు.

ఇవన్నీ అర్థం కావడానికి కేవలం మత దృష్టి చాలదు. ఆనాటి రాజకీయాలు, సామాజిక, వర్ణ, కుల వ్యవస్థలు వాటి లాభోక్తులు, స్వార్థాలు మతాల రూపంలో తమ ప్రయోజనాలను కొసాగించారు. అలా మతం పేరిట సామాజిక, రాజకీయ అవసరాలను అనుసరించి, పరిణామాలను అనుసరించి వీరశైవం అందరినీ కలుపుకొని ముందుకుసాగింది. పాల్కురికి సోమన వీరశైవాన్ని ప్రచారం చేస్తూ వీరశైవం తీసుకున్న భక్తుల జీవితాలను సంస్కృతినీ తన కావ్యాల్లో అపూర్వంగా చిత్రించాడు. గుణాఢ్యుని కథాసరిత్సాగరం, హాలుని గాథాసప్తశతి గ్రంథాల తర్వాత ప్రజల జీవితాలను చిత్రించిన మహాకవి పాల్కురికి సోమనే. పాల్కురికి సోమన రచనలను పరిశీలిస్తే ఆనాటి సామాజిక జీవితం, ప్రజల జీవితం, సంస్కృతి, ఆలోచనా విధానం కళ్ళకు కట్టినట్టు కనపడుతుంది.

పాల్కురికి సోమనాథుడు సామాజిక చరిత్రకు సాహిత్య గౌరవం కలిగించిన మహాకవి. అనువాదాలు వదిలితే తెలుగులో తొలి గ్రంథము బసవపురాణం. ప్రజలకు అర్థంకావడం కోసం ప్రజల పాటలకు దగ్గరై ద్విపద ఛందస్సులో జాను తెనుగులో రాసిన ప్రజాకవి సోమన. తెలుగునుండి కన్నడ, తమిళ, మరాఠీ, సంస్కృత భాషలలోకి అనువదించబడిన తొలిగ్రంథం కూడా బసవపురాణమే.

పాల్కురికి సోమనాథుడు క్రీ.శ. 1190 నుండి 1260 మధ్య జీవించాడని నిడదవోలు వెంకటరావు పేర్కొన్నారు.

పాల్కురికి సోమనాథుడు అనుభవసారం, బసవపురాణం, వృషాధిపశతకం, బిక్షరాంకగద్య, నమస్కార గద్య, శరణు బసవగద్య, అష్టోత్తర శతనామగద్య, సద్గురు రగడ, చతుర్వేద సారము, సంగీతారాధ్య చరిత్రము, మల్లమదేవి పురాణం వంటివి రచించాడు.

క్రీ.శ. 4వ శతాబ్దం నుండి 9వ శతాబ్దం దాకా దాదాపు 500 ఏండ్ల తెలుగుప్రాంత చరిత్ర చాలామేరకు ఇప్పటికి ఖాళీగా ఉంది. బలమైన రాజ్యాలులేని గణసమాజాలు, సమూహాల సమాజం కొనసాగడం వల్ల చరిత్ర ఖాళీగా కనపడుతున్నది బలమైన రాజ్యాల స్థాపన విస్తరణలో భాగంగా ఇస్లాం శైవం, వైష్ణవమతాల పుట్టుక వ్యాప్తి అనివార్యమైంది. నిర్దిష్ట సామాజిక రాజకీయ ఆర్థిక స్థితిగతుల్లో పుట్టినప్పటికి

ఆయా ఆధ్యాత్మిక, సామాజిక మత సిద్ధాంతాలు తాము పుట్టిన నిర్దిష్టతల నుండి లింకు తెంపుకుని స్వతంత్రంగా కనబడినపుడవి సార్వజనీన సిద్ధాంతాలుగా మతాలుగా కనబడుతాయి.

ఉదా॥ షిరిడి సాయిబాబా పుట్టిన చారిత్రక, సామాజిక ఆర్థిక నిర్దిష్ట చరిత్ర నుండి స్వతంత్రంగా కనపడ్డం ద్వారా ఆనాటి చారిత్రక వ్యక్తుల కన్నా గాంధికన్నా ఎక్కువ ప్రాచుర్యం పొందారు.

మతాలన్నీ ఆయా కాలాల నాటి సామాజిక సిద్ధాంతాలే. అవన్ని యిహలోక ఆచరణకు ఉద్దేశించినవే. రాజులు రాజ్యాధికారం ద్వారా అధికారం చెలాయిస్తే ద్విజులు మత, కర్మ, సంస్కృతి, సామాజిక, సాహిత్య సిద్ధాంతాల ద్వారా సమాజంపై అధికారం చెలాయించారు.

రాజవంశాలు మారినా ద్విజుల సామాజిక అధికారం మారలేదు. అది తొలగినప్పుడు పునఃస్థాపించడం కోసం పాతవో, కొత్తవో కలగలపో సామాజిక సిద్ధాంతాలను తాత్విక, మత, ఆధ్యాత్మిక రూపాల్లో ముందుకుతెచ్చారు. అలా బౌద్ధంతో కోల్పోయిన ఆధిక్యతను స్థాపించడానికి ఆదిశంకరుని అద్వైతం ముందుకు వచ్చింది. అటు తర్వాత శైవం, వీరశైవం వ్యాపించాయి.

పాల్కురికి సోమనాథుడు కులభేదాలు రూపుమాపాలని వీరశైవం ద్వారా ఆశించాడు. బసవేశ్వరుని కృషిని గురించి విని ఉప్పొంగిపోయాడు. శైవం స్వీకరించి లింగాధారణ చేసేవారందరూ సమానులే అనే సామాజిక సిద్ధాంతాన్ని వీరశైవం ప్రాచుర్యంలోకి తెచ్చింది.

బసవేశ్వరుని రాజకీయ, సాంఘిక సంస్కరణలు మతరూపంలో ముందుకు వచ్చాయి.

పండితారాధ్య చరిత్రలో పండితారాధ్యుడు వెలనాటి చోళుని సభలో జైన, బౌద్ధ, చార్వాకాది మతాలన్నింటిని జయించి సవైదిక వీరశైవ మతాన్ని ప్రచారం చేశాడు.

ఆ వాదనల్ని పాల్కురికి సోమనాథుడు సంస్కృత కావ్యమైన పండితారాధ్య చరిత్రలో తన పాండిత్యంతో అనుసృజించాడు.

ఇస్లాంలోని ఏకేశ్వరోపాసన దాని సామాజిక సిద్ధాంతాలు, సంస్కృతియే వీరశైవం రూపంలో కనబడుతాయి. దానిలాగే ప్రజలను యుద్ధానికి, త్యాగానికి

"నేను రాహిత్యానికి" సన్నద్ధులను చేయడానికి వీరశైవం, వైష్ణవం ఎంతో ఉపయోగపడినాయి. పరిపాలనకు రాజులు "నేను రాహిత్యాన్ని" స్వీకరించలేకపోయారు.

వీరశైవ ఉద్యమం బలహీనపడడంతో వీరశైవకులాలు ఏర్పడినాయి. అలా కులాల సంఖ్య మరింత పెరిగింది. కులవ్యవస్థ ద్వారా రూపొందిన ఉత్పత్తి శక్తులను ఉత్పత్తి సంబంధాలను, ఉత్పత్తి జ్ఞానాన్ని పంపిణీలను మానవ సంబంధాలను సమూలంగా మార్చే కృషి చేసిఉంటే కులాలు అంతర్ధానమై ఉండేవి. అది జరగకపోవడం వల్ల శైవ, వైష్ణవ ఉద్యమాలు సామాజిక ఉధృతి కోల్పోయాక అవి తిరిగి కొత్త కులాలుగా రూపొందడం జరిగింది.

చరిత్రలో వీరశైవం నిర్వహించిన పాత్ర సామ్రాజ్యాల నిర్మాణంతో ముడివడి వున్నది. దేశమంతటా ముస్లిం రాజ్యాలు ఏర్పడ్డప్పటికీ, ఆంగ్లేయుల పరిపాలన వచ్చినప్పటికీ స్వాతంత్ర్యం వచ్చాక కూడా వీరశైవం తాలూకు శివారాధన కొనసాగుతునే వున్నది. ఆధ్యాత్మికత రూపంలోకి, మతం రూపంలోకి సామాజిక సిద్ధాంతాలు మారిన తర్వాత రాజకీయ, సామాజిక పరిణామాలను అధిగమిస్తూ ముందుకు కొనసాగుతూ వుంటాయి.

పాల్కురికి సోమన తర్వాత వచ్చిన చాలామంది కవులు పాల్కురికి సోమనను అందుకోలేకపోయారు. ఆధునిక సాహిత్యంలో కూడా తెలంగాణ రచయితలు వచ్చాకే గ్రామీణ, జానపద ప్రజల జీవితాలను, సంస్కృతిని చిత్రించడం వేగం పుంజుకుంది.

ఇలా పాల్కురికి సోమనకు ఆధునిక సాహిత్యానికి మధ్య శతాబ్దాల కాలంలో ప్రజల జీవితం చిత్రించబడలేదు. పాల్కురికి సోమన ఆనాటి జీవితంలోని మంచి చెడులన్నిటిని చిత్రించిన తొలి తెలుగు మహాకవి.

సంత్ గురు రవిదాసు

భక్త రవిదాసు సుమారుగా క్రీ.శ.1376లో వారణాసి 2, 3 మైళ్ళ దూరంలో గల మండూర్ గ్రామంలో పుట్టాడని కొందరు పరిశోధకులు చెపుతున్నారు. కబీరు కూడా తన సమీప గ్రామమైన లహర్ తారాలో పుట్టాడని ప్రతీతి. కబీరు, రవిదాసు యిద్దరూ రామానందుని శిష్యులు. అతని శిష్యుల్లో పన్నెండు మంది శిష్యులు బాగా పేరు పొందారు. వారిలో ఎక్కువ మంది కింది కులాల వారు.

సంత్ గురు రవిదాసు, కబీరుల కాలం నాటికి మహమ్మద్ బీన్ తుగ్లక్ పాలన ముగిసి అతని కొడుకు ఫిరోజ్‌షా ఢిల్లీని పాలిస్తున్నాడు. రవిదాసుకు 22 ఏళ్ళ వయస్సుప్పుడు 1398లో ఆసియా సైనిక తండాలు తైమూరు (తామర్లేను) నాయకత్వంలో ఉత్తర భారతదేశంలో విలయతాండవం చేశాయి. 1413లో తుగ్లక్ వంశం అంతమైంది. రవిదాసు జన్మించేనాటికి కాకతీయుల రాజ్యం అంతరించి విజయనగర సామ్రాజ్యకాలం నడుస్తోంది. పైన బహమనీ సుల్తానులు ఏలుతున్నారు. రవిదాసు సమకాలికులుగా విజయనగర సామ్రాజ్యాన్ని రెండో హరిహరరాయలు, ఒకటో దేవరాయలు, రెండో దేవరాయలు పరిపాలించారు. శ్రీకృష్ణ దేవరాయలు ఏలుబడికిపూర్వమే రవిదాసు మరణించాడని చెప్పవచ్చు.

రచనాకాలం 1994. 'భారతదేశ చరిత్రలో మధ్య యుగం' కె.కృష్ణారెడ్డి, 'ప్రాక్ పశ్చిమ దర్శనాలు' - రాహుల్‌సాకృత్యాయన్-భక్తి రవిదాసు పుస్తకాల్లోంచి ఉల్లేఖనలు స్వీకరించబడ్డాయి.

రవిదాసు నూరేళ్ళపైబడి బతికాడని ప్రతీతి. కొందరు 150 ఏళ్ళు బతికాడని నమ్ముతున్నారు. రవిదాసు నూరేళ్ళే జీవించినా అత్యంత సంక్షోభిత సమాజంలో జీవించాడు. బుద్ధుడు జీవించిన కాలానికీ, రవిదాసు, కబీరులు జీవించిన కాలానికి పోలిక వుందంటారు. ఉత్తర భారతదేశంలో కబీరు కన్నా రవిదాసుకే ప్రాచుర్యం ఎక్కువని అంటారు. దక్షిణాదికి కబీరు తెల్సినట్టుగా రవిదాసు తెలియకపోవడంలో పని చేసిన కారణాలనుఅన్వేషించాల్సి వుంది.

రవిదాసు నుండి స్ఫూర్తి పొందిన వారిలో గురునానక్ ఒకరు. సిక్కుల పవిత్ర గ్రంథమైన "గురు గ్రంథ సాహిబ్"లో 40 దాకా రవిదాసు గేయాలున్నాయి.

ఆనాడు సమాజం మత విద్వేషాలతో, యుద్ధాలు, దోపిడీలు, దొంగతనాలతో అల్లకల్లోలమై వుంది. రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో స్థిరత్వం కొరవడి భద్రత కరువైంది. ఇదే సందులో వ్యాపారులు ధరలు పెంచి అక్రమ లాభార్జనకు దిగారు. బ్రాహ్మణులు, గుళ్ళు గోపురాలను బ్యాంకులుగా, బ్యాంకులాకర్లుగా మార్చుకొని ఎంతో సంపదను దోచుకున్నారు. గర్భగుడిలోకి రానీయకపోవడం అనేది గుళ్ళను బ్యాంకులుగా, బ్యాంకులాకర్లుగా మార్చిన తర్వాతే ప్రారంభమైంది.

దేవుళ్ళ పేరిట దాచిన సంపద కంటపడితే ముప్పు అని గ్రహించి బ్రాహ్మణులు ఈ పని చేశారు. సంపదలు గుళ్ళల్లో పేరుకుపోతున్న కొద్దీ బహుజనులు గుళ్ళల్లో ప్రవేశించడంపై రకరకాల ఆంక్షలు విధించారు. అటుచూస్తే ఇస్లాం మత వ్యాప్తి జరుగుతోంది. లక్షలాది మంది బహుజనులు ఇస్లాం స్వీకరిస్తున్నారు. నయనా భయానా స్వీకరించినా ఇస్లాంలోని సాంఘిక సమానత్వం వారిని ఎంతగానో ఆకర్షించింది. దాంతో పాటు అణిచివుంచే బ్రాహ్మణవాద భావజాలానికి భిన్నంగా, యుద్ధమంటే ఒక ఆటగా స్వీకరించగలిగే ధారులుగా వారిని ఇస్లాం తర్ఫీదు చేస్తోంది. తమ తోబుట్టువులు, రక్తసంబంధీకులు ఎందరో ఇస్లాంలో చేరుతున్నారు. మరెందరో యుద్ధాల్లో బలవుతున్నారు.

ఎటూ చేరకుండా వున్న వాళ్ళు కులవ్యవస్థ అణచివేత కింద యింకా అణచబడుతూ వున్నారు. సంక్షోభం వల్ల, అస్థిర రాజకీయాల వల్ల, దోపిడీవల్ల, బహుజనులు తమ ఉత్పత్తులను ఎంతో పెంచాల్సి వచ్చింది. కొత్త వృత్తులు ఏర్పడుతున్నాయి. వాటికి సాంఘిక గౌరవం అంతంత మాత్రమే. వాటిని చేపట్టాలా లేదా సంశయం. పన్నుల మీద పన్నులు భారం అవుతున్నాయి. వరదలు, కరువులు, రోగాలు రహదార్ల విచ్ఛిన్నత జీవితం కుదించుకుపోయేట్టు చేస్తున్నాయి. అదే

సమయంలో ఆ జీవితాన్ని వదిలి పారిపోవాలనే భయం, అక్కడే సాంఘిక భద్రత, గౌరవం చేకూరినా చాలు అనే ఆశ. మనిషి మనస్సును అల్లకల్లోలం చేస్తున్నాయి. అటు చూస్తే బ్రాహ్మణులు, దేవాలయాల్లో దైవం, సంగీతం, నృత్యం పేరిట నిత్యం భోగలాలసతో వ్యభిచారం చేస్తూ బహుజన స్త్రీలను దేవదాసీలుగా మార్చడం జరుగుతోంది. బహుజనుల్లో అందంగా కనపడే స్త్రీలను రకరకాల పేర్లతో గుళ్ళకు రాజాస్థానాలకు తెచ్చి వ్యభిచారం చేయడం క్రూరహింసగా బాధపెడ్తోంది.

ఇలాంటి దశలో బహుజనులు ప్రారంభించిన సామాజిక విప్లవాలే భక్తి ఉద్యమాలని పిలవబడుతున్నాయి. బుద్ధుడు మధ్యేవాదాన్ని అనుసరించినట్టుగా భక్తి ఉద్యమాలు మధ్యేవాదాన్ని అనుసరించాయి. వారికి సూఫీవాదం, అప్పుడే అంతరిస్తున్న బౌద్ధం ఎంతో స్ఫూర్తినిచ్చాయి.

ఇలా భక్తి ఉద్యమాలు సామాజిక రంగంలో బ్రాహ్మణవాద వ్యతిరేక, కుల మత వ్యతిరేక ఉద్యమాలుగా కొనసాగాయి. చరిత్రను, ఆనాటి సమాజాన్ని అధ్యయనం చేసిన వారు వాటిని ఆధ్యాత్మిక భక్తి ఉద్యమాలుగా కొట్టిపడేయలేరు. వాటిని ఆధ్యాత్మిక భక్తి ఉద్యమాలుగా వర్గీకరించి పరిశీలించే నాస్తిక హేతువాద, భౌతిక వాద దృక్పథాలు భావవాదంతో సమానమైనవి. భక్తి ఉద్యమాలు సమాజ శాస్త్రంలో ఒక ప్రధాన భాగాన్ని ఆక్రమిస్తాయి. సమాజ శాస్త్రం ఒక ప్రత్యేక శాస్త్రంగా రూపుదిద్దుకోక ముందు ఆ అంశాలు అన్ని దేశాల్లో లాగే సంస్కృతి, మత, ధార్మిక, మార్మిక, భక్తి, విశ్వాసాల రూపాల్లో కొనసాగుతూ వచ్చాయి.

బౌద్ధం బలహీనమై బ్రాహ్మణవాదం వేళ్ళూనుకున్నాక భౌతిక శాస్త్రాలకు, సామాజిక శాస్త్రాలకు మధ్య సమన్వయం లోపించింది. బ్రాహ్మణవాద సమాజ శాస్త్రాల్లోని బండారం బయట పడుతుందని వారు భయపడి పోయారు. బహుజనులు అన్ని రంగాల్లో ఎంతో నైపుణ్యంతో, కళాత్మకంగా భౌతిక శాస్త్రాల్లో అభివృద్ధిని సాధించిన పనితనాన్ని, తెలివితేటల్ని చూసి స్వార్థపరులైన బ్రాహ్మణవాదులు భయపడ్డంలో ఆశ్చర్యం లేదు.

నగలు, నాణాలు, శిల్పాలు, పంటలు, పశు పక్ష్యాదుల పెంపకాలు, అలంకరణ వస్తువులు, కత్తులు, బట్టలు తయారీ మొదలైన సమస్త కళలు, శాస్త్రాల్లో బహుజనుల నైపుణ్యం ఎంత గొప్పదో నేటి మ్యూజియంలు సాక్ష్యం ఇస్తున్నాయి. ఇంత తెలివితేటలు, నైపుణ్యం, సూక్ష్మదృష్టి గల బహుజనులకు వాటికి తోడుగా లిపి, విద్య, సామాజిక గౌరవం అందుబాటులోకి వస్తే బ్రాహ్మణవాదులు పనయిపోతుంది.

అందుకనే వాళ్లు బహుజనులకు సామాజిక శాస్త్రాల్లో ప్రవేశాన్ని నిరాకరించారు.

సమస్త కళలు, భౌతిక శాస్త్రాలు, తెల్సిన బహుజనులు సామాజిక శాస్త్రాల్ని కూడా అధ్యయనం చేస్తే అది గొప్ప విప్లవ పరిణామాలను తెస్తుంది. ఇంత స్పష్టమైన అవగాహన బ్రాహ్మణ వాదులకు కలిగిందో లేదో తెలియదు. కాని వారి స్వార్థమే ఆ పని చేయించింది. తద్వారా తమ పరిమితుల్లోనే బహుజనులు తమవైన రీతుల్లో సామాజిక శాస్త్రాలను అభివృద్ధి పరిచారు. అలా భక్తివాద రూపంలో సామాజిక విప్లవాలు రూపుదిద్దుకున్నాయి.

బ్రాహ్మణవాదంలో మనిషికన్నా దేవునికి, పూజారికి, ప్రాధాన్యత హెచ్చు. కర్మకాండ, తదితరాల రూపంలో రాజులు, వ్యాపారులు, పూజారులు సంపదను గుంజి తినడం, పోగుచేసికోవడం వారి పని. బహుజనుల భక్తి ఉద్యమాలు ఇందుకు భిన్నమైనవి. వీటిలో దేవునికన్నా భక్తుడు ప్రాథమికం కావడాన్ని మనం గమనించవచ్చు. బహుజన వాదులు చాలా మంది నిర్గుణ, నిరాకార, దైవ భావనను స్వీకరించారు. వాళ్ళు చాలాసార్లు అల్లాను, ముల్లాను, రామున్ని, పూజారిని కూడా నిరాకరించారు. వీరి ఈ నిర్గుణ నిరాకార దైవ భావన గ్రీకు సోఫిస్టుల నుండి, ప్లేటో మీదుగా యూనివర్సల్ భావన నుండి, అటు తర్వాత నాగార్జునుని శూన్యవాద, న్యాయ వైశేషిక వాదాలుగా మారిన క్రమం నుంచి సూఫీవాదుల నుంచి, ఇస్లాం నుంచి తీసుకొన్నదని రాహుల్ సాంకృత్యాయన్ అభిప్రాయపడతాడు. అయితే భక్తి వాదులకు నిర్గుణ, నిరాకార దైవ భావన ఒక ఆలంబనే, అది మనిషి యొక్క సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వాన్ని ప్రబోధించడానికి తీసుకొన్న ఒక సాధనమే.

భక్తి ఉద్యమాలలో కనపడే అంతర్ముఖత్వాన్ని పలాయనవాదం అని కొందరు వ్యాఖ్యానించారు. నేడు అభివృద్ధి చెందిన ప్రవర్తనా శాస్త్రం, మనస్తత్వ శాస్త్రం ఈ వ్యాఖ్యానం తప్పని స్పష్టం చేస్తాయి.

తాము సృష్టించే సంపదలు బ్రాహ్మణ, బనియా, హిందూ, ముస్లిం రాజులపాలవుతుంటే, ఉన్నది కాస్తా యుద్ధాల దోపిడీలు, దొంగలు, అధిక పన్నులు ఊడ్చుకుపోతుంటే బహుజనులు సాంఘికార్థిక భద్రత కోల్పోయి ఎంతో వ్యధకు లోనయ్యారు. ఈ రెంటి సాధనకు నాటి బౌద్ధం తరహాలో భక్తి ఉద్యమ కారులు బ్రాహ్మణ వాదుల ముస్లిం వాదుల మధ్య తమదైన ప్రత్యామ్నాయాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు.

భక్తి అంటే దైవానికీ భక్తునికి మధ్య ఆ భేదం, అవిభక్తం, మనలోనే దేవుడున్నాడు అనే భావన బ్రాహ్మణవాద గుళ్ళు గోపురాల దోపిడిని, ఆధిక్యతను దెబ్బతీసింది. బౌద్ధ ఆరామాల్లా భక్తి సమాజాలు, మతాలు వెలిశాయి. దేవుడు గుళ్ళల్లో లేడని, రాళ్ళకు మొక్కడం, తీర్థయాత్రలు అనవసరం అని యీసడించారు. దీంతో బ్రాహ్మణవాదం యొక్క ఆర్థిక వనరులపైనా, సాంఘిక ఆధిక్యతపైనా పెద్ద దెబ్బపడింది.

దేవున్ని నిరాడంబరంగా సాధించుకునే యీ బహుజన భక్తి మార్గం లక్షలాది బహుజనుల్ని బౌద్ధం లాగే ఆకర్షించడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. బ్రాహ్మణవాదాన్ని ఇలా ఓడించే కృషి చేసిన వారిలో కబీరు, రవిదాసు, గురునానక్ వంటి వారెందరో ఉన్నారు. మన దేశంలో కుల వ్యవస్థ కారణంగా సామాజిక శాస్త్రాలు అగ్రవర్ణాల చేతుల్లో, భౌతిక శాస్త్రాలు బహుజనుల చేతుల్లోను విడివిడిగా అభివృద్ధి చెందాయి. అలాకాకుండా కలిసి అభివృద్ధి చెందివుంటే ఆ ప్రగతి గొప్పగా వుండేది. ఆ క్రమాన్ని బహుజన బౌద్ధుల్లో చూడవచ్చు.

బౌద్ధ విప్లవం ప్రజల భాషల్ని అభివృద్ధి పరిచింది. బ్రాహ్మణవాదం ప్రజల భాషల్ని నిరాకరించింది. భక్తి ఉద్యమాల కాలంలో బ్రాహ్మణవాదం ఇదే పని చేసింది. కాగా బహుజన భక్తి ఉద్యమకారులు స్థానిక, ప్రజల భాషలను అభివృద్ధి పరిచారు. ప్రాంతీయ బహుజన భాషల్లో వారి సందేశాలు విన్పించారు. ఆనాటి బహుజనుల భక్తి ఉద్యమాలే నేటి ప్రాంతీయ మాతృభాషలుగా ఎదగడానికి పునాది వేశాయి. వాటికి ఇలా సాహిత్య, సాంఘిక గౌరవం కలిగించడం వల్ల వెనకబడిపోతుండిన బ్రాహ్మణ వాదులు ప్రాంతీయ భాషలను ఆశ్రయించారు. అందులో తిరిగి సంస్కృత భూయిష్ట గ్రాంథిక భాషను, వ్యాకరణ, ఛందోబంధాలను వాడి ప్రజలకు అందకుండా చూశారు. సంస్కృతం బ్రాహ్మణవాదులు ఎపుడూ బహుజనుల ప్రాంతీయ మాతృభాషలను అణచివేసే ప్రయత్నం చేయగా బౌద్ధ ఉద్యమాలు, భక్తి ఉద్యమాలు వాటిని అభివృద్ధి పరిచే కృషి చేశాయి. ఆనాటి భక్తి ఉద్యమాలు లేకుండా నేటి భాషలను ఊహించడం కష్టం.

భక్తి ఉద్యమాలు బౌద్ధ భిక్షువుల్లా సంచార జీవితాన్ని కూడా ప్రోత్సహించడం వల్ల విభిన్న ప్రాంతాల్లోని భాష పలుకుబళ్ళ మధ్య సమన్వయం ఏర్పడి నూతన భాషలు రూపుదిద్దుకున్నాయి. అలా భావ సమైక్యతే కాకుండా భాషా సమైక్యతను కూడా సాధించాయి. భక్తి ఉద్యమాలన్నీ ప్రధానంగా చేతివృత్తి కులాల వారిచే ప్రాచుర్యం పొందాయి. భాషల్ని అభివృద్ధి చేసిన గొప్పదనం కూడా వారికే చెందుతుంది. అలాంటి

భాషల్ని తిరిగి బ్రాహ్మణీకరించే సంస్కృతీకరించే ప్రయత్నాలు చేశారు బ్రాహ్మణవాదులు. నేటి ప్రాంతీయ భాషల్లో సంస్కృత భాషా పదాలు ఎక్కువగా కన్పడ్డానికి వాటిని అభివద్ధి పరచడంలో కాకుండా, అణచివేయాలని చూడ్డంలో వుంది. గ్రాంథిక భాషావాదం నిన్న మొన్నటిదాకా ప్రాంతీయ భాషల్ని, తద్వారా బహుజనుల భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని అణిచివేసే ప్రయత్నం చేయడంలోనూ దీన్ని గమనించవచ్చు. ఇప్పటికీ ప్రజల పాటను ఒక సాహిత్య ప్రక్రియగా బ్రాహ్మణవాదులు గుర్తించి సముచిత స్థానం యివ్వలేక పోవడంలోనూ దీన్ని చూడవచ్చు.

ఇలా ఎన్నో విధాలుగా బ్రాహ్మణవాద లక్ష్యాలు, వేరుగాను బహుజన భక్తి ఉద్యమాల లక్ష్యాలు వేరుగాను స్పష్టంగా కనపడతాయి.

ముస్లిం ల రాజ్యాధికారంలో సమాజంలో చెలరేగిన సమస్యలు నిరాశానిస్పృహలు, భూతప్రేత, మంత్రతంత్ర మూఢ విశ్వాసాలకు నెట్టివేశాయి. ఎందరో మహనీయులు మెరుగైన వ్యవస్థ కోసం అన్వేషించారు. అలాంటి దశలో భక్తి ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. వర్ణకుల వ్యవస్థల తాలూకు సంస్కృతిని, భూస్వామ్య సంస్కృతిని వ్యతిరేకిస్తూ బహుజన సంస్కృతిని భక్తి ఉద్యమాలు నిర్మించే కృషి చేశాయి.

మధ్యయుగ భక్తిసాధకుల గురించి చరిత్రకారుడైన రాంగేయ రాఘవ్ యిలా అంటాడు. “అప్పటికింకా కార్ల్‌మార్క్స్ పుట్టలేదు. గతితార్కిక భౌతికవాదం తల ఎత్త లేదు. అయినా నాటి మానవులు అన్యాయానికి, అధర్మానికి విరుద్ధంగా పోరాటం జరుపుతూనే వుండినారు. ఆ పోరాటపు సింహనాదాలే మనకు మధ్యయుగాల నాటి భక్తి వాణిలో వినిపిస్తున్నాయి. ఆ గంభీర స్వరాలన్నీ నిమ్న జాతుల విముక్తి కోసం పెల్లుబికిన ఎలుగులే. సర్వమానవ సమానత్వమే ధ్యేయమైన వైష్ణవ చింతనే భక్తివాణికి మూలం”

దుర్ఘనియా, రగ్గులకు పుట్టిన రవిదాసు కులవృత్తి అయిన చెప్పులు చేసే పనిని ఎంతో పవిత్రమైనదిగా ఎంచాడు. భక్తి ఉద్యమ కారుల్లో ఎక్కువ మంది చేతివృత్తుల వాళ్ళే. అందువల్ల వాళ్లు శ్రమను గౌరవించే సంస్కృతి ప్రచారం చేశారు. శ్రమ చేసి సాధించాలనేది గురు రవిదాసు సమాజానికిచ్చిన మౌలిక సందేశాల్లో ఒకటి. బ్రాహ్మణ వాదం శ్రమను అగౌరవ పరుస్తుంది.

రవిదాసు చిన్నప్పటి నుంచే భక్తి ధ్యానంలో చూసి ఒక దారికి తేవాలని ‘లోణా’ అనే అమ్మాయితో పెళ్ళి చేశారు తల్లిదండ్రులు. ఆమె కూడా అతనికి అనుకూలంగా

మారిపోయింది. తల్లిదండ్రులు రవిదాసుకు వేరు పోశారు. అది ఆయన సర్వస్వతంత్రకు దారి తీసింది. పొట్టకూటి మేరకు చెప్పులు కుట్టడం భక్తి ప్రచారం అతని జీవితం అయింది. అతను ఆర్థికంగా కష్టపడిన రోజుల్లోనూ అంతా రామునిదే భారం. నాకేం విచారం అని భావించేవాడు.

సికిందర్ లోడి (ఢిల్లీ సుల్తాను) కాశీకి వెళ్ళి రవిదాసు చేత దీక్ష పొందాడు. నేడు ఆ స్థానం 'జ్ఞానవాపీ మసీదు' పేరుతో అలరారుతున్నది. భక్త రవిదాసు ప్రేరణ వల్ల సికిందర్ లోడి నాటి నుంచి పరరాజ్యాలను ఆక్రమించడం మానుకున్నాడని, బహుజనులకూ, ముస్లిం నడుమ సహకార సామరస్యం నెలకొల్ప ప్రయత్నించసాగాడని అంటారు. ఏమైనా గురురవిదాసు సమజంపై వేసిన ప్రభావం ఎంతో గొప్పదని చెప్పక తప్పదు.

భక్తి ఉద్యమాలు కర్మకాండల్ని, బాహ్య ఆడంబరాల్ని తీసివేసి భక్తిని సరళం, సుగమం సర్వసులభం కావించాయి. జ్ఞాన సాధనకు భక్తిని ప్రధాన సాధనమన్నాయి. అహం వీడని వాడు భక్తికి అనర్హుడని, అది వీడినప్పుడే భక్తి సాధనలో కృతకృత్యుడవుతాడని రవిదాసు స్పష్టం చేస్తాడు. సత్సంగం లేనిదే భావం జనించదు. భావావేశం లేనిదే భక్తి కలగదు అని ప్రబోధిస్తాడు రవిదాసు. రవిదాసు అల్లా, ఖుదా, రామా, కృష్ణా అని అతడు వారిని సగుణసాకారులుగా చూడలేదు. ఆయన ఈ సమాజ పాలనను నిర్గుణ, నిరాకార రూపంలో స్వీకరించాడు. అందువల్ల విగ్రహారాధనకు ప్రాముఖ్యత నీయలేదు.

బ్రాహ్మణవాదులు 85 శాతంగా గల బహుజనుల మానవ జన్మను నీచమైనదని. పూర్వజన్మ పాప ఫలితం అని వ్యాఖ్యానించి హింసించారు. రవిదాసు ఇందుకు పూర్తి భిన్నం. ఎంతో పుణ్యం చేసికొంటేనే మానవజన్మ లభిస్తుందని చెప్తూ బహుజనులకు ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించాడు. బ్రాహ్మణవాదులకు అగ్రకులాల వృత్తుల పట్ల తప్ప మిగిలిన వృత్తుల పట్ల హేయయమైన భావం. రవిదాసు అందుకు విరుద్ధంగా తమ కులవృత్తులు ఎంతో గొప్పవి అని ఎలుగెత్తి చాటాడు. అందువల్ల గురు రవిదాసు ఉత్తర భారత దేశమంతటా దశాబ్దాల తరబడి పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తూ కూడా తాను సగర్వంగా చెప్పులు చేస్తూనే వుండేవాడు.

బ్రాహ్మణవాదులు, కులమత జాతి భేదాలను పెంచి పోషించారు. భయాన్ని, భయపెట్టడాన్ని ప్రధానం చేశారు. దానికి భయం, భక్తి అని దేవుని పేరు పెట్టారు. అందుకు భిన్నంగా శూద్ర భక్తి ఉద్యమకారులు జాతికుల మత భేదాలను నిరసిస్తూ

సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రబోధించే మానవతావాదాన్ని ప్రజలకు అందించారు. బహుజనులకు ధైర్యసాహసాలను, ఆత్మ విశ్వాసాన్ని కలిగించి నిర్భయుల్ని చేశారు.

సామాజిక అవసరాలను తీర్చడానికి ఆవిర్భవించిన భక్తి ఉద్యమాలు తమ లక్ష్యాలను ఎంతగానో సాధించాయి. వీటికి నాయకత్వం వహించిన వారు పడకకుర్చీ వాదులు కాదు. బ్రాహ్మణ వాదుల్లా తమ దగ్గరికి ప్రజల్ని రమ్మని పిలిచి అవమానించే వాళ్ళు కాదు. వాళ్ళే ప్రజల దగ్గరికి వెళ్ళి ఊరూవాడా, దేశం అంతా తిరిగి ప్రజల్లో ఒకరిగా కలిసిపోయి, వారు పెట్టిందే తిన్నారు. తమ జీవనోపాధి కోసం కూడా శ్రమ చేశారు వారు. అందువల్ల వాళ్ళని బౌద్ధ భిక్షువుల కన్నా, బ్రాహ్మణవాదుల కన్నా ఉన్నతులుగా ప్రజలు గౌరవించడంలో ఆశ్చర్యం లేదు.

కంచ అయిలయ్య బహుజన దేవుళ్ళు వేరు, బ్రాహ్మణవాదుల దేవుళ్ళు వేరు అని చెప్తుంటే బ్రాహ్మణవాదుల పునాదులు కదులుతున్న ఆదుర్దాలో అలా చెప్పడం ఘోరం అన్నారు. నిజానికి భక్తి ఉద్యమాల కాలంలోనూ, బహుజనుల దేవుళ్ళు, లక్ష్యాలు వేరు, బ్రాహ్మణ వాద దేవుళ్ళు లక్ష్యాలు వేరు. అందరిలో దేవుడున్నానే భావాన్ని ఆలంబన చేసుకొని సామాజిక సమానత్వం కోసం పోరాడారు భక్తి ఉద్యమ కారులు.

దేశంలో కొనసాగిన అస్థిరత్వం వల్ల శతాబ్దాలుగా బహుజనులు నష్టపోయారు. సామాజిక, రాజకీయ అస్థిరత్వం బహుజనుల ఆర్థిక పట్టును కుదురుకోనీయలేదు. శూద్రులు సృష్టించిన సంపదను రాజ్యవిస్తరణకు, యుద్ధాలకు ఇతర రాజ్యాల వాళ్ళు దోచుకుపోవడానికి, తరలించుకుపోవడానికి, ఎగుమతులకు, రాజాస్థానాల్లో గానాబజనాలకు, వేశ్యావాటికలకు, గుళ్ళ నిర్మాణానికి, కోటల నిర్మాణానికి తరలించారు. శూద్రులు సంపన్నులు కావడాన్ని ఓర్వలేకపోయారు. వైశ్యులు, బ్రాహ్మణులు, రాజులు మూడు రకాలుగా వారి సంపదను కైంకర్యం చేసుకున్నారు. ఈ పరాయీకరణ నుండి శూద్రులు సామాజిక ఉద్యమాల వైపు నడిచారు. వారి నాయకత్వం భక్తి తదితర ఉద్యమాల రూపంలో సామాజిక, సాంస్కృతిక, భావజాల, వృత్తి కళల నాయకత్వానికే పరిమితం కావాల్సి వచ్చింది.

ఆ దశ అనంతరం రాజకీయ, ఆర్థిక రంగాల్లో నాయకత్వంగా ఎదిగే దిశను అస్థిరత్వం వల్ల బహుజనులు కోల్పోయారు. గుర్రాల ఉత్పత్తి పెంపకాన్ని ఈ దేశంలో సాగనీయకుండా శతాబ్దాలుగా విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్నారు. గుర్రాల ఉత్పత్తి పెంపకం ఇక్కడి బహుజనుల చేతుల్లో పడితే, అది వీరుల జాతిగా

రూపుదిద్దుకుంటుంది. బ్రాహ్మణవాదులు, అధికారంలో ఉన్న రాజులు యిద్దరికీ ఇది ఎసరు తెచ్చే వ్యవహారం. అందువల్ల గుర్రాల ఉత్పత్తి పెంపకాన్ని మన దేశంలో అభివృద్ధి పరచలేకపోయారు. గుర్రాల కొనుగోలు కోసం బహుజనుల సంపదలు పన్నుల రూపంలో విదేశీ వాణిజ్యం ద్వారా తరలి పోయాయి. తద్వారా క్రమంగా గుర్రాలను పెంచే ప్రాంతాల వాళ్ళే యీ దేశంపైకి పయనించడం ప్రారంభించారు. ఇప్పుడూ ఆయుధాల కొనుగోలు ఇదే క్రమాన్ని ముందుకు తెస్తూ నయావలసగా మారుస్తున్న క్రమం మనముందే వుంది.

పారిశ్రామిక విప్లవం నాటి పరిభాషలో చెప్తే ఆధునిక వైజ్ఞానిక శూద్ర విప్లవమే. ఆ వృత్తులు, ఉత్పత్తులు బహుజనుల రంగాలవే. బహుజనులకందాల్సిన పారిశ్రామిక విప్లవ ఫలితాల్ని విదేశీయులు, గుజరాత్, మార్వాడీలు, బనియాలు కొల్లగొట్టారు. చరిత్రలో కప్పిపెట్టిన వాస్తవాలను అనేక కొత్త కోణాల్లో వెలికి తీయాల్సి వుంది.

భక్తి ఉద్యమాలు బ్రాహ్మణ వాదవ్యతిరేక ఉద్యమాలుగానూ, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విప్లవాలుగానూ సాధించిన పరిణామాలను బహుజన దృక్పథంతో విశ్లేషించాల్సి వుంది. అందుకు భక్తి ఉద్యమకారుల చరిత్ర, రచన, సామాజిక పరిశీలన ఒక చక్కని సాధనం. గురురవిదాసు ప్రజల హృదయాల్లో శతాబ్దాల తరబడి నిలిచిపోయారు. ప్రజలు వందలాది గురురవిదాసు గుళ్లను కట్టి ఆరాధిస్తున్నారు. ఢిల్లీ పార్లమెంట్ ప్రాంతంలో గురురవిదాసు పేరిట ఒక వీధిని చాలా మంది చూసే వుంటారు.

బుద్ధుడు వంటి గురురవిదాసు జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు తక్కువేమీ కాదు. భక్త మీరాబాయి తనకు గురువుగా గురురవిదాసును స్వీకరించింది. రాజపుత్రులు భక్త మీరాబాయి ఒక అంటరాని వాడి వద్ద దీక్షపొందటమేమిటని ఆగ్రహించి గురు రవిదాసుని హత్య చేశారని తెలుస్తున్నది.

ఒక సాత్వికుడైన కమ్యూనిస్టు విప్లవకారుడు ఆ కాలంలో పుట్టి వుంటే అచ్చం గురు రవిదాసులాగే జీవించేవాడు అని అన్పిస్తుంది. 'భక్త రవిదాసు' పుస్తకాన్ని రాసిన ఢిల్లీ వాసి చోళ్ళ విష్ణు, దానికి సంపాదకత్వం వహించిన ఇంగువమల్లికార్జున శర్మ అభినందనీయులు.

ఆధునిక భారతీయ సామాజిక తత్వవేత్త

మహాత్మా జ్యోతిరావ్ పూలే

ఆధునిక భారతదేశంలో సామాన్య మానవునికీ, అణిచివేయ బడ్డ వారికి, పీడితులకూ, తాడితులకూ, భారతీయ స్త్రీకి నూతన యుగోదయాన్ని ప్రకటించిన మొదటి భారతీయుడు జ్యోతిరావ్‌పూలే. మహారాష్ట్రలో అంటరాని వారికి, బాలికలకు పాఠశాలలు తెరిచిన మొదటి భారతీయుడు ఆయన. జ్యోతిరావ్ నిజమైన మహాత్ముడని గాంధీజీ అన్నారు. వీరసావర్కర్ జ్యోతిరావ్‌ను సామాజిక విప్లవకారునిగా అభివర్ణించారు.

ఆధునిక భారతీయ చరిత్రలో అనేక మార్పులు చేర్పులు చేయవలసి ఉన్నది. కాంగ్రెస్ పార్టీ, జాతీయోద్యమం అనేవి పర్యాయ పదాలుగా చరిత్రలో కనపడుతుంటాయి. కాంగ్రెస్ పార్టీ ఉద్యమవే మొత్తం జాతీయోద్యమంగా చరిత్ర పాఠ్యపుస్తకాల్లో రాస్తున్నారు. ఇది గెలిచినవారి చరిత్రను రాయడమే తప్ప అందరు చేసిన కృషిని రాయడం కాదు. ఆ యా సామాజిక వర్గాలు, కులాలు ఎదుగుతున్నకొద్దీ చరిత్రలో అంతదాకా కనుమరుగు చేయబడ్డ కృషిని, చరిత్రను తిరిగి అధ్యయనం చేయడం జరుగుతున్నది. సమాజానికి అందించడం జరుగుతున్నది. మహాత్మా జ్యోతిబా పూలే చరిత్ర అందులో ఒకటి.

తత్వవేత్తలు ఎన్నో రకాలు. సామాజిక తత్వవేత్త అంటే ఎవరు? లౌకిక, అలౌకిక, ఆధ్యాత్మిక, భావవాద, ఆత్మ పరమాత్మ, కర్మ, పునర్జన్మ చర్చలు చేసేవాళ్లను తత్వవేత్తల్లో భాగంగా చేర్చి

చర్చిస్తున్నారు. కలగూరగంపగా మార్చుతున్నారు. అందువల్ల తత్వవేత్తలను కూడా వర్గీకరించాల్సి ఉంది. ఆధ్యాత్మిక తత్వవేత్తలు, సామాజిక తత్వవేత్తలు, రాజనీతి తత్వవేత్తలు, సాంస్కృతిక తత్వవేత్తలు, నైతిక తత్వవేత్తలు, అలంకార శాస్త్రవేత్తలు మొదలైన విధాలుగా వర్గీకరించడం అవసరం. సమాజం గురించి పట్టించుకోకుండా ఆత్మ పరమాత్మ కర్మ కులం మతం గురించి, హిందూ మతం గురించి, వ్యక్తి శీలం గురించి చర్చించే వారు ఆధ్యాత్మిక భావ వాద, వ్యక్తివాద తత్వవేత్తలు.

సమాజం గురించి పట్టించుకుని సామాజిక వ్యవస్థలను, నిర్మాణాలను, ప్రజలను, సంస్కృతిని, జీవన విధానాల్ని, నైతిక విలువలను, వ్యక్తికి – సమాజానికి – రాజనీతికి – రాజకీయాలకు గల సంబంధాలను, అలవాట్లను, వేష భాషలను పట్టించుకుని చర్చించే వారు సామాజిక తత్వవేత్తలు. వాళ్లు భావవాదులైనా, భౌతికవాదులైనా సామాజిక తత్వవేత్తలే. ఈ నిర్వచనం ప్రకారం చార్వాకులు, లోకాయతులు, బుద్ధుడు, జైనుడు మహాత్మా జ్యోతిబా పూలే మొదలుకొని గాంధీజీ, డా॥బి.ఆర్.అంబేద్కర్, కాన్షీరాం దాకా గల పరంపర సామాజిక తత్వవేత్తల వర్గీకరణలోకి వస్తారు. మహాత్మా జ్యోతిబా పూలే ఈ సామాజిక రంగాలన్నిటినీ పట్టించుకున్న ఆధునిక భారతీయ తొలి సామాజిక తత్వవేత్త.

ఆధునిక భారతీయ ప్రజాస్వామికవాది

"మహాత్మా జ్యోతిబా పూలేను అనేక విశేషణాలతో సంబోధిస్తారు. కొందరు ఆధునిక భారతీయ సామాజిక విప్లవపిత అంటారు. కొందరు, భారతదేశంలోని మార్టిన్ లూథర్ అంటారు. మరికొందరు, భారతదేశంలోని స్త్రీల ప్రథమ ముక్తిదాత అంటారు. ఇంకొందరు, బహుజన బలహీనవర్గాల వైతాళికుడు అంటారు." (భారత్‌కే సామాజిక్ క్రాంతికారీ – హిందీ, దేవేందర్ కుమార్ బే సంతరీ, పేజీ 124)

పూలే 1827లో మహారాష్ట్రలోని పూనెలో జన్మించారు. 1827లో పుట్టే నాటికి మహారాష్ట్రలో చాలా మార్పులు జరుగుతున్నాయి. పీష్వా రెండవ బాజీరావు తన గద్దీని కోల్పోయాడు. ఎన్నో కుటుంబాలు నిరాశ్రయమై పోయాయి. అందులో పూలే తండ్రి గోవిందు కుటుంబం ఒకటి.

పూల మొక్కలు పెంచడం, పండ్ల చెట్లు పెంచడం, కాయగూరలు పండించడం పూలు అమ్మడం పూలే వంశీయుల వృత్తి, ఒక జాతిగా గానీ, ఒక కులంగా గాని వీరికి గుర్తింపు లేదు.

పూలేకు ఏడాది వయస్సున్నప్పుడే అతని తల్లి చిమ్నాబాయి మరణించింది. తండ్రి గోవిందు రెండో పెళ్ళిమాట తలపెట్టలేదు. పసివాడిని చూసుకోవడానికి ఏర్పాటు చేశాడు.

పిల్లవాడిని విద్యావంతుని చేయాలని తండ్రి సంకల్పం. ఆ రోజుల్లో బ్రాహ్మణేతరులు విద్య నేర్చుకునే పద్ధతి లేదు. అయినా ఆయనకు ఆ ఆలోచన వచ్చింది.

ఈ ఆధునిక కాలంలో వ్యవహారంలో వున్న విద్యా ప్రణాళిక జ్యోతిబా పుట్టేనాటికి భారతదేశంలో లేదు. అప్పటి విద్యావిధానం వేరు. అగ్రవర్ణాల వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో కొందరు పండితులు సొంతంగా (గురుకులం వంటి) పాఠశాలలు నడిపే వారు. అందులో సంస్కృతం, వ్యాకరణం, తర్కం, వేదాంతం, న్యాయశాస్త్రం వంటివి బోధించేవారు.

సమాజంలో కిందితరగతుల వారు చదువుకోగూడదు. వారికి ఆ అవసరమూ కనిపించేది కాదు. ఇప్పటిలా తరగతికి కొంతమంది విద్యార్థులుండే పద్ధతి అప్పట్లో లేదు. అందరూ ఒకే చోటకూర్చుని ఎవరి పాఠాలు వాళ్ళు ఏక కాలంలో గొంతు చించుకుని పెద్దగా వల్లిస్తూ ఉండేవారు. క్రింది వర్గాల వారు విద్య నేర్చుకోవాలన్న ప్రయత్నం ఏదైనా చేస్తే తీవ్రమైన పరిణామాలు ఎదురయ్యేవి. అలాంటి రోజులలో గోవిందరావుపూలే తన కొడుక్కి చదువు చెప్పించాలని అనుకున్నాడంటే అది సామాన్యమైన విషయం కాదు.

మరాఠీ రాయటం, చదవటం నోటి లెక్కలు నేర్చుకుంటున్న వయసులో ఈ చదువుల వల్ల పనికి వంగరు అని తండ్రి మనసు పాడు చేశాడు అతని గుమాస్తాగా ఉన్న బ్రాహ్మణుడు. కింది వర్గాల వారి చదువు బ్రాహ్మణులకు ఎంత బాధాకరంగా పరిణమించిందో తెలుసుకోవచ్చు. పొలంపనులకు సాయం వెళ్ళాడు జ్యోతి. తర్వాత పొలం పనులు చేసికొంటూ రాత్రి చదివే ప్రయత్నం చేసే అతని ఆసక్తిని చూసి ఒక క్రైస్తవ, ఒక ముస్లిం పండితులు, తండ్రికి నచ్చచెప్పి బడి చదువుకు పంపేటట్లు చేశారు కొన్నాళ్ళకు.

అప్పటి ఆచారం ప్రకారం జ్యోతికి పదమూడేళ్ళ వయస్సులో 1840లో పెళ్ళయింది. అప్పటికి సావిత్రికి ఎనిమిదేళ్ళు మాత్రమే. పూలే 1841లో పూనేలోని స్కాటిష్ మిషన్ హైస్కూలులో చేరారు. 1847లో సెకండరీ విద్యపూర్తి చేశాక

ప్రభుత్వోద్యోగంలో చేరకూడదని నిర్ణయించుకున్నారు. అప్పటికి అతనిలో స్వాతంత్ర్యోద్యమ భావాలు బలపడ్డాయి. అమెరికన్ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర అతన్ని ఉత్తేజ పరిచింది. జ్యోతిబా మంచి కసరత్తు నేర్చుకున్నాడు. అప్పటి వ్యవస్థ ప్రకారం చదువు పూర్తి కాగానే తన తండ్రి వలెనే పూల అమ్మకం పని చేయవలసి వుండింది.

1848లో ఒక బ్రాహ్మణ మిత్రుడు పెళ్ళికి రమ్మంటే వెళ్ళాడు జ్యోతిబా. పవిత్రులైన బ్రాహ్మణులతో ఒక కింది వర్గానికి చెందిన మాలి కొడుకు వూరేగింపులో నడవడం ఎంత కండకావరం అని ఒకాయన తిట్లకు లంకించుకున్నాడు. ఊరేగింపునించి వెళ్ళగొట్టారు. ఆ విషయం తండ్రికి చెప్పి వెక్కి వెక్కి ఏడ్చాడు. ఇంకా ఏమీ శిక్షించకుండా ఊరికే పంపేయడం ఔదార్యంగా భావించాడు తండ్రి. ఇలాంటి వారిని ఏనుగుల చేత తొక్కించడం తండ్రికి తెలుసు.

మహారాష్ట్రలో బ్రాహ్మణుల పాలనలో పంచమ కులాల స్థితి మరీ అధ్వాన్నంగా వుండేది. వారు పూణే వీధుల్లో అన్ని వేళలా నడవడానికి వీలు లేదు. ఒక వేళ వీధిలోకి వస్తే అలా నడిచే సమయాలలో మెడకు ఒక ముంత నడుముకు వెనకగా చీపురు కట్ట వంటి ఒక రకపు ఆకుల కట్ట కట్టుకోవలసి వుండేది. ఉమ్మివేస్తే ఉమ్మడానికి ఆ పాత్ర. నడిస్తే పడే అడుగుల ముద్రల్ని తుడిచివేయ డానికి ఆ ఆకుల కట్ట. ఇలా కూడా మధ్యాహ్నం మాత్రమే రావాలి. మిగతాసమయాల్లోనైతే వాళ్ళనీడ ఎవరిమీదైనా పడినా బాట మీద పడినా అపవిత్రం అవుతారు కదా! ఇలాంటివి చెప్పి తండ్రి కొడుక్కు ఊరట కల్గించాడు. కాని శివాజీ, జార్జి వాషింగ్టన్, లూథర్‌ల జీవిత చరిత్రలు అతనికి నిరాశను బోధించలేదు. నమ్మిన మార్గంలో ముందుకుపోవడం నేర్పాయి.

ఈ వ్యవస్థను ఇలా కొనసాగనీయరాదనుకున్నాడు. అది వరకు అతడు నిర్ణయించుకున్న మార్గాలన్నీ వదిలేశాడు. ఆ చిన్న సంఘటన అతని జీవిత గమనాన్నే మార్చివేసింది. ఇలా జరక్కపోయి వుంటే మామూలుగా క్రిందటి తరంలోని రాజా రామ్మోహన్ రాయ్ లాగా ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ఏదో హోదా సంపాదించేవాడే. మహారాష్ట్రలో ఉద్యోగాల జోలికి పోని ఉత్తమ శ్రేణి మేధావులలో జ్యోతిరావ్ ప్రథమగణ్యుడు.

సంఘంలో త్వరితగతిన మార్పు రావాలంటే విద్య ద్వారానే సాధ్యమని జ్యోతిబా తలచాడు. స్త్రీలే పిల్లలను తీర్చిదిద్దటానికీ తద్వారా సామాజిక చైతన్యానికీ

కారకులవుతున్నారు గనుక, వారి విజ్ఞానమే దేశ సౌభాగ్యం అని గాఢంగా నమ్మి వెంటనే బాలికల పాఠశాల తెరవడానికి ఉద్యుక్తు డయ్యాడు. పూనేలో పాఠశాల ప్రారంభించాడు. అది ముఖ్యంగా నిమ్నజాతుల బాలికలకు ఉద్దేశించిన పాఠశాల. దేశంలో ఇలాంటి మొదటి పాఠశాల అదే. అలా 1848లో భార్య సావిత్రిబాయికి చదువు నేర్పించారు. ఆగస్టు 1848లో పాఠశాల నెలకొల్పారు. సావిత్రిబాయి తప్ప పాఠశాలలో పని చేయటానికి ఏ టీచరూ సాహసించలేదు.

బ్రాహ్మణవర్గాలలో ఈ విషయం గొప్ప ఆందోళనని కలిగించింది. ఇదొక విద్రోహచర్యగా భావించారు. ఒక స్త్రీ, అందునా శూద్రస్త్రీ, బయటికి రావడం అదీ పంచములకు శూద్రులకు పాఠాలు చెప్పడం బ్రాహ్మణుల దృష్టిలో ఎంతో అపచారం అయ్యింది. ఆమెను ఎన్నో అనరాని మాటలన్నారు. తండ్రిపై ఒత్తిడి తెచ్చారు. తండ్రి బడిమానేస్తేనే యింట్లో ఉండమన్నాడు. తండ్రిని, యింటిని వదిలేయడానికే నిర్ణయించుకున్నాడు పూలే. సావిత్రీబాయి భర్తను అనుసరించింది. నిధుల కొరతతో పాఠశాల మూత పడింది.

ఇంటినించి బయటకు వచ్చాక పొట్టకూటికోసం ఏదో పని వెతుక్కోవాల్సి వచ్చింది. పాఠశాల నడపడం సాధ్యం కాలేదు. ఆర్థిక పరిస్థితి కొంతమెరుగైనాక పాఠశాలను మళ్లీ తెరిచాడు. ఎవ్వరూ ఇల్లు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. చివరికి తనకు మొదటినించి సహకరిస్తూ వస్తున్న బ్రాహ్మణ మిత్రుడు గోవాండే చూపిన ఒక స్థలంలో బడి ప్రారంభమైంది. రెండు సంవత్సరాలపాటు పాఠశాల నిర్వహణ పనిలో అనుభవం గడించాక జోతిబాకు మరింత ధైర్యం వచ్చింది. అన్ని వర్గాల బాలికల కోసం 1951లో మరో పాఠశాల తెరిచారు.

1851లో 8 మంది ఆడపిల్లలతో పాఠశాల పునఃప్రారంభించారు. 1851-52లో మరో రెండు బాలికల పాఠశాలల ప్రారంభించారు. చదువుకునే ఆడపిల్లల సంఖ్య 275కి పెరిగింది. 1852-53లో నిమ్న కులాల, ముఖ్యంగా, మహర్, మాంగ్‌ల బాలబాలికల కోసం పాఠశాల ప్రారంభించారు. దాదాపు పదేళ్ళపాటు పూలే వీటిలో పనిచేశాడు. 1853లో వితంతు మహిళలకు పుట్టిన అనాధ శిశువుల కోసం సేవా సదనం ప్రారంభించారు. ఇలాంటి సంస్థ భారతదేశంలో ఇదే మొదటిది. ఇది ఎవరి ఊహకు అందని సేవ.

1852 మే నెలలో జోతిబా నిమ్న జాతులలో విద్యా ప్రచారం లక్ష్యంగా ఒక సంస్థను ఏర్పాటు చేశాడు. దీనికి సదాశివరావు గోవాండే అధ్యక్షుడు. పాఠశాలల్లో

బాలికలు బాలురలో కలిసి కూర్చోవడానికి ఒప్పుకోలేదు. అంచేత వేర్వేరు పాఠశాలలు నడపవలసి వచ్చింది.

జోతిబాను అగ్రవర్ణాల వాళ్ళు హత్య చేయించే ప్రయత్నాలు మొదలయ్యాయి. హత్యకు వినియోగించబడ్డ వాళ్లు పేదకులస్తులు. వాళ్ళ అలకిడికి నిద్రలేచిన జోతిబా పేదవాళ్ళ చేతిలో చావడం నా అదృష్టం అని నిర్భయంగా చెప్పాడు. కొంత చర్చ తర్వాత వాళ్ళు మనసు మార్చుకున్నారు. ఆ తర్వాత వాళ్ళిద్దరు అతనికి ముఖ్య అనుచరులయ్యారు.

జోతిబా దృష్టిలో కింది వర్ణాల అభివృద్ధికి బ్రిటిష్ ప్రభుత్వమే ఎక్కువ సహకారి. ఆనాడు సంఘసంస్కర్తలు చాలామంది యిలాగే భావించారు. 1857 నాటి ఈస్టిండియా కంపెనీ ఇంగ్లాండు పాలనపై దేశీయ రాజుల తిరుగుబాటును ఆయన సమర్థించలేదు. రాజుల బ్రాహ్మణుల పాలన కన్నా బ్రిటిష్ పాలనే మేలు అని చెప్పాడు. జోతిబా, సావిత్రి బాయి గారలు నిమ్నజాతుల పాఠశాలల కోసం సుమారు పది సంవత్సరాల పాటు కృషి చేశారు. అవి స్థిరపడ్డాయనుకున్న తర్వాతనే వాటినించి ఇతర సామాజిక, సేవా కార్యక్రమాలపై దృష్టి మళ్ళించారు.

ఆనాడు సతీసహగమనం వితంతు సమస్య, మూఢాచారాలు ప్రబలంగా వుండేవి. వితంతు సమస్య అగ్రవర్ణాలదే అయినా ఆ పరిస్థితిని చూసి జోతిబా చలించిపోయాడు. అభాగినులైన వితంతువుల కోసం, వారికి పుట్టిన పిల్లల కోసం జోతిబా ఒక శరణాలయం స్థాపించాడు. గర్భవతులైన వితంతువులకు సహాయం, పురుడు పోసుకునే సౌకర్యం, పుట్టిన శిశువుల్ని అక్కడే శరణాలయంలో ఉంచే అవకాశం అందించారు. ఈ వార్త పూనే బ్రాహ్మణులను క్రోధ వివశులను చేసింది.

ఆ సమయంలో జోతిబాతండ్రి గోవిందరావు పూలే జబ్బు పడ్డాడు. ఆయనకు జోతిబాకు పిల్లలు లేరని దిగులు బాధిస్తూ వచ్చింది. జోతిబాను మరో పెళ్లి చేసుకోమన్నాడు తండ్రి. సంతానం కలగలేదన్న మిషతో రెండోపెళ్ళి చేసుకోవడం పరమ నీచమైనది అని అన్నాడు పూలే. భర్త వల్ల సంతానం పొందని స్త్రీ సంతానం కోసం మరో పెళ్ళి చేసికొంటే ఆ పురుషుడు ఎంత అవమానంగా భావిస్తాడో స్త్రీ కూడా అంత అవమానంగా భావిస్తుంది అని చెప్పిన మహానుభావుడాయన.

ఆ రంధితోనే తండ్రి గోవిందరావు పూలే మరణించాడు. జోతిబా తండ్రి అంత్యక్రియలు నిర్వర్తించాడు. అయితే అందరూ చేసే విధంగా బ్రాహ్మణుల శాస్త్రాల ప్రకారం కాదు. కాకులకు పిండాలు వేసి అవి తమ పూర్వీకులకు చేరతాయని నమ్మే

మనిషి కాదు జోతిబా. బీదలకు, వికలాంగులకు అన్నదానం చేశాడు. పేద విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంచాడు.

జోతిబా నిజాయితీగా ధనం సంపాదించే వ్యక్తి. ప్రజలకోసం పాటు పడే మనిషి. తన లక్ష్యాల కోసం డబ్బు అవసరం. ప్రభుత్వంతో రాళ్ళ కాంట్రాక్టు తీసుకున్నాడు. ఆ కార్మికులతో పరిచయాలై, ఆ దోపిడీ విధానాన్ని చూసి నిరసించాడు. వారి సంఘటనల్ని పాటలుగా రాశాడు. ఈ దోపిడీని అరికట్టాలని ప్రభుత్వానికి సూచించాడు. శ్రద్ధ, కఠోరశ్రమ చేస్తే కాంట్రాక్టు పనుల్లో నిజాయితీగానే ధనం సంపాదించవచ్చునని నిరూపించాడు జోతిబా.

మహాత్మా రనడే 1871లో పూనేకు వచ్చినపుడు, జోతిబా సంఘ సంస్కరణ కార్యక్రమం చూసి ఎంతో సంతోషించాడు. పూలేనించి స్ఫూర్తిపొంది 1875లో ఆయన పండరిపూర్‌లో ఒక అనాథ శరణాలయం ప్రారంభించాడు.

జోతిబా కవి, పదకర్త, గ్రంథకర్త, నిమ్నకుల అణిచివేతపై, మూఢ విశ్వాసాలపై ఆయన రాసిన గేయాలు, పుస్తకాలు ముద్రితమై ఎంతో ప్రచారం పొందాయి. గులాంగిరి (బానిసత్వం) అనే పుస్తకం బాగా ప్రాచుర్యం పొందింది.

కింది వర్ణాలను జాగృతం చేయడం కోసం 1873 సెప్టెంబర్ 24న "సత్యశోధక సమాజ్" అనే సంస్థను స్థాపించాడు జోతిబా. దాని కృషి అమూల్యమైనది. ఆధునిక భారతదేశంలో సాంఘికోద్యమాన్ని నడిపిన తొలి సంస్థ యిది. జోతిబా "బ్రహ్మసమాజాన్ని", "ప్రార్థనా సమాజాన్ని" నిరసించాడు. భగవద్గీతలోనూ, వేదాలలోనూ తమ పూర్వీకులు చెప్పిన రాజకీయాన్నే వారు ఆధునికరణ చేసి చెప్పారని స్పష్టం చేశాడు.

రైతులకు ఆధునిక విషయాలు బోధించడంతో పాటు జోతిబా వాటికి కార్యరూపం యివ్వటం కూడా మొదలుపెట్టాడు. ఉపకార వేతనం ఆశించే విద్యార్థుల నించి దరఖాస్తులు తీసికొని పది మందికి ఉపకారవేతనాలు యిచ్చాడు. ఈ పనికి బ్రాహ్మణేతరులంతా హర్షించారు. తర్వాత పురోహితులు లేకుండా పెళ్ళి చేయించే పనిలో పడ్డాడు.

స్వామి దయానంద సరస్వతి పూనే వచ్చినపుడు వారి సన్మాన ఊరేగింపును ఛాందస బ్రాహ్మణులంతా వ్యతిరేకించారు. జోతిబా ఆ ఊరేగింపులో పాల్గొని ఆటంకాలు కలగకుండా చేశాడు.

నారాయణ మెఖంజీ లోఖండే భారతదేశ కార్మిక ఉద్యమానికి పితామహుడు.

పూలే లోఖండేతో కలిసి సత్య శోధక్ సమాజ్ ఉద్యమాన్ని నిర్మించారు. బ్రాహ్మణేతర ఉద్యమకారులలో సత్యశోధక్ ఉద్యమ నిర్మాతలైన మహాత్మ జ్యోతిరావు పూలే, బావేకర్, లోఖండే సమ ఉజ్జీలు. రైతాంగ ఉద్యమాలను నడిపారు. బ్రాహ్మణేతర కులాల వారిని సమీకరించి సాంఘిక అసమానతలకు, అణిచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమాలను నడిపారు.

జోతిబా బొంబాయి మిల్లు కార్మికులకోసం కూడా పోరాడాడు. పూణే మునిసిపాలిటీ సభ్యుడిగా కింది వర్గాల వాడలలోని ప్రజల సౌకర్యం కోసం పాటుపడ్డాడు. పూనే మున్సిపాలిటీ మద్యం విక్రయించే దుకాణాల్ని పెంచడానికి 1880లో కొత్త సారా దుకాణాలకు అనుమతి యిచ్చింది. జోతిబా మద్యపాన వ్యతిరేకి. ఈ విషయమై ఆందోళన ప్రారంభించాడు.

భారతదేశంలోని విద్యారంగ పరిస్థితులను పరిశీలించేందుకు ప్రభుత్వం 1882లో ఇండియన్ ఎడ్యుకేషన్ కమిషన్‌ను నియమించింది. దాని అధ్యక్షుడు హంటర్ పేరిట అది హంటర్ కమిషన్‌గా ప్రసిద్ధి పొందింది. దానికి జోతిబా ఒక విజ్ఞప్తి సమర్పించాడు.

పూలే 1883లో 'రైతు చేతి చెర్నాకోల' పుస్తకాన్ని రచించారు. 1884లో సత్యశోధక సమాజ్ సంస్థకు తోడుగా దీనజన సార్వజనిక సభ అనే సభని కృష్ణారావు బాలేకర్ స్థాపించాడు. జోతిబా సహాయ సహకారాలతోనే యిది ఏర్పడింది. పీడిత ప్రజల కష్టనిష్టూరాలను ప్రభుత్వానికి విన్నవించడం, మూఢాచారాల్ని, అంధ విశ్వాసాల్ని తొలగించడం ఈ సభ లక్ష్యాలు.

జోతిబాకు అరవై సంవత్సరాలు నిండ బోతున్న సందర్భంగా బొంబాయిలోని ఆయన అభిమానులు, అనుయాయులు, పెద్ద ఎత్తున సన్మానం తలపెట్టారు. 1988 మే 11న జరిగిన పెద్ద సభలో ఆయనకు **'మహాత్మా'** బిరుదునిచ్చి సన్మానించారు. ఆ సభలో ఎందరో రాజకీయ సామాజిక రంగాల ప్రముఖులు వచ్చారు. బరోడా మహారాజు సాయాజీరావు అందులో ఒకడు.

జ్యోతిబా పూలే 1869లో 'పౌరోహిత్యం యొక్క బండారం' పుస్తకాన్ని రచించారు. 1879లో తన అనాథాశ్రమం నుంచి ఒక పిల్లవాడిని దత్తత తీసుకున్నారు. 1873లో 'గులాంగిరి' పుస్తకం ప్రచురించారు. 1876లో పూనె పురపాలకసంఘ సభ్యుడిగా నియమించబడ్డారు. 1877లో మహారాష్ట్ర కరువు బాధిత ప్రాంతాల్లోని అనాథ పిల్లలను సాకేందుకు మే 17వ తేదీన సత్యశోధక సమాజం ఆధ్వర్యంలో విక్టోరియా అనాథ

శరణాలయం ఏర్పాటు చేశారు. 1879లో సత్యశోధక సమాజం తరఫున 'దీనబంధు' వారపత్రికను ప్రారంభించారు. ఈ పత్రికలోని వ్యాసాలను బాలగంగాధర తిలక్ తీవ్రంగా విమర్శిస్తూ తన పత్రికలో రాసేవాడు. 1880లో బొంబాయి నూలు మిల్లు కార్మికుల సభలో పాల్గొన్నారు. 1888 మార్చి 2వ తేదీన లండన్‌లో కన్నాట్ డచెస్ మరియు డ్యూక్ గౌరవార్థం జరిగిన కార్యక్రమంలో రైతు వేషధారణతో హాజరయ్యారు. ధనిక అగ్రవర్ణాల దోపిడిని దుయ్యబడుతూ భారతదేశానికి నిజమైన ప్రతినిధులైన పేదరైతుల కార్మికుల దయనీయ స్థితిగతుల గురించి చారిత్రాత్మక ప్రసంగం చేశారు. జోతిరావు పూలే చేసిన నిస్వార్థమైన కృషి లండన్‌లోని డైరెక్టర్ల బోర్డు వరకు తెలిసింది. అతని సేవలకు గుర్తింపుగా అతన్ని బ్రిటీష్ ప్రభుత్వం జోడు శాలువాలతో సత్కరించింది. గాంధీజీ పంచకట్టుతో రౌండు టేబుల్ సమావేశాల్లో పాల్గొనడానికి పూలేను ఆదర్శంగా తీసుకున్నారు.

జోతిబాకు జరిగిన సత్కారం, గుర్తింపు అతని కొక్కనికే కాదు. యావద్భారతదేశంలోని విద్యారంగానికి ఒక మలుపు అది. గుజరాతీ, మరాఠీ, బెంగాల్ భాషల్లో బాలికలకు పాఠశాలలు ప్రారంభమైనాయి. అంతకు ముందు బ్రిటీష్ ప్రభుత్వ పాఠశాలలో బ్రాహ్మణులకు అగ్రవర్ణాలకు మాత్రమే ప్రవేశం వుండేది. 1854లో నిమ్నజాతుల వారిని కులంపేరిట పాఠశాల ప్రవేశాన్ని నిరాకరించ కూడదని ఆదేశాలిచ్చారు.

జోతిబా సామాజిక విప్లవాన్ని ఆశించాడు. జీవితమంతా పోరాటంగా గడిపిన మనిషి అతడు. మానవత్వపు విలువలను గుర్తించి గౌరవించటానికీ, వాటికే అంకితమైపోయి ఆచరణలో పెట్టడానికి చాలాతేడా వుంది. ఒక సమస్యపై సానుభూతి చూపడం వేరు. అందులో పుట్టి పెరగడం వేరు.

ఎంత ఉదాత్తుడైనా అగ్రవర్ణాలకు చెంది తద్వారా చేకూరే సదుపాయాలు అప్రయత్నంగానే అనుభవిస్తూ, అంతస్తు, అధికారం వాటంతట అవే వచ్చిన వారు ఎన్నటికీ సాంఘిక విప్లవకారులు కాలేరు. ఈ సమాజంలో ఒక బ్రాహ్మణుడు ఎన్నటికీ సాంఘిక విప్లవకారుడు కాలేడు అన్నారు అంబేద్కర్. అలా కావడం బ్రిటిష్ రాజు సోషలిస్టు కావడం లాంటిదే. సామాజిక విప్లవకారుడుగా జోతిబా ఆలోచనలు అతని అగ్రవర్ణ మిత్రుల ఆలోచనలకు భిన్నంగా వుండేవి. అతడు మూఢనమ్మకాల్ని వ్యతిరేకిస్తూ పాఠ్య ప్రణాళికని ప్రవేశపెట్టాడు. మూఢాచారాలకు వ్యతిరేకంగా రచనలు చేశాడు.

జబ్బు పడిన జోతిబా 27-11-1890న మరణించాడు. త్యాగశీలి అయిన సావిత్రిబాయిపూలే 1897లో పూనేలో ప్లేగు వ్యాధికి గురైన వారికి సేవ చేస్తూ ప్లేగు వ్యాధితో మరణించింది. సావిత్రి పూలే చక్కని రచనలు కూడా చేశారు. మహారాష్ట్రలో సావిత్రి పూలే పేరిట ఎన్నో నిర్మాణాలు, వీధులు కనబడతాయి. జ్యోతిబా, సావిత్రి బాయి పూలే నడిపిన పాఠశాలతో ఎందరో దళిత బాలికలు, బాలలు చైతన్యవంత మయ్యారు. వీరి నుండి అంబేద్కర్ తండ్రి పొందిన స్ఫూర్తి అంబేద్కర్‌కు వారసత్వంగా అందింది.

శతాబ్దాలుగా అణిచిపెట్టబడి వున్న కింది కులాల గురించి ఆలోచించిన మొదటి నాయకుడు జోతిబాపులే. సాంఘిక, రాజకీయ, మత సంబంధమైన ఏ ఉద్యమమైనా నిజాయితీపరుడైన వ్యక్తితోనే ప్రారంభమవుతుంది. ఇలాంటి మహనీయ దంపతుల గురించి గొప్ప విద్యావేత్త, నాటక కర్త, గొప్ప దర్శకుడైన ఆచార్య పి.కె.ఆత్రే "మహాత్మా జోతిరావ్ పూలే" జీవిత చరిత్రను సినిమాగా తీశారు. ఆయన ప్రయత్నాన్ని డా॥అంబేద్కర్ ఎంతగానో అభినందించారు. జోతిరావుపూలేను తన గురువుగా భావించుకొని ఆయన ఉద్యమ స్ఫూర్తితో పురోగమించిన వారిలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ అగ్రగణ్యుడు. గాంధీకి కూడా పూలే ఒక ఆదర్శం.

చరిత్రకారుడుగా మహాత్మా జ్యోతిబా పూలే

మహాత్మా జ్యోతిబా పూలే భారతీయ చరిత్రను బహుజనుల కోణంలో, మూలవాసుల కోణంలో అధ్యయనం చేశారు. ఆర్యులు, బ్రాహ్మణులు విదేశాల నుండి వచ్చారని నిరూపించారు. దశావతారాలను అందుకు సాక్ష్యంగా తీసుకుని వ్యాఖ్యానించారు. బాలగంగాధర్ తిలక్ ఆర్యులు ఉత్తర ధృవం నుండి, హిమాలయాల నుండి వలస వచ్చారని సిద్ధాంతీకరించారు. దాన్ని తిలక్‌కు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాడు పూలే. ఆంగ్లేయుల బానిస మనస్తత్వంతో ఆంగ్లేయులతో సమానం అనిపించుకోవాలని ఆర్యులు కూడా ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చినవారని వారి మూలం ఉత్తర ధృవం నుండి మానస సరోవరం, టిబెట్ దాకా అని తిలక్ పేర్కొన్నాడు. అందువల్ల వాళ్లంతా విదేశీయులే అని, వాళ్లే బ్రాహ్మణ వాదులని స్పష్టం చేశాడు పూలే.

పెళ్లి మొదలైన శుభ కార్యాలకు, మరణానంతర కర్మకాండలకు వ్యయం, అట్టహాసం లేకుండా వుండటం, శ్రామికుల సంస్కృతిని మన్నిస్తూ అందులోంచి మత సంబంధమైన అంశాల్ని వీలయినంత తగ్గించడం, పోరాటకారుల్ని వారి చరిత్రను అగ్ర వర్ణ భావజాలంలో సంస్కృతీకరించకుండా సామాన్య ప్రజల దృక్పథంలోంచి

వ్యాఖ్యానించడం ప్రభుత్వోద్యోగాల్లో అగ్రవర్ణ, అగ్రవర్ణ ఆధిపత్యాన్ని సర్వత్రా ఎదుర్కోవడం అంతిమంగా శ్రామికులకు సహకరించడం - పూలే చెప్పిన అంశాల్లో కొన్ని." (జ్యోతిరావు పూలే - రోజలిండ్ ఓ హాన్‌లన్)

డా. కత్తి పద్మారావు ఇలా పేర్కొన్నారు, "జ్యోతిరావు గోవిందరావు పూలే 19వ శతాబ్దపు మహారాష్ట్రలోని శూద్రుల, అతి శూద్రుల, ప్రవక్త, మహర్షి, మహాత్యాగి, మానవతావాది, అనాసక్త కర్మయోగి, క్రాంతదర్శకుడు, న్యాయసాధనలో మహాసాహసి, మహాత్మా గాంధి చేతనే మహాత్ముడని ప్రస్తుతింపబడ్డ మహా మహితాత్ముడు. ఈ శతాబ్దంలో సామాన్యుడికి సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాటం సలిపిన మహాయోధుడు డా॥బి.ఆర్.అంబేద్కర్ గారు తనకు ముగ్గురు గురువులని వారు బుద్ధుడు, కబీరు, మహాత్మా పూలే అని పేర్కొన్నారు. మహాత్ముల్లో మహాత్ముడు మహాత్మా జ్యోతిరావు పూలే."

సెప్టెంబరు 24వ తేదీ భారతీయ బహుజనులకు అతి పెద్ద పండుగ రోజు. ఆధునిక చరిత్రలో తొలిసారిగా ఈ దేశ శూద్రులకు (బీసీ లకు), అతి శూద్రులకు (ఎస్సీలకు) తమదైన సంస్థ ఏర్పడిన రోజు. "సత్యశోధక సమాజ్" పుట్టినరోజు. 1873వ సంవత్సరంలో సెప్టెంబర్ 24వ తేదీన "సత్యశోధక్ సమాజ్" ఏర్పడిన రోజునే ఆ సంస్థ స్థాపకుడు, ఆధునిక భారత తొలి సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబా పూలే పుట్టిన రోజును కూడా జరుపుతున్నారు.

"మహాత్మా జ్యోతిబా పూలే నిమ్న వర్గాల కులాల ప్రజలకై దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ భావజాలం కోసం జరిగే అన్వేషణకు భూమిక సిద్ధం చేశాడు. మార్క్సు ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు మ్యానిఫెస్టో రాస్తున్న సమయంలోనే ఈ దేశంలోని దోపిడిని, కుల వ్యవస్థను, సామాజిక అణిచివేతను వ్యతిరేకిస్తూ రచనలు చేయడంతో పాటు ఆచరణను కూడా ప్రారంభించాడు పూలే, మార్క్సు, సమకాలికులు. ఇద్దరు వేర్వేరు పరిస్థితులలో పనిచేశారు.

మహాత్మా జ్యోతిబా పూలే కులవ్యవస్థ చేసిన కట్టడులను, అణిచివేతను, అమానుషత్వాన్ని స్వయంగా అనుభవించి వున్నాడు. దాన్నించి ఆయన ఈ దేశంలోని నిజమైన శ్రామికవర్గ ప్రత్యామ్నాయ దార్శనికతను అందించాడు."

అర్థశాస్త్రవేత్తగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

ఇందులో చర్చించిన అంశాలు

1. భారతీయ సామాజిక అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
2. భారతీయ రాజకీయ అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
3. భారతీయ సామాజిక సంక్షేమ అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
4. ప్రణాళికాబద్ధ అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
5. భారతీయ ప్రయోజనాలు కేంద్రంగా అంతర్జాతీయ అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
6. భారతీయ ద్రవ్య (ఫైనాన్షియల్) అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
7. భారతీయ పట్టణీకరణ అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
8. భారతీయ సామాజిక అభివృద్ధి శాస్త్రవేత్తగా అంబేడ్కర్
9. భారతీయ సామాజిక నిర్మాణాన్ని (సోషల్ స్ట్రక్చర్) మార్చే అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
10. మతానికి, కులానికి, భావజాలానికి అర్థశాస్త్రానికి గల సంబంధాన్ని పట్టించుకున్న అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్
11. సామాజిక కార్యకర్తగా అర్థశాస్త్రాన్ని సామాజిక శాస్త్రంగా చర్చించిన అంబేడ్కర్
12. బుద్ధిస్ట్ అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్

కాకతీయ యూనివర్సిటీ, వరంగల్‌లో 6,7 మే 2006
అంబేడ్కర్‌పై జాతీయ సెమినార్‌లో సమర్పించిన పత్రం

సామాజిక సమస్యల పట్ల, కులం పట్ల, హిందూమతం పట్ల, రాజ్యాంగ నిర్మాణం పట్ల అంబేడ్కర్ చేసిన కృషి ఎక్కువగా ప్రాచుర్యం పొందింది. డా॥ బి. ఆర్. అంబేడ్కర్ అర్థశాస్త్రంలో చేసిన కృషిని ఎక్కువగా పరిశీలించడం జరగలేదు. ప్రజలకు అంబేడ్కర్ అర్థశాస్త్రవేత్తగా తెలిసింది తక్కువ. అంబేడ్కర్ అర్థశాస్త్రవేత్త కావడంవల్లే కులం అర్థశాస్త్రంలో నిర్వహించే పాత్రని స్పష్టంగా గమనించి కుల నిర్మూలన తత్వవేత్తగా ఎదిగాడు. కుల నిర్మూలన, బౌద్ధ స్వీకారం, ప్రజాస్వామ్య పరిపాలనావిధానం మొదలైనవి అంబేడ్కర్ అర్థశాస్త్రవేత్తగా చేసిన కృషిని కూడా వివరిస్తాయి. రూపాయి సమస్య గురించి, ఎగుమతి, దిగుమతుల గురించి, భూములను జాతీయం చేయడం గురించి, ఇన్సూరెన్స్ కంపెనీలను, భారీ పరిశ్రమలను జాతీయం చేయడం గురించి, బహుళ పార్టీ వ్యవస్థలో సామాజిక సమానత్వం, రాజకీయ సమానత్వం, ఆర్థిక సమానత్వం సాధించడం గురించి అంబేడ్కర్ విస్తృతమైన రచనలు చేశారు. వాటన్నిటినీ క్రోడీకరించినపుడు అర్థశాస్త్రవేత్తగా అంబేడ్కర్ స్పష్టమౌతాడు.

డా॥ బి.ఆర్. అంబేడ్కర్ విద్యార్థి దశలో అర్థశాస్త్రం అధ్యయనం చేశారు. అర్థశాస్త్రంపై ఆయన తొలి పరిశోధన వ్యాసం తన 24వ ఏట 1913లో రాశారు. 'ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలన – ఆర్థిక విధానం' అనే థీసిస్ ఎమ్.ఏ. డిగ్రీ కోసం సమర్పించారు. ఇదే అంబేడ్కర్ రాసిన తొలి వ్యాసం. బ్రిటిష్ ఇండియాలో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ పరిణామం – సామ్రాజ్య ఆర్థిక వ్యవస్థ రాష్ట్రీయ వికేంద్రీకరణపై ఒక అధ్యయనం అనే శీర్షికతో 1924లో రెండవ గ్రంథం రాశారు. కొంచెం అటూ ఇటుగా రూపాయి సమస్య – భారత కరెన్సీ బ్యాంకింగ్ చరిత్ర గురించిన గ్రంథం కూడా వెలువరించారు. కరెన్సీ మారకం, 1926లో పన్ను విధింపు విధానాల పరిశీలనా సంఘం నివేదికపై సమీక్ష రాశారు.

వస్తుమార్పిడి భారతదేశ సాంఘిక బీమా గురించి భారత కరెన్సీ మరియు ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన రాయల్ కమీషన్ ఆర్థిక వ్యవస్థను పరిశీలించి భారతీయ కరెన్సీ విధానంలో మార్పులను సూచించేందుకు 1924 – 25 మధ్య భారతదేశాన్ని సందర్శించిన సందర్భంగా డా॥ అంబేడ్కర్ వారి ప్రశ్నావళిని, సాక్ష్యాన్ని, స్టేట్‌మెంట్లను రికార్డు చేసి సమర్పించారు. ప్రాచీన భారతీయ వాణిజ్య, మధ్యప్రాచ్యంలో భారతదేశ వాణిజ్య సంబంధాలు మధ్యయుగాల్లో భారతదేశ వాణిజ్య సంబంధాలు బ్రిటిష్ రాజ్యపరిపాలన అనే అంశాలను తీసుకుని 1913–15లో ఎమ్మే పట్టా కోసం తొలుత పరిశోధన చేశారు. అంబేడ్కర్ ఇలా అర్థశాస్త్రం గురించి సుమారు వెయ్యి పేజీలకు పైగా పరిశోధన, నిర్ధారణలు చేశారు. ఇవి అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు

6, 12వ సంపుటాలలో సంకలనం చేయబడ్డాయి.

అంబేద్కర్ సామాజిక కార్యకర్తగా ఎదగకముందు విద్యార్థి దశలో అర్థశాస్త్రం గురించి ఎక్కువగా పరిశోధన చేశారు. ఆయన అర్థశాస్త్రంలో పీ. హెచ్‌డీ తీసుకున్నారు. అయితే, సామాజిక కార్యకర్తగా పనిచేసే క్రమంలో అర్థశాస్త్రం దానికదే స్వతంత్రమైనది కాదని సామాజిక వ్యవస్థకు, ప్రభుత్వ విధానాలకు, పరిపాలనకు, మతానికి, కులానికి, భావజాలానికి, అర్థశాస్త్రాన్ని శాసించే స్వభావం వుందని సామాజిక శాస్త్రాలన్ని సౌకర్యం కోసం విడగొట్టి పరిశీలిస్తున్నవే తప్ప జీవితంలో సమాజంలో అవన్నీ పరస్పర ఆధారితాలేనని కలిసే ఉన్నాయని గమనించి అంబేద్కర్ వాటన్నిటినీ పట్టించుకున్నారు. పరిశోధించి విశ్లేషించారు.

1. భారతీయ సామాజిక అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అందువల్ల అంబేద్కర్‌ను మిగతా రచనలను, మొత్తం సామాజిక ఆచరణను పరిశీలించినప్పుడు ఆయనని అర్థశాస్త్రంలో సామాజిక అర్థశాస్త్రవేత్తగా వర్గీకరించవచ్చు. అర్థశాస్త్రం నుండి అంబేద్కర్ తత్వశాస్త్రం వేపు, సామాజిక శాస్త్రం వేపు, మరలి వర్ణవ్యవస్థను, కులవ్యవస్థను, హిందూ మత వ్యవస్థను సీరియస్‌గా పట్టించుకున్నారు. అలా సామాజిక తత్వవేత్తగా పరిణామం చెందారు. ఇవన్నీ భారతీయ సమాజం ఒక మొత్తంగా అభివృద్ధి చెందడం కోసం అడ్డంకిగా వున్న వాటిని పరిష్కరించడం కోసం చేసిన కృషిలో భాగమే. శతాబ్దాల తరబడి మెజార్టీ ప్రజానీకాన్ని కొన్ని పనులకే పరిమితం చేసి ఉత్పత్తి శక్తులను, మేధస్సును అభివృద్ధి చెందకుండా అడ్డుకుంటున్న కర్మ, పునర్జన్మ, వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ సిద్ధాంతాలను చీల్చిచెండాడారు. భారతదేశం ప్రపంచంలో ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి ఇవన్నీ అడ్డంకిగా వుంటూ మానవ వనరులను నిరుపయోగంగా మార్చుతూ పేదరికంలోకి నెట్టివేస్తున్నాయని స్పష్టంగా ప్రకటించారు. అలా సామాజిక అర్థశాస్త్రం పరిధిలోకి చాలా విషయాలను చేర్చి సుసంపన్నం చేశారు. కొందరు వీటిని అలా భావించకుండా భావజాల చర్చగా చర్చించి అంబేద్కర్ సామాజిక ఆర్థిక లక్ష్యాలను వదిలివేస్తుంటారు. అంబేద్కర్ అర్థశాస్త్రవేత్తగా, సామాజిక శాస్త్రవేత్తగా వీటన్నిటినీ పట్టించుకోవడం అనివార్యమైంది.

2. భారతీయ రాజకీయ అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్ గతంలోని అర్థశాస్త్రాల మంచిని స్వీకరించాడు.

తనదైన కోణంలో అర్థశాస్త్రాన్ని అభివృద్ధి పరిచాడు. కొందరు అర్థశాస్త్రాన్ని పెట్టుబడి, సరుకులు, లాభాలు, శ్రమశక్తి, అదనపు విలువ, రాజ్యం మొదలైనవాటి ద్వారా పరిశీలించారు. రికార్డో, మార్క్స్, ఏంగెల్స్‌లు పెట్టుబడి, సరుకులు, లాభాలు, శ్రమశక్తి, అదనపు విలువ, రాజ్యం మొదలైనవాటి ద్వారా సమాజాన్ని, సామాజిక వ్యవస్థను పరిశీలించారు. చివరకు ఆర్థిక వ్యవస్థే సామాజిక వ్యవస్థను నిర్ణయిస్తుంది అనేదాకా వాళ్లు వెళ్లారు. మరికొందరు ప్రభుత్వం పాలకవర్గాలు, వారి సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి అర్థశాస్త్రం పరిధిగా పరిశీలించారు.

ప్రభుత్వం, సమాజం, కులం, వర్గం, వ్యవసాయ కమతాలు, పారిశ్రామిక యాజమాన్యం మొదలైనవి ఎవరి ఆధిపత్యంలో వుంటాయో వారే ఆర్థికంగా సామాజికంగా ప్రయోజనాలు పొందుతూ ఇతరులను ఎలా శాసిస్తారో స్పష్టం చేశారు. అందువల్ల అంబేద్కర్ ఒక అర్థశాస్త్రవేత్తగా భారతదేశంలోని అన్ని సమస్యలను, అన్ని కోణాలను భారతీయ ప్రయోజనాలు కేంద్రంగా విశ్లేషించారు. మూఢవిశ్వాసాలుగా పాతుకుపోయిన హిందూ బ్రాహ్మణవాదాలను, వర్ణ కుల వ్యవస్థ సిద్ధాంతాలను రాజ్యాధికారంలో వాటాను తీవ్రంగా పట్టించుకున్నారు. రిజర్వేషన్లు కూడా అర్థశాస్త్రంలో భాగం అని అంబేద్కర్ భావించారు.

అంబేద్కర్ రాజకీయాలకు, పరిపాలన విధానానికి, అర్థశాస్త్రానికి, అభివృద్ధికి ప్రజల జీవన పరిణామాలకు మధ్య గల సంబంధాలను లోతుగా పరిశీలించారు. భారతీయ ప్రాచీన వాణిజ్యం గ్రంథంలో యుద్ధాలు, ఆ యా ప్రాంతాలపై ఆధిపత్యం, సరుకుల రవాణా సాధనాలు మొదలైనవి సమాజాలను, మతాలను, ప్రజల జీవితాలను, దేశాలను ఎలా పలు మార్పులకు లోనుచేశాయో భారతదేశం కేంద్రంగా పరిశీలించారు. మార్క్స్, ఎంగెల్స్‌లు, యూరప్, అమెరికా అర్థశాస్త్రవేత్తలు యూరప్ అమెరికా రాజకీయ సామాజిక అధికార కేంద్రానికి అనువుగా సామాజిక శాస్త్రాలను, అర్థశాస్త్రాలను పరిశీలించారు. మరో రకంగా చెప్పాలంటే ఆసియా దేశాల సామాజిక శాస్త్రాలను, అభివృద్ధిని, పరాయీకరించే, సేకరించే, అణిచివేసే విధానాల కనువుగా వారు చర్చించారు. అంబేద్కర్ ఇందుకు భిన్నంగా భారతదేశం కేంద్రంగా, ఆసియా దేశాల కేంద్రంగా తన పరిశీలనను చేస్తూ యూరప్ దేశాలు వీటిని ఎలా దోపిడి చేశాయో, అణిచివేశాయో సోదాహరణంగా వివరించారు. అందువల్ల అంబేద్కర్ అర్థశాస్త్రానికి పాశ్చాత్య అర్థశాస్త్రాలకు మధ్య మౌలికమైన భేదం వుంది.

అంబేద్కర్ రాజకీయ అర్థశాస్త్రవేత్తగా భారతదేశ చరిత్రను, ఉత్పత్తి విధానాలను, కులవృత్తులను, ముస్లిం దండయాత్రలను, యూరప్ వలసలను, వారి దోపిడీని

నిశితంగా పరిశీలించారు. రోమన్ చక్రవర్తులు తమ ఖడ్గాన్ని ప్రాచ్య, పాశ్చాత్య దిశలు రెండింటి వైపు ఝుళిపించారు. ఫలితాలు వేరు అని, తూర్పున "వారు జయించినది శిక్షించడానికి మాత్రమే" అని, పశ్చిమాన తమ పాలితులను రోమనైజ్ చేయాలని భావించారని అంబేద్కర్ పేర్కొన్నారు. ఇలా ప్రాచీన కాలంలోని వాణిజ్య సంబంధాలు మొదలుకొని బ్రిటిషు కాలం వరకు భారతీయ వాణిజ్య ఆర్థిక అంశాలను భారతదేశ కేంద్రంగా పరిశీలించారు.

అంబేద్కర్ ప్రాచీన భారతదేశంలో వ్యవసాయిక వ్యవస్థ, శ్రమశక్తి పరిశ్రమలు, వాణిజ్యం, వాటి నిర్వహణ ఎలా వుందో పరిశోధించారు. రవాణా సాధనాలు, నదీమార్గాలు, రహదారి బిడారులు, వాణిజ్యంలో నిర్వహించే పాత్రను చర్చించారు. భారతదేశంలో డబ్బు ఎలా ప్రవేశించిందో వివరిచారు. పురాతన కాలం నుండి వున్న వస్తుమార్పిడి పద్ధతి, గోవుల లెక్కన బియ్యం కొలతల లెక్కన అంచనా వేసే పద్ధతిలో క్రమంగా లోహద్రవ్యం వాడకంలోకి వచ్చిందని బౌద్ధ సాహిత్యం నమోదు చేసిన విషయాన్ని పేర్కొన్నారు. గౌతముని ప్రకారం రుణాలపై ఆరు రకాల వడ్డీలుండేవి అని వివరించారు.

చరిత్ర ఆరంభ దినాలనుండి హిందూ మహా సముద్రం ఉత్తర భాగంలో రాకపోకలు జరుగుతున్నాయని సోదాహరణంగా వివరించారు. ప్రాచీన భారత వాణిజ్య కార్యకలాపాలలో బాబిలోనియా అవతరణ పెద్ద మలుపు అని గమనించారు. గ్రీకు, రోమన్, బాబిలోనియా, మెసపొటేమియా నాగరికతలతో భారతదేశం వర్తక వాణిజ్యాలు ఎలా కొనసాగించిందో చారిత్రకంగా నిర్ధారించారు. ఇస్లాం అవతరణ పశ్చిమ ఐరోపా విస్తరణ ఆర్థిక రాజకీయ వర్తక వాణిజ్యాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆ కాలపు ఆర్థిక శక్తుల ప్రోద్బలంతోనే మహమ్మదీయ మతాన్ని కొత్తగా స్వీకరించినవారు (క్రీ.శ.668–675లో) కాన్‌స్టాంట్‌నోపుల్‌ను ముట్టడించారు. కాన్‌స్టాంట్‌నోపుల్‌పై ఎవరి ఆధిపత్యం వుందో వారు ఆసియా, యూరప్ దేశాల ఆర్థిక వ్యవస్థలను, వర్తక వాణిజ్యాలను శాసించేవారు. ఇలా రాజకీయ సాంఘిక పరిణామాలు అర్థశాస్త్రంలో నిర్వహించిన పాత్రను చారిత్రకంగా అంచనా వేశారు.

బ్రిటిష్ రాజ్యపాలన నాటికి ఇండియా ఆర్థికంగా ఎంత ఉన్నతంగా వుండేదో చక్కగా వివరించారు. ఇంగ్లాండులోని సౌభాగ్యానికి భారతదేశం ఎంతో దోహదం చేసింది. లేదా భారతదేశం చేత దోహదం చేయించుకున్నారనో అనడం సబబు అంటారు అంబేద్కర్. బ్రిటిష్ వలసవాదులు భారతదేశాన్ని ఇక్కడి వర్తకాన్ని కులవృత్తులను ప్రణాళికాబద్ధంగా ఎలా ధ్వంసం చేస్తూ వచ్చారో బ్రిటిష్ రికార్డుల

ఆధారంగానే నిర్ధారించారు. యూరప్ పరిశ్రమల ఉత్పత్తులను అమ్ముకునే మార్కెట్‌గా మార్చడానికి భారతదేశాన్ని ఎంతగా ధ్వంసం చేశారో అంబేద్కర్ నిర్ధారించిన తీరు సమగ్రమైనది. రాజకీయ సామాజిక పరిణామాలన్నిటిని అర్థశాస్త్రంలో భాగంగా వివరించిన తీరు అంబేద్కర్ అర్థశాస్త్ర పరిశీలన విధానానికి ఒక విశిష్టతను సాధించిపెట్టింది.

3. భారతీయ సామాజిక సంక్షేమ అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అంబేద్కర్ సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయం, సామాజిక మార్పు, సమానత్వం, స్వేచ్ఛ దృష్టితో అర్థశాస్త్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ఎలా వుండాలి? సామాజిక వర్గాలు ఎలా వున్నాయి? సామాజిక న్యాయం కోసం పంపిణీ వ్యవస్థ ఎలా వుండాలి? అధికారాలు ఎలా ఎవరిచేతుల్లో వుండాలి? మొదలైనవి అంబేద్కర్ అర్థశాస్త్రంలో సీరియస్‌గా పట్టించుకున్నారు. అందువల్ల అంబేద్కర్ అర్థశాస్త్రాన్ని సాంఘిక సంక్షేమ అర్థశాస్త్రంగా నిర్వచించవచ్చు.

సాంఘిక సంక్షేమమే అంబేద్కర్ అర్థశాస్త్రంలోని మౌలిక అంశం. ఆధునిక అర్థశాస్త్రవేత్తలు చాలామంది పాశ్చాత్య దేశాలను వాటి అభివృద్ధిని, ప్రయోజనాలను, వారి అవసరాలను, వారి వనరులను, జీవన విధానాన్ని కేంద్రంగా చేసుకుని అర్థశాస్త్రాలను రచించారు. వాటిని చాలామంది యథాతథంగా భారతదేశానికి అన్వయించడానికి సరిపోతాయని భావించి ఆచరణలో పెట్టారు. డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఇందుకు భిన్నంగా భారతదేశాన్ని కేంద్రంగా చేసుకుని, దేశీయ ప్రయోజనాలను, వనరులను, జీవన విధానాలను, అవసరాలను, సంస్కృతిని, కుల వివక్ష తాలూకు అసమానతలను దృష్టిలో ఉంచుకుని భారతీయ అర్థశాస్త్రాన్ని సాంఘిక సంక్షేమ అర్థశాస్త్రంగా మలిచారు.

స్వర్గ మార్గం వలెనే సాంఘిక సంస్కరణా మార్గం కూడా క్లిష్టమయిన ముళ్లబాటే. కులం అనే రాకాసి ఈ దారిలో అడ్డు తగులుతూ ఉంటుంది. ఈ రాకాసిని సంహరించే వరకూ రాజకీయ సంస్కరణలూ రావు, ఆర్థిక సంస్కరణలూ ఉండవు అని డా॥బి.ఆర్.అంబేద్కర్ స్పష్టం చేశారు. అర్థశాస్త్రానికి ఉన్న పరిమితి ఏమిటో అంబేద్కర్‌కు చాలా స్పష్టంగా తెలుసని ఈ మాట స్పష్టం చేస్తున్నది.

4. భారతీయ ప్రణాళికాబద్ధ అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అంబేద్కర్ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని ప్రతిపాదించిన అర్థశాస్త్రవేత్త కూడా.

స్వాతంత్ర్యానికి పూర్వం నుండి బ్రిటిష్ పరిపాలనలో, సంస్థానాల్లో జరగాల్సిన ఆర్థికాభివృద్ధి గురించి పలు సూచనలు చేశారు. నిజాం రాజ్యం గురించి కూడా నిజాం రాజుగారికి అనేక సూచనలు చేశారు. ఇవన్నీ అంబేద్కర్ సంకలిత రచనల్లో ఇంకా చేర్చవలసి వున్నది. జీవితమంతా చేసిన కృషి సంకలనాల్లో చేర్చడం ఎప్పటికీ పూర్తికాకపోవచ్చు. అందువల్ల సామాజిక ఆచరణ నుండి ఆనాటి వారి భావాలను క్రోడీకరించడం అవసరం అవుతుంది.

అంబేద్కర్ స్వాతంత్ర్యానంతరం రష్యా వలె ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరగాలని స్పష్టమైన దృక్పథాన్ని వెలిబుచ్చారు. నెహ్రూ దృష్టి కూడా అదే. ప్రధానమంత్రిగా నెహ్రూకు అంతకుముందు లేని ప్రాధాన్యత కొన్ని వందల రెట్లు పెరిగి నెహ్రూ పేరిట చాలా విషయాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. అలా నెహ్రూ ఆర్థిక విధానం, గాంధీ ఆర్థిక విధానం అంటూ దేశంలో చర్చ జరిగింది. పాఠ్యపుస్తకాలకు ఎక్కింది. రామ్‌మనోహర్ లోహియా, మావో, గాంధీ గ్రామీణ అభివృద్ధి ముఖ్యం అని అధికార వికేంద్రీకరణ, పారిశ్రామిక వికేంద్రీకరణ కోరారు. అంబేద్కర్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పాత ఉత్పత్తి విధానాలు, గ్రామాలు వర్ణవ్యవస్థను, కుల వివక్షతను, మళ్ళీమళ్ళీ ఉత్పన్నం చేస్తాయని అంబేద్కర్ భావించారు.

స్వాతంత్ర్యానంతరం గాంధీ విధానాలను కాంగ్రెస్ వాళ్లు వదిలేసినట్లుగానే అంబేద్కర్‌ను కూడా కావాలని వదిలివేశారు. వేలాది గ్రంథాలను అధ్యయనం చేసి అర్థశాస్త్రంలో విశేష కృషి చేసిన అంబేద్కర్ ఆర్థిక విధానం అంటూ ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం వుంది.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉండడంవల్ల వారి నాయకుల చిన్న చిన్న మాటలనే ఆర్థిక సిద్ధాంతాలుగా ఎంతో ప్రచారం చేసుకున్నారు. అంబేద్కర్‌లాగా తర్వాత కాలంలో ఆలోచించినవారు కూడా చాలా తక్కువ. ఇప్పటికైనా ఆ యా సందర్భాలలో గాంధీ, నెహ్రూ, వెలిబుచ్చిన అభిప్రాయాలను వారి ఆర్థిక సిద్ధాంతాలుగా క్రోడీకరించినట్టుగా అంబేద్కర్ అభిప్రాయాలను క్రోడీకరించడం అవసరం. ప్రణాళికాబద్ధంగా సామాజిక న్యాయంలో అణిచివేతకు గురైన వారికి అంతే ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక అవకాశాల ద్వారా అభివృద్ధి చెందించాలని రిజర్వేషన్లను అందుకు సాధనంగా అంబేద్కర్ భావించారు.

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం ప్రణాళికా సంఘం, పంచవర్ష ప్రణాళికలు ఎంతగానో అవసరమని భావించినవారిలో అంబేద్కర్ ఒకరు. సమాజానికవసరమైన

ఉత్పత్తులకు, సేవలకు ప్రోత్సాహకాలుగా అవసరమైనప్పుడు సబ్సిడీలు ఇవ్వడం ఎంతో అవసరమని భావించాడు. రిజర్వేషన్ల సిద్ధాంతం, సబ్సిడీ సిద్ధాంతం రెండూ ఒకే కోవకు చెందినవి. మానవ వనరులకు పనికల్పన, నీటిపారుదల సౌకర్యాల అభివృద్ధి, విద్యుత్తు ఉత్పాదన, మౌలిక భారీ పరిశ్రమల అభివృద్ధి, భారీ నీటి ప్రాజెక్టుల అభివృద్ధి భారతీయ ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. పన్నుల వ్యవస్థ ఎలా వుండాలో అంబేద్కర్‌కు కొన్ని స్పష్టమైన అభిప్రాయాలున్నాయి.

బ్యాంకులను, ఇన్సురెన్స్ కంపెనీలను జాతీయం చేయాలని భారీ పరిశ్రమలు ప్రభుత్వ యాజమాన్యంలో వుండాలని అంబేద్కర్ భావించారు. భూమిని జాతీయం చేసి భూయజమానులకు డెవిడెంట్లు ఇవ్వాలని తద్వారా శాంతియుతంగా భూమి బదలాయింపు జరిగిపోతుందని విద్యార్థి దశలోనే అంబేద్కర్ భారతదేశంలో భూమి సమస్యపై చక్కటి సూత్రీకరణలను అందించారు.

రిజర్వేషన్ల ద్వారా ఆధునిక అభివృద్ధిని వెనుకబడిన ఆదివాసి, దళిత జాతులు అందుకోవడానికి ఇతోధికంగా కృషి చేశారు. తద్వారా వ్యవసాయంపై మనుషుల ఒత్తిడి తగ్గి వ్యవసాయంపై మనుషుల భారం తగ్గింది. అంబేద్కర్ బ్రిటిష్ వాళ్లు భారతదేశంలోని వృత్తులను వారి పారిశ్రామిక సరుకుల అమ్మకానికనువుగా అధిక పన్నుల ద్వారా ఇతరత్రా అణిచివేయడం వల్ల వృత్తులు కోల్పోయిన వాళ్లంతా వ్యవసాయంలోకి మళ్ళారని తద్వారా వ్యవసాయంపై మనుషుల ఒత్తిడి మునుపు ఎన్నడూ లేనంతగా పెరిగిందని స్పష్టం చేశారు.

ఆధునిక అభివృద్ధిలో వాటా పొందే పోరాటాలు చేయడం ద్వారా అంబేద్కర్ బ్రిటిష్ వాళ్ల వల్ల వ్యవసాయంపై, భూమిపై పెరిగిన ఒత్తిడిని చాలామేరకు తగ్గించగలిగారు. కాని కొందరు కమ్యూనిస్టులు, నక్సలైట్లు భూమిపై బ్రిటిష్‌వాళ్ల విధానాల వల్ల పెరిగిన మనుషుల ఒత్తిడిని అధ్యయనం చేయక దున్నేవారికే భూమి అని భూమి మీద మరింత ఒత్తిడిని పెంచి భూస్వాములు ఆధునికాభివృద్ధిని అందుకోవడానికి పరిగెత్తేవిధంగా చేసి ఆధునికాభివృద్ధిని అందుకోవాల్సిన ప్రజలు భూమిలోకి కూరుకుపోయే విధంగా మార్చారు. ఇలా కమ్యూనిస్టులు, నక్సలైట్లు భారతదేశంలో పాలకవర్గాల ప్రయోజనాలకనువుగా వారిని ఆధునిక అభివృద్ధిని అందుకోవడానికి తరిమే వారుగా వారి కృషి కొనసాగింది. ఈ దృష్టితో చూసినప్పుడు రిజర్వేషన్లు సాధించిన సామాజిక పరిణామాలు ఎన్ని కోణాల్లో పరిశీలించవలసివున్నదో తెలుస్తుంది.

5. భారతీయ ప్రయోజనాలు కేంద్రంగా అంతర్జాతీయ అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అంబేద్కర్ ప్రాచీన ప్రపంచ వాణిజ్య చరిత్రను విస్తారంగా అధ్యయనం చేశారు. సైమన్ కమిషన్‌కు ఇచ్చిన నివేదికలో వీటిని విస్తారంగా రికార్డు చేశారు. ప్రపంచ చరిత్రలో భారతదేశం నిర్వహించిన పాత్ర మహోన్నతమైనదని, ప్రపంచ నాగరికతలకు, సంస్కృతికి భారతదేశం చేర్పు కీలకమైనదని పలు విధాలుగా నిర్ధారించారు. చరిత్రను, వర్తకాన్ని, మతాన్ని, దండయాత్రను, యుద్ధాలను, నాగరికతలను పరిశీలించి అంతర్జాతీయ భారతీయ చారిత్రక, ఆర్థిక దృక్పథం ఎలా వుండాలో మార్గం సూచించారు.

అయితే, స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్ ప్రభుత్వంలో, ఉద్యోగ రంగాలలో చేరిన కులాలవాళ్లు, వర్గాలవాళ్లు ఆ యా కులాల కనువుగా, మరికొందరు పాశ్చాత్య సామాజిక ఆర్థిక సిద్ధాంతాల కనువుగా అంతర్జాతీయ భారతీయ చారిత్రక ఆర్థిక దృక్పథాన్ని ఆచరించారు. తద్వారా దేశం తాత్వికంగా, చరిత్ర అధ్యయన శాస్త్రంలో, ఆర్థిక చరిత్ర అధ్యయన శాస్త్రంలో విదేశాలకు దాసోహం అనే విధంగా వారి ఆధిక్యతను అంగీకరించే విధంగా క్రమక్రమంగా పరిణామం చెందుతూ చివరకు గాట్, గ్లోబలైజేషన్ ఒప్పందాలతో పరాధీన దేశంగా మారే క్రమం స్థిరపడింది. అంబేద్కర్ అర్థశాస్త్రాన్ని అంతర్జాతీయ దృక్పథంగా స్వీకరించి వుంటే ఈ దుస్థితి వచ్చి వుండేది కాదు అని ఆయన రచనలు స్పష్టం చేస్తాయి.

6. భారతీయ ద్రవ్య (ఫైనాన్షియల్) అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

శతాబ్దాలుగా భారతదేశంలో వస్తుమారకం స్థానంలో ద్రవ్యం ప్రవేశించిన తర్వాత నాణాల చలామణీ ఎలా సాగిందో అంబేద్కర్ విశ్లేషించారు. బంగారు, వెండి, రాగి నాణాలను రాజులు ముద్రించడంలో తీసుకున్న ప్రమాణాలు ఏమిటో చర్చించారు. ముస్లిం రాజులు, బ్రిటిష్ పరిపాలకులు నాణాల విడుదలలో, విలువలలో పాటించిన సూత్రాలను అవి వర్తక వాణిజ్యాల్లో, ప్రజల జీవితాల్లో వేసిన ప్రభావాలను అంబేద్కర్ మనముందుంచారు.

బ్రిటిష్ ద్రవ్యవిధానాల్లో ఇండియా బ్రిటిష్ ఆర్థిక సంబంధాల్లో రూపాయి విలువను ఎలా నిర్ధారించాలో ఒక గొప్ప పరిశీలనను అందించారు. ఇలాంటి పలు పరిశీలనల వల్ల 1947 నాటికి డాలరు, పౌండు, రూపాయి విలువ ఒకటికి ఒకటిగా సమానంగా కొనసాగాయి. ఇప్పుడు డాలరుకు 45 రూపాయలు, పౌండుకు 75 రూపాయలుగా రూపాయి విలువ తగ్గించబడింది. అంబేద్కర్ ప్రసరించిన వెలుగులో

రూపాయి విలువను స్వాతంత్ర్యానంతరం భారతీయ ప్రయోజనాలు కేంద్రంగా అంచనా వేసి వుంటే ఈ దుస్థితి వచ్చివుండేది కాదు.

7. భారతీయ పట్టణీకరణ అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అంబేద్కర్ కులవ్యవస్థ కారణంగా గ్రామాలు పట్టణాలుగా మారాలని అభిలషించారు. లెనిన్ కూడా పట్టణీకరణను కోరుకున్నాడు. మావో గ్రామాలను కమ్యూన్లుగా అనగా నేటి జిల్లా పరిషత్‌లుగా ఒక యూనిట్‌గా ఒక సమన్వయంలోకి తీసుకురావాలని ప్రణాళికాబద్ధంగా కృషి చేశారు. ఇదే కోవలో అంబేద్కర్ ఆలోచించారు. కులవృత్తులు వెనుకబడిన ఉత్పత్తి విధానానికి సంబంధించినవని, కర్మ, పునర్జన్మ, కులవ్యవస్థ సిద్ధాంతాలు వాటికి తోడవ్వడం వల్ల అవి అభివృద్ధి అందుకోకుండా సమాజం అభివృద్ధి చెందకుండా ఆ యా కులాలను అడ్డగిస్తున్నాయని, సన్నకారు ఉత్పత్తి విధానం తొలగినప్పుడే కులవ్యవస్థ బీటలు వారుతుందని అంబేద్కర్ భావించారు.

పట్టణ నాగరికత, భారీ పరిశ్రమలు మనుషులందర్నీ కలుపుతాయని పలు విధాలుగా స్పష్టం చేశారు. పల్లెల్లోనే కులవ్యవస్థ కరడుగట్టుకుపోయి వుందని, అందుకని గ్రామీణ స్వరాజ్యం అనే గాంధీ మాటను అవి దోపిడి కులాల అధికారాన్ని స్థిరపరచడానికే పనికొస్తుందని అంబేద్కర్ స్పష్టం చేశారు. గ్రామీణ దోపిడి కులాలనుండే భారతీయ రాజకీయ నాయకత్వం గత అరవై ఏళ్లుగా ఎదగడం చూస్తుంటే అంబేద్కర్ దృష్టి ఎంతో ముందుచూపుతో ముందుకుసాగిందని స్పష్టమౌతున్నది. గ్రామీణ స్వరాజ్యంలో ఆధిపత్య కులాలవాళ్లు సర్పంచులుగా ఎన్నికై అటుతర్వాత అంచెలంచెలుగా ఎదిగి ముఖ్యమంత్రులదాకా మారారు. గ్రామీణ స్వరాజ్యం ఇలా గ్రామస్థాయి నుండి బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలవాళ్లు నాయకులుగా ఎదగకుండా అడ్డుకున్నది.

అంబేద్కర్‌కు కులవృత్తులు నశించడం పట్ల బ్రిటిష్ వాళ్లు వాటిని ధ్వంసం చేయడం పట్ల ఎంతో ఆవేదన ఉన్నప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పట్ల అంబేద్కర్‌కు ధర్మకోపం ఉంది. కులవ్యవస్థ వల్లనే ఈ ధర్మకోపం స్థిరపడింది. పట్టణాల అభివృద్ధి, నగరాల, పరిశ్రమల అభివృద్ధి, కులం తాలూకు ఆర్థిక సాంఘిక అసమానతలను నిర్మూలించడంలో తోడ్పడుతాయి అని భావించారు. పట్టణాల్లో కన్నా పల్లెల్లో ఇంకా వెనుకబడిన ఎడ్డికాలంనాటి కులసంబంధాలు, సాంఘిక అణిచివేత తద్వారా ఆర్థిక రాజకీయ అణిచివేత కొనసాగడం ఇప్పటికీ చూడవచ్చు. కొన్ని గ్రామాలు కలిసి ఒక పట్టణంగా మారితే మంచిదని అంబేద్కర్ అభిలషించారు.

8. భారతీయ సామాజిక అభివృద్ధి శాస్త్రవేత్తగా అంబేద్కర్

అంబేద్కర్‌ని ఒక సమగ్ర దృక్పథంతో అధ్యయనం చేయడం విస్తృతంగా జరగాలి. గాంధీ, నెహ్రూలకు ఇచ్చిన ప్రాధాన్యత అంబేద్కర్‌కు ఇవ్వకపోవడం వల్ల అంబేద్కర్ సమగ్ర అధ్యయనం సాగలేదు. మరోవేపు మార్క్సిజం సిద్ధాంతాలను ముందుకునెట్టి అంబేద్కర్ అర్థశాస్త్ర అధ్యయనాన్ని అసలు ఉందనే విషయం కూడా తెలియకుండా దశాబ్దాలు గడిపేశారు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, మావో, గాంధీ, నెహ్రూగారల ఆర్థిక సామాజిక రాజకీయ సిద్ధాంతాలతో అంబేద్కర్ సిద్ధాంతాలను తులనాత్మక అధ్యయనం చేసినప్పుడు భారతదేశంలో భారతీయ సమాజాన్ని పట్టించుకుని దాని సామాజిక అభివృద్ధి కోసం నిరంతరం పలవరించినవారిలో అంబేద్కర్ తప్ప మరొక జాతీయ నాయకులెవరైనా ఉన్నారా? అని సందేహం కలుగుతుంది. ఎందుకంటే అంబేద్కర్ లాగా భారతీయ సమాజ అభివృద్ధి కోసం సీరియస్‌గా అధ్యయనం చేసి గ్రంథస్తం చేసినవారు భారతీయ జాతీయ నాయకుల్లో మరెవరూ లేరు. చిన్న చిన్న వ్యాసాలు, ప్రసంగాలనే గొప్ప సిద్ధాంతాలుగా జాతీయ నాయకుల గురించి ప్రచారం చేయబడ్డాయి. నిజమైన భారతీయ సామాజిక అభివృద్ధి శాస్త్రవేత్తగా అంబేద్కర్ ఉన్నత శిఖరాలను అందుకున్నారు.

ముందే చెప్పినట్టు అంబేద్కర్ అర్థశాస్త్రం దానికదే స్వతంత్ర శాస్త్రం కాదని అది రాజకీయ సామాజిక సాంస్కృతిక, జీవన విధానాల పర్యవసానంగా నిరంతరం మారుతూవుంటుంది అని అంబేద్కర్ గమనించారు. శాశ్వతమైనది సనాతనమైనది స్థిరమైనది అంటూ ఏదీ లేదు. ప్రతిదీ మారుతూనే వుంటుంది. వ్యక్తికి, సమాజానికి కూడా మార్పు ఒక జీవలక్షణం అని అంబేద్కర్ ఒక సందర్భంలో స్పష్టం చేశారు.

అర్థశాస్త్రం మానవుల జీవన కార్యకలాపాలను తెలుపుతుందని, అందుకని రాజకీయాలను, సంస్కృతిని, తత్వశాస్త్రాన్ని, కులవృత్తులను, పారిశ్రామిక రంగాలను, మతాన్ని ఏకకాలంలో పట్టించుకున్నారు. ఇలా ఒక సమగ్రతలో అంబేద్కర్ అర్థశాస్త్రాన్ని పరిశీలించారు. అర్థశాస్త్రానికి వీటికి భిన్నంగా ప్రత్యేక అస్తిత్వం వుండే అవకాశం లేదని తన రచనల ద్వారా నిర్ధారించారు.

9. భారతీయ సామాజిక వ్యవస్థను (సోషల్ స్ట్రక్చర్) మార్చే అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అంబేద్కర్ భారతీయ సామాజిక వ్యవస్థను మార్చడం కోసం జీవితాంతం కృషి చేశారు. కులవ్యవస్థను రద్దు చేయడానికి కులనిర్మూలనను ప్రతిపాదించారు.

కులం ఒక పెట్టుబడిగా, అదనపు సంపదగా, అదనపు విలువగా, అధికార కేంద్రంగా వుందని స్పష్టం చేయడం ద్వారా అంబేద్కర్ కులాన్ని కూడా అర్థశాస్త్రంలో భాగంగా చర్చించినట్టయింది. కులవ్యవస్థ నిర్మూలనకు బౌద్ధం మరొక మార్గమని ఆచరించి చూపారు. ప్రజాస్వామిక సంస్కృతికి హిందూ మతం, హిందూ సంస్కృతి, మహమ్మదీయ మతం, ఇస్లాం సంస్కృతి పనికిరావని బౌద్ధ సంస్కృతే అందుకు చక్కని మార్గమని స్పష్టం చేశారు. నవ బౌద్ధ మార్గాన్ని రూపొందించారు. ఇలా అంబేద్కర్ భారతదేశంలోని సామాజిక వ్యవస్థను సమూలంగా మార్చే ప్రతిపాదికలు వేసిన అర్థశాస్త్రవేత్తగా, సామాజిక శాస్త్రవేత్తగా, యుగపురుషుడుగా ఎదిగారు.

10. మతానికి, కులానికి, భావజాలానికి అర్థశాస్త్రానికి గల సంబంధాన్ని పట్టించుకున్న అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

పాశ్చాత్య అర్థశాస్త్రవేత్తలు, మార్క్స్, లెనిన్, మావో మొదలైన అర్థశాస్త్రవేత్తలు అర్థశాస్త్రానికి, మతానికి, కులానికి, భావజాలానికి, సామాజిక అభివృద్ధికి మధ్య సంబంధం వుందని తెలిసి కూడా పట్టించుకోలేదు. పైగా మతం వ్యక్తిగత విషయమని దానికి ప్రివిలేజ్ ఇచ్చారు. దాన్ని అనుసరించి భారతదేశంలో మార్క్సిస్టులు, కులాన్ని కూడా మతం లాగే వ్యక్తిగత విషయం అని ప్రివిలేజ్ ఇచ్చారు. తద్వారా ఆధిపత్యంలో ఉన్నవారినే సామాజిక నాయకత్వంగా అంగీకరించినట్టయింది.

స్త్రీవాదులు వ్యక్తిగతమైనదంతా సామాజికమైనదే, రాజకీయమైనదే అని నిర్ధారించారు. ఐనప్పటికీ ఇప్పటికీ వాళ్ళు కులాన్ని, మతాన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సమస్యగా పట్టించుకోలేదు. అంబేద్కర్ వీరికి భిన్నంగా వీటన్నిటినీ పట్టించుకున్న మహోన్నత అర్థశాస్త్రవేత్త. కులం, మతం, జెండర్, భావజాలం జీవితంలో నిర్వహిస్తున్న పాత్రను పట్టించుకుని వాటికి వ్యతిరేకంగా వేల పేజీల గ్రంథాలను వెలువరించారు. మార్క్సిస్టులు, పాశ్చాత్య అర్థశాస్త్రవేత్తలు ఇప్పటికీ ఈ పని చేయడంలేదు. పైగా ఆ పని చేయడం ప్రధాన అంశాలను పక్కదారి పట్టిస్తుందని ప్రచారం చేశారు. నిజానికి ఇవే ప్రధాన అంశాలని అంబేద్కర్ జీవితమంతా స్పష్టం చేస్తూనే వచ్చారు.

అందువల్ల అంబేద్కర్‌తో పోల్చదగిన పాశ్చాత్య అర్థశాస్త్రవేత్తలుగాని, ప్రాచ్య అర్థశాస్త్రవేత్తలుగాని, ఆధునిక కాలంలో మనకు కనిపించరు. మతాలకు, మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా నాస్తిక హేతువాదులు, కొంతమేరకు మార్క్సిస్టులు పోరాటాలు చేసినప్పటికీ వారి కృషి అంబేద్కర్ లాగా అర్థశాస్త్ర దృష్టి కోణంలో

భాగంగా మార్చుకోలేకపోయారు. ఈ కారణాల వల్లే అంబేద్కర్‌కు ప్రపంచ అర్థశాస్త్రవేత్తల్లో పోలిక గాని, పోటీ గాని ఉన్నట్టుగా కనిపించదు.

11. సామాజిక కార్యకర్తగా అర్థశాస్త్రాన్ని సామాజిక శాస్త్రంగా చర్చించిన అంబేద్కర్

అంబేద్కర్ ప్రపంచంలోని మహామేధావుల్లో ఒకరు. ఐనప్పటికీ సామాజిక కార్యకర్తగా ఆయన చేసిన కృషి అపారమైనది. భారతీయ సమాజాన్ని సమూలంగా మార్చడానికి సామాజిక కార్యకర్తగా కృషిచేస్తూనే ఆ క్రమంలో అర్థశాస్త్రాన్ని అన్వయించి సామాజిక సాంస్కృతిక రాజకీయ నైతిక ధార్మిక విషయాలను చర్చించారు. అందువల్ల అవి డిక్షన్‌లో ఆ యా ప్రత్యేక పదజాలాన్ని, శాస్త్రాల రూపాల్ని కలిగివున్నాయి. వాటన్నిటిలో గల రాజకీయ ఆర్థిక అంశాల అంతస్సారాన్ని విశదీకరించడం నేటి అర్థశాస్త్రవేత్తల కర్తవ్యం.

ఎందుకంటే సామాజిక కార్యకర్తగా పనిచేసే క్రమంలో విద్యార్థి దశలో అర్థశాస్త్రాన్ని పట్టించుకుని రాసినట్టుగా రాసే సమయం గాని, ప్రాధాన్యత గాని అంబేద్కర్ ఇవ్వలేదని రాజకీయ అధికారమే ఆర్థిక రాజకీయ సామాజిక రంగాలన్నిటిని సమూలంగా మార్చే మాస్టర్ కీ అని, అన్ని సమస్యల తాళాలను తెరిచే కీ అని స్పష్టం చేశారు. అందువల్ల అంబేద్కర్‌ను అర్థశాస్త్రవేత్తగా అన్ని రచనల నుండి అంతస్సారాన్ని వెలికితీసి క్రోడీకరించడం ద్వారా సామాజిక కార్యకర్తగా అర్థశాస్త్రాన్ని జీవితమంతా అంబేద్కర్ ఎలా పట్టించుకున్నారో స్పష్టమౌతున్నది.

ఇలా సమస్త జీవన రంగాలలో, సామాజిక రంగాలలో అంబేద్కర్ అర్థశాస్త్రాన్ని అన్వయించి విశ్లేషించారు. సామాజిక తత్వవేత్తగా ఆయన చేసిన కృషిని కూడా అర్థశాస్త్రవేత్తగా పరిగణించినపుడు క్రోడీకరించుకోవడం అవసరం. అప్పుడు సామాజిక శాస్త్రాల ద్వారా అర్థశాస్త్రాన్ని విశ్లేషించిన సామాజిక తత్వవేత్తగా అంబేద్కర్ దర్శనమిస్తారు.

12. బుద్ధిస్ట్ అర్థశాస్త్రవేత్తగా అంబేద్కర్

అంబేద్కర్ అర్థశాస్త్రాన్ని ఆయన మొత్తం కృషిని లెక్కలోకి తీసుకున్నప్పుడు బుద్ధిస్ట్ అర్థశాస్త్రంగా పేర్కొనడం సముచితంగా వుంటుంది. నిజానికి **'అంబేద్కరిస్ట్ అర్థశాస్త్రం'**గా రూపొందించేంత విస్తారంగా అంబేద్కర్ రచనలు, భావాలు రికార్డయి వున్నాయి. మార్క్సిస్టు అర్థశాస్త్రం, పెట్టుబడిదారీ అర్థశాస్త్రం, ప్రజాస్వామిక అర్థశాస్త్రం

లాగే అంబేద్కరిస్ట్ అర్థశాస్త్రం అని కూడా పిలువవచ్చు. అంబేద్కర్ బుద్ధుని నుండి చరిత్రను, వారసత్వాన్ని, ప్రజాస్వామిక సూత్రాలను, సంస్కృతిని స్వీకరించడం వల్ల చరిత్ర పొడుగునా కొనసాగిన కౌటిల్యుని అర్థశాస్త్రం వంటి శాస్త్రాలకు భిన్నంగా కొనసాగిన బుద్ధిస్ట్ అర్థశాస్త్రాలు, వాటి వారసత్వంగా **'అంబేద్కరిస్ట్ అర్థశాస్త్రం'** పరిగణించినపుడు అంబేద్కరిస్ట్ అర్థశాస్త్రాన్ని బుద్ధిస్ట్ అర్థశాస్త్రంగా, అంబేద్కర్‌ను బుద్ధిస్ట్ అర్థశాస్త్రవేత్తగా పేర్కొనవచ్చు.

అసమానతలను తొలగించడానికి బలప్రయోగం కన్నా సిద్ధాంత అవగాహన, ప్రచారం, సైద్ధాంతిక పోరాటం ఎంతో ముఖ్యమని భావించడం కూడా అర్థశాస్త్రం పరిధిలోనిదే అని చెప్పవచ్చు. కొందరు యుద్ధాల ద్వారా, సాయుధ పోరాటాల ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టారు. అంబేద్కర్ ఇందుకు భిన్నంగా శాంతియుత పరివర్తన, సైద్ధాంతిక సంఘర్షణ, బహుజన సమ్మతి, ప్రచార యుద్ధం, మొదలైనవాటిని మౌలిక మార్పులకు దోహదం చేస్తాయని గమనించి ఆచరించి చూపారు.

రికార్డో, మాల్తూసియస్, మార్క్స్, లెనిన్, స్టాలిన్, మావో, లియాంటీవ్ మొదలైనవాళ్లు రాసిన అర్థశాస్త్ర దృక్పథం వేరు. అంబేద్కర్ వంటి వారి అర్థశాస్త్ర దృక్పథం వేరు. అంబేద్కర్ అర్థశాస్త్రవేత్తగా చేసిన కృషిని 'బౌద్ధ అర్థశాస్త్రం'గా వర్గీకరించ వచ్చు. కౌటిల్యుని అర్థశాస్త్రం, మనువు రాసిన మనుధర్మశాస్త్రం ఈ రెంటికి విరుగుడుగా అంబేద్కర్ బౌద్ధ అర్థశాస్త్రం (బుద్ధిస్ట్ ఎకానమీ) రూపొందింది.

ప్రజాస్వామ్య విధానాల్లో బహుళ పార్టీ వ్యవస్థలో ఎవరు, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజల సాంఘిక సంక్షేమం ప్రాధాన్యత వహించే విధంగా ఉండే అర్థశాస్త్రాన్ని అంబేద్కర్ కలగన్నాడు. ఆయన రచనల్లో పరుచుకునివున్న అర్థశాస్త్ర అంశాలను ఒకచోట క్రోడీకరించి, సంశ్లేషించి అంబేద్కరిస్ట్ అర్థశాస్త్రాన్ని రూపొందించి పాఠ్యపుస్తకాల్లో పొందుపరచడం అవసరం. ఇప్పటికే ఇతర భాషల్లో ఈ విషయమై కొన్ని పరిశోధనలు వెలువడ్డాయని తెలుస్తున్నది. అవి తెచ్చిన వెలుగును విస్తృతంగా ప్రచారంలోకి తేవడం అవసరం.

బీసీల సాధికారికత
రామ్ మనోహర్ లోహియా

డా॥ రామ్ మనోహర్ లోహియా శతజయంతి సంవత్సరం ఇది. 1910 మార్చి 23న జన్మించిన లోహియా భారత రాజకీయాల్లో నిర్వహించిన పాత్ర ప్రత్యేకమైనది, విశిష్టమైనది. డా॥ రామ్ మనోహర్ లోహియా సమకాలికులను ప్రభావితం చేశారు. తనకన్నా రాజకీయాల్లో సీనియర్లయిన గాంధీ, నెహ్రూ వంటి వారిని కూడా ప్రభావితం చేయడం లోహియా విశిష్టత.

రామ్ మనోహర్ లోహియాలో ఒక నిశితమైన మేధావి వున్నాడు. ఆయనలో వైరుధ్యాలు వున్నాయని కొందరు అంటుంటారు. గాంధీని, అంబేద్కర్‌ని సమానంగా గౌరవించడం లోహియాలో గల వైరుధ్యం అంటారు. రాముణ్ణి, కృష్ణుణ్ణి భారతీయ జాతీయ నాయకులు అని చెప్పడంలో వైరుధ్యముందంటారు. చరిత్ర ఇతిహాస చక్రాన్ని ప్రతిపాదించడంలో కూడా ఈ వైరుధ్యం చూడవచ్చునంటారు. భారతదేశంలో హిందీని ఇతర భాషా ప్రాంతాల వారు కూడా ఖచ్చితంగా నేర్చుకోవాలని, ఆచరించాలని చెప్పడంలో తీవ్రమైన వైరుధ్యముందంటారు. పార్టీ నిర్మాణంలో కూడా అనేక వైరుధ్యాలు ఉన్నాయంటారు. లోహియా బీసీలకు పార్టీల్లో అరవై శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆచరించి చూపాడు. కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శిస్తూనే, గాంధీ ఆలోచనా విధానాన్ని ఆచరిస్తూ వుంటాడు అని అంటారు. ఇలా, ప్రధానమైన వైరుధ్యాలను లోహియాను అంగీకరించడానికి, వ్యతిరేకించడానికి చూపిస్తూ వుంటారు.

జాతీయోద్యమ కాలంలో లోహియా, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్, డా॥బి.ఆర్.అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్, గిరిజన పోరాటాలు... కమ్యూనిస్టు ఉద్యమాలు, కమ్యూనిస్టు పార్టీ మొదలైనవి కాంగ్రెస్‌కు సమాంతరంగా అప్పుడప్పుడు వ్యతిరేకంగా కొనసాగాయని వర్గీకరిస్తుంటారు. కాంగ్రెస్ ఒక ముద్దగా పెద్దగా కనపడుతుంది. కానీ, కాంగ్రెస్‌కు వెలుపల దాంతో పోటీ పడి సమాంతరంగా రైలు పట్టాల్లాగా సాగిన జాతీయోద్యమ చరిత్ర ఎంతో వుంది.

1920 నుండి అంబేద్కర్ దళిత వాద సిద్ధాంతాలను ముందుకు తీసుకుని వచ్చాడు. భారతదేశంలో స్వాతంత్ర్యం ఎవరికి? ఇందులో అంటరానివాళ్లకు అందేదేమిటి? అంటరానివాళ్లకు స్వాతంత్ర్యం ఇవ్వకపోతే ఆ స్వాతంత్ర్యం అంటరానివాళ్లని మరింత అణిచివేయడానికే పనికొస్తుంది అని అన్నాడు. 1932లో పూనా ఒప్పందం ద్వారా దళితులకు రిజర్వేషన్లు సాధించారు.

ఈ చారిత్రక నేపథ్యంలో రామ్ మనోహర్ లోహియా జన్మించాడు. లోహియా వయస్సు పెరుగుతున్నకొద్దీ చైతన్యం పెరుగుతూ వచ్చింది. సోషలిస్టుగా ఎదిగాడు. సోషలిస్టుగానే గుర్తింపు పొందాడు. సోషలిస్టుగానే అనేక విషయాలపై తన అవగాహనను ప్రసంగాల ద్వారా స్పష్టం చేశాడు. లోహియా సోషలిజం ప్రత్యేకమైనది. కమ్యూనిస్టులు, నక్సలైట్లు చెప్పే సోషలిజానికి, లోహియా చెప్పే సోషలిజానికి తేడా వుంది. సోషలిజాన్ని సాధించే మార్గంలో, దృక్పథంలో, ఆచరణలో కూడా తేడా వుంది. ఈ తేడాయే లోహియా సోషలిజాన్ని ప్రత్యేకంగా నిలుపుతుంది.

'లోహియా సోషలిజం' ఫ్రెంచ్ సోషలిస్టుల నుండి స్ఫూర్తి పొందింది అంటారు. కమ్యూనిస్టు, మార్క్సిస్టు క్యాంపుల సోషలిజానికి వెలుపల గల ప్రపంచంలో సోషలిజానికి సంబంధించిన చర్చలు, ఉద్యమాలు ఎన్నో కొనసాగాయి. జాతీయోద్యమంలో కాంగ్రెస్ చరిత్ర వరుస క్రమంలో రికార్డయి మిగతా ఉద్యమాల చరిత్ర శకలాలుగా మార్చబడ్డట్టుగా ప్రపంచ సోషలిస్టు ఉద్యమాల్లో మార్క్సిస్టుల ఉద్యమాలు వరుస క్రమంలో రికార్డయి మిగతా సోషలిస్టుల చరిత్ర శకలాలుగా రికార్డు అయింది, కానీ, తరానికి తరానికి అందడం లేదు. అలాంటి వాటిలో భారతదేశంలోని లోహియా, జయప్రకాశ్ నారాయణ్ వంటి వారి సోషలిస్టు ఉద్యమాల చరిత్ర కూడా ఒకటి.

నిజానికి, లోహియా సోషలిస్టు ఉద్యమానికి ఈ దుస్థితి పట్టాల్సిన అవసరంలేదు. అది నిర్వహించిన పాత్ర దేశంలో ప్రముఖమైనది. రెండో స్వాతంత్ర్య పోరాటం సాగడానికి 1975లో ఇందిరాగాంధీ పెట్టిన ఎమర్జన్సీకి ముందు, తరువాత కూడా

పోరాటం చేసిన చరిత్ర సోషలిస్టులది. ప్రజాస్వామిక విలువల కోసం, ప్రతిపక్ష పాత్రలో చేసిన సోషలిస్టుల కృషి తక్కువేమీ కాదు. భారతదేశ చరిత్రలో లోహియా సోషలిస్టుల స్థానం ప్రత్యేకమైనది. దేశ చరిత్రను మలుపు తిప్పారు. రామ్ మనోహర్ లోహియా సిద్ధాంతాలు, ఆచరణ లేకుండా లాలూ ప్రసాద్ యాదవ్, ములాయంసింగ్ యాదవ్, శరద్ యాదవ్, జార్జి ఫెర్నాండెజ్ వంటి వారిని ఊహించలేం.

బహుజన సమాజ్ పార్టీ గానీ, అంబేడ్కరైట్లు గానీ, రామ్ మనోహర్ లోహియాను స్ఫూర్తిదాతగా బహుజన సమాజ్ పార్టీ స్వీకరించలేదు. సామాజిక న్యాయం కోసం గుళ్లను నిర్మించిన నారాయణ గురును, భక్తిని ప్రచారం చేసిన గురు రవిదాస్, కబీర్ వంటి వారిని కూడా బీఎస్పీ స్ఫూర్తిదాతలుగా స్వీకరించినప్పటికీ లోహియాను స్వీకరించలేదు.

గాంధీ వలె లోహియాకు, అంబేడ్కర్‌కు మధ్య సిద్ధాంత సంఘర్షణ జరగలేదు. అంబేడ్కర్‌ను లోహియా అపారంగా గౌరవించాడు. అయితే, గాంధీని కూడా బాగా గౌరవించాడు. అదే సమయంలో, హిందూ మతాన్ని, రాముడు, కృష్ణుడు లను లోహియా స్వీకరించాడు. ఇది ఒకటే వైరుధ్యమా? ఇంకా ఏమైనా వున్నాయా? లోహియా బీసీల కోసం, వారి రిజర్వేషన్ల కోసం ఎంతగానో తపన పడ్డాడు.

లోహియా అగ్ర కులాల్లో పుట్టడమే కారణమా? అలాగైతే, బుద్ధుడు కూడా గణ తెగల నాయకుడి కొడుకుగానే పుట్టాడు. అశోకుడు స్వయంగా చక్రవర్తి కూడా. వారిని స్వీకరిస్తున్నాము. లోహియాలో వున్న మంచిని బేరీజు వేయడం, లోపాలను తులనాత్మకంగా పరిశీలించడం శతజయంతి సందర్భంగా అవసరం. తద్వారా, మంచిని ముందుకు తీసుకుని పోతూ లోహియా స్ఫూర్తిని కూడా భవిష్యత్ తరాలు పొందడానికి ఉపయోగపడుతుంది.

బీసీల సాధికారికతలో లోహియా ప్రాధాన్యత

లోహియా సోషలిస్టులు లేకుండా భారత పార్లమెంటు రాజకీయాలను, అందులోని పరిణామాలను చెప్పడం సాధ్యమా? లోహియా లేకుండా భారతదేశంలో బీసీలకు రాజ్యాధికారం, రిజర్వేషన్లు, వాటి పరిణామాలు సాధ్యమయ్యాయా? బీసీలకు లోహియా సోషలిస్టులు ఏమీ చేయలేదా? వీటిని బీసీలు తెలుసుకోవడం అవసరం.

అలా చూసినప్పుడు, భారతదేశానికి లోహియా సోషలిస్టుల కాంట్రిబ్యూషన్ ఎంతో వుంది. బీసీలకు వారు చేసిన మేలు ఎంతో వుంది. భారత రాజకీయాల్లో

ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో 1967 నాటికే లోహియా సోషలిస్టులు అధికారంలోకి వచ్చారు. ముఖ్యమంత్రులయ్యారు. ఉత్తరప్రదేశ్‌లో రామ్ నరేష్ యాదవ్, బీహార్‌లో కర్పూరి ఠాకూర్ ముఖ్యమంత్రులయ్యారు. ఇద్దరూ బీసీలే. ఇది కాంగ్రెస్ ప్రభుత్వాల్లో సాధ్యమా? ఉత్తరప్రదేశ్, బీహార్ లలో లోహియా సోషలిస్టుల కృషి పరిణామాలు లేకుండా బహుజన సమాజ్ పార్టీ ఆవిర్భావం, ఎదుగుదల, విజయం సాధ్యమా? సోషలిస్టులు తెచ్చిన పరిణామాల్లో భాగంగానే బహుజన సమాజ్ పార్టీ ఎదిగింది. విజయం సాధించింది.

రామ్ మనోహర్ లోహియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1962 నాటికే బీసీలు అధికారంలోకి వస్తారని 1956లో అనేక ప్రసంగాల్లో చెప్పారు. ఎందుకు అలా జరగలేదు? ఉత్తరప్రదేశ్, బీహార్ లలో 1967 నాటికి లోహియా అనుకున్నట్టుగానే అధికారంలోకి వచ్చినప్పటికీ అది ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కాలేదు? ఈ రెండు పరిణామాల మధ్య తేడా ఏమిటి? ఈ విషయం అధ్యయనం చేయాల్సిన అవసరం వుంది.

రామ్ మనోహర్ లోహియా, గాంధీలో ఏం చూసి ప్రేమించాడు, గౌరవించాడు? పరిశీలించాల్సిన అవసరం వుంది. కేవలం కులం ఒక్కటే కారణం కాదు. లోహియా, గాంధీ చేతి వృత్తులను గురించి ఆ కులాల, గ్రామీణుల అభివృద్ధి, వికేంద్రీకృత అభివృద్ధి, పరిశ్రమల వికేంద్రీకరణ, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ గురించి తీవ్రంగా పట్టించుకున్నారు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అంటే, మానవ వనరులైన ప్రజల శక్తి సామర్థ్యాల అభివృద్ధి, నైపుణ్యాల అభివృద్ధి అని, వారికి ఉపాధి కల్పన జీవన భద్రత ప్రధానమని, దీనికి లోబడే దీనికి అనువైన పారిశ్రామికీకరణ జరగాలని కోరారు. మావో, గాంధీ, లోహియాల మధ్య ఈ ఏకత్వం వుంది.

శాంతియుత పరివర్తనలో, బహుళ పార్టీ వ్యవస్థలో సాధ్యమైన మేరకు సోషలిజాన్ని సాధించడమే ఫ్రెంచ్ సోషలిస్టుల, భారతీయ సోషలిస్టుల లక్ష్యం. పేద ప్రజలకు సబ్సిడీలతో ఆహారం, కూడు, గుడ్డ, నీడ ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పారిశ్రామికవేత్తలకు పారిశ్రామిక అభివృద్ధి పేరిట కాంగ్రెస్ పార్టీ లక్షల కోట్ల రూపాయల పన్నుల మినహాయింపులను, ఇతరత్రా భూసేకరణలో సహకరించింది. ప్రజలకు ఇవ్వడానికి అభ్యంతరమేమిటి? ప్రజలకు ఇవ్వని ప్రభుత్వం దేనికి? ఈ దృష్టితో రామ్ మనోహర్ లోహియా అనేక ఆలోచనలు చేశాడు. వాటిని జనతా పార్టీ అనుసరించే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా, 1977లో జార్జి ఫెర్నాండెజ్, శరద్ యాదవ్, మధుదండావతె, మధులిమాయే

తదితరులు మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా జనతా పార్టీ, లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో ఒక్కటై అధికారంలోకి వచ్చినప్పుడు రూపాయికే స్నానపు సబ్బు ఇవ్వాలని ఉత్తర్వులిచ్చారు. అన్ని కంపెనీలు తమ ఉత్పత్తులను మార్కెట్లోకి తెచ్చాయి కూడా. అలాగే, జనతా సబ్బులతో పాటు జనతా చీరలు, జనతా ధోతులు తక్కువ ధరకు సబ్సిడీపై గోధుమలు, బియ్యం, తదితర సరుకులు ఇచ్చారు.

ఏమైనప్పటికీ, హింద్ మజ్దూర్ సంఘ్, తదితర పేర్లతో సోషలిస్టుల కార్మిక సంఘాలు కార్మిక రంగంలో గొప్ప పాత్ర నిర్వహించాయి. 1974లో జార్జి ఫెర్నాండెజ్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా రైళ్ల సమ్మె జరిగింది. అది ఇందిరాగాంధీ ప్రభుత్వాన్ని కదిలించింది. మరోవైపు, అదే సమయంలో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ సర్వోదయ ఉద్యమం నుండి తిరిగి సామాజిక, రాజకీయ రంగంలోకి వచ్చారు. దేశవ్యాప్తంగా అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ లలో లక్షలాది విద్యార్థులు, యువకులు కదిలారు.

లోహియా నెహ్రూపై పోటీ చేశాడు. ఓడిపోయాడు. 1963 ఉపఎన్నికలో లోక్‌సభకు ఎన్నికయ్యాడు. లోహియా సహచరుడైన రాజ్‌నారాయణ్, ఇందిరాగాంధీపై పోటీ చేశాడు. ఇందిరాగాంధీ ఎలాగో గెలిచింది. ఎన్నికల్లో అక్రమాలు చేసి గెలిచిందని రాజ్‌నారాయణ్ కోర్టులో కేసు వేశాడు. 1975లో సుప్రీం కోర్టు నిజమేనని, అక్రమాలు జరిగాయని నిర్ధారించి ఇందిరాగాంధీ లోక్‌సభ ఎన్నిక చెల్లనేరదని లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసింది. దాంతో, ఇందిరాగాంధీ ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలి. కాంగ్రెస్‌లోని మరొకరికి అధికారం అప్పగించాలి. తన పదవి కోసం, తన ఒక్క ప్రాణం కోసం ఇందిరాగాంధీ లోకం ఏమైనా కానీ అని అనుకున్నది. ఎమర్జెన్సీ ప్రకటించింది. ప్రతిపక్ష నాయకులను, లక్షలాది ప్రజలను జైళ్లల్లో పెట్టారు. పత్రికలపై, రేడియోలపై సెన్సార్ విధించారు. అలా, తన పదవి కోసం ఇందిరాగాంధీ ప్రపంచ చరిత్రలో ఒక చీకటి అధ్యాయాన్ని సృష్టించారు.

జయప్రకాశ్ నారాయణ్, రాజ్‌నారాయణ్, జార్జి ఫెర్నాండెజ్, శరద్ యాదవ్ వంటి సోషలిస్టులు అవినీతికి వ్యతిరేకంగా, ప్రజలకు, సామాజిక న్యాయం జరగాలని శాంతియుతంగా చేపట్టిన ఉద్యమాలు దేశంలో గొప్ప చైతన్యాన్ని తీసుకువచ్చాయి. ఆ క్రమం నుండే, ములాయం సింగ్, లాలూ ప్రసాద్ వంటి వాళ్లు ఎదిగివచ్చారు. ఎమర్జెన్సీ తర్వాత జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. అది రెండో స్వాతంత్ర్యం అన్నారు. స్వాతంత్ర్యం యొక్క విలువ తెలిసింది. రాజ్యాంగంలో ఇంత క్రూరమైన

అణిచివేతకు అవకాశాలున్నాయా అని సమాజం విస్తుపోయింది. మళ్లీ అలాంటి ఎమర్జెన్సీ పెట్టకుండా రాజ్యాంగ సవరణ చేశారు. అలా, జనతా పార్టీ అందులోని సోషలిస్టులు చరిత్రాత్మకమైన పాత్ర నిర్వహించారు.

లోహియా ప్రతిపాదించిన 'ఇతిహాస చక్రం' అనే చారిత్రక దృక్పథం ఆయన రచనల్లో ఒకటి. ఇది వివాదాస్పదమైంది. సమాజం ముందుకు సాగుతూనే వుంటుందని ప్రజాస్వామిక వాదులు, సోషలిస్టులు, మార్క్సిస్టులు భావిస్తుంటారు. లోహియా దీనికి కాస్త భిన్నంగా ఆ యా దేశాల జాతుల చరిత్రను చర్చిస్తూ మళ్లీ ఒకనాటికి ఇండియా, చైనా వంటి ప్రాచీన జాతులు తిరిగి ప్రపంచానికి నాయకత్వం వహిస్తాయని ఇప్పుడు నాయకత్వం వహిస్తున్న యూరప్, అమెరికాల ఆధిపత్యం పోతుందని చెప్పాడు. ఇలాంటి కోణంలో ఇతిహాస చక్రాన్ని ప్రతిపాదించాడు.

తెలుగు అకాడమీ రామ్ మనోహర్ లోహియా రచనల అనువాదాలను కొన్నిటిని ప్రచురించింది. రామ్ మనోహర్ లోహియా భావాలను తెలుగు ప్రజలకు చేరవేయడంలో అనువాదకుడిగా తెలంగాణ తొలి తరం కథకుడు అయిన జి.సురమౌళి పాత్ర మరువలేనిది. మధు దండావతే, మధులిమాయే, బద్రి విశాల్ పిట్టి, రావెల సోమయ్య, కె.యన్.రామదాస్ వంటి ఎందరో లోహియా భావాలను, పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కృషి చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రజాకర్షక రెండు రూపాయలకు కిలో బియ్యం వంటి పథకాలను ప్రవేశపెట్టడంలో టీడీపీలో చేరిన సోషలిస్టుల పాత్ర ఉందని అంటారు. అలా, టీడీపీలో లోహియా సోషలిస్టు భావాలు అనేక రూపాలు తీసుకుని కొనసాగాయి.

లోహియాలో ఉత్తరాదికి చెందినవాడుగా కొన్ని అవగాహన లోపాలు చోటు చేసుకున్నాయి. హిందీని దక్షిణాది రాష్ట్రాల మీద బలవంతంగా రుద్దే ప్రయత్నం చేశారు. బెంగాల్ ప్రజలు కూడా తమిళనాడు వలెనే హిందీ రుద్దడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రతి ఒక్కరు భారతదేశంలో పాఠ్యాంశాల్లో మూడు భాషలు నేర్చుకోవాలని ప్రతిపాదించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఇది కొనసాగుతున్నది. ఉత్తరాది రాష్ట్రాల్లో తెలుగునో, తమిళాన్నో, మరొకటో స్వీకరించడం, నేర్చుకోవడం చాలా తక్కువ. హిందీ రుద్దడం వల్ల తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమాలు పెద్ద యెత్తున సాగాయి.

భాషా సమస్య విషయంలో, లోహియా పొరపాటు చేశాడనిపిస్తుంది. ఇంగ్లీషు ప్రాధాన్యతను గుర్తించలేదు. హిందీకి బదులుగా లోహియా ఇంగ్లీషును అవసరమని

చెప్పి వుంటే ఆయన భారతదేశానికి మరింత ఆరాధ్యుడై వుండేవాడు. నేటి సాఫ్ట్‌వేర్ విప్లవానికి లోహియా ఇంగ్లీషు ప్రతిపాదన ఎంతో ఉపయోగపడిందని చరిత్ర గుర్తు చేసుకుని వుండేది. రాజ్యాంగంలోని షెడ్యూల్‌లో చేర్చిన ప్రతి భాష కూడా భారతీయ జాతీయ భాషే. రాముడు, కృష్ణుడు విషయంలో జాతీయ నాయకులు అని లోహియా అన్న మాటను అంబేద్కర్ వద్దన్నా బీసీలు ఆచరిస్తూనే వున్నారు. అంబేద్కర్ భావజాలం యొక్క ప్రాధాన్యత ఇక్కడే వుంది. కులాల మధ్య సఖ్యత కోసం లోహియా సిద్ధాంతాలు ఉపయోగపడితే, కులాల వ్యవస్థను నిర్మూలించడానికి అంబేద్కర్ సిద్ధాంతాలు ఉపయోగపడతాయి.

కులాల సమస్య విషయంలో లోహియా అవగాహన వర్తమానానికి సరిగ్గా సరిపోయిన అవగాహన. వర్తమాన పరిస్థితులకు అనువుగా అందరు కలిసి జీవిస్తూ కొద్ది కొద్దిగా మారుతూ శాంతియుత పరివర్తన సాగించాలని, అన్ని కులాలు కలిసి పోయి డీక్లాస్ అయి, డీక్యాస్ట్ అయి ఒక జాతిగా ఎదగాలని లోహియా వంటి వాళ్లు భావించారు. సోషలిస్టు పార్టీలో ప్రధాన పదవుల్లో అరవై శాతం పదవులు బీసీలకే కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకుని ఆచరించారు. ఆ పరిణామం నుండే ఉత్తరప్రదేశ్, బీహార్ లలో స్వాతంత్ర్యానంతరం బీసీలు కింది స్థాయి నుండి ఎదుగుతూ 1967 నాటికి అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రులయ్యారు. ఇదేమీ చిన్న విషయం కాదు.

ఇలా, స్వాతంత్ర్యానంతరం బీసీలకు, వారి రిజర్వేషన్లకు లోహియా ఒక పెద్ద దిక్కుగా నిలిచారు. ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ లోహియా లోని ఈ అవగాహన బీసీలకు లోహియా అంబేద్కర్ వంటివాడు అని కొందరు విశ్లేషిస్తున్నారు. దీన్ని చరిత్ర లోతుల్లోకి వెళ్లి నిగ్గు తేల్చాల్సిన అవసరం వుంది. అంబేద్కర్ దళితులకు రిజర్వేషన్లు సాధించాక, మహిళల సమాన హక్కుల కోసం హిందూ కోడ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాడు. నెహ్రూ కాంగ్రెస్ పార్టీ సభ్యులకు విప్ జారీ చేయకపోవడం వల్ల బిల్లు వీగిపోయింది. అలాంటి బిల్లు బీసీ రిజర్వేషన్ల కోసం ప్రవేశపెట్టడం జరగలేదు. ఎవరు బీసీలు? ఎవరెవరిని బీసీల్లో చేర్చాలి? అనే అంశాన్ని సామాజిక, ఆర్థిక స్థితిగతుల పరిశీలనకు, సిఫారసులకు కాకా కాలేల్కర్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే అందుకు జనభా లెక్కలే ప్రాతిపదిక కావాలనుకుంటే దానికి మార్గముంది. ఒక ఏడాది సమయంలో ప్రత్యేకంగా 1952 పార్లమెంటు ఎన్నికల తర్వాత జనాభా లెక్కల సేకరణ చేస్తే సరిపోయేది. లేదా, 1961 జనాభా లెక్కల్లో బీసీలు ఎవరెవరో లెక్కలు తీస్తే సరిపోయేది. కాంగ్రెస్ పార్టీ ఈ పని చేయలేదు. చేయకూడదనే చేయలేదు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేసినంత

ద్రోహం జాతీయోద్యమ కాలం నుండి మరెవరూ చేయలేదు. అయినా, కాంగ్రెస్ వెంట బీసీలు నడుస్తూనే వున్నారు. బీజేపీ, ఆరెస్సెస్ పరివారం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని తెలిసి కూడా బీసీలు వాటి వెంట నడుస్తూనే వున్నారు. మాయలఫకీరు వెంట బాలనాగమ్మను కుక్కను చేసుకుని తీసుకుపోతున్నట్టుగా బీసీలను కాంగ్రెస్, బీజేపీ తమ వెంట తీసుకుపోతూనే వున్నాయి. ఇలాంటి చారిత్రాత్మకమైన సన్నివేశంలో లోహియా జాతీయోద్యమంలో, స్వాతంత్ర్యానంతరం నిర్వహించిన పాత్ర, బీసీల కోసం ఆయన చేసిన కృషి, ఆయన సిద్ధాంతాలు, జీవితం, అధ్యయనం ఎంతో అవసరం.

బీసీ రిజర్వేషన్ల కోసం జనతా పార్టీ 1977లో మండల్ కమిషన్‌ను నియమించింది. వాళ్లు 1980 లోనే అధికారం కోల్పోయి తిరిగి కాంగ్రెస్ రావడం వల్ల, ఇందిరాగాంధీ తిరిగి ప్రధానమంత్రి కావడం వల్ల బీసీ రిజర్వేషన్లు రాకుండా పోయాయి. తిరిగి కాంగ్రెసేతర జనతాదళ్ పార్టీ అధికారంలోకి వచ్చాకే, మండల్ కమిషన్ సిఫారసులను, ప్రతిపాదించిన రిజర్వేషన్లను ఆచరించే ప్రక్రియ మొదలైంది. అలా, వి.పి. సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు బీసీ రిజర్వేషన్లను ముందుకు తెచ్చారు. దాంతో ఆయన ప్రభుత్వాన్ని పడగొట్టారు. పి.వి.నరసింహారావు ప్రధానమంత్రి అయ్యాక బీసీ రిజర్వేషన్లు కొద్ది కొద్దిగా ఆచరణలోకి రావడం మొదలైంది. ఈ క్రమం అంతటికీ లోహియా సోషలిస్టుల కృషి, వాళ్ల అధికార త్యాగం, సిద్ధాంత చర్చ ఎంతో వుంది. ఇలా, రామ్ మనోహర్ లోహియా, ఆయన కృషి, ఆయన సహచరులు చేసిన కృషి భారతదేశ చరిత్రలో విశిష్టమైనది. అది చెరిపేస్తే చెరిగిపోయేది కాదు.

డా॥ రామ్‌మనోహర్ లోహియా కాంట్రిబ్యూషన్

1. కుల నిర్మూలన గురించి డిస్ట్రక్షన్ ఆఫ్ క్యాస్ట్ అండ్ క్లాస్ అని అది ఎలా జరగాలో వివరించారు. డిక్లాస్ కావడం, డిక్యాస్ట్ కావడం గురించి స్వామి వివేకానంద వలె తీవ్రంగా నొక్కి చెప్పారు. కులాలు, వర్గాలు అంతరించాల్సిన క్రమం సూచించాడు.

2. గ్రామీణ పేదల అభివృద్ధి, పరిశ్రమల, అధికార వికేంద్రీకరణ, చేతివృత్తుల అభివృద్ధి ప్రధానం అని భావిస్తూ యూరప్ దేశాల పారిశ్రామిక విధానం ఆసియా దేశాల్లో పనికిరాదని అధిక జనాభా గల మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడానికి ప్రజల నైపుణ్యాలను అభివృద్ధి పరచి ఉత్పత్తి శక్తులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ విషయంలో మావో, గాంధీ, లోహియా మాత్రమే సీరియస్‌గా ఆలోచిం

చారు. నెహ్రూ, అంబేద్కర్, లెనిన్, మార్క్స్, ఏంగెల్స్ ఇందుకు భిన్నంగా ఆలోచించారు. వారు నగరాల, భారీ పరిశ్రమల అభివృద్ధిని అధికార కేంద్రీకరణను కోరారు. కాని లోహియా అధికార వికేంద్రీకరణే నిజమైన ప్రజాస్వామ్యమని నొక్కి వక్కాణించారు.

3. 1936లో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా వున్నప్పుడు లోహియా ఫారెన్ అఫైర్స్ కార్యదర్శిగా ఉంటూ ప్రపంచంతో భారతదేశ సంబంధాలను అధ్యయనం చేసి అవగాహన పత్రం రూపొందించారు. అదే స్వాతంత్ర్యానంతరం ఆచరించబడుతున్నది.

4. శూద్రులకు, బీసీలకు రాజకీయ అధికారంలో జనాభా అనుసరించి వాటా ప్రజాస్వామ్యయుతంగా పార్టీలోను, ప్రభుత్వాల్లోను, ఉద్యోగాల్లోను కల్పించాల్సిన అవసరం ఉందని ఉద్యమించారు. ఆచరించారు. దానివల్ల 1967లో భారతదేశంలో సగానికి పైగా రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

5. 1949 దాకా లోహియా నెహ్రూ, ఇందిరా కుటుంబ స్నేహితుడిగా కొనసాగి నప్పటికీ ఆ తరువాత సీరియస్‌గా వ్యతిరేకించారు. గాంధీ సిద్ధాంతాలను వదిలి భారీ పరిశ్రమల, ప్రాజెక్టుల, నగరాల కేంద్రీకరణ, అధికార కేంద్రీకరణ చేస్తున్న నెహ్రూను వ్యతిరేకిస్తూ బీసీలకు అధికారంలో వాటాకావాలని నిరంతరం కృషి చేశారు.

6. యూరప్ దేశాల అభివృద్ధి, ఆసియా దేశాల దోపిడీ ద్వారానే జరిగిందని విశ్లేషించి చూపారు.

బీసీలు చారిత్రక శక్తులుగా, చరిత్ర శోధకులుగా రాజకీయాల్లో కీలకపాత్ర నిర్వహించే క్రమంలో అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్, నారాయణ గురు వంటి చారిత్రక పురుషులతో, మహనీయులతో లోహియా సమన్వయం, సంశ్లేషణ చెందే అవకాశం ఉంది. లోహియా కులస్తులైన వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వైశ్యులు, మార్వాడీలు మొదలైనవారు బీసీ రిజర్వేషన్లను, బీసీ రాజకీయాధికారాన్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తూ తమ వాటాను, స్థానాన్ని బీసీలతో కలిసి పంచుకునే అవగాహనకు చేరుకున్నప్పుడు ఇది సాధ్యం. అనగా, బీజేపీ వెనుక గల గాంధీ, లోహియా కులాల, వర్గాల వారు బీసీ రాజకీయ శక్తుల వెనుక మద్దతుగా సాగినప్పుడు బీజేపీ ఎదుగుదల ఆగిపోతుంది. బీసీల రాజకీయ అధికారం సాకారం అవుతుంది. మరొక వైపు బీఎస్పీ, దళిత శక్తులు తమ అవగాహనను బీసీలకు అనుకూలంగా మార్చుకుంటారు. ఇప్పటికే, సర్వజన సంక్షేమం నినాదంతో బీఎస్పీ తన అవగాహనను మార్చుకుంటున్నది. ఇప్పుడు బీఎస్పీ నడుస్తున్న క్రమం దళితుల నాయకత్వంలో లోహియా చెప్పిన సోషలిస్టు పరివర్తనే తప్ప మరొకటి అవుతుందా? అయితే, అంబేద్కరిజం సిద్ధాంతంగా కొనసాగుతున్నది.

చేతి వృత్తి కులాల అభివృద్ధి గురించి, చిన్న స్థాయి ఉత్పత్తి గురించి మావో, లోహియా, గాంధీ ఎంతగానో ఆలోచించారు. నెహ్రూ, అంబేద్కర్, మార్క్స్, లెనిన్, స్టాలిన్ భారీ పారిశ్రామిక విస్తరణను ప్రతిపాదించి ఆచరించారు. మావో దీన్ని వ్యతిరేకించాడు. ఉత్పత్తి శక్తుల అభివృద్ధి అంటే, ఉత్పత్తి సాధనాల అభివృద్ధి కాదని, ఉత్పత్తి శక్తులైన ప్రజల నైపుణ్యాల అభివృద్ధి అని, మానవ వనరుల సద్వినియోగం అని అందుకు ప్రణాళికలు రచించాలని కమ్యూన్లను ప్రతిపాదించి ఆచరించాడు. 1976లో మావో చనిపోయాక తిరిగి భారీ పారిశ్రామిక ఉత్పత్తి రంగానికి చైనా ఆర్థిక వ్యవస్థను మళ్లించారు. లోహియా, మావో, గాంధీ ఆసియా దేశాల జనాభా వనరులను గురించి, వారి జీవన భద్రత, ఉపాధి గురించి, వ్యవసాయ సమాజంలోని గ్రామీణ ప్రజల గురించి, వారి అభ్యున్నతి గురించి ఆలోచించారు. ప్రతిపాదించారు. అందువల్ల, ఈ విషయంలో భారతదేశంలోని లోహియా సోషలిస్టులు ఫ్రాన్స్ లోని సోషలిస్టుల కన్నా భిన్నమైన ఆసియా దేశాలకు అవసరమైన సరియైన పాత్రను నిర్వహించారు. ఇలా, లోహియా ప్రపంచ సోషలిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరుగా ఎదిగారు. ఆసియా వ్యవసాయిక దేశాల సోషలిస్టు ఉద్యమాల నిర్మాణం ప్రజాస్వామిక వ్యవస్థలో ఎలా సాధించుకోవాలో అని ఆలోచించిన తరానికి ప్రపంచానికి ఒక మార్గదర్శకుడిగా లోహియా నిలిచిపోయారు.

వర్గ వివక్ష, సామాజిక వర్గాల అసమానతలు తొలగడానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజిక వర్గాల్లో వర్గ దృక్పథాన్ని ప్రవేశపెట్టి వర్గీకరించడానికి మార్క్సిజం, వర్గ దృక్పథం ఎంతగానో ఉపయోగపడుతుంది. బహుళ పార్టీ వ్యవస్థలో శాంతియుత పద్ధతిలో రాజ్యాంగం మనం నిర్దేశించికున్న ప్రజాస్వామ్య సామ్యవాదాన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సాధించుకోవడానికి లోహియా భావాలు, వాటిలోని అంతస్సారం ఎంతగానో ఉపయోగపడుతుంది. అటు మార్క్సిజం చెప్పిన సామ్యవాదాన్ని, వర్గ దృక్పథాన్ని, బీసీల, దళితుల ప్రయోజనాలను ముందుకు తీసుకువెళ్లే క్రమంలో లోహియా స్థానం మరింత స్థిరపడే అవకాశం వుంది.

1967 అక్టోబర్ 12వ తేదీన లోహియా ఆస్పత్రిలో చనిపోయారు. ఒక పథకం ప్రకారం ఆస్పత్రిలో చంపబడ్డారని కొందరు ఇప్పటికీ భావిస్తుంటారు. లోహియా శతజయంతి సంవత్సరాన్ని అంబేద్కర్ శతజయంతి వలె దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరపడం ద్వారా మరుగున పడిన లోహియా కృషి, భావాలు, బీసీల సాధికారికత, చైతన్యం మెరుగులుదిద్దుకుంటాయి.

ఆమె ఒక తరానికి ప్రతినిధి

ప్రజలను సమీకరించడం ఆమెకు ఎంతో ఇష్టమైన పని

ఆమె జ్ఞాపకాలు కన్నీళ్ళు తెప్పిస్తాయి. ఆమెతో కలిసి పనిచేసిన క్షణాలు స్నేహ సౌశీల్యాన్ని గుర్తు చేస్తాయి. సైకిల్ మీద తిరుగుతూ ఆమె పనులు చక్కబెట్టేది. ఆమె ఏప్రిల్ 11, 2008న మరణించినట్లు వార్తాపత్రికల ద్వారా తెలిసింది. చనిపోయే నాటికి ఆమె వయసు 54 ఏళ్ళు.

అనురాధాగాంధీ ఒక మానవతా వాది. స్నేహశీలి. కరుణార్ధ హృదయం గల సౌజన్యమూర్తి. 1985లో ఆమె, నేను నాగపూర్‌లో కలుసుకున్నప్పటి జ్ఞాపకాలు ఇప్పటికీ కళ్ళల్లో కదలాడుతున్నాయి. కర్ణాటక లోని కూర్గు ప్రాంతానికి చెందిన అనురాధ తండ్రి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు నిర్వహిస్తూ అడ్వకేట్‌గా పని చేస్తూ ముంబాయికి మకాం మార్చారు. ముంబాయి కేంద్రంగా అనురాధా గాంధీ విద్యాజీవితం సాగింది. ఆమె మహారాష్ట్ర పౌర హక్కుల ఉద్యమంలో, విప్లవ విద్యార్థి, 'నవజవాన్ భారత సభ' నిర్మాణంలోనూ, ఆహ్వాన్ నాట్యమండలి నిర్మాణంలోను చురుకైన పాత్ర నిర్వహించారు.

అనురాధాగాంధీ ఒక మానవత వాది. స్నేహశీలి. కరుణార్ద్ర హృదయం గల సౌజన్య మూర్తి. 1985లో కలుసుకున్ననాటికి ఆంధ్ర, మహారాష్ట్ర శాఖల మధ్య సిద్ధాంత చర్చలు, రెండు శిబిరాలకు దారితీశాయి. ఆ సందర్భంగా ఆమె చర్చిస్తూ వరవరరావు సిద్ధాంతాలే ముఖ్యమని వాదిస్తే కలిసి పనిచేసే మార్గాలు ఉంచుకోవాలని ఆమె అభిప్రాయ పడింది.

అనురాధాగాంధీ సిద్ధాంత నిబద్ధతతోపాటు, స్నేహ కరుణార్ద్ర, విశ్వమానవ ప్రేమ దృక్పధాన్ని నమ్మి ఆచరించిన కార్యశీలి. మావోయిస్టు కేంద్ర కమిటి సభ్యురాలుగా ఆమె ఈ దేశం సమూలంగా మారాలని సామాజిక న్యాయం, సామాజిక మార్పు జరగాలని అందుకు నూతన ప్రజాస్వామిక విప్లవం రావాలని కడదాకా కృషి చేసిన అనురాధాగాంధీ జీవితం, లక్ష్యం పట్ల చిత్తశుద్ధి ఎవరికైనా ఆదర్శప్రాయమే. ఆమె చిత్తశుద్ధిని స్నేహశీలతను కర్తవ్యదీక్షను గుర్తు చేసుకోవడానికి ఆమెతో నాకు, మీకు గల భిన్నాభిప్రాయాలు అడ్డంకేమి కాదు.

చరిత్ర కొన్ని సార్లు వ్యక్తుల పరంగా రికార్డవుతూ వుంటుంది. అలాంటి వ్యక్తులను చరిత్ర ప్రతినిధులు అని అంటారు. అనురాధాగాంధీ అలాంటి చరిత్ర పరిణామానికి ప్రతీక, ప్రతినిధి. ఆమె ఒక తరానికి ప్రతినిధి. 1970లలో స్వాతంత్ర్యానంతరం పుట్టి పెరిగిన యువతరం నూతన ఆలోచనలతో ముందుకు వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దేశంలో సామాజిక మార్పు జరగడం లేదని అసమానతలు, నిరుద్యోగం మరింత పెరగడం నాలాగే కోట్లాది మందిని అసంతృప్తికి గురి చేసింది. ఆ అసంతృప్తి సమాజిక పరిణామం పట్ల, దాని పరిపాలన పట్ల, వ్యవస్థ పట్ల అసహనంగా మారింది. ఏదో చేయాలి. ఎలాగైనా అసమానతల వ్యవస్థను మార్చాలని యువతరం తాము విన్నది, కన్నది, చదివింది, అనుభవించింది ఆధారంగా ఎక్కడికక్కడ కొన్ని ఆందోళనలు చేపట్టారు. ఇలాంటి వారందరు 1970 దశకంలో నక్సలైట్ల ఉద్యమంలోకి, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమంలోకి ఆకర్షించబడ్డారు. అలా విద్యావంతులు, యువకులు ఆయా ఉద్యమాల్లో ఉత్సాహంగా చేరిన తరానికి అనురాధాగాంధీ ఒక ప్రతినిధి. ఉన్నంతలో సౌఖ్యంగా బతక గల్గే అవకాశం ఉన్నప్పటికీ వాటిని త్యాగం చేసి ఈ సమాజంలో సరైన మార్పులు తేవాలని కష్టాలను, ఉద్యమాలను కౌగిలించుకున్న వారెందరో! అనురాధా గాంధీ అలాంటి వారిలో ఒకరు.

ముంబాయిలో ఉన్నత విద్యనభ్యసించి, నాగపూర్‌లో లెక్చరర్‌గా పని చేస్తున్న అనురాధాగాంధీతో నా పరిచయం విప్లవోద్యమంలో భాగంగా జరిగింది. 1983లో ఏర్పడిన ఎ.ఐ.ఎల్.ఆర్.సి రూపుదిద్దుకోవడంలో, అవగాహన కార్యక్రమా రూపకల్పనలో అనురాధాగాంధీ చురుకైన పాత్ర నిర్వహించారు. ఆమె సైద్ధాంతిక అవగాహనలో అందరికన్నా ముందుండి ఇతరులకు మార్గదర్శనం చేసే విధంగా నిరంతరం అధ్యయనం చేసేది. 1996 దాకా అనురాధా గాంధీ ఎ.ఐ.ఎల్.ఆర్.సి కార్యవర్గ సభ్యురాలుగా ఎన్నో కార్యక్రమాల రూపకల్పనలు చేశారు. 1997 నుండి పూర్తికాలం కార్యకర్తగా ఆదివాసీ ప్రాంతాలకు వెళ్ళారు. 1983లో ఎ.ఐ.ఎల్.ఆర్.సి

ప్రథమ మహాసభలు ఢిల్లీలో జరిగినప్పుడు మాతృభాషా బోధన గురించి ఆమె నొక్కి చెప్పారు. జాతీయ భాషగా హిందీ ఉండాలని కొందరు విరసం సీనియర్లు వాదించగా మరికొందరు ఎ.ఐ.ఎల్.ఆర్.సి సభ్యులు ఇంగ్లీషును ప్రతిపాదించారు. ఆ సందర్భంగా అనురాధా గాంధీ మాతృభాష, ప్రాంతీయ భాషల అభివృద్ధి గురించి విస్తృతంగా వాదించారు. అందరినీ ఒప్పించారు. అలా ఎ.ఐ.ఎల్.ఆర్.సి ఇంగ్లీషు అనుసంధాన భాషగా ప్రాంతీయ భాషలు, మాతృభాషలు ప్రధాన మీడియాగా ఉండాలని అవగాహన రావడానికి ఆమె కృషి ఎంతో ఉంది. ఢిల్లీలో, నాగ్‌పూర్‌లో, ఆమె, నేను పలుసార్లు కలుసుకున్నాము.

1985 జులైలో నేను రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, వరవరరావు, విరసం, ఎ.ఐ.ఎల్.ఆర్.సి ప్రతినిధిగా, గద్దర్, సంజీవ్ డోలకిష్టు రాజు జననాట్య మండలి ప్రతినిధులుగా 7 విప్లవ సంస్థల ప్రతినిధులుగా అఖిలభారత పర్యటనకు బయలుదేరాము. హైదరాబాద్ నుంచి బయలుదేరి మొదటి మజిలీగా నాగపూర్‌కు చేరుకున్నాం. నాగపూర్‌లో దళితులు నివసించే లక్ష్మినగర్‌లో కిరాయికి ఉంటున్న అనురాధాగాంధీ మమ్మల్ని సాదారంగా ఆహ్వానించారు. నాగపూర్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని విప్లవోద్యమాలపై సాగుతున్న నిర్బంధాన్ని ఖండిస్తూ ప్రజలకు మద్దతుగా సీతాబర్డీలోని హాలులో పెద్ద ఎత్తున మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ సభలో సుప్రసిద్ధ సంఘసేవకులు బాబా ఆమ్టే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

1985 నాటికి పార్టీలో రెండు పంథాల మధ్య చర్చ మొదలై రెండు శిబిరాలు ఏర్పడ్డాయి. మహారాష్ట్ర మైదాన పార్టీ, ఆంధ్రలోని సత్యమూర్తి వాదన వైపు మొగ్గారు. సత్యమూర్తి 1989లో బహిరంగ జీవితంలోకి రావడంతో మహారాష్ట్ర మైదాన పార్టీ వారు 1990-91లో తిరిగి ఆంధ్రప్రదేశ్ పార్టీతో కలిసి పనిచేయడం ప్రారంభించారు. అందులో అనురాధా గాంధీ సమన్వయ పాత్ర నిర్వహించారు.

అనురాధాగాంధీ మహారాష్ట్ర మైదాన ప్రాంత విప్లవోద్యమ నిర్మాణంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఎంతోమంది రచయితలను, కళాకారులను, విద్యార్థులను, యువకులను కూడగొట్టారు. సాంస్కృతిక రంగంలో విప్లవోద్యమానికి ఆమె చేసిన చేర్పు గుర్తించుకోదగినది. విప్లవ శ్రేణిలో పలు విషయాలపై జాతీయ స్థాయి సెమినార్‌లు నిర్వహించడంలో ముఖ్యంగా జాతుల సమస్య, భారతదేశంలో కులాల సమస్య విషయంలో, ఫెమినిజం విషయంలో, విద్యార్థి, కార్మిక సంఘాల నిర్మాణంలో విప్లవోద్యమం విస్తృత పరుచుకోవాల్సిన అవగాహన గురించి చేపట్టాల్సిన ఆచరణ గురించి నిర్మాణం చేయాల్సిన ప్రజా సంఘాల గూర్చి, ఉద్యమంలో ఆమె చేసిన

సూచనలు, విప్లవ శ్రేణులలోకి ఒక కొత్త శక్తి ప్రవేశించడానికి దోహదం చేసింది.

మారుతున్న సమాజంతో పాటు విప్లవ ఉద్యమాల అవగాహన ఆచరణ ఎదగడానికి, విస్తరించడానికి ఒక మేధావిగా, క్రియాశీలిగా ఆమె నిర్వహించిన పాత్ర చరిత్రాత్మకమైనది. పార్టీ కార్యకర్తలు, నాయకులు పూర్తి కాలం కార్యకర్తలుగా పనిచేసినప్పటికీ తమ ఆదాయ వనరుల కోసం పార్ట్ టైమ్ వృత్తులు చేపట్టి దాని ద్వారానే బతకాలని ఉద్యమంలో పని చేయాలని బలంగా విశ్వసించిన వారిలో అనురాధా గాంధీ ఒకరు. అందుకే ఆమె పూర్తికాలం కార్యకర్త అయినప్పటికీ నాగ్‌పూర్‌లో పార్ట్ టైమ్ లెక్చరర్‌గా 1996 దాకా పని చేశారు. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ ఇటీవల పూర్తికాలపు కార్యకర్తల నిర్మాణాన్ని రద్దు చేసి అందరూ ఎవరి పని వారు చేస్తూ పార్టీకి పని చేయాలని తీర్మానించడం చూస్తే అనురాధా గాంధీ ఆలోచనల లోతు, ముందు చూపు ఆశ్చర్యం గొలుపుతుంది. ఆమె కృషి జాతీయ, అంతర్జాతీయ ఫెమినిస్టులు విప్లవోద్యమం పట్ల ఆసక్తి చూపడానికి ప్రేరణ అయింది. గేయిల్ ఓంవెద్ లాంటి సుప్రసిద్ధ ఫెమినిస్టులు, శరద్‌పాటిల్, విలాస్ గోగ్రే వంటి దళిత రచయితల నుండి ఆమె స్ఫూర్తి పొందడంతోపాటు వారు ఆమె స్నేహశీలత నుండి స్ఫూర్తి పొందారు. కోబాడ్ గాంధీని పెళ్లి చేసుకొన్న అనురాధాగాంధీ జీవితంలో డిక్లాస్ కావాలని ఆచరించి చూపింది. అనురాధాగాంధి, డిక్లాస్ కావడంతో పాటు అడవుల్లోకి ఆదివాసుల వెంట నడిచింది. అడవుల్లో, సాధారణంగా అందరిపై మలేరియా దాడి చేస్తుంది. అనురాధాగాంధీ కూడా క్రానిక్ మలేరియాతో మెదడుకు వ్యాపించి చనిపోయారు.

కుల సమస్య విషయంలో అంబేద్కర్ కృషి గురించి, అనురాధాగాంధీ, మాకు మరో కోణంలో నూతన ఆలోచనలు కలగడానికి పురికొల్పారు. మహారాష్ట్రలో అంబేద్కర్ ప్రభావం హెచ్చుగా వుండడం వల్ల ఆమె దాని ప్రాధాన్యతను విప్లవ అవగాహనతో విస్తరింప చేయగలిగారు. మహారాష్ట్రలో మహిళలతో కేవలం మహిళలే ఒక సెషన్ నిర్వహించుకొని ప్రత్యేక సమస్యల పట్ల, ప్రత్యేక తీర్మానాలను, కార్యచరణను రూపొందించిన ఆమె పాత్ర ఇతర ప్రాంతాలకు ఆదర్శమైనది. అలాంటి సమావేశాలు ఇప్పటికీ పలు ప్రాంతాల్లో జరుగుతున్నాయి.

అనురాధాగాంధీ ఒక ఆత్మీయ చిహ్నం. ఆమెలో చిరునవ్వు, ప్రసన్నత, ఆదరత తొనికిసలాడేది. పనిపట్ల ఎంతో మక్కువ. ప్రజలను సమీకరించడం ఆమెకు ఎంతో ఇష్టమైన పని. ఆపనిలో ఉంటూనే కన్నుమూశారు ఆమె.

బీసీల ఆశాజ్యోతి

జస్టిస్ బి.ఎస్.ఏ.స్వామి

నిరంతర తపన, బీసీల భవిష్యత్తుపై కొండంత విశ్వాసం, మొక్కవోని ఆచరణ కలిస్తే జస్టిస్ బి.ఎస్.ఏ.స్వామి. ఆయన హైకోర్టు న్యాయమూర్తి కాకముందు, అయిన తరువాత, పదవీ విరమణ తరువాత మూడు దశల్లోనూ ఒకే వ్యక్తిత్వం. కల్లా కపటం ఎరుగని మనిషి. బోళాతనం, నిర్మొహమాటంగా ఉన్నది ఉన్నట్టు చెప్పడం. మనసులో ఏదీ దాపరికం లేని మంచితనం. పోట్లాడిన పది నిముషాల్లోనే అన్నీ మరచి, పులకింతల, పలకరింతల పసితనం. నిత్యం పచ్చగా వికసించే స్నేహ సౌశీల్యానికి జస్టిస్ బి.ఎస్.ఏ. స్వామి ఒక ప్రతీక. ఇరవయ్యేళ్ళ స్నేహంలో ఆయనతో కలిసి పంచుకున్న అనుభవాలు, అనుభూతులు ఎన్నో. బీసీల ఆశాజ్యోతిగా జస్టిస్ స్వామి సామాజిక న్యాయం కోసం పోరాటాలు సాగుతున్నంత కాలం స్ఫూర్తినిస్తునే వుంటారు. ఆయన జీవితం ఎందరికో ఆదర్శం. మాటలు కాకుండా చేతలతో ముందుకు సాగిన కళ్ళ ముందే కదిలి నడిచే మహామనీషి జస్టిస్ బి.ఎస్.ఎ.స్వామి.

జాతీయోద్యమ కాలం నుండి బీసీల కోసం ఎందరో మహనీయులు కృషి చేశారు. సర్దార్ గౌతలచ్చన్న అందులో ఒకరు. సర్దార్ గౌతులచ్చన్న శిష్యరికంలో బహుజన జీవితాల్లో వెలుగు నింపాలని బీసీలు రాజకీయాధికారం సాధించాలని నిరంతరం ఉద్యమించిన మేథావి, దార్శనికుడు జస్టిస్ బి.ఎస్.ఏ.స్వామి. 11 జులై 1942న తూర్పు గోదావరి జిల్లా అయినవెల్లి మండలం ముక్తేశ్వరంలో జన్మించిన బొక్కా శ్రీ అచ్యుతానంద స్వామి పోరాటాల మధ్య వ్యక్తిత్వం

సంతరించుకున్నారు. వారి తండ్రి, తాత ఆనాటి సామాజిక స్థితుల్లో అగ్రకులాధిపత్యంపై చేసిన పోరాటం విద్యార్థి దశలోనే స్వామిపై గొప్ప ప్రభావం వేసింది. అమలాపురంలో బి.ఎస్.సి. చేసి ఆంధ్రా యూనివర్సిటీ నుండి లా డిగ్రీ పుచ్చుకునే సరికి గౌతులచ్చన్న ప్రభావంలో ఒక దీర్ఘకాలిక లక్ష్యాన్ని జీవిత లక్ష్యంగా మలచుకున్నారు. జస్టిస్ అల్లాడి కుప్పుస్వామి, కేంద్ర మంత్రి పి.శివశంకర్‌ల వద్ద జూనియర్ లాయర్‌గా జీవితాన్ని ప్రారంభించిన స్వామి న్యాయ వ్యవస్థలో సామాజిక న్యాయం కోణాన్ని తీవ్రంగా అధ్యయనం చేశారు. చట్టాలను సామాజిక న్యాయానికి అనుకూలంగా మార్పు చేసుకోవాల్సిన అవసరంవుందని గమనించారు. సుప్రసిద్ధ న్యాయవాదిగా పని చేస్తూనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగువర్గాల ప్రజల చైతన్యం కోసం అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. మద్దతు ఇచ్చారు. 1976 ఫిబ్రవరిలో హైకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన తరువాత వెనుతిరిగి చూడలేదు. ఆంధ్రప్రదేశ్ యువన్యాయవాదుల సంఘాన్ని స్థాపించి దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా పని చేశారు.

కాన్షీరాం సామాజిక న్యాయం, సామాజిక మార్పుకోసం రాజకీయాధికారం అవసరం అంటూ అంబేడ్కరిజం వెలుగులో జాతీయ స్థాయిలో వేసిన ప్రభావం బిఎస్ఎ స్వామి గారిని బలంగా ఆకర్షించింది. బహుజన సమాజ్ పార్టీలో చేరి రాష్ట్రంలో బహుజన సమాజ పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేస్తూ సొంత ఆదాయాన్ని బిఎస్‌పి ఉద్యమానికి ధారపోశారు. 1995 మే 2వ తేదీన హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించి జులై 11, 2004న పదవీ విరమణ చేశారు.

హైకోర్టు న్యాయమూర్తిగా వున్నప్పుడే మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ సంస్థను 1995లో స్థాపించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామిక వ్యవస్థలో అట్టడుగు జనాభాకు ప్రాతినిధ్యం, అభివృద్ధిలో వాటా అన్ని రంగాల్లో అందించడం లక్ష్యంగా స్వీకరించారు. కులాల మధ్య సమన్వయం, సహకారం ప్రభుత్వ సంస్థలపై నిఘా వుంచి ప్రజలకు సామాజిక న్యాయం చేకూర్చడం ఈ సంస్థ లక్ష్యాల్లో ఒకటి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను రూపొందించడంలో వాటిని సరిగ్గా అమలు జరపడంలో క్రియాశీలంగా ఈ సంస్థ పని చేయాలని, అలాగే పిల్లలందరూ బడికి వెళ్ళాలని, ఆరోగ్యం వైద్యం ఓటర్ల జాబితా మొదలైన అనేక విషయాల్లో సామాజిక న్యాయం అందించాలని మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ సంస్థ తన లక్ష్యాలుగా ప్రకటించుకుంది. దీని తరఫున అమలాపురంలో విద్యా సంస్థలు నిర్వహిస్తున్నారు.

2004లో స్వామి రిటైర్ అయ్యాక గౌతలచ్చన్న తీసిన మహాజన పత్రిక నిర్వహణలో పాలుపంచుకున్న అనుభవంతో ఒక పత్రికను నిర్వహించాలని తన జీవిత ఆశయంగా ముందుకు కదిలారు. తనకున్న స్నేహితులు, పరిచయాలు జర్నలిస్టులు, రచయితలు, పారిశ్రామిక వేత్తలు మొదలైన వారితో ఎన్నో సదస్సులు నిర్వహించారు. కలిసి రాగలిగేవారితో 2004 నుండి **'మన పత్రిక'** వారం వారం సామాజిక న్యాయ సమరనాదం నినాదంతో ప్రతివారం వెలువరిస్తున్నారు. మన పత్రిక ద్వారా వేలాదిమంది నాయకులను, న్యాయమూర్తులను, కార్యకర్తలను, రచయితలను తీర్చిదిద్దుతూ నూతన ఆలోచనా విధానంతో మార్గదర్శకం చేయడానికి కృషి చేశారు. **'మన పత్రిక'** స్వామి జీవితంలో భాగమైపోయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అందరూ కలిసి ఒక వేదిక మీదకు రావాలని ఒక రాజకీయ శక్తిగా ఎదగాలని నిరంతరం తపించి వారందరికీ ఒక వేదికగా మనపత్రికను తీర్చిదిద్దారు.

జస్టిస్ బిఎస్ఎ స్వామి అనేక విషయాలపై ఎప్పటికప్పుడు తన అభిప్రాయాలను సంపాదకీయాలుగా, నా మాటగా వెలువరించారు. న్యాయవ్యవస్థ గురించి రాసినా, పారిశ్రామికవేత్తల గురించి రాసినా, ఆకలి చావులు గురించి రాసినా, పేదలకు వైద్యంగురించి రాసినా, రాజకీయాల గురించి రాసినా, తెలంగాణ గురించి రాసినా రాజకీయాల్లో అవినీతి గురించి రాసినా, కుటుంబ రాజకీయాలను విమర్శిస్తూ రాసినా అన్నిటిలో ఉన్నది ఒక్కటే. అదే సామాజిక న్యాయం. బీసీల సాధికారికత.

పూలే, అంబేద్కర్, పెరియార్ రామస్వామి ఆలోచనా విధానంలో సమాజాన్ని, సామాజిక న్యాయాన్ని ముందుకు నడపాలని కోరకున్న స్వామి వ్యక్తిగత జీవితంలో దైవం పట్ల ఎనలేని విశ్వాసం. ఆయన విశ్వాసం ఆయన సామాజిక జీవితానికి ఎన్నడూ అడ్డంకి కాలేదు. గొప్ప ప్రజాస్వామిక వాదిగా, సంస్కరణ వాదిగా భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూ వారితో కలిసి పని చేసే సహృదయ వాదిగా జస్టిస్ బిఎస్ఎ స్వామి వేలాది బహుజన హృదయాల్లో నిలిచిపోయారు. మహాత్మా జ్యోతిబా పూలే సామాజిక న్యాయ సంస్థ తరఫున ప్రత్యేకంగా ఒక రథాన్ని తయారు చేయించి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించారు. తన ఇల్లునే కార్యాలయంగా మార్చారు.

బిఎస్ఎ స్వామి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాల్సిన కర్తవ్యం అందరిదీ. వారు ప్రారంభించిన మనపత్రికను ఆగిపోకుండా నిర్వహించడానికి కృషి చేసినప్పుడే ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకు వెళ్ళిన వారం అవుతాము. 2008, జులై 24న గుండెపోటుతో మరణించిన బి.ఎస్.స్వామిగారికి నా అశ్రునివాళి.

బి.ఎస్.రాములుగారి జీవిత విశేషాలు

పుట్టిన తేది, స్థలం :	ఆగస్టు 23, 1949, జగిత్యాల పట్టణం, కరీంనగర్ జిల్లా. పద్మశాలి కుటుంబం.
తల్లిదండ్రులు :	కీ. శే. బేతి లక్ష్మిరాజు, కీ. శే. మిట్టపెల్లి నారాయణగారల ద్వితీయ పుత్రుడు. తండ్రి బొంబాయి బట్టల మిల్లు కార్మికుడు. ఆరో యేట 1955లో తండ్రి మృతి. తల్లి బీడీ కార్మికురాలిగా పిల్లలను పెంచి పోషించింది. 1991 జనవరి సంక్రాంతి రోజున మృతి.
బాలశిక్ష :	సాతాని అయ్యోరు పంతులు, జగిత్యాల
ప్రాథమిక విద్య :	1955-60 మర్కజి (సెంట్రల్) ప్రైమరీ స్కూలు, జగిత్యాల.
హైస్కూలు విద్య :	1960-67 మల్టీపర్పస్ హైస్కూలు, జగిత్యాల.
కళాశాల విద్య :	1970-74 డి.ఓ.ఎల్, బి.ఓ.ఎల్, శ్రీలక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల, ధర్మపురి, కరీంనగర్ జిల్లా.
తెలుగుపండిత శిక్షణ :	1979-80 కాకతీయ యూనివర్సిటీ, బీఈడీ కాలేజీ, హన్మకొండ.
పెళ్లి :	17, మే 1973, చెన్న నారాయణ, చెన్న గౌరమ్మల ఎనిమది పిల్లల్లో నాలుగో సంతానం ప్రథమ పుత్రిక - చెన్న శ్యామలతో, పైడిమడుగులో మెట్‌పల్లి తాలూకా, కరీంనగర్ జిల్లా. సాంప్రదాయిక వివాహం.
రచనారంగం :	విద్యార్థి దశలో 1964 నుండి రచనలు చేస్తున్నారు. సాహిత్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.
నిరుద్యోగం :	1967-75 హైస్కూలు విద్యార్హతతో పోస్టాఫీసులో రావాల్సిన ఉద్యోగం రాకపోవడం, ఇతర ప్రాంతాల వాళ్ళు ఉద్యోగాలు ఆక్రమించడం వల్ల తొమ్మిది సంవత్సరాల పాటు నిరుద్యోగంలో చిన్న చిన్న వృత్తులు.
ఉద్యోగం :	17-12-1975 సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగం. 31 జులై 2007 ఉద్యోగ విరమణ.

ఉద్యమాలు :

- ధర్మపురి కళాశాలలో విద్యార్థి ఉద్యమాల నిర్వహణ. 1964లో ఆరెస్సెస్ శాఖకు వెళ్లుట. 1967 నుండి 1972 ఆర్ఎస్ఎస్ ముఖ్య శిక్షక్‌గా జగిత్యాల, ధర్మపురిలలో ఆరెస్సెస్ నిర్మాణం. 1976 నుండి సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం, జిల్లా, రాష్ట్ర శాఖల నిర్వహణ.
- 1977-80 ఉద్యోగ సంఘాల నిర్మాణంతో పాటు పీడీఎస్‌యూ, ఆర్ఎస్‌యూ విద్యార్థి యువజన సంఘాల నిర్మాణంలో చేయూత నందించడం. అధ్యయన తరగతుల నిర్వహణ. 1978 నుండి పౌరహక్కుల సంఘం, హుజూరాబాద్, రాడికల్ విద్యార్థి, యువజన సంఘాల నిర్మాణం, అంబేద్కర్ సంఘాల నిర్మాణం. జిల్లా కార్యక్రమాలు.
- 1980 నుండి విరసం సభ్యులు. 1983- పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి. 1984 జనవరి విరసం సభల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు. 1984లో అనంతపూర్‌లో జరిగిన రాడికల్ యువజన సంఘం రాష్ట్ర మహా సభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక.
- 1984-88 రాడికల్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

నక్సలైట్ కార్యకలాపాలు చేస్తున్నారనే ఆరోపణలతో 1984 జనవరిలో జగిత్యాలలో అరెస్టు. కరీంనగర్ జైలులో నిర్బంధం. ఉద్యోగం నుండి సస్పెండ్ చేయుట. అప్పటి నుండి పూర్తి కాలం రాడికల్ యువజన సంఘం, పౌర హక్కుల సంఘం, రాష్ట్ర కార్యకలాపాల నిర్వహణ.

- 1985లో పెరిగిన నిర్బంధం వల్ల 1985 జూన్ నుండి 90 వరకు రహస్య జీవితం. ఈ కాలంలో గద్దర్, వరవరరావు, సంజీవ్ తదితరులతో కలిసి అఖిలభారత సాహిత్య, సాంస్కృతిక, ఉద్యమ ప్రచార యాత్ర నిర్వహణ.
- 1990 ఏప్రిల్ 1న కరీంనగర్ జిల్లా మంథనిలో జరిగిన రాడికల్ యువజన సంఘం జిల్లా మహా సభల్లో బహిరంగ జీవితంలోకి రాక. ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి హయాంలో పోలీస్ కేస్ పెండింగ్‌లో ఉంచి తిరిగి ఉద్యోగంలో చేర్చుకుంటూ జిల్లా కలెక్టర్, ఉత్తర్వులతో 17 ఏప్రిల్ 1990లో సుల్తానాబాద్‌లో ఉద్యోగంలో చేరిక. జూలైలో జగిత్యాల బదిలీ.
- 1997 దాకా జగిత్యాలలో ఉద్యోగం. 1997 – 2000 సిరిసిల్లలో ఉద్యోగం. తర్వాత తిరిగి జగిత్యాలలో ఉద్యోగం. 2003 నుండి దీర్ఘ కాలిక లీవు పెట్టి పూర్తి కాలం సామాజిక జీవితానికి అంకితం చేశారు.
- 1990 నుండి రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల ఐక్యత కోసం పూలే, అంబేద్కర్ బుద్ధిస్ట్ దృక్పథంతో సాహిత్య, భావజాల ఉద్యమాల నిర్మాణం. రాష్ట్రవ్యాప్త పర్యటన. వందలాది ప్రసంగాలు.
- 1992 డిసెంబర్ 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక ఏర్పాటు. దానికి వ్యవస్థాపక కన్వీనర్.
- 1993 ఫిబ్రవరి 12, 13 తేదీల్లో హైదరాబాద్ అంబేద్కర్ భవన్‌లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో ఆం.ప్ర. దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నిక. రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ రచయితలను కళాకారులను సామాజిక కార్యకర్తలను తీర్చిదిద్దుట. రాజకీయ రంగంలో ఈ దృష్టితో పనిచేసే యువతరాన్ని తయారుచేయుట.
- 1996 నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సభలు, సమావేశాలు వ్యాసాలు ప్రసంగాలు. తెలంగాణ రచయితల, కళాకారుల, మేధావుల సమీకరణ. సైద్ధాంతిక వ్యాసాలు, పుస్తకాలు. తెలంగాణ రచయితల కళాకారుల మేధావుల ఐక్య వేదిక కన్వీనర్.

తెలంగాణ తల్లి రూపకల్పన : తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, భాషను వెలికి తీస్తూ, ఉద్యమిస్తూ అందులో భాగంగా తెలంగాణ తల్లి రూపకల్పన చేశారు. క్యాలండర్‌లు, విగ్రహాలు వెలయించారు.

పత్రికా సంపాదకత్వం: 1977లో సాంఘిక సంక్షేమ శాఖ ఉద్యోగస్తుల కోసం సంఘమిత్ర పత్రిక ప్రచురణ. 1980 నుండి మంటలు పక్షపత్రిక. సృజన మాసపత్రిక. 1983 నుండి చాటింపు పక్షపత్రిక సంపాదక మిత్ర

మండలిలో కృషి. 84లో కరీంనగర్ కేంద్రంగా జీవగడ్డ దినపత్రిక నిర్వహించాలని విజయ కుమార్‌తో అవగాహన. మధ్యలో నిర్బంధం వలన ఆగిపోవుట. 1995 నుండి దరకమే ఐక్యవేదిక తరఫున గబ్బిలం మాసపత్రిక ప్రచురణ.

ఆం.ప్ర.దరకమే ఐక్య వేదిక ద్వారా కృషి :

- దరకమే ఐక్య వేదిక రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలు, సభలు, సమావేశాలు.
- వందలాది పాటలు, కథలు, 200 పుస్తకాలు వెలువడ్డాయి. కంచ ఐలయ్య గారి నేను హిందువునెట్లయిత గ్రంథం దరకమే ఐక్యవేదిక పునాది నుండి వెలువడిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. వందలాది వ్యాసాలు, దేశవ్యాప్తంగా ప్రసంగాలు.
- 125పైగా పుస్తకాలకు పీఠికలు. కథా శిక్షణా శిబిరాలు సాహితీ శిక్షణా తరగతులు సిద్ధాంత అధ్యయన తరగతులు.
- 150కి పైగా కథలు, ఆరు నవలలు, 150 సిద్ధాంత వ్యాసాలు, 150 సాహిత్య వ్యాసాలు, పది తాత్వికగ్రంథాలు, మూడు అలంకార శాస్త్ర గ్రంథాలు.
- వివిధ కథా సంకలనాల్లో వీరి కథలు 50 వరకు ప్రచురించబడ్డాయి.
- రాష్ట్రంలో వివిధ సంస్థల ద్వారా, ఇతర రాష్ట్రాల్లో నాగపూర్, ఢిల్లీ, పానిపట్, నగరాల్లో పలు సత్కారాలు, సన్మానాలు.
- 1993లో కథా సాహితీ వేదిక ప్రారంభం.

కరీంనగర్ బుక్ ట్రస్ట్ ప్రచురణలు : 1982లో నిజాం వెంకటేశంతో కలిసి కరీంనగర్ బుక్‌ట్రస్ట్ స్థాపన. బతుకుపోరు నవల, భూమి, బొగ్గు పొరల్లో, అడవిలో వెన్నెల కథా సంపుటాల ప్రచురణ.

విశాల సాహిత్య అకాడమీ స్థాపన : బహిరంగ జీవితంలో వచ్చాక 1990లో విశాల సాహిత్య అకాడమీ ప్రారంభించారు. పుస్తకాల ప్రచురణ. కథా శిక్షణ శిబిరాల నిర్వహణ. సాహిత్య సభలు. సిద్ధాంత అధ్యయన తరగతుల నిర్వహణ. వందలాది యువ రచయితలను తీర్చిదిద్ది వారి రచనలను పత్రికల్లో ప్రచురణకై చేయూత. వారి పుస్తకాల ప్రచురణ. వందలాది యువ రచయితలకు ఇంటింటి గ్రంథాయం ఏర్పాటు చేసుకోవడానికి కృషి.

ముఖ్యమైన ఉద్యమాలు, కార్యక్రమాలు :

- 1973లో ధర్మపురి కాలేజీలో రెండు నెలల పాటు
- విద్యార్థుల సమ్మె నిర్వహణ. ఆరెసెస్ ద్వారా వ్యక్తిత్వ వికాస,
- దేశభక్తి ప్రచారం. 1977–80 రాడికల్ విద్యార్థి యువజన సంఘాల నిర్మాణం. అంబేద్కర్ సంఘాల నిర్మాణం. ప్రచురణ 1990 నుండి విశాల సాహితి ప్రచురణల ప్రారంభం. 1995 నుంచి విశాల సాహితి తరఫున సభలు, సమావేశాలు.

సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం : 2002 నుండి సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం స్థాపన. సభలు, సమావేశాలు, పుస్తక ప్రచురణ. విశాల సాహితి,

సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం తరఫున 90 పుస్తకాల ప్రచురణ.

గృహ గ్రంథాలయం : వందలాది గ్రంథాలతో 1980 నుండి గృహ గ్రంథాలయ నిర్వహణ. ఉద్యమ కారులుగా విద్యార్థులను, యువకులను చైతన్య పరచుట కోసం మొబైల్ గ్రంథాలయ నిర్వహణ. 1984లో పోలీసులు అరెస్టు చేసినపుడు పుస్తకాలు ఎత్తుకుపోయారు. 1990నుండి తిరిగి పుస్తకాల కొనుగోలు. గ్రంథాలయ నిర్వహణ. 2004లో షోలాపూర్ గ్రంథాలయానికి 600 గ్రంథాలు వితరణ. పరిశోధక విద్యార్థులకు సహకారం.

కార్యాలయ స్థాపన : 1992 నుండి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీగారి జల దృశ్యంలో దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక కార్యాలయ నిర్వహణ. 2002 నుండి విశాల సాహితి, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయానికి ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ సమీపంలో కార్యాలయ నిర్వహణ. పుస్తక ప్రచురణ వేగవంతం చేయడం.

ముఖ్యమైన ఉద్యమాలు : 1977-1990 నక్సలైట్ భావజాలంతో పలు ప్రజాసంఘాల ఉద్యమాల నిర్మాణం. 1985-90 దేశ వ్యాప్తంగా పర్యటన. వందలాది రచయితలతో, కళాకారులతో, ఉద్యమ కారులతో చర్చలు, ప్రసంగాలు. 1996-2008 ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. 1990-2008 బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత కోసం అనేక సంస్థల నిర్మాణం, అధ్యయన తరగతులు. సాహిత్య శిక్షణ తరగతులు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలు. బుద్ధుడి నుండి జ్యోతిరావు పూలే, అంబేద్కర్‌ల దాకా సామాజిక తాత్వికత భూమికను అంబేద్కరిజంగా సమన్వయం చేసి రాష్ట్ర వ్యాప్తంగా భావజాల ఉద్యమ నిర్మాణం.

భావజాల ఉద్యమం : 1991లో వెలువడిన 'గతితర్క తత్వదర్శన భూమిక' అనే తాత్విక గ్రంథం తెలుగునాట భావజాల చర్చతీరును పూర్తిగా మార్చివేసింది. ప్రపంచ భావజాల ఉద్యమరంగంలో ఈ గ్రంథం ఒక మైలురాయి. ఈ గ్రంథం బీసీ, ఎస్సీ, ఎస్టీల వేదికైన దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక నిర్మాణానికి తాత్విక పునాది. 'గతితర్కం - అంబేద్కరిజం - మార్క్సిజం', 'అంబేద్కరిజం - సోషలిజం', 'నేను ఎవరు?', 'ప్రేమ అంటే ఏమిటి?', 'భౌతికవాద ప్రాపంచిక దృక్పథం', 'జ్ఞానం పుట్టుక', 'బహుజన తత్వం', 'బీసీలు ఏం చేయాలి?', 'భారతీయ చరిత్ర - శూద్ర దృక్పథం', 'బీసీలకు రాజకీయ అధికారం', 60 ఏళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు', వందలాది పత్రికా వ్యాసాలు.

అరెస్టులు :

- 1980లో గ్రామాలకు తరలండి అని విరసం ఇచ్చిన పిలుపుతో వేములవాడ తాలూకా కోనరావుపేటకు వెళ్ళిన సందర్భంగా అరెస్టు.
- 1984 జనవరి 21న అరెస్టు. వారం రోజుల పాటు లాకప్‌లో. 20 రోజులు కరీంనగర్ జిల్లా జైలులో.
- 1985 ఏప్రిల్ 20వ తేదీన ఇంద్రవెల్లి సభ సందర్భంగా గుడి

హత్నూరులో అరెస్టు. పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.బాలగోపాల్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.మురళీమనోహర్, ప్రొ॥ సీతా రామారావు తదితరులతో కలిసి మూడు రోజులు ఉట్నూరు, ఆదిలాబాద్‌లలో లాకప్‌లో.
- 1987లో హైదరాబాద్‌లో అరెస్టు. తప్పించుకోవడం

విశ్వవిద్యాలయ సెమినార్లు : కాకతీయ, ఆంధ్ర, ఉస్మానియా, శ్రీకృష్ణదేవరాయ, విశ్వవిద్యాలయాల్లో సెమినార్ పత్రాలు.

అవార్డులు :

- కొడవటిగంటి కుటుంబరావు స్మారక విప్లవ కథకు ఇచ్చే పురస్కారం - ఆదివాసుల జీవితాన్ని - పోరాటాన్ని చిత్రించిన "అడవిలో వెన్నెల" కథకు 1984 అక్టోబరు 28న తెనాలిలో కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, కొడవటిగంటి వరూధినిల నేతృత్వంలో పురస్కారం.
- బీడీ కార్మికుల జీవితాలను చిత్రించిన 'బతుకుపోరు' నవలకు 1992లో డా॥దాశరథి రంగాచార్య పురస్కారం.
- మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, బీ.సీ. ఉద్యమ నాయకులు, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ పురస్కారం 1992.
- వరంగల్ జిల్లా 'పాలకుర్తి సోమన కళాపీఠం' వారి "పాల్కురికి సోమన". పురస్కారం-1995.
- ప్రముఖ హేతువాది త్రిపురనేని రామస్వామి చౌదరి పేరిట గల తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం-1995.
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారిచే 2002 లో బి.యస్.రాములు 'మమతలు మానవ సంబంధాలు' కథ సంపుటికి ఉత్తమ కథా సంపుటి పురస్కారం.
- షోలాపూర్-సిరిసిల్ల పద్మపీఠం వారిచే "పద్మాంజలి అవార్డు"-2001.
- దళిత సాహిత్య అకాడమీ, ఢిల్లీ వారిచే మహాత్మా జ్యోతిరావ్ పూలే ఫెలోషిప్ 2001.
- హర్యానాలోని పానిపట్‌లో ప్రేమ్‌చంద్ సమకాలికులు జయప్రకాశ్ నారాయణ్ సహచరుడైన బిహార్ కథకుడు రామవృక్ష బేనిపురి శతజయంతి పురస్కారం 2003.

స్వర్ణకంకణాలు :

- టిఆర్ఎస్, కెసిఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ సంబురాలు-2007లో తెలంగాణ తల్లి రూపకల్పన చేసిన సందర్భంగా బంగారు గండపెండేరంతో నిజాం కాలేజి, హైదరాబాద్‌లో సత్కారం
- డా॥ పి.యశోదారెడ్డి స్మారక తొలి పురస్కారం, స్వర్ణకంకణం. తేది : 4-11-08

ఇతర విశేషాలు : 50వ జన్మదిన స్వర్ణోత్సవాల సందర్భంగా జగిత్యాలలో సాహిత్య సదస్సు. 'సామాజిక తత్వవేత్త' బిరుదు ప్రదానం. 50వ జన్మదిన ప్రత్యేక సంచిక ప్రచురణ. పలు సామాజిక రాజకీయ, సాహిత్య అంశాలపై ఇంటర్వ్యూలు. 52 పుస్తకాల ప్రచురణ. మరో 10 పుస్తకాలు

అముద్రితాలు. తల్లి మిట్టపల్లి లక్ష్మీరాజు పేరిట 27 మందికి విశాల సాహితీ కథా పురస్కారాల ప్రదానం.

సామాజిక సేవారంగం : మద్యపాన వ్యతిరేక, అవినీతి వ్యతిరేక ఉద్యమాలు. పేదలను విద్యావంతులను చేయడం. వ్యక్తిత్వ వికాసం తోడ్పాటు. ఆత్మవిశ్వాసం పెంచడం. రచయితల్లో, సామాజిక కార్యకర్తల్లో వారి సృజన, నాయకత్వ శక్తి సామర్థ్యాలను వెలికి తీయడం, ప్రోత్సహించడం. స్త్రీ విద్య ప్రాధాన్యత. ప్రజాస్వామ్య హక్కుల ప్రాధాన్యత వివరించడం. ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ. పర్యావరణ, ఆరోగ్య చైతన్యం. కనీస కూలీల, జీవన ప్రమాణాల పెంపుదలకోసం ఉద్యమించడం. పొదుపు ఉద్యమాల ఆవశ్యకత. ఆధునిక సమాజంలో అందుకోవాల్సిన స్థానం గురించి చేయూత నందించడం.

సంఘ సంస్కరణ : కులాంతర, మతాంతర వివాహాల ప్రోత్సాహం. కులాతీత, మతాతీత ప్రజాస్వామ్య, సామ్యవాద, సమగ్ర సామాజిక వికాసానికై సమస్త రంగాల్లో సంఘ సంస్కరణలకు ఉద్యమించడం. మూఢ విశ్వాసాల నిర్మూలన, వర్ణ, కుల వివక్షతల వ్యతిరేక ఉద్యమాలు, స్త్రీ విద్య, ఆయా కుల సంఘాలను సంఘ సంస్కరణలకై తీర్చిదిద్దుట. హిందూ, ముస్లిం, క్రైస్తవుల సమైక్యత. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజకీయ సామాజిక, సాంస్కృతికై కృషి. వివాహ పద్ధతులను, పండగలను, పాత సంస్కృతిని సంస్కరించుట. ఆధునిక విద్య, సమస్త అవకాశాలు అందరికీ అందేందుకు కృషి. కూడు, గుడ్డ, నీడ కోసం, జీవన ప్రమాణాల కోసం సమస్త మానవాళి వికాసం కోసం కృషి.

బి.ఎస్.రాములు రచనలపై
వెలుడిన గ్రంథాలు-పరిశోధనలు :

- 50వ జన్మదిన స్వర్ణోత్సవ సంచిక
- బి.ఎస్.రాములు కథలు-ఒక పరిశీలన - కర్రె సదాశివ్, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ చేసి పుస్తకంగా వెలువరించారు.
- 'బతుకుపోరు-సామాజికత' ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో పల్లా మాలతి చంద్ర ఎం.ఫిల్ పరిశోధనకు గోల్డ్‌మెడల్. పుస్తకంగా వెలువరించారు.
- ఎమ్.లలిత, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మరో పరిశోధనకు ఎం.ఫిల్ తీసుకున్నారు.
- అడవిలో వెన్నెల కథల సంపుటిపై పరిశోధన చేసి సెంట్రల్ యూనివర్సిటీలో రమేష్ ఎం.ఫిల్. తీసుకున్నారు.
- నిర్మల, తదితరులు కొనసాగిస్తున్న విశ్వవిద్యాలయాల పరిశోధనలు.
- బి.ఎస్.రాములు కథలపై, నవలలపై, ఇతర రచనలపై అనేక విశ్వవిద్యాయాల్లో కోవెల సంపత్ కుమారాచార్య నుండి సిహెచ్.వి. ప్రభాకర్‌రావు దాకా పలువురు సెమినార్ పత్రాలు వెలువరించారు.